Ananth & Ananth Series



# సూర్యదేవర రామ్ మోహన రావు

**THE NUMBER ONE BEST SELLING AUTHOR**



# ఓ హీరోయిన్ నిజ జీవితం

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author

# సూర్యదేవర రామ్మోహనరావు

# ఓ హీరోయిన్ నిజ జీవితం

మోడల్ పబ్లికేషన్స్

**O HEROIN NIJA JEEVETHAM**

(Serialised in "Mayuri" Weekly)

By

**SURYADEVARA RAM MOHANA RAO**
Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Nava Nirman Nagar, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**MODEL PUBLICATIONS**

Edition : **2016**

Price :
**₹. 145-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
Vijayawada.

# ఓ హీరోయిన్ నిజ జీవితం

మనిషికి అందం గ్లామర్ నిస్తుంది. అందానికి వ్యక్తిత్వం గ్లామర్ నిస్తుంది. వ్యక్తిత్వానికి నిజాయితీ గ్లామర్ నిస్తుంది. నిజాయితీకి నడవడిక గ్లామర్‌నిస్తుంది. నడవడికకు జీవితంలోని ప్రతి సంఘటనా, సంఘటనలోని ప్రతి అనుభవమూ, ఆ అనుభవములోని ప్రతి స్పందనా, ప్రతిస్పందనా కారణాలవుతాయి.

ప్రేమ స్పందన అయితే, ద్వేషం ప్రతిస్పందన అవుతుంది. సుఖం మూలమైతే దుఃఖం మూల్యమవుతుంది. జీవితం ప్రభాతంలో మెరిసే కలలు, కలల్నిండా పేరుకునే ఆశలు ఒక్కొక్కప్పుడు నిరాశలుగా మిగిలి పోతాయి. నిరాశ వేళ్ళల్లోంచి ఒక్కొక్కప్పుడు ఆశ తన ఉనికిని తాను చాటుకుంటుంది.

ఆ ఉనికి చిత్రంగా వర్ణచిత్రంగా వుంటుంది. మనసులోని ఊహల మేఘాల మాటున కొన్ని వర్ణ చిత్రాలు కనిపించవు. రంగులన్నీ కలసి పోయినట్టుగా ఇంద్రధనస్సు వెలిసిపోయినట్టుగా, మనిషి అలసిపోతాడు కానీ మనిషి అంతరంగం మాత్రం అలసిపోదు.

మంచు తుంపరల మధ్య మసక వెన్నెల్లా, మనసు గోధూళిలా మెరుస్తుంది. ఆ మెరుపులో ఎన్నో జలపాతాలుంటాయి. ఎన్నెన్నో స్వార్థ ప్రకంపనాలుంటాయి. నిస్వార్థ ఆశా నివాహాలుంటాయి. ప్రణయావేశాలుంటాయి. ప్రళయ ప్రభంజనా లుంటాయి.

వాటన్నిటికీ జీవితం కేంద్రబిందువుగా ఉంటుంది. రసరమ్యమైన వూహల ప్రపంచంలో ఆ చివర, ఈ చివరను ముడివేసే మధుర మంత్రం ఏమిటి?"

* * * * *

జూబ్లీహిల్స్, రోడ్‌నెంబర్ 71...

సురేష్ గెస్ట్‌హౌస్ దగ్గర మలుపు తిరిగి కారు నేరుగా నవనిర్మాణ్‌నగర్ దూసుకుపోయింది.

నవనిర్మాణ్ నగర్ కుడివేపున ఎత్తయిన కొండమీద మయుడు చెక్కిన వింత శిల్పంలా మెరిసిపోతోంది. తెల్లనిరంగులో గెస్ట్‌హౌస్, విశాలమైన గేట్, ఆ గేట్ దాటాక, నాజూకుగా కట్‌చేసి, ముచ్చటగా పెంచుతున్న లాన్ – ఆ లాన్ దాటాక పోర్టికో... వరండా.... పెద్ద హాలు... కింద రెండు బెడ్‌రూమ్స్, మధ్యనుంచి మేడమీదకు మెట్లు, మేడమీద పెద్ద హాలుకి అటూ – ఇటూ బెడ్ రూమ్స్, కిచెన్... బాల్కనీ...

కారు కొండ ఎక్కుతున్న సమయంలో కారు డ్రైవ్ చేస్తున్న సుమంతరావు, పక్కనే వున్న ప్రదీప్‌తో ఇలా అన్నాడు.

"మనకు బొచ్చెడుమంది సినిమా రచయితలున్నారు... ఫోన్‌చేస్తే ఇరవై నాలుగు గంటల్లో కథ, స్క్రీన్‌ప్లే, మాటలతోసహా తయారుచేసిపడేసి వెళ్ళిపోతారు... ఈ కొత్త రచయిత ఎలా దొరికాడు... నీకు... కథేంటో చెప్పడు... ఇదిగో చెప్తాను... అదిగో చెప్తాను అంటాడేతప్ప ఏం చెప్పాడయ్యా నీకు... నీకు అతనిమీద ఏం కాన్ఫిడెన్సో నాకర్థంకాదు. ఇయ్యాల... మొత్తం కథ, గిదా, ఆర్టిస్ట్స్...

టెక్నిషియన్స్ వ్యవహారమంతా ఫైనలైజ్ అయిపోవాలి...." అండర్‌స్టాండ్... గడగడా చెప్పాడు సుమంతరావు.

సుమంతరావుకి నలభై రెండేళ్ళు. రకరకాల వ్యాపారాలు చేసి, గ్రానైట్ బిజినెస్‌లోకి అడుగుపెట్టాక, కాలం కలిసివచ్చి, ఎక్స్‌పోర్టింగ్‌లో లాభాలు సంపాదించాడు.

సుమంతరావుకి, కాలేజీలో క్లాస్‌మేట్ ప్రదీప్ వ్యాపార ప్రపంచంలో గానీ, బంధు, మిత్ర వర్గంలోగానీ సుమంతరావు నమ్మే ఏకైక వ్యక్తి ప్రదీప్ మాత్రమే.

ప్రదీప్‌కి ఎప్పటికైనా సినిమా డైరెక్టర్ కావాలని కోరిక. ఆ కోరికతో పదేళ్ళక్రితం మద్రాసువెళ్ళి, నానా బాధలుపడ్డాడు. సినిమా ఇండస్ట్రీషిఫ్టింగ్ వ్యవహారంతోపాటు హైదరాబాద్ వచ్చాడు. డజను సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసాడు.

అలాంటి సమయంలో సుమంతరావు దగ్గర్నించి ఫోన్ వచ్చింది ప్రదీప్‌కు. వెంటనే హోటల్ రూమ్‌కెళ్ళి కలిసాడు.

"పదేళ్ళక్రితం నేనో ప్రామిస్ చేసాను... గుర్తుందా?" అడిగాడు నేరుగా.

"ఉంది...." వెంటనే చెప్పాడు ప్రదీప్.

"ఏమిటది...?"

"ఎప్పటికైనా సినిమా తీస్తానన్నావు... అదేనా...." అన్నాడతను.

"కాదు...."

"నిన్ను డైరెక్టర్‌గా పెట్టి, సినిమా తీస్తానన్నాను... అవునా...?"

"అవును...."

"టైమొచ్చింది... ఇదిగో రెండుకోట్లకు చెక్ ఇస్తున్నాను.... నువ్వు కొత్తవాళ్ళతో తీస్తావో, పాతవాళ్ళతో తీస్తావో నీ ఇష్టం... ఏ విషయంలోనూ నా జోక్యం వుండదు. అలాగే ఈ రెండుకోట్లకు మించి నేను పైసా పెట్టుబడి పెట్టలేను. నాది నాకిస్తేచాలు. లాభం అక్కర్లేదు. దీనివల్ల నీకు నాలుగు సినిమాలొస్తే నాకంతే చాలు."

కాళ్ళకు చుట్టేసిన మల్లెతీగలా అకస్మాత్తుగా మిత్రుడిచ్చిన ఆ అవకాశానికి పొంగిపోయాడు ప్రదీప్. నవనిర్మాణ్‌నగర్‌లో గెస్ట్‌హౌస్ తీసుకోవడం... డిస్కషన్స్ స్టార్ట్ చెయ్యడం మొదలై అయిదు రోజులు అయింది.

*       *       *       *       *

కారు గెస్ట్‌హౌస్ ముందు ఆగింది.

బాయ్ ఎదురొచ్చి, సుమంతరావు చేతిలోని బ్రీఫ్‌కేసు అందుకున్నాడు. ఇద్దరూ ఆఫీస్‌రూమ్‌లో కూర్చున్నారు. ఫోన్ అందుకున్నాడు ప్రదీప్. ఏదో నెంబర్‌కి డయల్‌చేసి సూర్యవంశీ వున్నారా అని అడిగాడు. అదే సమయంలో ఆ రూమ్‌లోకి ప్రవేశించిన సూర్యవంశీ "ఎస్ బాస్... ఇక్కడే వున్నాను...." అంటూ వచ్చి సుమంతరావుని విష్‌చేసి, ప్రదీప్‌కు ఎదురుగా కూర్చున్నాడు.

సూర్యవంశీకి ముప్ఫై అయిదేళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా వుంటాడు. ఆంధ్రదేశంలో అతనికి మంచి సపలా రచయితగా పేరుంది. చాలా టీ.వీ. సీరియల్స్‌కి కథలూ, మాటలూ అందించాడు. సినిమా ఛాన్స్‌ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో ప్రదీప్ పరిచయమయ్యాడు. మొదటి కలయికలోనే సూర్యవంశీలోని ప్రతిభను అతను ఇస్తున్న కొత్త కొత్త ఐడియాలను అంచనా వేసుకున్నాడు ప్రదీప్.

"నేను డైరెక్ట్‌చేసే మొదటి సినిమాకు నువ్వే రైటర్‌వి రైటర్‌వి...." ప్రామిస్ చేశాడు ప్రదీప్. ఆ రోజునుంచీ వాళ్ళిద్దరూ ఫ్రెండ్స్.

"ఈ రోజు నీ కథ తేలిపోవాలయ్యా?" అన్నాడు ప్రదీప్.

"అంతా అయిపోయింది... క్లయిమాక్స్ కోసం రాత్రంతా గింజుకున్నాను... వండర్‌ఫుల్ ఎండింగ్... బిఫోర్ ఇంట్రవెల్... టూ మేజర్ సీన్స్... ఆఫ్టర్ ఇంటర్‌వెల్... టూ మేజర్ సీన్స్...." ఆవేశంగా చెప్పబోయాడు సూర్యవంశీ.

"సీన్స్ తర్వాత... ముందు కథ...." అన్నాడు సుమంతరావు.

"అయితే వినండి...." అంటూ మొదలెట్టాడు సూర్యవంశీ.

నలభై అయిదు నిమిషాలు...

ఎడింగ్ సీన్ చెప్పడం పూర్తయింది.

నుదుటమీద చెమటను తుడుచుకుంటూ "ఎలా వుంది సార్...?" అని అడిగాడు.

ప్రదీప్ వసంతరావు కళ్ళల్లోకి చూసాడు.

సుమంతరావు, డోర్ దగ్గర నిలబడి కథను విన్న ఆఫీస్ బాయ్ వేపు చూసి, నువ్వేం చెప్పొద్దు అన్నట్టుగా ప్రదీప్‌కు చేతితో సంజ్ఞచేసి "ఇలారారా" అని అతన్ని పిలిచాడు.

ఆఫీస్ బాయ్ దగ్గరకొచ్చి, వినయంగా నిలబడ్డాడు.

"రచయితగారు చెప్పిన మన సినిమా కథ విన్నావు కదా...."

"విన్నాను సార్...."

"ఎలా వుంది?"

"చాలా మంచిగ వుంది సార్."

"వెళ్ళిపో...." అంటూ సూర్యవంశీ కళ్ళలోకి చూసి–

"మిస్టర్ సూర్యా! మా ప్రదీప్, నిన్నే ఎందుకు సెలక్ట్‌చేసుకున్నాడో ఇప్పుడర్ధమైంది... గో ఎ హేడ్...." అన్నాడు హేపీగా.

కామన్ మేన్ మాత్రమే సినిమాను సక్సెస్‌చేసి ప్రేక్షకుడు అందుకే ఆఫీసు బాయ్ అభిప్రాయాన్ని మొదట అడిగాడు సుమంతరావు.

"అందుకే నువ్వు పెద్ద బిజినెస్ మేగ్నట్‌వి అయ్యావు...." అన్నాడు నవ్వుతూ ప్రదీప్.

* * * * *

రెండు గంటలు గడిచాయి...

టెక్నిషియన్స్, క్యారక్టర్ అర్టిస్టులు, కామేడి అర్టిస్టుల లిస్టు తయారైంది.

హీరో, హీరోయిన్ల దగ్గర వాళ్ళ ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పడింది.

"క్యారక్టర్ హెవీ క్యారెక్టర్... కొత్త అమ్మాయిలతో వేగలేం... పడలేం... టేకులమీద టేకేలు తింటారు...."

"బాలీవుడ్ నుంచి తెచ్చుకుందాం...."

సలహా ఇచ్చాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

"అక్కర్లేదు... మన తెలుగు ఇండస్ట్రీలో బోలెడుమంది కొత్త తారలున్నారు... వాళ్ళని వుపయోగించుకుంటే చాలు... గ్లామరస్‌గా వుండటం ఒక్కటే కాదు, యాక్టింగ్ కావాలి... అని అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

"పోనీ... ముందు హీరోని ఫైనలైజ్ చేద్దాం... నా దృష్టిలో విమల్ అన్నాడు ప్రదీప్.

"అతను చాలా బిజీ కదా. అతని సినిమాలన్నీ వరుసగా హిట్ అవుతున్నాయి... డేట్స్ కుదరవేమో...." అన్నాడు సూర్యవంశీ.

"అన్నీ కుదురుతాయి" అంటూ ఫోన్ రిసీవర్ అందుకుని ఒక నెంబరుకు డయల్ చేశాడు. హీరో విమల్ గురించి ఎంక్వయిరీ చేశాడు.

"విమల్ ఊటీలో వున్నాట్ట. సెల్ నెంబర్ ఇది" అంటూ పక్కనే వున్న సెల్‌ఫోన్ అందుకున్నాడు.

సరిగ్గా పది నిమిషాల తర్వాత హీరో విమల్ లైన్‌లోకి వచ్చాడు. పావుగంట మాట్లాడిన తర్వాత ఫోన్ పెట్టేశాడు డైరెక్టర్ ప్రదీప్ ఆనందంగా.

"ఏమన్నాడు...?"

"ఓ.కె... డన్... ఎల్లుండి మార్నింగ్ ఊటీనుంచి వస్తున్నాడు. మనం కలుస్తాం... మన పిక్చర్ చేస్తానన్నాడు...."

"ఇంత త్వరగా విమల్ ఒప్పుకున్నాడంటే, నాకాశ్చర్యంగా వుంది. వాళ్ళ మామయ్య కథ వినాలి... ఓకే చెయ్యాలి... ఆపైన అడ్వాన్స్ తీసుకుంటేనేగానీ విమల్ ఓ.కె. అనడని విన్నాను... మీకు విమల్ బాగా పరిచయం వుందా...?" ఆసక్తిగా అడిగాడు సూర్యవంశీ.

"అవును... చాలా బాగా...." అని చెప్పి, "హీరోయిన్ విషయంలో ఒక పని చేద్దాం...." అన్నాడు ప్రదీప్.

"ఏంటి...?" అన్నట్టుగా చూశాడు సుమంతరావు.

"పేపర్లో ప్రకటన ఇద్దాం... వచ్చిన వాళ్ళలో ఒకర్ని సెలక్టు చేసుకుందాం...."

"ఐడియా బాగానే వుంది కానీ... అదో పెద్ద ప్రాసెస్... డిలే అవదూ...."

"కాదు... వారం రోజులు అంతే... ఇప్పుడే ఆర్టిస్టుకి ఫోన్‌చేసి యాడ్ తయారుచేయిస్తాను... యాడ్ ఏజన్సీకి ఫోన్‌చేస్తే మిగతావన్ని వాళ్ళే చూసుకుంటారు...." అంటూ ఫోన్ ఎత్తాడు ప్రదీప్.

మరో మూడు గంటలు గడిచాయి.

యాడ్ ఏజెన్సీ నుంచి వచ్చిన వ్యక్తి తెచ్చిచ్చిన యాడ్ డిజైన్స్‌లో ఒక డిజైన్‌ను సెలక్టు చేసాడు ప్రదీప్.

"వెరీగుడ్...." అంటూ తన అంగీకారం కూడా తెలిపాడు సుమంతరావు.

"ఈనాడు పేపర్‌లో, సినిమా పేజీలో రావాలి...." చెప్పాడు ప్రదీప్.

యాడ్ డిజైన్‌తోపాటు వెళ్ళిపోయాడు యాడ్ ఏజన్సీ వ్యక్తి. పనులన్నీ పూర్తయ్యేసరికి, రాత్రి పది గంటలు దాటింది. లాన్‌లో కుర్చీల్లో కూర్చున్నారు ముగ్గురూ...

టీపాయ్‌మీద స్కాచ్ బాటిల్‌ని అందుకుని గ్లాసుల్లో పోసి, సోడా వేసి, తనే స్వయంగా ప్రదీప్‌కి సూర్యవంశీ అందించి, తనో గ్లాస్ తీసుకుని సిప్‌చేసి–

"షెడ్యూలు ప్రకారం ఇవాల్టి పనులన్నీ పూర్తయ్యాయి... ఒక్కటి తప్ప... అదిప్పుడు ఫైనలైజ్ అయిపోవాలి...." అన్నాడు సీరియస్‌గా.

"టైటిల్ కదా...?" అడిగాడు ప్రదీప్.

"యస్...."

"కథ వినగానే టైటిల్ నిర్ణయించుకున్నా...."

"ఏమిటది...." ఆసక్తిగా అడిగాడు సూర్యవంశీ.

"సస్పెన్స్.... ఈ పెగ్ పూర్తయ్యాక...." పెగ్గు పూర్తవడానికి పది నిమిషాలు పట్టింది.

అప్పుడు చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్ సినిమా టైటిల్‌ను.

"నేడే విడుదల."

"వండ్రఫుల్... పర్ ఫెక్ట్ టైటిల్, ఫర్ ఫర్ ఫెక్ట్ స్టోరీ...."

* * * * *

ప్రముఖ బిజినెస్ మాగ్నట్ పి. సుమంతరావు సారథ్యంలో, ప్రదీప్ దర్శకత్వంలో భారీగా నిర్మిస్తున్న తెలుగు చలనచిత్రంలో హీరోయిన్‌గా

నటించడానికి అందమైన అమ్మాయి కావాలి. వయసు పద్దెనిమిది, ఇరవై మధ్య వుండాలి. అమ్మాయి ఎత్తు 54 వుండాలి. తెలుగు ఉచ్ఛారణ స్పష్టంగా వుండాలి. వినయం, సంస్కారం, సహనం, ఇలా నేర్పగానే అలా నేర్చుకోగల గ్రహణశక్తి, సమయస్ఫూర్తి, మొదటిరోజు మేకప్ వేసుకోగానే ఫోజుకొట్టడం నేర్చుకోకుండా వుండటం చాలా ముఖ్యం... తెలుగు ఉచ్ఛారణ స్పష్టంగా వుండాలి.

ఆసక్తిగల అమ్మాయిలు. వివిధ భంగిమలల్లో దిగిన ఫోటోలు, వివరాలతో ఈ క్రింది చిరునామాకు పంపండి.

హీరోయిన్ల ఎంపిక ఒక ప్రత్యేక కమిటీ చేస్తుంది.

అభ్యర్ధినులు తమ వివరాలను పది రోజుల లోపల ఈ క్రింది అడ్రసుకు పంపాలి.

మా చిరునామా :

సుమిత్ర ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, ప్లాట్ నెంబర్ 303.

డోర్ నెం. 71, నవనిర్మాణ్‌నగర్,

జూబ్లీహిల్స్,

హైదరాబాద్–500 033.

పేపర్లో వచ్చిన యాడ్‌ను చూసి, సంతృప్తిని ప్రకటించి ఆ పేపర్ని ప్రదీప్‌కు ఇచ్చాడు సుమంతరావు. ప్రదీప్ చూసాక సూర్యవంశీ చూస్తూ–

"ఫోన్ నెంబర్ ఇస్తే బావుండేదేమో...." అన్నాడు.

"బావుండదు... లక్షమంది ఫోన్‌చేసి, సవాలక్ష ప్రశ్నలు వేస్తారు... నువ్వు కూర్చుని జవాబు చెప్పాలి... ఓపికుందా?" నవ్వుతూ అన్నాడు.

"మరి హీరో విమల్‌ని కలిసేదెప్పుడు?" అడిగాడు సుమంతరావు.

"ఇప్పుడే" ఫోన్ రిసీవర్ అందుకుంటూ అన్నాడు ప్రదీప్.

* * * * *

హైదరాబాదు నుంచి షంషాబాద్ వెళ్ళే నేషనల్ హైవేకి రెండు కిలోమీటర్ల దూరంలో ఎడం పక్కన ఏడెకరాల విశాలమైన ద్రాక్షతోట మధ్యన కొత్తగా కట్టిన మూడంతస్తుల బిల్డింగ్ చూపరులకు ఒక ప్యాలస్ లాగ కన్పిస్తుంది.

మెయిన్‌గేట్ అనుకుని వున్న గోడపైన ఐరెన్ ఫెన్సింగ్... మెయిన్‌గేట్ దాటి లోనకువెళితే, ఎడమపక్కన సెక్యూరిటీ గార్డ్‌రూమ్... ద్రాక్షతోట మధ్య సిమెంట్ దారి... ఆ చివర పోర్టికో–ఆ పోర్టికోలో ఒకమూల మనిషంత ఎత్తుండే డాబర్‌మాన్ కుక్క.

లోనికి, హాల్లోకి వెళితే, పారిస్ నుంచి తెప్పించిన అతి విలువైన షాండెలీర్... నాలుగువేపులా పాలరాతి శిల్పాలు... అందమైన సోఫాసెడ్... అక్కడక్కడ అద్భుతమైన కళాఖండాలు... అది ఒక ఇల్లులా లేదు... ఇంద్రభవనంలా వుంది.

ఆ భవనంలో రెండో అంతస్తులో ఆ చివర రూమ్‌రోడ్ దగ్గరగా వేసుంది.

ఆ డోర్ తీస్తే...

అక్కడ కిటికీ పక్కన కూర్చుని, ఒకమ్మాయి ద్రాక్షతోట వేపు నిశ్శబ్దంగా చూస్తోంది. అలా కొన్ని గంటలనుంచి ఆ అమ్మాయి అలా చూస్తూనే వుంది.

ఆమె పేరు బృంద, ఇటలీలోని జాస్మిన్ సెంటర్లో వుంచిన పాలరాతి శిల్పాన్ని నిలబెట్టినట్టుగా వుంటుంది బృంద. గ్రీక్‌వనితలా పొడవుగా, జలపాతం లాంటి వత్తు జుత్తు. గులాబీ రెక్కల్ని పొడిచేసి, తయారుచేసి పట్టుగా శరీరపు రంగు, వెన్నెల పాకుతున్నట్టుగా కన్పించే విశాలమైన కళ్ళు.

లేత నీలం రంగు సిల్కుచీర, జాకెట్టు, జడవేసుకోకుండా వదిలేసిన జుత్తు.

చాలా సేపటి తర్వాత ఆ అమ్మాయి కిటికి పక్కనుంచి కదిలి, ఉయ్యాల్లో కూర్చుని, రిమోట్ అందుకుని టీ.వీ. ఆన్ చేసింది.

ఏ ఒక్క ఛానల్‌లోనూ, ఏ ఒక్క ప్రోగ్రామూ ఆమెకు నచ్చలేదు. టీవీ ఆపేసి, ఇంగ్లీష్ సినిమా క్యాసెట్ తీసి, వి.సి.ఆర్.లో పెట్టి ఆన్ చేసింది. ఏదో వార్‌మూవీ.

అరేబియా ఎడారిలో గుర్రాలు పరుగెడుతున్న చప్పుడు, ఆ గుర్రాలన్నీ ఒక కొండ మలుపులో ఆగాయి. ఆ గుర్రాల్లో ఒక గుర్రమ్మీదున్న ఆజానుబాహుడైన ఒక వ్యక్తి.

కిందకు గెంతి కొండ వెనకవేపు నడిచాడు.

అక్కడ చిన్న చెరువు, ఆ చెరువులో ఒక యువతి స్నానం చేస్తోంది. ప్రకృతిని, పరిసరాలను మరిచిపోయి తన్మయతతో, నగ్నంగా స్నానం చేస్తున్న ఆ యువతికి కొంచెం దూరంలో నుంచున్న ఆ ఆజానుబాహువు, తన చేతిలో వున్న పువ్వును నీళ్ళల్లోకి విసిరాడు.

ఆ పువ్వు ఆ నీళ్ళల్లో తేలుతూ, ఆమె ముందుకు వెళ్ళింది. ఆ పువ్వుని అందుకున్న ఆ యువతి, చటుక్కున తలెత్తి బండరాయిమీద నుంచున్న ఆ అజానుబాహుడి వేపు చూసి చిన్నగా నవ్వింది. నగ్నంగానే ఒడ్డుకు వచ్చింది.

అతను ఆమెను కౌగిలించుకున్నాడు గాఢంగా. అరమోడ్పు కనులతో ఆమె, అతని కళ్ళల్లోకి చూసింది. అతను వంగి ఆమె పెదవులమీద గట్టిగా, గట్టిగా ముద్దు పెట్టుకుంటున్నాడు.

"స్టాప్...." అంటూ గట్టిగా అరిచి, రిమోట్‌ని టీ.వీ. స్క్రీన్ మీదకు కోపంగా విసిరేసింది బృంద.

భళ్ళున టీ.వీ స్క్రీన్ పగిలిన చప్పుడు.

అసహనంగా బృంద, ఉయ్యాలలోంచి లేచి డోర్‌వేపు రాబోతుండగా.

అప్పుడే డోర్ తెరచుకుని లోనికి వచ్చిన వ్యక్తి ఆమెవేపు చూసి చిన్నగా నవ్వాడు.

బృంద నవ్వలేదు. ఆమె ముఖంలో ఏదో తెలియని బాధ, అలసట, ఒక్కసారి ఆమె కళ్ళు కాంతి విహీనమైపోయాయి.

ఆమె పరిస్థితి అతనికి వెంటనే అర్థమైంది.

"మనం ఇప్పుడు బయటకు వెళుతున్నాం. లంచ్‌కి. ఎక్కడికెళ్దాం చెప్పు?" చిరునవ్వుతో అడిగాడతను. అతని నవ్వుకి ఆమె స్పందించలేదు.

"ఇప్పుడెందుకు అంకుల్?" నిరాసక్తంగా అన్నది బృంద.

"బోర్డాఫ్ డైరెక్టర్స్ మీటింగును కాన్సిల్ చేసుకుని వచ్చాను... తెలుసా? ఎందుకొచ్చానో చెప్పు? నా బర్త్‌డే కాబట్టి! ఐ వాంట్ టు సెలబ్రేట్ ఇట్ విత్ యూ! కమాన్ బేబీ...." అంటూ రూమ్‌లోంచి బయటి కొచ్చాడాయన.

ఆయన పేరు రామ్‌కాశ్యప్. ఛైర్మెన్ ఆఫ్ కశ్యప్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్. ఆయనకు యాభైనాలుగేళ్ళు.

ఆమె అతని వెనక మౌనంగా నడిచింది. వారిని చూడగానే పోర్టికోలో వున్న మారుతీ జెన్ కారు డోర్‌ని ఓపెన్‌చేసి వినయంగా నుంచున్నాడు తెల్లటి యూనిఫాంలో వున్న డ్రైవర్.

అతని పక్కనే నుంచున్నాడు యాభైరెండేళ్ళ సి.ఎ. రామావతారం.

"చూడండి అవతారం! మీకు వేరే కారులో ఫ్యాక్టరీకి వెళ్ళిపొండి. పర్సనల్ వర్క్‌మీద మేం బయటికి వెళుతున్నాం...." చెప్పాడు రామ్‌కాశ్యప్.

"అలాగే సార్...!" నమస్కరించి ముందు కెళ్ళిపోయాడు అవతారం.

తనెక్కి కూర్చుని "గెటిన్ బేబీ" అన్నాడు రామ్‌కాశ్యప్.

ఎక్కి కూర్చుంది బృంద.

కారు మరో మూడు నిమిషాల తర్వాత మెయిన్ రోడ్‌మీద పరుగులు తీస్తోంది.

"నీకు హైదరాబాద్ నచ్చలేదా...?" సడన్‌గా అడిగాడు రామ్‌కాశ్యప్.

విండోలోంచి బయటకు చూస్తున్న బృంద ఉలిక్కిపడింది. తలతిప్పి-

"నచ్చలేదు...." టక్కున జవాబు చెప్పింది బృంద.

"హైదరాబాద్... నీకు నచ్చలేదా? సో స్ట్రేంజ్! దానికి కారణాలు చెప్ప గలవా?" అడిగాడాయన.

"ఇక్కడ ఎక్కడ చూసినా జనం... క్రౌడ్... ఐ హేట్ పీపుల్.... ఉరుకులు, పరుగుల్తో వెళ్ళిపోయే జనం అంటే నాకసహ్యం...." చెప్పిందామె.

ఆమె మనస్తత్వాన్ని అర్ధంచేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడాయన.

"నిన్ను ఏ జపాన్‌లోనో, చైనాలోనో ఉంచాలి కొన్నాళ్ళు...." నవ్వుతూ అన్నాడాయన.

"రైఫిల్ తీసుకుని, అక్కడి జనాల్ని షూట్ చేసేస్తాను...." సీరియస్‌గా అందామె.

"చూడు బృందా! నువ్వు ఒకడినో, ఇద్దర్నో షూట్ చెయ్యగలవు. మొత్తం జనాలను షూట్ చెయ్యగలవా? ఎందుకు నీకు మనుషులంటే కోపం?"

"మనుషులంటే నాకు కోపం లేదు. మగవాళ్ళంటేనే కోపం...." అందామె కోపంగా.

"ఏ మగవాడు నీకేం అన్యాయం చేశాడు?" చాలాకాలంగా ఆమెను రామ్‌కాశ్యప్ అడగాలనుకుంటున్న ప్రశ్న అది.

ఆ ప్రశ్నకు ఆమె అంతకు పూర్వంలాగే జవాబు చెప్పలేదు.

"చూడు బృందా! ఈ ప్రపంచం నీదీకాదు – నాదీకాదు. మనందరిదీనూ! ప్రపంచంలో రకరకాల మనుషులుంటారు. వ్యక్తిత్వాలుంటాయి. మంచి వాళ్ళుంటారు, దుర్మార్గులుంటారు. మనం ఎందుకు బతకాలో, మనమే నిర్ణయించుకోవాలి. అందుకు అనుగుణంగా మనమే జీవితాన్ని మలుచుకోవాలి. జీవితంలో ఏదీ శాశ్వతం కాదు.

నా జీవితం గురించి నీకు తెలుసా? అతి సాదా, సీదా మనిషిని. ఇవాళ వెయ్యికోట్ల సంపాదించాను. నాకెవరున్నారు! ఒక్క కొడుకు... భార్య చనిపోయింది. ఆ కొడుకు అమెరికాలో వుంటున్నాడు. ఇండియా రాడు, నాదెంత ఒంటరితనం! నా ఒంటరితనాన్ని పోగొట్టేవి ఏంటో తెలుసా? మనిషి... అదే జనం... నువ్వు జనాల్ని ద్వేషిస్తున్నావు. నేను జనాల్ని ప్రేమిస్తున్నాను" ఉద్వేగంగా చెప్పాడాయన.

కారు గ్రీన్‌పార్క్ హోటల్ ముందు ఆగింది. దిగి లోనికి నడిచారిద్దరూ.

రామ్‌కాశ్యప్‌ని చూడగానే ఎమ్.డి. పరుగు పరుగున ఎదురుగావచ్చి, విష్‌చేసి సాదరంగా లోనికి తీసుకెళ్ళాడు. హోటల్ వెనుక భాగంలో ఆర్టిఫిషియల్‌గా ఏర్పాటు చేసిన వాటర్‌ఫాల్స్. ఆ పక్కన చిన్న చిన్న హట్స్! ప్రతి హట్‌కి మధ్య అందంగా ఏర్పాటు చేసిన ఫౌంటెన్స్.

వి.ఐ.పి. హట్‌లో కూర్చున్నారిద్దరూ.

మెనూ చెప్పి, బృంద మిగతా హట్స్ వేపు, వాటిల్లో వున్న జంటలవేపు చూస్తోంది.

"చూడు బృందా! మావాడు... అదే అనంత్ కాశ్యప్ అమెరికానుంచి రాడు. నీకు ఉద్యోగం ఎందుకురా అంటే వినడు. నాకు ఫ్యాక్టరీ వ్యవహారాల్లో హెల్ప్ చెయ్యడానికి ఒక సిన్సియర్ పర్సన్ కావాలి. నా మనిషి కావాలి. నువ్వు చదువుకున్న దానివి. అవగాహన, ప్రతిభ వున్నదానివి నా కంపెనీకి నిన్ను ఎమ్.డి.ని చేస్తాను. నీక్కూడా కాలక్షేపంగా వుంటుంది ఏమంటావ్?" అడిగాడు.

"వద్దంకుల్! అలాంటి రెస్పాన్స్ బిలిటీస్ నేను ఇప్పుడు నిర్వహించలేను. ఐ కాంట్ కాన్సన్‌ట్రేట్ ఆన్ ఎనీథింగ్ ఎట్ ప్రజెంట్! ఐవాంట్ సైలెన్స్... సైలెన్స్! ఐ వాంట్ లోన్లీనెస్ ఎంటైర్ లొన్లీ నెస్. ఈ ప్రపంచంలో నేనొక్కదాన్నే... మరే మనిషీ వుండకుండా వుండాలని వుంది...." నెమ్మదిగా చెప్పింది బృంద.

బేరర్ టమాటా సూప్ తెచ్చిపెట్టాడు.

"చూడమ్మా! ఏ పనీ లేని మనిషిని ఏమంటారో తెలుసా? మెంటల్ క్రిమినల్ అంటారు. అంటే మానసిక నేరస్తుడు. పనిలేని మనిషి రకరకాలుగా ఆలోచిస్తాడు. ఆ ఆలోచనలన్నీ వక్రంగానే వుంటాయి. లక్ష్యం, చిత్తశుద్ధీ ఏవీ వుండవు. నువ్వేం చేయదలుచుకుంటున్నావ్?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడాయన.

"అంటే?" ప్రశ్నించింది బృంద.

"బీ బిజీ యువర్ సెల్ఫ్! యూ వాంట్ టు డు సమ్‌థింగ్. డూ ఇట్... అవసరమైన హెల్ప్ నేనూ చేస్తాను."

పొడవాటి ప్లాస్టిక్ చెంచాతో సూప్‌ని సిప్ చేస్తూ ఆలోచిస్తోందామె.

ఆ సమయంలో ఆమె ఎదురుగా వున్న హాట్‌లో జంట వేపు చూస్తోంది.

ఆ హట్‌లో ఎదురెదురుగా కూర్చున్న జంటలో అమ్మాయికి పాతికేళ్ళ వయసుంటుంది. అబ్బాయికి ముప్పై ఏళ్ళ వయసుంటుంది. అతనేదో చెపుతుంటే, ఆమె నవ్వుతోంది. ఆ నవ్వులో అంతులేని ఆనందమూ, హాయీ వున్నాయి.

అదే సమయంలో బేరర్ రెండు ప్లేట్లు తెచ్చి టేబుల్ మీద పెట్టి, పక్కన నుంచున్నాడు.

బృంద చూస్తున్న వేపే చూస్తున్నాడు రామ్‌కశ్యప్.

"బృందా...." నెమ్మదిగా పిలిచాడు.

"నేనో ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్తావా...?" అడిగాడాయన.

ఏం మాట్లాడలేదు బృంద. ఆ హట్‌లోని జంటవేపే కన్నార్పకుండా చూస్తోంది.

ఆ జంటలోని ఆ యువకుడు అటూ ఇటూ చూసి ఆ అమ్మాయి చేయి పట్టుకున్నాడు. ముందుకు వంగి గబుక్కున ఆమె బుగ్గమీద 'ముద్దు' పెట్టుకున్నాడు.

తల పక్కకు తిప్పుకుంది బృంద.

"అడగండి అంకుల్!" అందామె.

"నీకు పెళ్ళి చేసుకోవాలని వుందా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

కళ్ళెత్తి సీరియస్‌గా రామ్‌కాశ్యప్ వేపు చూసింది బృంద.

ఒక్క నిమిషం!!

ఒకే ఒక్క నిమిషం!!

ఎడం చేత్తో టేబుల్ మీదున్న ప్లేటును విసిరికొట్టి లేచి నిలబడి, గబగబా ముందుకు నడిచి, ఎదురుగా వున్న హట్ దగ్గరికి వెళ్ళిందామె.

ఆ యువకుడి వేపు సీరియస్‌గా చూసి–

"మీరు భార్యాభర్తలా?" అడిగింది బృంద.

"ఉయ్ ఆర్ లవింగ్ ఈచ్ అదర్!" చెప్పాడు ఆ యువకుడు.

"లవింగ్... బోడి లవింగ్... పెళ్ళికాకుండా ఎందుకు ముద్దు పెట్టుకున్నావ్?" కోపంగా అడిగింది బృంద.

ఆ యువకుడికి ఏం సమాధానం చెప్పాలో తోచడంలేదు. ఒక్క క్షణం తర్వాత–

"కిస్ ఈజ్ ది సింబల్ ఆఫ్ లవ్... దట్సాల్...." అన్నాడతను చాలా క్యాజువల్‌గా.

"ఆఫ్టర్ కిస్... ఏం చేస్తావ్...." అలా అడుగుతున్న బృందనే ఆశ్చర్యంగా చూసాడతను.

"డోంట్ ఫూల్ హెర్... డోంట్ ఛీట్ హేర్... డోంట్ డిసీవ్ హేర్...." అరుస్తూ చెప్పింది బృంద.

"హు ఆర్ యూ టు ఆస్క్ మీ...." కోపంగా అన్నాడతను.

"నేనెవర్నా...." అంటూ బృంద చేయెత్తి, అతని చెంపమీద పడేల్‌మని కొట్టింది. ఆ యువకుడు కూడా నిమరుగా లేచి బృంద చేయి పట్టుకుని వెనక్కి తోసేశాడు.

అదే సమయంలో పరుగు - పరుగున వెనక్కి వచ్చిన రామ్‌కాశ్యప్ బృందను పట్టుకున్నాడు.

"ఒరేయ్... నువ్వొక మగాడివి... ఆ అమ్మాయిని మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నావ్... నువ్వు నిజమైన లవర్‌వి అయితే... దాన్ని హోటల్స్‌కి, పార్కుకి తిప్పవు... నిజమైన ప్రేమ ఎప్పుడూ గుట్టుగానే వుంటుంది నీకు తెలుసా...." కోపంగా, ఊగిపోతూ అడుగుతున్న బృంద వేపు ఆశ్చర్యంగా చూస్తూ ఆ యువకుడు, ఆ అమ్మాయి చేయిపట్టుకుని బయటకు తీసికెళ్ళిపోయాడు.

బయటికి వెళ్ళిపోతున్న వాళ్ళిద్దరివైపూ చూస్తూ– "డోంట్ టచ్‌హెర్... డోంట్ టచ్ హెర్...." అరుస్తూ, అరుస్తూ స్పృహతప్పి పడిపోయింది బృంద. కారులో వెంటనే ఆమెను అపోలో హాస్పిటల్‌కి తీసికెళ్ళిపోయాడు రామ్‌కాశ్యప్.

* * * * *

జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్.

స్పెషల్ రూమ్‌లో బెడ్‌మీద నిద్రపోతోంది బృంద.

అప్పటికి అన్ని టెస్టులూ జరిగిపోయాయి.

ఆ రూమ్‌కి ఆనుకుని వున్న ఏ.సీ. రూమ్‌లో చీఫ్ సైక్రియాటిస్ట్ ప్రొఫెసర్ విశ్వనాథ్, ఎదురుగా వున్న రామ్‌కాశ్యప్ వేపు చూసాడు.

"రామ్‌కాశ్యప్‌గారూ... ఈ అమ్మాయి ఎవర్నయినా ప్రేమించిందా" అని అడిగాడు విశ్వనాథ్.

"సర్ యువర్ ఇన్‌పర్మేషన్...షి ఈజ్ నాట్ మై డాటర్...."

"మరి...." ఆశ్చర్యపోతూ అడిగాడు విశ్వనాథ్.

"ఇట్ పజ్ ఏ లాంగ్ స్టోరీ... షి ఈజ్ ఎ గుడ్ గర్ల్... అంతే. ఆమె మానసిక పరిస్థితి చెప్పండి...." రామ్‌కాశ్యప్ మనసులో ఏదో ఆందోళనను పసికట్టాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

"ఐ థింక్ ఈజ్ సఫరింగ్ ఫ్రమ్ మెంటల్ ఇల్‌నెస్... దానికి చాలా కారణాలున్నాయి. దిసీజ్ ఓన్‌లీ సైకలాజికల్ ఇంటేలెన్స్...." అని అంటూ స్కానర్‌లోంచి తీసిన బ్రెయిన్ టెస్ట్ రిపోర్టును రామ్‌కాశ్యప్‌కు ఇచ్చాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

మళ్ళీ చెప్పాడాయన–

"కొన్నాళ్ళు ఆమె ఫీలింగ్స్‌ను టెస్ట్ చేసాకగాని, నేనేమీ చెప్పలేను. మీ అనుభవం దృష్ట్యా మీరయినా టెస్ట్ చెయ్యొచ్చు... ఆమెకు ఎంత వయసు వుండొచ్చు.... మైనీ ట్వంటీవన్... ఆర్ ట్వంటీటూ... ఈ వయసులో వచ్చే ప్రాబ్లం.. లవ్... ఎవర్నయినా ప్రేమించి మోసపోయిందా?" అడిగాడు ప్రొఫెసర్.

"నాకు తెలీదు...." చెప్పాడు రామ్‌కాశ్యప్.

"మీకూ, ఆవిడకూ సంబంధం ఏమిటి?" మళ్ళీ ప్రశ్నించాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

వెంటనే జవాబు చెప్పలేకపోయాడు రామ్‌కాశ్యప్.

"డూ యూ లవ్ హెర్...." ఎంతోమంది మానసిక పేషంట్లను చూసిన ప్రొఫెసర్ విశ్వనాథ్ అనుభవం దృష్ట్యా అడిగాడు.

"నో... నో... లవ్ అంటే మీరనుకునే లవ్ కాదు. ఆ అమ్మాయి హ్యూమన్ ఫీలింగ్స్ నాకిష్టం. అంతే దట్సాల్...." ఒక్కొక్క మాటను వత్తిపలుకుతూ చెప్పాడాయన.

"మీకు రిలేషనా...." ప్రొఫెసర్ విశ్వనాథ్ అడిగాడు.

"కాదు...." వెంటనే జవాబు చెప్పాడు రామ్‌కాశ్యప్.

"ఈజ్ దేర్ వెరీ ఇంటర్నల్ రిలేషన్...." సీరియస్‌గా అడిగాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

"మీన్స్...." కోపంగా అడిగాడు రామ్‌కాశ్యప్.

అయామ్ ఎ సైక్రియాట్రిస్ట్... యూ మస్ట్ అన్సర్ మై క్వశ్చన్ సీరియస్‌గా చెప్పాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

"మిస్టర్ విశ్వనాథ్... ఒక మనిషిని, ఇంకొక మనిషి అభిమానించడం, ప్రేమించడం అనేది ఒక వ్యాధికాదు... డబ్బు మన అందరికీ ఇష్టమే... కానీ డబ్బుని ప్రేమించడం వ్యాధా... ఇట్స్ ఎ నెససరీ. అలాగే మనిషిని, మనిషి ప్రేమించడం, అభిమానించడం తప్పనిసరి ప్రక్రియ... ఇందులో వయోభేదం లేదు... ఆమెకూ నాకూ వున్న సంబంధం... ఆమె నా ప్రాణాలను రక్షించటానికి

చిత్తశుద్ధిగా సహాయం చేసిన వ్యక్తి... ఆ కృతజ్ఞత....” మరి చెప్పలేకపోయాడు రామ్‌కాశ్యప్.

“మీరేమీ ఇక చెప్పక్కర్లేదు... నాకంతా అర్థమైంది... రేపు మార్నింగ్ ఆమెను తీసికెళ్ళిపోండి... కానీ ఆమెను కొంచెం బిజీగా వుంచటానికి ప్రయత్నించండి... ఆలోచనలు ఒక్కొక్కప్పుడు మంచికీ దారి తీస్తాయి. చెడుకీ దారితీస్తాయి... ఏకాంతపు ఆలోచనలు చెడుకీ దారితీస్తాయి. మీకు అర్థమయిందనుకుంటాను” చెప్పాడు ప్రొఫెసర్ విశ్వనాథ్.

మరో అరగంట తర్వాత హాస్పిటల్‌లోంచి బయటికి వచ్చేసాడు రామ్‌కాశ్యప్.

బయటికొచ్చాక, మామూలు సాధారణమైన వ్యక్తిలా ఐ.ఎస్.టి.డి. బూత్‌లోకి నడిచాడు.

అక్కడినుంచి కొడుకు అనంత్ కాశ్యప్‌కి, అమెరికాలోని న్యూజెర్సీకి ఫోన్ చేసాడు.

ఆ ఫోన్ ఎంతకీ ఎవరూ లిఫ్ట్ చేయకపోవటంతో అసహనంతో ఫోన్ రిసీవర్ని పెట్టేసీ, కారెక్కాడు.

* * * * *

కళ్ళు లేకపోతే కన్నీళ్ళు రావు. కళ్ళు గుడ్డివైనా కన్నీళ్ళు వస్తాయి. మనసు బాధతో మూసుకుపోయినా దుఃఖం ఒక నిరంతర జలపాతం. ఉబికి దుమికే జలపాతం నిండా, ఎన్ని కన్నీళ్ళ ప్రవాహాలుంటాయో ఎవరికి తెలుసు?

హాస్పిటల్‌లోంచి వచ్చిన బృంద, బెడ్‌రూమ్‌లో నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

ఆమెకు ఎదురుగా రామ్‌కాశ్యప్.

రెండు గంటలనుంచీ కదలకుండా, ఆమెవైపే చూస్తూ కూర్చున్నాడు. కాసేపయ్యాక కిందకొచ్చి హాల్లో కూర్చున్నాడు. ఎదురుగా టీపాయ్ మీదున్న న్యూస్‌పేపర్ తిరగేస్తున్నాడు.

మెయిన్ పేపర్ తిరగేసాక, సప్లిమెంట్‌కు అందుకుని చూస్తున్న రామ్‌కాశ్యప్ సినిమా పేజీలో సినిమా వార్తల్ని చూస్తున్నాడు.

అతనెప్పుడూ ఇప్పటివరకూ సినిమా పేజీని చూడలేదు. అతని దృష్టి ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ మీద పడింది.

ఆ అడ్వర్‌టైజ్‌మెంట్-

కొత్త హిరోయిన్‌లకు ఆహ్వానము.

పూర్తిగా చదివి, ఆలోచనలో పడ్డాడు రామ్‌కాశ్యప్.

అతని ఆలోచనలు ఒక రూపం దిద్దుకోవటానికి ముప్పై నిముషాలు పట్టింది.

*     *     *     *     *

ఉదయం ఆరు గంటల సమయం.

అప్పుడే జాగింగ్‌చేసి వచ్చిన రామ్‌కాశ్యప్ లాన్‌లో తిరుగుతున్న బృంద వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"గుడ్‌మార్నింగ్ అంకుల్... నిన్న నాకేమైంది...." అడిగింది బృంద.

"ఏం జ్ఞాపకం లేదా...." అడిగాడు రామ్‌కాశ్యప్.

"లేదంకుల్... మనం ఏదో హోటల్‌కి వెళ్ళాం... అక్కడ మనం సూప్ తాగుతున్నాం... అంతవరకు మాత్రమే జ్ఞాపకం వుంది... ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు...." అందామె.

బృంద మానసిక పరిస్థితిని ఏమాత్రం అంచనా వేయలేకపోతున్నాడు రామ్‌కాశ్యప్. కొన్ని వేలమంది ఉద్యోగస్తులకు సింహస్వప్నంగా వుండే రామ్‌కాశ్యప్‌కు పరిస్థితి అయోమయంగా వుంది.

"ఈ అమ్మాయి డ్రామా ఆడుతోందా...." అనే సందేహం వస్తోంది అతనికి.

"నువ్వు ఆ హోటల్లో ఒక అబ్బాయిని కొట్టావు గుర్తుందా...?" అని అడిగాడాయన సీరియస్‌గా.

"నేను కొట్టానా... ఎందుకు కొట్టడం?" అమాయకమైన ముఖంతో ప్రశ్నించింది బృంద.

అరగంట తర్వాత...

లాన్‌లో టీపాయ్‌కి ఎదురెదురుగా కూర్చున్నారు బృంద, రామ్‌కాశ్యప్. రామ్‌కాశ్యప్ చేతిలో పేపర్ పేజీ వుంది.

"బృందా... నీ అందమ్మీద నీకు నమ్మకం వుందా...." అని అడిగాడాయన.

నవ్వింది బృంద.

"అయ్ లైక్ యువర్ స్మైల్...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"థాంక్యూ అంకుల్...." అంది బృంద.

"జస్ట్ ఫర్ ఏ ఛేంజ్... నువ్వు సినిమా హీరోయిన్‌వి ఎందుకు కాకూడదు...." అడిగాడు రామ్‌కాశ్యప్.

రామ్‌కాశ్యప్ మాటలకు పెద్దగా నవ్వేసింది బృంద.

"నేనా...? సినిమా హీరోయిన్నా...? చిన్నప్పుడు అనుకునేదానిని... నా అభిమాన హీరో అయినా సరే మగాళ్ళని షూట్‌చేసి చంపెయ్యాలనుకున్నాను... ఎప్పుడో నేను ఎవర్నో చంపేస్తాను...." ఆ మాటా సీరియస్‌గా అందో, సరదాగా అందో అర్థంకాలేదు రామ్‌కాశ్యప్‌కి.

"అంటే నీకు సినిమా ఫీల్డ్ అంటే ఇంట్రెస్ట్ వుంది... అవునా కాదా... చెప్పు....." అడిగాడాయన.

మౌనంగా వుండిపోయింది.

"వెరీగుడ్ బేబీ... ఒక ప్రాబ్లెమ్‌కి ఒక సొల్యూషన్ దొరికింది. అయామ్ హేపీ నౌ...." అంటూ లేచి వెళ్ళిపోతున్న రామ్‌కాశ్యప్ వేపు ఆసక్తిగా చూడసాగింది బృంద.

* * * * *

TO HANDLE YOUR SELF USE YOUR HEAD.

TO HANDLE OTHERS. USE YOUR HEART.

అమెరికాలోని, అట్లాంటా సిటీలో ఒక పబ్‌లో కూర్చుని స్కాచ్ తాగుతున్న అనంతకాశ్యప్, ఎదురుగా కూర్చున్న ఫ్రెండ్ ఇచ్చిన పుస్తకంలో, మొదటి పేజీలో కన్పించిన కొటేషన్‌ను చూసి విసుక్కుని ఆ బుక్‌ని పక్కన పడేసి–

"చూడు నియమా... కొటేషన్స్ ఎవరికి...? నీలాంటి వాళ్ళకి... జీవితంలో ఫిలాసఫీ ఎందుకొస్తుంది...? ఓడిపోయాక వస్తుంది... కోటీశ్వరులు ఫిలాసఫీల్ని రాయరు.... పేదవాళ్ళే రాస్తారు... పేదవాళ్ళు ఎవరు? పిరికివాళ్ళే పేదవాళ్ళు... నువ్వొక పిరికిదానివి... మన పెళ్ళి ఇక్కడే జరుగుతుంది... ఐలవ్‌యూ

సోమచ్....” అని ఆగి, ఒక పెగ్గు తాగి సిగరెట్ వెలిగించుకుని నియమవేపు చూస్తున్నాడు అనంత్‌కాశ్యప్.

“ఓ.కే... అనంత్... అయ్ టూ ఎగ్రీ విత్ యువర్ ఆర్గ్యూమెంట్ బట్ వన్‌థింగ్... అయామ్ నౌ ప్రగ్నెంట్... ఏం చేయమంటావ్?” అడిగిందామె.

“ప్రెగ్నెన్సీ... ఇట్స్ కామన్ ఫర్ లేడీస్... అబార్షన్ చేయించుకో” అన్నాడు అనంత్ కాశ్యప్–చాలా తేలిగ్గా.

“నేను చేయించుకోను. నేను మీ నాన్నగారితో మాట్లాడతాను....” అంది నియమ.

“మా నాన్నగారితో నువ్వెందుకు మాట్లాడడం. ఆయనొక ఇడియట్, మా మదర్ చనిపోయాక డాడీ రెండో పెళ్ళి చేసుకోండీ అని అడిగాను... చేసుకోలేదు. అంత సిన్సియర్ మాన్, అన్ని కోట్లు ఎలా సంపాదించాడో నాకే అర్థం కాలేదు. సిన్సియార్టీ ఒక్కొక్కప్పుడు మనుషుల్ని ఫూల్స్‌ని చేస్తుంది” ఉద్వేగంగా అన్నాడు అనంత్‌కాశ్యప్.

నవ్వింది నియమ. ఆ నవ్వులో రకరకాలైన మనస్తత్వ పరిశీలన వుందని అనంత్ కాశ్యప్‌కి తెలీదు.

*　　*　　*　　*　　*

గెస్ట్‌హౌస్‌లో ప్రదీప్ ఒక్కడే వున్నాడు. సూర్య కోసం ఎదురు చూస్తున్నా డతను.

ఆఫీస్ బాయ్ వచ్చి, కొన్ని కవర్లను టేబిల్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు. అవన్నీ హీరోయిన్ సెలక్షన్ కోసం వచ్చిన అప్లికేషన్లు. ఒక్కొక్కటీ కవర్ విప్పి ఫోటోను, బయోడేటాను చూస్తున్నాడు ప్రదీప్.

బయోడేటాతోపాటు, పిన్ చేసిన లెటర్‌వేపు చూసి, ఆ లెటర్‌ను చదవడం ప్రారంభించాడు.

డైరెక్టర్ గారూ!

నా పేరు సునంద. మాది అనకాపల్లి. డిగ్రీ పూర్తిచేశాను. నాకు సినిమాల్లో హీరోయిన్‌గా నటించాలని వుంది. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. ప్రతిరోజూ టీవీలో అన్ని ఛానల్స్‌లో వచ్చే సిరియల్ చూస్తుంటాను. అలాగే

సినిమా పాటల్ని చూస్తుంటాను. నేను హీరోయిన్ పాత్ర ఇచ్చినా, ఇంకా ఏ పాత్ర ఇచ్చినా బాగా నటించి, పేరు తెచ్చుకోగలను. సెక్సీగా కూడా నటించగలను. కొత్త హీరోయిన్లు, డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్‌తో సన్నిహితంగా వుంటేనే పేరు వస్తుందని, డబ్బుకూడా వస్తుందని మా ఫ్రెండ్స్ చెప్పారు. చాలామంది హీరోయిన్లు అలాగే వుంటారట.

నేను అర్ధనగ్నంగా నటించటానికి రెడీ. అలాగే ముద్దు సీన్లతోగానీ, పడక సీన్లలోగానీ మొహమాటం లేకుండా నటించగలనని హామీ ఇస్తున్నాను. నా బాడీ కొలతలన్నీ ఇప్పుడున్న సినిమా హీరోయిన్లకన్నా ఆకర్షణీయమైనవని తెలియజేస్తున్నాను.

మీరు నాకు హీరోయిన్‌గా అవకాశం ఇస్తే, ఈ జన్మలో మీ ఋణం వుంచుకోను.

యువర్స్ సిన్సియర్లీ

విశాలాక్షి...

సినిమా క్రేజ్ చాలా గొప్పది. సిన్సియర్ వ్యక్తులకు సినిమా ఇండస్ట్రీ బంగారు గని అయితే, వీక్‌నెస్ వ్యక్తులకు అదే. ఇండస్ట్రీ ఊబి అవుతుంది.

ఒకప్పుడు సంవత్సరానికి రెండు వందల యాభై సినిమాలను తీసిన తెలుగు ఇండస్ట్రీ ప్రస్తుతం యాభై చిత్రాలకు మాత్రమే పరిమితమై పోయింది. తమిళ డబ్బింగ్ సినిమాలకు వున్న విలువ, ఒరిజినల్ తెలుగు సినిమాలకు లేదు. కారణం ఏమిటి?

సక్సెస్ పార్ములా పేరుతో హ్యూమన్ టచ్‌ని కోల్పోవడం, ఏ కళలోనైనా మానవతా స్పర్శ చాలా ముఖ్యం. సినిమా సామూహిక మధనానికి ఆకృతి. సినిమా అంటే మనుషుల్ని అమ్మడం కాదు. మనుషుల్ని నమ్మడం, మానవత్వాన్ని నమ్మడం. నిజజీవితానికి ప్రతిబింబంగా ప్రతి స్పందనగా, భావితరాలకు సినిమా కళారంగం జాగృతిగా వుండాలి.

పెట్టుబడి, లాభం అనే సూత్రం ప్రతి ఇండస్ట్రీకీ వుంటుంది. నిజాయితీ అనేది కనిపించని అంతస్సూత్రం. ఆ అంతస్సూత్రమే సక్సెస్‌కు దారితీస్తుంది. నాల్గు పాత సినిమాలను కలిపేసి, కొత్త సినిమా తీయడం చిత్తశుద్ధికి నిదర్శనం కాదు. నిత్య నూతన చైతన్యం, సిసలైన సినిమాకు నాంది అవుతుంది.

"నమస్తే...." తలెత్తి చూశాడు ప్రదీప్.

ఎదురుగా రచయిత సూర్య.

"ఫస్ట్ ఆఫ్ డైలాగ్ వెర్షన్ రెడీ సార్" అంటూ ఎదురుగా కూర్చుని, ఓ ఫైల్‌ని ప్రదీప్‌కి అందించి, హీరోయిన్ అప్లికేషన్స్‌లోని ఫోటోల్ని చూస్తూ.

"చాలా వచ్చినట్లున్నాయ్...." అని అన్నాడు సూర్య.

డైలాగ్ వెర్షన్‌ని తిరగేస్తున్నాడు ప్రదీప్.

"హీరో విమల్ ఇప్పుడు వస్తారు... నువ్వు ఆయనకు కథ చెప్పాలి" అన్నాడు ప్రదీప్.

"హీరో విమల్‌కి కావల్సింది... ఎన్ని ఫైట్స్ వున్నాయ్... ఎన్ని పాటలున్నాయనేదే కదా... ఆ విషయం నిన్ననే చెప్పాను కదా...." జోగ్గా అన్నాడు సూర్య.

"ఒక భారీ సీన్ చెప్పు... ఎలా రియాక్ట్ అవుతాడో చూద్దాం... ప్రస్తుత పరిస్థితుల్లో గట్టి ఫైనాన్సియల్ మనకు దొరకాలంటే, విమల్‌ని హీరోగా పెట్టుకోక తప్పదు... ఎందుకంటే, ఫైనాన్సియర్లకు కళ అక్కర్లేదు... కాసులు కావాలి...." తన ఆవేదనను వ్యక్తం చేశాడు డైరెక్టర్ ప్రదీప్.

సరిగ్గా అదే సమయంలో లోనికి వచ్చాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

"హీరో గారొచ్చారా?" అని అడుగుతూ కుర్చీలో కూర్చునర్నాడు సుమంతరావు.

సరిగ్గా అదే సమయంలో ఆఫీసు బాయ్ పరిగెత్తుకుని లోనికొచ్చి-

"సార్ హీరో విమల్ గారొచ్చారు...." అంటూ ఎక్సయిటయి పోతూ చెప్పాడు.

ప్రదీప్ లేచి ఆ రూమ్‌లోంచి బయటకొచ్చాడు. ఆ వెనక సూర్య అనుసరించాడు.

హీరో విమల్ హాల్లోకి వచ్చి ఎదురుగా నుంచున్న ప్రదీప్‌వేపు చూసి విష్ చేశాడు.

"అరగంట ఆలస్యమైందనుకుంటారు... రాత్రి కొంచెం లేటయింది. ఫిల్మ్‌సిటీలో అమితాబ్‌బచ్చన్ కలిస్తే... మీకు తెల్సుగా... నా లేటెస్ట్ సినిమా

చూశాడట... కంగ్రాచ్యులేట్ చేశాడు....” చెపుతూ మెట్లెక్కి వచ్చి రూమ్‌లో వున్న ప్రదీప్ సీట్లో కూర్చుని, ఎదురుగా వున్న సుమంతరావు వేపు చూసి నవ్వాడు.

సుమంతరావుని పరిచయం చేశాడు ప్రదీప్.

“చెప్పారు... వారేం.... ప్రొడ్యూసర్ గారా... నమస్తే అండీ... నిన్న మీరు రాలేదనుకుంటా....” అన్నాడు హీరో విమల్.

ఆ మాట మీరెందుకు రాలేదు అన్నట్టు అనిపించింది సుమంతరావుకి.

“అవును ప్రదీప్ కథేంటి...? నేను చిన్న చిన్న వేషాలేస్తున్నపుడు... మీరు అసిస్టెంట్ డైరెక్టర్... నన్ను ఎంకరేజ్ చేసారు... అంచేత ప్రొడ్యూసర్ కొత్త వ్యక్తి అయినా, మీకోసం ఒప్పుకున్నాను... చూడండి... కథంతా నామీదే నడవాలి... ఫస్ట్ హాఫ్‌లో మూడు పాటలు, మూడు ఫైట్స్ వుండాలి. కనీసం రెండు పాటలనైనా స్విట్జర్లాండ్‌లోగానీ, కనీసం మలేషియాలోగానీ తీస్తే బావుంటుంది....” అన్నాడు హీరో విమల్.

అతనివేపు ఆశ్చర్యంగా చూశాడు ప్రదీప్.

“అది కాదు హీరోగారూ... మనది కొంచెం వెరైటీ సబ్జెక్టు... లేడీ ఓరియంటెడ్... అందులో మీది కొంచెం నెగెటివ్ టచ్ వున్న క్యారేక్టర్... న్యాయం కావాలి సినిమా చూశారుగా... అందులో చిరంజీవి క్యారెక్టర్ లాంటిది....” చెప్పాడు సూర్యవంశీ.

“మీరెవరు?” అడిగాడు హీరో విమల్.

“సారీ... ఆయన్ని మీకు పరిచయం చేయటం... మర్చిపోయినట్టు న్నాను... ఆయన మన రైటర్‌గారు... సూర్య....” మళ్ళీ పరిచయం చేశాడు డైరెక్టర్ ప్రదీప్.

“నిన్న మీరు వచ్చారు కదూ... అసిస్టెంట్ అనుకున్నాను. ఇంతకు పూర్వం ఏ సినిమాలకు వర్క్ చేశారు” అడిగాడు విమల్.

“ఇదే ఫస్ట్ సినిమా, చాలా సీరియల్స్‌కి వర్క్ చేశాను. దూరదర్శన్‌లో సుడిగుండంలో అడది ఈయనదే, మన సినిమాకి మంచి స్టోరీ ఇచ్చాడు” చెప్పాడు ప్రదీప్.

“ఎంత మంచి స్టోరీ అయినా తెలుగులో ఒరిజినల్ స్టోరీస్ వర్కవుట్ కావండీ... తమిళ మూవీస్ చూడండి, ఒక సక్సెస్ మూవీ తీసుకుని మనం

రీమేక్ చేసుకున్నామనుకోండి. గ్యారంటీ ప్రాఫిట్ వుంటుంది. కొత్త ప్రొడ్యూసర్స్‌కి రీమేక్ బెటర్. ఎందుకీ పెయిన్? అందుకే ఒరిజినల్ తెలుగు స్టోరీస్ అంటే నాకు భయం" అన్నాడు హీరో విమల్.

"తమిళ స్టోరీస్ తీసుకున్నామనుకోండి. ఆ తమిళ హీరో, హీరోయిన్స్‌నే పెట్టుకుంటే సరిపోతుందిగా, తెలుగు హీరో, హీరోయిన్స్ ఎందుకు?" ఆ ప్రశ్న వేసిన సుమంతరావు వేపు కొంచెం కోపంగా చూశాడు హీరో విమల్.

వెంటనే తన మాటను మార్చేశాడు విమల్.

"సినిమాను హిట్ చేసేది డైరెక్టర్ అంటే మీరు... ప్రస్తుతం నేను సక్సెస్‌ఫుల్ హీరోని. నా హీరో ఇమేజ్‌కి దెబ్బతగలకుండా సినిమా తీసే బాధ్యత మీది. నాకు కథ అనవసరం. మీ మీద నాకు నమ్మకం వుంది ఇంతకీ హీరోయిన్ ఎవరు... ఆ అరవిందేనా?" అడిగాడు విమల్.

ఇటీవలకాలంలో వరుసగా వచ్చిన సినిమాల్లో విమల్ పక్కన అరవింద హీరోయిన్‌గా నటించిన సినిమాలు సక్సెస్ అయ్యాయి. హిట్ పెయిర్‌గా వాళ్ళకు పేరొచ్చింది. అందుకే విమల్ అరవిందను రికమెండ్ చేస్తున్నాడు. విమల్, అరవింద ప్రేమించుకుంటున్నారని, వాళ్ళిద్దరూ త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నారని కొన్ని ఇంగ్లీష్ మ్యాగజైన్స్‌లో న్యూస్ కూడా వచ్చింది.

"మీరు నిన్నటి పేపర్ చూడలేదనుకుంటా" అన్నాడు సూర్య.

"లేదు... నేను పేపర్లు ఎక్కువగా చూడను. అంత తీరికేదండి. నిన్నటి పేపర్లో ఏముంది?" ప్రశ్నించాడు విమల్.

"కొత్త హీరోయిన్ కావాలని మనం ప్రకటన ఇచ్చాం" చెప్పాడు ప్రదీప్.

"ఆ ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ వల్ల ఉపయోగం లేదండీ. తెలుగువాళ్ళు మనకు వద్దనుకుంటే, హిందీ అమ్మాయిలు బెటరు. ఎక్స్‌పోజింగ్‌కు కాదనడు. అన్ని విషయాల్లోనూ మనకు కోఆపరేట్ చేస్తారు. ఏమంటారు ప్రొడ్యూసర్‌గారూ?" అంటూ కన్నుగీటాడు హీరో విమల్.

"ప్రొడ్యూసర్ సమంతరావుకి అప్పటికే హీరో విమల్ ధోరణి నచ్చలేదు. అంచేత ఏం మాట్లాడలేదు.

"ఏం విమల్‌గారూ! స్టోరీ ప్రకారం కొత్త హీరోయిన్ అయితేనే బాగుంటుం దనుకున్నాం" అన్నాడు ప్రదీప్.

"మీ యిష్టం... అరవింద అయితే బెటర్. అరవిందలా కోపరేట్ చేస్తే, కొత్త హీరోయిన్ అయినా బెటరే, మీ టేస్టుని నేనెందుకు కాదనటం? మ్యూజిక్ సిట్టింగ్స్ ఎప్పుడు?" అన్నాడు విమల్.

చెప్పాడు ప్రదీప్.

"ఫస్ట్ సాంగ్‌ని అజంతాలో షూట్ చేద్దాం. ఎందుకంటే నాకు అజంతా చూడాలని వుంది" చెప్పాడు హీరో విమల్.

సుమంతరావు వేపు చూసి అలాగేనన్నాడు ప్రదీప్.

అరగంట తర్వాత అడ్వాన్స్ తీసుకుని, హీరో విమల్ వెళ్ళిపోయాక...

"హీరోలు ఇలా వుంటారనుకోలేదు" అన్నాడు సుమంతరావు.

"అందరు హీరోలూ ఇలా వుండరు. అవసరం మనది. సినిమా ఇండస్ట్రీలో తలనొప్పులు మీకు తెలీవు. రోజుకి పది అమృతాంజనం సీసాలు రాసుకుంటేనే గానీ నిద్రపట్టదు" అన్నాడు ప్రదీప్.

హీరోయిన్ సెలక్షన్ ఎంతవరకొచ్చిందండి?" అడిగాడు సుమంతరావు.

"చాలా అప్లికేషన్‌లు వచ్చాయి. వెరిఫై చేసి రేపు లెటర్స్ పంపాలను కుంటున్నాను" చెప్పాడు ప్రదీప్.

*    *    *    *    *

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాడు. రామ్‌కాశ్యప్. ఎదురుగా పి.ఎ. రామావతారం నుంచున్నాడు.

కొన్ని చెక్కులమీద సంతకాలు తీసుకున్నాక–

ఊటీకి రెండు టిక్కెట్స్ బుక్ చేశాను సార్!" అన్నాడు అవతారం.

"అక్కర్లేదు... కాన్సిల్ చెయ్యండి. నీకెవరైనా సినిమా ప్రొడ్యూసర్స్ తెలుసా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"తెలీదు సార్!" అన్నాడతను ఆశ్చర్యపోతూ.

"నువ్వెప్పుడైనా అసలు సినిమాలుచూస్తావా?" నవ్వుతూ అడిగాడు రామ్‌కాశ్యప్.

"అప్పుడెప్పుడో నాగయ్య నటించిన భక్తపోతన చూశాను సార్! తర్వాత చూడలేదు" చెప్పాడు అవతారం బిక్క మొహం వేసుకొని.

"అంటే... నీ చిన్నప్పుడు చూశావన్నమాట" అన్నాడాయన చిన్నగా నవ్వుతూ.

"మన బృందను సినిమా యాక్టర్ని చెయ్యాలి... ఏమంటావ్?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"నలభై ఏళ్ళనుంచి మీ దగ్గరున్నాను. మనిద్దరం ఎప్పుడో కలిసి చదువు కున్నాం. ఆ స్నేహంతో నన్ను కష్టంలో ఆదుకుని, పి.ఏ.గా ఉద్యోగమిచ్చి, తమ్ముడిలా చూసుకున్నారు. నాకు తెలియక అడుగుతున్నాను సార్... మీకు ఒక్కగానొక్క కొడుకు. అనంత్ గురించి మీరింతగా ఆలోచించడం నేనెప్పుడూ చూడలేదు. కొన్ని నెలల క్రితం పరిచయమైన ఒక అమ్మాయి గురించి... ఇంతగా... ఆవిడ... వూరేంటో తెలీదు" సందేహాలను వ్యక్తం చేశాడు చనువుగా రామావతారం.

"స్నేహం, చుట్టరికం, బాంధవ్యం... ఇవేవీ లేకపోతే ఒక మనిషిని ఇంకొక మనిషి పట్టించుకోకూడదా రామావతారం? కొన్ని నెలలక్రితం ఈ అమ్మాయే లేకపోతే... నేనీనాడు నీ ముందు వుండేవాడినికాదు... రామావతారం! అదంతా పెద్ద కథ. ప్రపంచంలో కృతజ్ఞత తీర్చుకోవడం కన్నా గొప్ప దాతృత్వం లేదని నమ్మే మనిషిని నేను. ఆ విషయం నీకు తెలుసు. ఒక పనిచెయ్... మన ఆఫీసుకి ఫోన్‌చేసి, జనరల్ మేనేజర్ పరశురామ్‌ని ఒకసారి ఇంటికి రమ్మని చెప్పు" అంటూ మేడ మెట్లెక్కసాగాడు రామ్‌కాశ్యప్.

* * * * *

రామ్‌కాశ్యప్ తన చేతికిచ్చిన కవర్ వేపు చూస్తూ.

"ఏంటీ అంకుల్ ఇది...." అడిగింది బృంద.

"తిప్పిచూడు...." అన్నాడు రామ్‌కాశ్యప్. ఆ కవర్ విప్పి, ఆ కవర్‌లో ఉన్న తన ఫోటోలవేపు ఆశ్చర్యంగా చూస్తూ.

"ఈ ఫోటోలెలా వచ్చాయి... నేనెప్పుడూ తీయించుకోలేదే...." ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని వ్యక్తంచేసింది బృంద.

"నేనే స్వయంగా, నా కెమెరాతో, నీకు తెలీకుండా తీసాను...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"ఇప్పుడీ ఫోటోలెందుకు?"

"సినిమా వాళ్ళకు పంపడానికి."

"హీరోయిన్ కోసమా?"

"అవును."

"హీరోయిన్‌గా సెలక్ట్ కావడమంటే మాటలా... టాలెంట్, బ్యూటీ వుంటే మాత్రమే సరిపోదు... ఎవరో సినిమా పెద్దమనిషి రికమండేషన్ వుండాలి...." చెప్పింది బృంద.

నవ్వాడు రామ్‌కాశ్యప్.

"నీకు సినిమా ఇండస్ట్రీ గురించి చాలా విషయాలు తెలుసే... రికమండేషన్ ఉన్నంత మాత్రాన ఎవరూ హీరో, హీరోయిన్లు అయిపోరమ్మా... లక్ ఉండాలి... ఆ లక్ వెనక టాలెంట్ ఉండాలి... బ్యూటీ ఉండాలి... నీకు బ్యూటీ వుంది... టాలెంట్ వుంది... నువ్వెందుకు సెలక్ట్ కావు...." అని, ఆ పేపర్ తీసి, పేజీని ఆమెకిచ్చి.

"ఈ అడ్వర్‌టేజ్‌మెంట్ చూడు...." అన్నాడు.

బృంద ఎడ్వర్టేజ్‌మెంట్ వేపే చూస్తోంది.

"ఇంటర్వ్యూకి కొన్ని వందలమంది అమ్మాయిలు వస్తారు... నేను సెలక్ట్ అవుతానని నాకు నమ్మకంలేదు...." అందామె.

"నువ్వే సెలక్ట్ అవుతావని నాకు నమ్మకం... నమ్మకం కాదు... నువ్వే సెలక్ట్ అవుతావు... దట్సాల్... బయోడేటా రాసివ్వు... పంపుతాను. ఇవాళే లాస్ట్ డేట్... చూసావుకదా....." అన్నాడు రామ్‌కాశ్యప్.

బయోడేటా రాసి, సంతకం చేసి రామ్‌కాశ్యప్‌కి ఇస్తూ-

"నా సినిమా ఇంట్రస్ట్‌ని మీరింత సీరియస్‌గా ఎందుకు తీసుకుంటున్నారో నాకర్థంకావడంలేదు...." అని అందామె.

"నాకు బిజినెస్ ఇంట్రెస్ట్... సీరియస్‌గా తీసుకున్నానా లేదా... నువ్వంటే నాకు ఇంట్రెస్ట్... నీకు సినిమాలంటే ఇంట్రెస్ట్... నీ ఇంట్రెస్ట్‌ని కాపాడాల్సిన రెస్పాన్సిబులిటీ నాకు లేదంటావా?... అన్నాడాయన ఆర్ద్రంగా.

మరో గంట తర్వాత–

రామ్‌కాశ్యప్ ఫోటోల్నీ, బయోడేటాని కవర్‌లో పెట్టి తనే స్వయంగా అడ్రస్ రాసి పి.ఎ. రామావతారానికిచ్చి–

"నువ్వు స్వయంగా ఈ కవర్‌ని ఆ ఫిలిమ్ కంపెనీ ఆఫీసుకెళ్ళి ఇచ్చిరా... తర్వాత ఏం చేయాలో చెప్తాను...." అన్నాడు.

* * * * *

సుమిత్ర ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ ఆఫీస్ కోలాహలంగా వుంది. ప్రొడక్షన్ మేనేజర్, ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్స్... డైరెక్టర్ ప్రదీప్ ఎదురుగా కూర్చున్నారు.

ఒక రూమ్‌లో మ్యూజిక్ డైరెక్టర్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి.

"ఇరవై రెండో తేదీన రామానాయుడు స్టూడియోలో ముహూర్తం... అంటే మూడే మూడు రోజులుంది... రేపు మనం హీరోయిన్‌ని ఫైనలైజ్ చేస్తున్నాము... ఇరవైనాలుగున అజంతాలో పాట పిక్చరైజేషన్... డాన్స్ డైరెక్టర్ రహీమ్‌కి ఇప్పుడే ఫోన్ చేశాను... ఎరేంజ్‌మెంట్స్ చూడండి.... రెండు షెడ్యూల్స్‌లో పిక్చర్ పూర్తయి పోవాలి... రైటర్‌గారిని ఒకసారి రమ్మని చెప్పండి...." అని చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

ఒక అసిస్టెంట్ డైరెక్టర్ బయటకు వెళ్ళాడు. అయిదు నిమిషాల తర్వాత రైటర్ సూర్య, డైరెక్టర్ రూమ్‌లోకి వచ్చాడు.

"రేపు హీరోయిన్ సెలక్షన్... మూడు నిమిషాలకు సరిపోయే మంచి సీన్ కావాలి...." అడిగాడు ప్రదీప్.

"మంచి సీన్ అరగంటలో తెస్తాను...." చెప్పి వెళ్ళిపోయాడు సూర్య.

ప్రొడక్షన్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్స్ వెళ్ళిపోతున్న దశగా ప్రొడ్యూసర్ సుమంతరావు లోనికొచ్చాడు.

"ఆ ఫైనాన్సర్ వ్యవహారం ఎంతవరకొచ్చింది?" అడిగాడతను.

"ట్రై చేస్తున్నా...." అన్నాడు ప్రదీప్.

"షూటింగ్ స్టార్టయ్యేసరికే ఫైనాన్సర్ వ్యవహారం సెటిలైపోవాలి... లేకపోతే నీ కాన్‌సన్‌ట్రేషన్ దెబ్బతింటుంది... జాగ్రత్త...." హెచ్చరించాడు సుమంతరావు.

"లేదు.... భగవాన్, భాగ్యరాజులకు ఫోన్ చేశాను... వాళ్ళిద్దరే ఇండస్ట్రీలో ప్రస్తుతమున్న పెద్ద ఫైనాన్సర్... భాగ్యరాజు బెంగుళూరు వెళ్ళడట. రేపు వస్తాడు... భగవాన్‌తో అపాయింట్‌మెంట్ మధ్యాహ్నం మూడు గంటలకు... నేనే స్వయంగా వెళ్ళి మాట్లాడతాను...." చెప్పాడు ప్రదీప్.

"రేపు హీరోయిన్ సెలక్షన్ అయ్యాక, నేను ఢిల్లీ వెళతాను... ముహూర్తం టైమ్‌కి వచ్చేస్తాను... ఏదైనా పనుంటే హోటల్‌కి ఫోన్ చెయ్యి...." చెప్పి వెళ్ళిపోయాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

మధ్యాహ్నం మూడు గంటలు.

రాష్ట్రపతి రోడ్‌లో ఉన్న ఫైనాన్సర్ భగవాన్ ఆఫీసులో భగవాన్ ఎదుట కూర్చున్నాడు డైరెక్టర్ ప్రదీప్, పక్కనే వున్నాడు రైటర్ సూర్య.

"ఆ సుమంతరావు గురించి నేనూ విన్నా... గ్రానైట్ బిజినెస్ గదా... బావుందా... ఆయనెంత పెడుతున్నాడు?" అడిగాడు భగవాన్.

చెప్పాడు.

అందుకు సంబంధించి బ్యాంక్ బుక్ చూపించి... "ఫిఫ్టీ లాక్స్ డిపాజిట్ చేసాడాయన" చెప్పాడు ప్రదీప్.

"విమల్ హీరోనా... హీరోయిన్ కొత్తమ్మాయా... కతేంటి...." అడిగాడు భగవాన్.

వెంటనే గడగడమని కథ చెప్పాడు సూర్య.

కథ అంతా విన్నాక–

"ఈ సినిమా హిందీలో వచ్చిందా, తమిళంలో వచ్చిందా...." అడిగాడు భగవాన్.

"లేదుసార్! మన స్వంత తెలుగు కథ సార్. ఒక యధార్థ సంఘటనని యధాతథంగా తెరకెక్కించే ప్రయత్నం సార్. స్టోరి వెరైటీగా ఉందా లేదా?" అడిగాడు సూర్య.

"ఏంది... వెరైటీ... కథ ఎలా ఉన్నా ఫర్వాలేదయ్యా... ఇవ్వాళ కథలు చూసి సినిమా చూస్తున్నారా? వంద రోజులు ఆడితేనే సినిమాలో మంచికథ ఉన్నట్టు లెక్క... నాకు తెల్వక అడుగుతాను... లవ్వూ, పెళ్ళి సబ్జెక్టులమీద ఎన్ని సినిమాలయ్యా మీరు తీస్తారు... ట్రెండ్ మార్చండయ్యా... విఠలాచార్య సినిమాలు చూసావా నువ్వు– ఆ సినిమాలు నాకిష్టం. కత్తి, యుద్ధాలు, గుర్రాల పరుగులు... పిల్లి పులి అయిపోవడం... ఎలుక ఎలుగుబంటు అటు పోవడం, బావుంటాయయ్యా. ఆ సినిమా తియ్యరాదూ?" చాలా కులాసాగా చెప్పాడు భగవాన్.

"ఆ సినిమా ప్రస్తుతం తీయడం చాలా కష్టంసార్... జనం టేస్ట్ మారి పోయింది" చెప్పాడు ప్రదీప్.

"జనాలకు టేస్టుంది అంటావేంటి? మనం తీస్తే అళ్ళు జూస్తారు. బాగా తిస్తే హిట్ చేస్తారు. మనకు నాలుగు పైసలొస్తాయ్... కత్తియుద్ధాం సినిమా సంగతి వదిలెయ్. మహాభారతం వుందికదా? అందులోంచి ఒక కథ బయటికి లాగి, సినిమా తియ్యరాదుటయ్యా... రామాయణ, భారతాల్ని ఎన్నిసార్లు తీసినా ఇరగబడి చూస్తారు జనం...." చెప్పాడు భగవాన్.

"చాలా కష్టవండి...." చెప్పాడు ప్రదీప్.

"ఏంది కష్టం... భారతం అంటే పాండవుల కథ, కౌరవుల కథ తీస్తామా మనం... ఎవరూ తియ్యని కథ... ఉదాహరణకి... ఆడెవడు... దుర్యోధనుడి తండ్రి... ధృతరాష్ట్రుడు.. కబోది కదా... ఆడి కథ తియ్యి... ఆడు పుట్టాడు.. గాంధారిని ప్రేమించాడు... గాంధారి నాన్న ఆళ్ళ పెళ్ళికి ఒప్పుకోలేదు... ఇద్దరూ గుర్రంమ్మీద పారిపోయి వేరే ఊరెళ్ళిపోయారు... గాంధారి నాన్న వాళ్ళని పట్టుకోవడం కోసం మనుషుల్ని పంపాడు... కత్తి యుద్ధాలు... చిట్ట చివరకు గాంధారిని ధృతరాష్ట్రుడు పెళ్ళి చేసుకోవడంతో శుభం కార్డు పడుతుందన్న మాట...." విలాసంగా చెప్పాడు భగవాన్.

"మీరు చెప్పిన కథ భారతంలోలేదు సార్...." చెప్పాడు సూర్య.

"తీసిన కథలన్నీ భారతంలోనూ, రామాయణంలో వున్నాయటయ్యా! మనం అనుకుని తీసెయ్యాలి... డేరింగ్ అంటే అదే... తర్వాత అదే పుస్తకంలోకి

ఎక్కిస్తారు... అది సరేగానీ, హీరో విమల్ అన్నావు కదూ? అడికీ మధ్య ఎక్కువై పోయిందయ్యా... మనలో మాట... ఎవడితో ఒకమాట చెప్పకపోతే నీతో ఒకమాట చెప్తా" సర్వం తగ్గించి అటూ ఇటూ చూసి అన్నాడు భగవాన్.

"చెప్పండి సార్" అన్నాడు ప్రదీప్.

"హీరోగా ఆ విమల్‌ని తీసెయ్, నేను ఫైనాన్స్ చేస్తాను. ఒక్కటే మాట" అన్నాడు భగవాన్.

"లేదుసార్... ఎగ్రిమెంట్ కూడా అయిపోయింది" అన్నాడు నీరసంగా ప్రదీప్.

"ఆ విషయం నాకు తెలీదు. రాజేష్‌ని పెట్టుకో... మవాడు... ఆడుకూడా మూడు సినిమాలు హిట్లు ఇచ్చాడు తెల్సుకదా."

"రాజేష్ కూడా మంచి హీరోయే కానీ... ఈ క్యారెక్టర్‌కి సరిపోదండి." రచయిత సూర్య చెప్పాడు.

"ఏందయ్యా... క్యారెక్టర్ సరిపోకపోవడం... కథ మార్చు అంతే...."

* * * * *

మరో ఇరవై నిమిషాల తర్వాత భగవాన్ ఆఫీస్‌నుండి బయట పడ్డారు ప్రదీప్, సూర్య.

కారు టాంక్‌బండ్ మీదుగా వెళుతోంది.

"నాకు తెల్సుకదా... ఈ భగావాన్‌కి తెలంగాణా పిచ్చి... ఏ కరీంనగర్ వాడో డైరెక్టర్ అయితే వెంటనే ఫైనాన్స్ చేస్తాడు... కళకి కేస్ట్ ఏంటో" అన్నాడు సూర్య.

"కళకికాదు, కథని కూడా కేస్ట్‌తో కొలిచే మహానుభావులు తయారవు తున్నారు" అన్నాడు వ్యంగ్యంగా ప్రదీప్.

* * * * *

ప్రదీప్ ఎదురుగా సూర్య. అసిస్టెంట్ డైరెక్టర్స్ ఇద్దరూ కూర్చున్నారు. హీరోయిన్ కోసం వచ్చిన ఫోటోల్ని, బయోడేటాల్ని చూస్తూ పర్వాలేదు అనుకున్న వాటిని గ్రీన్‌ట్రేలో పెడుతున్నారు.

"చాలా ఎక్కువే వచ్చాయి... దాదాపు అయిదువందలుంటాయి" అన్నాడు సూర్య.

"నలభైఏళ్ళ ఆంటీలు కూడా పంపారు సార్" అన్నాడు ఒక అసిస్టెంట్ డైరెక్టర్.

యాభైమందిని సెలెక్ట్ చేశాడు ప్రదీప్.

"వీళ్ళను వెంటనే ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్స్ యివ్వండి. ఓ.కే–" బయటికి లేచివెళుతూ అన్నాడు ప్రదీప్. సరిగ్గా అదే సమయంలో ఆఫీస్ బాయ్ ఒక కవర్ని తెచ్చి–

"ఎవరో స్వయంగా వచ్చి ఇచ్చి వెళ్ళారు సార్...." అంటూ ఆ కవర్ని ప్రదీప్ చేతుల్లో పెట్టాడు.

ఆ కవరు విప్పి, అందులోంచి తీసిన ఫోటోలవేపు చూస్తూ ఆశ్చర్యంగా అలాగే వుండిపోయాడు డైరెక్టర్ ప్రదీప్.

ఆ ఫోటోల్లో ఉన్న అమ్మాయి బృంద!

*   *   *   *   *

ఉదయం ఆరుగంటల పదిహేను నిమిషాలు.

బంజారాహిల్స్‌లోని భాగ్యరాజు ఆఫీసు రూమ్‌లో ఆయన కెదురుగా కూర్చున్నాడు ప్రదీప్. బయట విజిటర్స్ ఛైర్స్‌లో కూర్చున్నాడు రైటర్ సూర్య.

"కథ నచ్చింది... హీరో నచ్చాడు. హీరోయిన్ కొత్త అమ్మాయి అంటున్నావ్... బాగానే వుంది. మొన్న రిలీజైన మోహనచంద్ర సినిమా చూశావా... సూపర్‌హిట్ అయిపోతుందని పేపర్ వాళ్ళు రాశారు ఏమైంది. తుస్సుమంది. నీమీద నాకు నమ్మకం వుంది... కాదనను. ఓ పని చెయ్యి... నాలుగు రీళ్ళు సినిమా తియ్యి... రషెస్ చూశాక ఫైనాన్స్‌చేస్తా ఏమనుకోకు... మళ్ళీ కలుద్దాం" చెప్పేసి సీట్లోంచి లేచి లోపలికి వెళ్ళిపోయాడు భాగ్యరాజు.

ఆ ఉన్న ఒక్కఆశా ఎగిరిపోవడంతో పూర్తిగా డీలా పడిపోయాడు ప్రదీప్.

మౌనంగా వచ్చి కారెక్కాడు.

పరిస్థితి అర్థమైన సూర్యం ఏం మాట్లాడలేదు.

"ఎక్కడైనా వడ్డీకి తెచ్చయినా సినిమా తీస్తాను... సక్సెస్ చేస్తాను. అప్పుడు చూపిస్తాను ఈ ప్రదీప్ అంటే ఏంటో–" కసిగా అనుకున్నాడు ప్రదీప్.

*   *   *   *   *

భాగ్యరాజుకి చాలా ఆశ్చర్యంగా వుంది. ఇండస్ట్రియలిస్ట్ రామ్‌కాశ్యవ్ స్వయంగా తనకు ఫోన్‌చేసి 'మీతో కొంచెం పనుంది... మనం కల్సుకుందామా' అని అడగటం.

రెండుసార్లు ఫ్లయిట్‌లో కలిసాడు రామ్‌కాశ్యవ్.

ఎవరో పరిచయం చేస్తే ముక్తసరిగా మాట్లాడాడాయన. అంతటి కోటీశ్వరుడికి తనతో పనేందో...?

"పదిగంటలకు వస్తాను సార్...." చెప్పి ఫోన్ పెట్టేసి, సరిగ్గా పది గంటలకు రెసిడెన్స్‌కు వెళ్ళాడు భాగ్యరాజ్.

"మిస్టర్ రాజు... మీరు నాకో హెల్ప్ చెయ్యాలి...." అడిగాడు టీ కప్పును తనే స్వయంగా భాగ్యరాజుకి అందిస్తూ.

"నేను ఏ రకంగా కూడా మీకు హెల్ప్ చెయ్యలేను. మీరు జోక్ చేస్తున్నారు."

"లేదు... మీరు సినిమాలకు ఫైనాన్స్ చేస్తుంటార్ట... కదా...."

"అదే నా మెయిన్ బిజినెస్ సార్."

"గుడ్! మీరో సినిమా రిఫైనాన్స్ చెయ్యాలి... ఎందుకంటే...." అసలు సంగతి చెప్పాడు.

"ఆ డైరెక్టర్ గంట క్రితమే నా దగ్గరకు వచ్చి వెళ్ళాడు సార్.... ఇవాళే వాళ్ళు హీరోయిన్ సెలక్ట్ చేస్తున్నారట" చెప్పాడు భాగ్యరాజు.

"డబ్బు మీదయినప్పుడు మీ హీరోయిన్ సెలక్ట్ కాకుండా ఎలా వుంటుంది?" ప్రశ్నించాడు భాగ్యరాజు.

"డబ్బు నాదే... కానీ నీ ద్వారా ఇస్తున్నాను. హీరోయిన్‌గా ఎంపికయ్యే మా బృందకు ఈ విషయం తెలియకూడదు. ఏ రికమండేషన్ జరగకపోతే...? ఆమెను హీరోయిన్‌ని చెయ్యాలనేదే నా లక్ష్యం... దట్సాల్" అంటూ యాభై లక్షలకు చెక్‌ని అందించాడు రామ్‌కాశ్యవ్.

"మీ ఫోన్ కోసం ఎదురుచూస్తుంటాను...." కారు వరకూ వచ్చి దిగబెట్టాడు భాగ్యరాజుని రామ్‌కాశ్యవ్.

* * * * *

హాల్లో కూర్చున్న అమ్మాయిల పేర్లను ఒరిజినల్ లిస్టులో సరి చూసుకుని ఆ లిస్టును డైరెక్టర్ ప్రదీప్‌కు ఇచ్చాడు అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు.

అదే సమయంలో కెమెరామెన్ లోనికొచ్చాడు.

"అంతా రెడీ సార్...." చెప్పాడతను.

రైటర్ సూర్య డైలాగ్ పేజీని ప్రదీప్‌కు ఇచ్చాడు.

లేచి పక్క రూమ్‌లోకి నడిచాడు ప్రదీప్.

ఆ రూమ్‌లో కూర్చున్నాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

"క్యాండిడేట్స్‌ను పిలుస్తాను...." అని చెప్పి లిస్టును అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజుకు ఇచ్చాడు.

లోనికొచ్చిన అమ్మాయివేపు చూసాడు ప్రదీప్.

"చూడమ్మా... నువ్వు హాస్పిటల్‌లోంచి అప్పుడే డిస్‌చార్జి అయ్యావు... నీ చేతిలో వారం రోజుల పసికందు వుంది. నువ్వు నీ భర్త ఇంటి మెట్లెక్కుతున్నావు, నిన్ను చూసిన నీ భర్త ఆ పసికందుని తన చేతుల్లోకి లాక్కుని, నిన్ను మెట్లమీదకు తోసేస్తాడు. నువ్వు కిందపడిపోతావు... నీ బిడ్డను నీకిమ్మని దయనీయంగా అడుగుతావు... సీన్ అర్థమైందా?" చెప్పాడు రైటర్ సూర్య.

"అర్థమైంది సార్...."

"నువ్వు చెప్పాల్సిన డైలాగులు ఇవి...." అంటూ డైలాగులున్న పేజీని ఆమె చేతికిచ్చాడు సూర్యం. ఆ డైలాగ్స్ చదువుకుంటోందామె.

"ఏవండీ... తాళి కట్టిన దగ్గర్నుంచీ మీరెన్ని చిత్రహింసలు పెట్టినా భరించాను... గర్భవతినని చూడకుండా బూటు కాళ్ళతో తన్నినా సహించాను. ఎందుకోసం... మీకోసం... ఈ బిడ్డకోసం... నేనంటే మీకు ఇష్టం లేదా వెళ్ళిపోతాను... ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతాను. కానీ నా పేగు పంచుకుని

పుట్టిన నా చిన్నారిని నాకు దూరం చేయకండి... నా కన్నీళ్ళను రక్తంగా మార్చకండి...."

సన్నివేశానికి అనుగుణంగా ఆ అమ్మాయి నటించడం ప్రారంభించింది, మూడు నిముషాలు గడిచాయి.

డైరెక్టర్ ప్రదీప్ ఆమె హావభావాలను పరిశీలిస్తున్నాడు. ఆ దృశ్యాన్ని కెమెరామెన్ వీడియోలో రికార్డ్ చేస్తున్నాడు.

అంతా అయిపోయాక.

"ఎలా వుంది సార్?" ఉద్వేగంగా అడిగిందామె.

"రెండ్రోజుల్లో మీకు తెలియజేస్తాం. ఇక మీరు వెళ్ళొచ్చు...." చెప్పాడు ప్రదీప్.

ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. ఇంకో అమ్మాయి రూమ్‌లోకి వచ్చింది.

రెండు గంటలు గడిచాయి.

ఇంకా ఇద్దరు క్యాండిడేట్స్ మిగిలారు.

అందులో ఒకామె బృంద.

లోన ఇంటర్వ్యూలో హీరోయిన్ ఎంపిక కోసం ఇచ్చిన సీన్ తెల్సుకున్న బృంద మొదట షాక్‌కి లోనయింది. మరికొద్ది క్షణాల్లోనే షాక్ నుంచి తేరుకొని తీవ్రమైన విస్మయానికి లోనయింది. ఆ సీన్లో తను ఎలా యాక్ట్ చెయ్యాలో మనసులోనే రిహార్సల్ వేసుకుంటోంది.

అప్పుడొచ్చింది ఆమెకు ఫ్లాష్‌లాంటి ఆలోచన. గబగబా అటూ ఇటూ చూసి బయటికొచ్చింది. ఇంటర్వ్యూ కోసం వస్తున్నప్పుడు గెస్ట్‌హౌస్‌కు కొంచెం దూరంలో బేబీకేర్ సెంటర్‌ను ఆమె చూసింది. గబగబా ఆ బేబీకేర్ సెంటర్‌కు పరుగులు, వార్డెన్‌ని కల్సి, ఆమె చేతిలో ఒక వందరూపాయలు పెట్టింది.

పది నిమిషాల కోసం... వందరూపాయలా...." వార్డెన్ ఆశ్చర్యపోతూ లోపలిగదిలోకి నడిచింది.

రూమ్‌లో కొచ్చిన బృందను చూడగానే ఆమె అద్వితీయమైన అందానికి ముగ్ధుడైపోయాడు డైరెక్టర్ ప్రదీప్.

ఆమె చేతిలో వున్న నెలల పిల్లాడ్ని చూసి ఆశ్చర్యపోయాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

"సీన్ తెల్సుకుని పిల్లాడితో వచ్చావా... లేక ఈ బాబు మీ బాబా!" అడిగాడు సుమంతరావు.

"సీన్ తెల్సుకుని పక్కనే వున్న బేబీకేర్ సెంటర్ నుంచి బాబును తెచ్చాను... నేచురల్‌గా వుంటుందని...." చెప్పింది బృంద.

సూర్య డైలాగ్స్ చెప్పాడు.

ఆవేశంగా ఆ డైలాగ్స్ చెప్తోంది బృంద. సరిగ్గా అదే సమయంలో అక్కడి కొచ్చిన భాగ్యరాజును చూసి విశ్చేష్టుడైపోయాడు ప్రదీప్.

ఫైనాన్సర్ భాగ్యరాజు స్వయంగా ప్రొడక్షన్ ఆఫీసుకు రావడం ఏమిటి...? నమ్మలేకపోతున్నాడు సూర్య.

రామ్‌కాశ్యప్ చూపించిన ఫోటో చూడడంవల్ల భాగ్యరాజు బృందను వెంటనే గుర్తుపట్టాడు.

'ఒక్క నిముషం' అంటూ బృందతో చెప్పి కుర్చీలోంచి లేవబోయిన ప్రదీప్.

"కారీ ఆన్... ఇదైపోయాక మాట్లాడుకుందాం...." అంటూ ప్రదీప్ ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని బృంద యాక్టింగ్‌ను చూస్తున్నాడు.

ఇప్పటివరకూ నటించిన అమ్మాయిలు కొంతమంది డైలాగ్స్ బాగా చెప్పారు. ఇంకొంతమంది నటనను బాగా చూపారు. కానీ ఆ సన్నివేశంలో నిజంగా కళ్ళంట కన్నీళ్ళు ఎవరికీ రాలేదు.

ఒక భార్య, పసికందును పట్టుకుని, కన్నీళ్ళతో ఎలా ఏడుస్తుందో అలాగే ఏడుస్తూ అర్ధంగా నేలమీద పడిపోయి సహజాతి సహజంగా నటించిన బృంద నటనకు ప్రదీప్ చప్పట్లు కొట్టాడు.

అటు సుమంతరావు, సూర్యతోపాటు ఫైనాన్సర్ భాగ్యరాజు కూడా చప్పట్లు కొట్టడంతో ప్రదీప్ అతనివేపు వింతగా చూశాడు.

సీన్ అయిపోయాక అందరికీ నమస్కరించి చేతిలో బాబుతో వెనక్కివచ్చి బేబీకేర్‌లోకెళ్ళింది బృంద.

ఇంకొక్క అమ్మాయి ఇంటర్వ్యూ మాత్రమే వుంది.

"మిస్టర్ ప్రదీప్... నీకోసమే వచ్చాను... టూ మినిట్స్" అన్నాడు అతని ప్రవర్తనకు ఆశ్చర్యపోతున్నాడు ప్రదీప్.

"క్యారీ ఆన్... నేనిప్పుడే వస్తాను...." అంటూ ఆ రూమ్‌లోంచి తన రూమ్‌లోకొచ్చాడు ప్రదీప్.

"ఆ అమ్మాయి పేరేంటి... బాగా యాక్ట్‌చేసింది... హీరోయిన్‌గా కరెక్టుగా సరిపోతుందనుకుంటాను...." అంటూ ప్రదీప్ వెనకవచ్చి అతని కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు భాగ్యరాజు.

"అవున్సార్... ఆమె దగ్గర్నించి వండ్రఫుల్ పెర్‌ఫామెన్స్ రాబట్టొచ్చు.... కరెక్ట్ క్యాండిడేట్...." అన్నాడు ప్రదీప్ భాగ్యరాకజు ముఖంలోకి చూస్తూ.

"ఎందుకో నాక్కూడా ఆ అమ్మాయే నచ్చిందయ్యా... ఫిక్స్ చేసెయ్యండి... ఫైనలకి వెతుక్కోకండ్రీ...." అంటూ జేబులోంచి చెక్‌బుక్ తీసి ఒక లీఫ్‌మీద ఎమౌంట్ వేసి సంతకంచేసి ప్రదీప్ చేతిలో పెడుతూ "నీ సిన్మా శతదినాలాడుద్ది... పో...." అన్నాడు భాగ్యరాజు.

''శతదినాలు అడడం ఏంటండీబాబూ....'' అని మనసులోనే అనుకున్నాడు రచయిత సూర్యవంశీ.

"నేనొస్తా మరి... ఏదో డబ్బింగ్ సిన్మాకి ఫైనాన్స్ చెయ్యాలట... ఆ పార్టీ వెయిట్ చేస్తున్నారు... మంచిది వుండు" అని లేచాడతను.

"థాంక్యూ... థాంక్యూ సార్...." వణుకుతున్న గొంతుతో అన్నాడు ప్రదీప్.

బైటకెళ్ళిపోయాడు భాగ్యరాకజు.

"హిఫ్... హిఫ్... హుర్రే... చిన్నపిల్లాడిలా అరుస్తూ ఇంటర్వ్యూ జరుగుతున్న రూమ్‌లోకొచ్చి ఆనందంగా ఆ చెక్‌ను సుమంతరావు చేతిలో పెట్టాడు.

సుమంతరావు ఆ చెక్‌వేపు కళ్ళప్పగించి చూస్తూ–

"యూ ఆర్ లక్కీ మైఫ్రెండ్... ఆ అమ్మాయి ఎవరు... బృంద... ఆమె యాక్టింగ్ చేస్తున్నప్పుడే... ఆ భాగ్యరాజువచ్చాడు... సో... బృందనే మీరోయిన్‌గా సెలక్ట్ చెయ్యి... నీ దశ తిరుగుతుంది...." అన్నాడాయన.

"భాగ్యరాజుగారు కూడా ఆ అమ్మాయినే సెలక్ట్ చేశారు...." అన్నాడు ప్రదీప్.

"నా ఓటు కూడా ఆ అమ్మాయికే...." అన్నాడు సూర్య.

"సూర్య... ఆ అమ్మాయి బయట వుందేమో చూడండి...." అన్నాడు ప్రదీప్.

సూర్య గబగబా బయటికి వచ్చాడు.

బృంద కనిపించలేదు. ఆ విషయం చెప్పాడు లోనికొచ్చి.

"సిటియే అనుకుంటాను... ఫోన్ నెంబర్ వుందేమో చూడండి... లేకపోతే వెంటనే టెలిగ్రామ్ ఇవ్వండి... రేపు రమ్మనమని...." చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

ఫోన్ నెంబర్ లేకపోవడంతో టెలిగ్రాం ఇచ్చాడు బృందకు.

* * * * *

మసక మసక చీకట్లు అలుముకుంటున్నాయి. మెట్లుదిగి హాల్లోకి రాబోతున్న బృంద అప్పుడే హాల్లోకొచ్చిన రామ్‌కాశ్యవ్‌ని చూసింది.

"ఏం బేబీ... ఇంటర్వ్యూ ఎలా వుంది... ఇంటర్వ్యూ నుంచి ఫోన్ చెయ్యమన్నానుగా...?"

"ఎందుకు ఫోన్... కష్టం అంకుల్... చాలామంది వచ్చారు... నా యాక్టింగ్ నాకు నచ్చింది. కానీ ఆ ప్రొడ్యూసర్‌కి, డైరెక్టర్‌కి నచ్చాలిగా...."

"ఎందుకు నచ్చదు... నచ్చుతుంది... నిన్ను మాత్రమే వాళ్ళు హీరోయిన్‌గా సెలక్ట్ చేస్తారు... బెట్...."

"నేను సెలక్ట్ కాను... బెట్...."

"నువ్వు సెలక్ట్ అయితే...."

"మీరేం చెపితే అది చేస్తాను...."

"ఓ.కే... ఆ విషయం మర్చిపోకు. నువ్వు పెద్ద హీరోయిన్‌వి అవుతావు... ష్యూర్... నువ్వు చేసిన ప్రామిస్‌కు నేను నా జీవితకాలంలో ఒక కోరిక కోరుకుంటాను. ఎలాంటి పరిస్థితుల్లో నువ్వున్నా, ఆ కోరిక నువ్వు తీర్చాలి... ఓకే...." అన్నాడాయన దూరదృష్టితో.

సరిగ్గా అదే సమయంలో–

సెక్యూరిటీ గార్డు లోనికొచ్చి రామ్‌కాశ్యప్‌కు టెలిగ్రామ్ ఇచ్చాడు ఆ టెలిగ్రామ్ విప్పి చూసిన రామ్‌కాశ్యప్ "కంగ్రాచ్యులేషన్స్" అని అన్నాడు బిగ్గరగా.

ఆ టెలిగ్రాంని బృందకిచ్చాడాయన,.

ఆ టెలిగ్రామ్ వేపు ఏకదీక్షగా చూస్తోంది బృంద.

''ఈజిట్ ట్రూ... అయ్ కాంట్ బిలీవ్ ఇట్... అంకుల్....'' ఎక్సయిటింగ్‌గా అంది బృంద. ఆ ముఖంలో ఏదో తెలియని ఆనందం కనిపిస్తోంది రామ్‌కాశ్యప్ కళ్ళకు.

"కాన్ఫిడెన్స్ నీమీద నీకుండాలి... నీమీద నాకుంది కాబట్టే నువ్వే సెలక్ట్ అవుతావని నేను చెప్పగలిగాను...." అన్నాడు రామ్‌కాశ్యప్.

ఆనందంలో టెలిగ్రామ్‌ను చూసుకుంటూ అటూ ఇటూ తిరుగుతున్న సమంలో లోనికొచ్చాడు పి.ఎ. రామావతారం. అతన్ని చూడగానే మేడమీద కెళ్ళిపోయింది బృంద.

"బృంద హీరోయిన్‌గా సెలక్ట్ అయింది" అన్నాడు రామ్‌కాశ్యప్.

"నాకు తెల్సు... రామ్‌కాశ్యప్ తలచుకుంటే ఈ ప్రపంచంలో జరగని పనులుండవని" అన్నాడు రామావతారం.

"అదే వద్దన్నాను. ఈ విషయంలో నా ప్రమేయం వుందని, ఎప్పుడూ, ఎక్కడా బయటకు రాకూడదు...." హెచ్చరించాడు రామ్‌కాశ్యప్.

"ఇప్పుడు ఆఫీసులో లేవు కాబట్టి, ఛైర్మన్‌ని కావు కాబట్టి... మామూలు పిలుపుకి వచ్చేస్తాను. చూడు కాశ్యప్! అసలు ఆ అమ్మాయి ఎవరు? ఆ అమ్మాయి అసలు పేరుని మార్చి బృంద అని కొత్త పేరు ఎందుకు పెట్టావ్? నువ్వే స్వయంగా యాభై లక్షలిచ్చి ఆ అమ్మాయిని ఎందుకు హీరోయిన్‌గా చేస్తున్నావు? అభ్యంతరం లేకపోతే నాతో చెప్పు" చనువుగా అడిగాడు రామావతారం.

"అన్నీ చెప్తాను కాని ఇప్పుడు కాదు. అవసరమైనప్పుడు. రేపటి నుంచి నువ్వు నాకు పి.ఎ.వి కాదు. ఆ అమ్మాయికి పి.ఎ.వి. ఆ అమ్మాయి ఎలాంటి పరిస్థితిల్లోనూ మానసిక ఉద్వేగానికి లోనుకాకుండా చూసే బాధ్యత నీది. అలాగే

ఎప్పుడూ ఆ అమ్మాయి చిరునవ్వుతో సంతోషంగా వుండేటట్లు చూడు అంతే" సీరియస్‌గా చెప్పాడు రామ్‌కాశ్యప్.

"ఏవిటో నీ దోరణి అంతా సస్పెన్స్ సినిమాలా వుంది" అంటూ ముందుకు సాగిపోయాడు రామావతారం.

మేడ మెట్లెక్కాడు రామ్‌కాశ్యప్, దగ్గరగా వేసున్న డోర్ కొంచెం తెరిచి లోనికి చూశాడు. ఏదో పాటను హమ్‌చేస్తూ తల దువ్వుకుంటున్న బృందను చూసి ఆనందంగా వెనక్కి వచ్చేశాడాయన.

* * * * *

రామానాయుడు స్టూడియోలో రంగరంగ వైభవంగా 'నేడే విడుదల' సినిమా ముహూర్తం జరిగిపోయింది. హీరో బస్సు దిగుతున్న హీరోయిన్‌ని చూసి విష్ చేయడాన్ని ముహూర్తపు షాట్‌గా చిత్రీకరించారు.

సినిమా షూటింగ్ వరంగల్‌లో సగం, హైదరాబాద్‌లో సగం తీయడానికి నిర్ణయించాడు డైరెక్టర్ ప్రదీప్.

మర్నాడు వరంగల్‌లో షూటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చకచకా జరిగి పోతున్నాయి.

శీతాకాలం...

ఎటు చూసినా కనిపిస్తున్న పచ్చికనేల... ఆ పచ్చిక మంచుతో స్నానం చేసినట్లుగా మెరుస్తోంది. ఉదయభానుని లేత కిరణాల కాంతిలో మంచుపొరలో స్నానం చేసినట్లుగా మెరుస్తోంది. ఉదయభానుని లేత కిరణాల కాంతిలో మంచుపొరలో తెరమరుగవుతుంటే, సన్నటి గాలికి వూగుతున్నట్టు చెట్ల కొమ్మలు మనోహరంగా కనిపిస్తున్నాయి.

వరంగల్ నుండి పరకాల వేపు వేళ్ళే రోడ్డులో అయిదు కార్లు ఒక వ్యాను వేగంగా వెళుతున్నాయి.

రెండో కారులో కిటికీ పక్కన కూర్చున్న బృంద, తెలంగాణా పల్లెటూళ్ళ సౌందర్యాన్ని తన్మయతతో చూస్తోంది.

మొదటి కారులో బ్యాక్ సీటులో కూర్చున్న హీరో విమల్‌కి అంత చక్కటి స్వచ్ఛమైన వాతావరణంలో సిగరెట్ కాలుస్తుంటే ఎంతో హాయిగా వుంది.

తొలిప్రేమ, తొలిముద్దు, తొలిరేయి జీవితంలో ఒకేసారి వస్తాయి.

కాని, ప్రతి ఉదయం మొట్టమొదటి సిగరెట్ ఇచ్చే ఆనందం ముందు అవి తక్కువే అని అతడి అభిప్రాయం.

గంటన్నర గడిచాక–

రామప్ప దేవాలయం వేపు వెళ్ళే దారివద్ద కార్లన్నీ ఆగాయి.

దూరంగా రామప్పగుడి కనిపిస్తోంది.

గుడికి వెళ్ళేముందు ఇసుక దారి...

గంటలో ఆ రోడ్డుమీద షూటింగ్ జరపడానికి అన్ని ఏర్పాట్లు జరిగి పోయాయి.

డైరెక్టర్ ప్రదీప్ తీయవలసిన సీన్ గురించి బృందకు, కమేడియన్ రామబ్రహ్మంకు వివరించి చెప్పాడు.

వ్యాన్‌లో జనరేటర్ స్టార్ట్ అయ్యాక, లైటింగ్ ఏర్పాట్లు చేసుకున్నారు కెమెరా సిబ్బంది.

బృంద ఆకుపచ్చరంగు మెటల్‌షిపాన్ చీరలో వుంది. ఆమెకు కొంచెం దూరంలో కూర్చున్నాడు హీరో విమల్.

బృంద అందం వేపే చూస్తున్నాడు విమల్.

రోడ్డుకి ఒకపక్కన షాట్ తీయడానికి, కెమెరా యాంగిల్స్ చూసుకుంటు న్నాడు డైరెక్టర్ ప్రదీప్.

సినిమాలోని కథ ప్రకారం హీరోయిన్ని చూడగానే హీరో ఫ్రెండ్ రామబ్రహ్మం మనసు పారేసుకుంటాడు. రోజూ ఆమెవెంట కాలేజీవరకు బాడీగార్డులా ఫాలో అవుతుంటాడు. అలా మూడు నెలలు గడిచాక, ఇక తాడోపేడో తేల్చుకుందామని హీరోయిన్ని రోడ్డుమీద ఆపి అడుగుతాడు అది సీన్.

బృంద, రామబ్రహ్మం ఓకే అన్నారు.

అసిస్టెంట్ డైరెక్టర్ క్లాప్ కొట్టగానే ప్రదీప్.

“యాక్షన్” అన్నాడు.

రామబ్రహ్మం పరుగు పరుగున హీరోయిన్ దగ్గరకొచ్చి–

"మేడమ్! ఆప్‌కా నామ్ నాకు తెలియదుగానీ, మిమ్మల్ని ఫస్ట్‌టైమ్ చూశాను. సెకండ్ టైమ్ చూశాను. థర్డ్‌టైమూ చూశాను... అంతే... నా హార్ట్ హార్ట్‌లో లేదండి. డాక్టర్ దగ్గరికెళ్ళి స్టెతస్కోప్ పెట్టుకొని చూస్తే హార్ట్ లేదని డాక్టర్ చెప్పాడండి! అంచేత మనమీద మీ అభిప్రాయం ఏంటి?" అంటూ కెమోరా వేపు తిరిగి ఓ ఫోజిచ్చాడు రామబ్రహ్మం.

"మీరెవరు? మొన్న తాజ్‌మహల్ హోటల్ దగ్గర యమహా బైక్ వెనక సీట్లో కూర్చున్నది మీరేనా?" అంది బృంద.

"బైకా... మీరు నా వెనక బైక్‌మీద కూర్చోవాలనుకుంటున్నారా? వెరీగుడ్! కానీ నాకు సైకిల్ కూడా రాదే...." అన్నాడు రామబ్రహ్మం.

"అదికాదండీ? బైక్ నడిపే వ్యక్తి ఎవరని అడుగుతున్నా" అంది బృంద.

"ఓహ్! వాడా. నా క్లోజ్‌ఫ్రెండ్ విమల్. విమ్ అని పిలుస్తాంలెండి. ఏం... వాడెందుకు మనమధ్య?" తల ఎగరేస్తూ అన్నాడు రామబ్రహ్మం.

"ఎందుకంటే. నేనతన్ని లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అన్నమాట" అంది బృంద.

"అయ్యబాపోయ్... అదా కథా! అంటే నా మూడునెలల తిరుగుడు ఫట్ అన్నమాట. అయినా కామెడీగాడికి, హీరోయిన్‌తో లవ్ ఏంటండీ బాబూ! క్రాక్ కాకపోతే... నేను క్రాక్‌ని... అయితే మావాడి వివరాలు తమకు కావాలన్న మాట...." అన్నాడు రామబ్రహ్మం నిరాశగా.

"ఇక్కడ బృంద మొహంలో ఏవిటి అన్నట్టు ఆశ్చర్యం... క్లోజప్ షాట్‌ని తీశాడు కెమెరామాన్.

"కట్...." చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

తర్వాత అదే సీనులో, తెలంగాణా దాదా వేషంలో మరో నటుడు అంబరీష్ ఎంటర్ అయ్యే సన్నివేశం.

ఆ షాట్‌కి కెమెరా పొజిషన్ మారింది.

అంబరీష్ ఎంటరయ్యాడు.

"గేంబే మా గొల్లీ పోరిని పరేషాన్ చేస్తున్నావ్? బే... నెలలట్కేసూస్తున్నా... లైటింగ్ కొడ్తున్నవ్‌లే. బొక్కలిరుస్తా. ఆపై పోలీస్‌స్టేషన్ల బొక్కలో పెట్టిస్తా...." అంబరీష్ రామబ్రహ్మం వేపు రావడంతో, బృంద అడ్డుపడి డైలాగ్ చెప్పింది.

"అతడి తప్పేం లేదండీ! మా చుట్టాలబ్బాయే."

"కట్" చెప్పాడు డైరెక్టర్.

తర్వాత రామప్పగుడి బ్యాక్ డ్రాప్‌గా సాంగ్ తీయాలి. యూనిట్ అంతా గుడివేపు పరికరాలతో నడవసాగారు.

మొదట్లో ముభావంగా వున్నా, హీరో విమల్ కొన్ని సూచనలివ్వడం, మూమెంట్స్ గురించి చెప్పడంతో అతడిమీద సదభిప్రాయం ఏర్పడుతోందామెకు.

"మీరు యాక్ట్ చేసే సమయంలో కాన్‌సన్‌ట్రేషన్ అంతా మీ క్యారెక్టర్ మీదే వుండాలి. మీరు అప్పుడు బృంద కాదనే విషయం పూర్తిగా మరిచిపోవాలి. ఎదుటి ఆర్టిస్ట్ ఎలా చేస్తున్నాడు... ఎంతో స్పీడుగా తమ భావాల్ని మారుస్తున్నాడనే విషయాన్ని గమనిస్తూ మీ రియాక్షన్స్ వుండాలి. అలాగే సాంగ్స్ సమయంలో కూడా... సిగ్గుపడకూడదు...." అని నవ్వాడు విమల్.

"సిగ్గెందుకు?" అంది బృంద.

"ఎందుకో మీకు స్వయంగా ఇప్పుడే తెలుస్తుందిలెండి...." అన్నాడతను.

అదే సమయంలో అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చి పిలిచాడు.

ఇద్దరూ సీట్లోంచి లేచారు.

నగారాలోంచి పాట పల్లవి వినబడుతోంది.

కురిసే చినుకా చేరుకుంటావు ఎక్కడికో...

ఉరికే మనసా కోరుకుంటావు ఎవ్వరినో...

చినుకే చిలకై నదిపైన వాలినది...

చిలిపి ప్రేమే మదినిండా నిండినది...

హీరో, హీరోయిన్స్ ఒకరి చేయి ఒకరు పట్టుకుని వెళ్తుంటారు.

బ్యాక్ డ్రాప్‌లో రామప్పగుడి, పాట జేసుదాస్ చిత్రాల గొంతుల్లో మెలోడీతో మధురంగా వుంది.

నటన అని తెలిసినా, బృంద మనసులో ఏదో సంచలనం.

సగం వరకు హీరో విమల్ చెయ్యి పట్టుకుని ఆ తర్వాత వదిలేసింది.

"కట్... కట్" అని అరిచాడు డైరెక్టర్.

పరుగున ముందుకొచ్చి–

"బృందగారూ... ఏంటీ హీరో చెయ్యి వదిలేశారేంటి... ఈ పల్లవి పూర్తయ్యే వరకూ అలా చేతిని పట్టుకునే వుండాలని చెప్పానుకదా?" అని అన్నాడు.

"ఓకే! మళ్ళీ ఫస్ట్‌నుంచి చేద్దాం" అంటూ వెనక్కి వెళ్ళాడు.

"మీరు నా చెయ్యి ఎందుకు వదిలేశారో చెప్పనా" అన్నాడు విమల్.

"ఎందుకు?"

"సిగ్గువల్ల కదూ... మొదట్లో ప్రతి హీరోయిన్ ఇలాగే సిగ్గుపడుతుంది... ఈ సిగ్గు పడకూడదని ఇందాక చెప్పింది అందుకే...." అన్నాడు హీరో విమల్.

మళ్ళీ పాట స్టార్టయింది.

రెండు గంటలు గడిచాయి. పల్లవి రియడం పూర్తయింది. డైరెక్టర్ కెమెరామెన్ నిరంజన్‌తో ఏదో చెపుతున్నాడు.

"ఇప్పుడు షాట్... వేయి స్థంబాల గుడిదగ్గర... కథకు కీలకమైన షాట్ ఇది... జాగ్రత్త...." అని చెప్పి బృంద, విమల్ దగ్గరకు వచ్చాడు ప్రదీప్.

"చూడండి బృంద... ఫెర్‌ఫామెన్స్ చూపించే సీన్స్ మొదలవుతున్నాయి... భారీ సీన్ ఫస్టు సీన్... ఇదిగో డైలాగ్స్... సీన్ ఏంటంటే ప్రేమించిన హీరో, హీరోయిన్ని తిరస్కరిస్తాడు."

ఆ విషయం చెప్పటానికి ఈ గుడిదగ్గరికి తీసుకొస్తాడు.

హీరో మాటలకు హీరోయిన్ వైల్డ్‌గా రియాక్ట్ అవుతుంది ఎప్పటికైనా నీచేతే తాళి కట్టించుకుంటాననంటుంది. అదన్నమాట అర్థమైందా?" చెప్పి "డైలార్ జాగ్రత్త" అని చెప్పి గబగబా ముందుకెళ్ళిపోయాడు.

అంతవరకూ ప్రసన్నంగా వున్న బృంద ముఖం ఒక్కసారిగా మారి పోయింది. సడన్‌గా ఆమె మూడ్ అవుట్ అయిపోయింది. పేపర్ మీద డైలాగ్స్ కనిపించడంలేదు. అవునూ ఇలాంటి సంఘటన తనకు తెల్సు ఈ కారెక్టర్ తనదే... తనదే... ఆమె మనసులో ఏదో బాధ.

"బృంద ఏమలా వున్నారు...? వాట్ హ్యాపెండ్...?" అడిగాడు విమల్.

"ఏం లేదండి."

"మూడ్ తెచ్చుకుంటున్నారా?" నవ్వాడు విమల్.

మరో ఐదు నిమిషాల తర్వాత షాట్ ప్రారంభం అయింది.

నాలుగు స్థంబాల మధ్య ఒక స్థంభానికి ఆనుకుని హీరో విమల్ నుంచున్నాడు. హీరోయిన్ బృంద మెట్లమీద నుంచుంది.

“బృందా... హీరో దిశగా నడుస్తూ నీవు డైలాగులు చెప్పాలి... కెమెరావైపు చూడొద్దు... ఓకే రెడీ కెమెరా స్టార్ట్... యాక్షన్” అరిచాడు ప్రదీప్.

“చూడు విమల్... నాకెన్ని తియ్యటి మాటలు చెప్పావో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో... ఎన్ని వాగ్ధానాలు చేసావో జ్ఞాపకం తెచ్చుకో, అన్నీ మర్చిపోయావా?” అంది ఆవేశంగా బృంద.

“అవును... మర్చిపోయాను... మర్చిపోవాలి... నెల మారిపోతే క్యాలెండర్‌లో కాగితం మారిపోతుంది. అలాగే ఆడది కూడా నీమీద మోజు పోయింది. క్యాలెండర్‌లో కాగితం మారిపోయింది... మర్చిపో... ఈ డబ్బు తీసుకో” అంటూ చేతిలో డబ్బును ఆమె చేతిలో పెట్టాడు.

ఆ డబ్బును బృంద విమల్ ముఖం మీదకు విసిరికొట్టింది.

“నువ్వింత నయవంచకుడివని నేను అనుకోలేదు. మిస్టర్ విమల్ నువ్వు నన్ను వదిలించుకోవాలన్నా వదిలించుకోలేవు... ఆడదాన్ని మోసం చెయ్యడం అంత సులభమంటున్నావా? ఇప్పుడే పోలీస్ స్టేషన్‌కెళ్తాను” అంటూ వెనుదిరిగింది బృంద.

“హలో చప్పట్లు కొట్టాడు విమల్.

తలతిప్పి చూసింది బృంద.

“నువ్వు నా ముఖంమీద విసిరేసిన డబ్బుతోనే ఆ పోలీసుల్ని కొంటాను... నిన్నే నేను వ్యభిచారిగా అరెస్టు చేయిస్తాను” వ్యంగ్యంగా నవ్వుతూ చెప్పాడు విమల్.

“నేను వ్యభిచారిని అయితే... నువ్వేమవుతావు? విటుడివి అవుతావా తార్పుడిగాడివవుతావా...?” అంటూ ఆవేశంగా చెయ్యెత్తి నిజంగా విమల్ చెంప మీద కొట్టింది.

“ఏయ్... ఏయ్... ఏంటిది? ఈ సీన్‌లో చెయ్యి మాత్రమే ఎత్తాలి ఏవండీ డైరెక్టర్‌గారూ” అన్నాడు విమల్.

“కట్... కట్... ఏమ్మా బృందా! ఏంటిది? సీన్ బ్రహ్మాండంగా వుంది. యాక్షన్ వండ్రపుల్. ఈ సీన్‌లో మీరు చెయ్యి మాత్రమే ఎత్తాలని చెప్పానా లేదా?” కంగారుగా అడిగాడు ప్రదీప్.

ఏం మాట్లాడలేదు బృంద. తనని తాను కంట్రోల్ చేసుకోవటానికి ప్రయత్నిస్తోందామె.

డైరెక్టర్ చెప్పిన మూమెంట్స్ యాంగిల్స్ అన్నీ అలాగే ఉన్నాయి. తనకిది క్యారెక్టర్ కాదు, తనే... తనే.

స్థంభానికానుకొని కూర్చుండిపోయింది బృంద.

"ఏమ్మా అలా కూర్చుండిపోయావ్?" అడిగాడు డైరెక్టర్.

"ఏంలేదు సార్! అయాం రెడీ" పేలవంగా నవ్వుతూ లేచి నిలబడింది. ఆ పేలవమైన, నివర్ణమైన ముఖాన్ని, ఆ ముఖంలో భావాలను సుభిశితంగా పరిశీలిస్తున్నాడు రైటర్ సూర్య.

"సమ్‌థింగ్ రాంగ్.. సమ్‌థింగ్.. రాంగ్...." మనసులో అనుకున్నాడు.

మళ్ళీ సీన్ ప్రారంభమయింది.

ఈసారి ఓ.కె. అయింది.

అంత పెద్దసీన్ ఒక్కటేక్‌లోనే ఓ.కే. కావడం. డైలాగ్స్ చెప్పడంలో ఎక్కడా బృందా తొట్రుపాటు పడకపోవడం. చాలా సీనియర్ నటిలా ముఖంలో భావాలను ప్రకటించడం చాలా ఆశ్చర్యంగా వుంది విమల్‌కు.

ఇద్దరూ కుర్చీలో కూర్చున్నాక ఐస్ వాటర్ తాగుతూ అడిగాడు విమల్–

"మీరు నాటకాల్లో అనుభవం వుందా?"

"లేదు."

"మరి అంత సహజంగా ఎలా నటించగలుగుతున్నారు?"

"మీరిచ్చిన ఇన్‌స్పిరేషన్" అంది బృంద.

"మీకు డైలాగులొచ్చేశాయి" జోక్ వేసాడు హీరో విమల్.

లంచ్ బ్రేక్.

గంట తర్వాత రైటర్ సూర్య బృంద దగ్గరకొచ్చాడు. డైలాగ్ పేపర్ ఆమెకిచ్చాడు.

"మేడమ్! ఇది చాలా మంచి సీన్, డైలాగ్స్ తక్కువే కాని ఫెర్‌ఫామెన్స్‌కి స్కోప్ ఎక్కువ. ఒకసారి సీన్ చదవండి. డైరెక్టర్‌గారొచ్చి మిగతా వివరాలు చెపుతారు" అంటూ వెళ్ళిపోయాడు.

సీన్ చదవగానే తలెత్తి రైటర్ కోసం చూసింది.

ఎక్కడా కనిపించలేదు.

ఇంతలో డైరెక్టర్ ప్రదీప్ అక్కడికొచ్చాడు.

"చూడమ్మా! ఈ సీన్ ఏంటంటే... నిన్ను ప్రాస్టిట్యూషన్ కేసులో హీరో ఇరికించాడు. పోలీస్ ఇన్స్‌పెక్టర్ నిన్ను తీసుకెళ్తుంటాడు. ఆ సమయంలో ఆ ఇన్స్‌పెక్టర్ చేతిలో పిస్టల్‌ని నువ్వు లాక్కుని, సూసైడ్ చేసుకుంటానని బెదిరిస్తావు.

పోలీసులూ, ఇన్స్‌పెక్టరూ నీవేపు నిశ్చేష్టులై చూస్తున్న సమయంలో–

నువ్వు వాళ్ళనుంచి తప్పించుకొని పారిపోతావు" చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

అప్పటికే అనుమానంగా వుంది బృందకు.

"అసలు సినిమా స్టోరీ ఏంటి సార్?" అడిగింది బృంద.

"మన స్టోరీ లీక్ కాకూడదనే... ఆర్టిస్టులకు కూడా ఆఖరికి హీరోగారికి కూడా ఆయన సీన్లే చెబుతున్నాను. అది నా సెంటిమెంట్... ఫస్ట్ సినిమా కదా. నా సెంటిమెంటును మీరు అర్థం చేసుకోండి... కథ అడక్కండి...." అంటూ వెళ్ళిపోయాడు ప్రదీప్.

"ఇందులో ఏదో మిస్టరీ వుంది" అనుకుంది బృంద.

ఆ సీన్లో కూడా వండ్రఫుల్‌గా నటించింది బృంద. నటిస్తున్నంత సేపూ ఆమె ఆలోచిస్తూనే వుంది. మనసులో ఏదో సందిగ్ధత. ఇది అని తెలియని ఏదో అనుమానం, డైరెక్టర్ ఒక సీన్ చెప్పగానే, ఆ సీన్ తన జీవితంలో జరిగినట్టు, తనకెదురైనట్టు ఏదో అనుభూతి. ఏదో మానసికమైన ఉద్వేగం. ఒకసారి రిహార్సల్ చేసుకుంటే బావుంటుందేమో అని డైరెక్టర్ అన్నమాటకు, అక్కర్లేదు అని ధైర్యంగా చెప్పినమాటే ఆమెకు చాలా ఆశ్చర్యంగా వుంది.

పేకప్ అయ్యాక తనకు కేటాయించిన గెస్ట్‌హౌస్‌కొచ్చి, రిఫ్రెష్ అయి సోఫాలో కూర్చుని టీపాయ్ మీదున్న సినిమా మ్యాగజైన్స్‌ను అందుకుని చూస్తూనే ఆలోచిస్తోంది బృంద.

పనిమనిషి ఫ్రూట్ జ్యూస్ తెచ్చి టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిపోయింది. డేట్స్ ప్రకారం ఆ రోజు తనకు షూటింగ్ లేదు.

సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో డైరెక్టర్ ప్రదీప్ దగ్గర్నుంచి టెలిఫోన్ వచ్చింది బృందకు.

"చెప్పండి."

"సారీ మేడమ్! చిన్న రిక్వెస్ట్."

"చెప్పండి సార్!"

"హీరో విమల్‌గారు ఇంకో సినిమా షూటింగ్‌కి రేపు మార్నింగ్ వెళ్ళాల్సి వుంది. ఆ టైంలో మన షెడ్యూల్ చేసుకున్న సీన్, ఇప్పుడే తీసేయమన్నారాయన. ప్రిపేరవుతున్నాం... మీరు కోపరేట్ చేస్తే నిజానికి ఆ సీన్‌లో ఇంపార్టెన్స్ మీదే ఎక్కువ" బృంద అభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నాడతను.

ఆ సమయంలో బృందకు కొంచెం అలసటగానూ, తలనొప్పిగానూ వుంది. కానీ డైరెక్టర్ ప్రదీప్ రిక్వెస్టుకు కాదనలేకపోయింది.

"ఎన్ని గంటలకి?"

"ఇంకో అరగంటలో కారు పంపుతాను మేడమ్!"

"సరే" ఫోన్ పెట్టేసి లేచింది బృంద.

అదే సమయంలో మేకప్‌మేన్ లోనికి ప్రవేశించాడు.

*  *  *  *  *

హీరో విమల్ వుంటున్న త్రీస్టార్ హోటల్ రూమ్‌లో షూటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి బృంద అక్కడికి వెళ్ళేసరికే హోటల్ లాన్‌లో ప్రత్యేకంగా వేసిన కుర్చీల్లో కమేడియన్ రామబ్రహ్మం, ఇద్దరు జూనియర్ ఆర్టిస్టులు డైరెక్టర్ ప్రదీప్ వున్నారు.

అందర్నీ విష్‌చేస్తూ, తన సీట్లో కూర్చుంది బృంద.

రామబ్రహ్మం ఏవో జోకులు చెప్తున్నాడు.

"హీరోగారి మేకప్ పూర్తికాలేదు" బృందతో చెప్పాడు.

డైరెక్టర్ ప్రదీప్, రామబ్రహ్మం చెప్తున్న జోకుల్ని ఎంజాయ్ చేస్తున్నారు.

రామబ్రహ్మం ఇంకో సంఘటన చెప్పడం ప్రారంభించాడు.

"ఒకసారి బాలసుబ్రహ్మణ్యం తమిళ, తెలుగు సినిమా ప్రముఖులందరికీ మద్రాసులోని ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో డిన్నర్ ఇచ్చాడట. ఆ డిన్నర్‌కి మనసుకవి

ఆత్రేయగారు కూడా వచ్చాడట. బాలసుబ్రహ్మణ్యం మ్యూజిక్ డైరెక్టర్స్‌కి, పాటల రచయితలకి ఎక్కువ ప్రాముఖ్యం యిస్తూ వారిని పేరుపేరున పలకరిస్తూ, వారు తృప్తిచెందేలా దగ్గరుండి భోజనం ఏర్పాట్లు చూసి, డిన్నర్ అయిపోయాక ఒక్కొక్కర్ని తనకు సంబంధించిన కార్లలోనే పంపించడం ప్రారంభించాడట.

కొంతసేపటికి ఆత్రేయగారు ఇంటికి బయలుదేరారట. బాలు ఆత్రేయ కాళ్ళకి నమస్కారంపెట్టి ఆ పక్కనే ఉన్న తన డ్రైవర్ని పిలిచి, 'గురువుగారిని డ్రాప్ చేసిరా' అని చెప్పాడట.

దానికి ఆత్రేయగారు చాలా చురుగ్గా స్పందించి ఒరే బాలూ... 'చేతనైతే లిఫ్ట్ ఇవ్వరా... డ్రాప్ చేసే ప్రయత్నం చెయ్యకు' అని చెప్పగానే బాలసుబ్రహ్మణ్యం తోపాటు ఆ చుట్టుపక్కలున్నవారు కూడా ఆత్రేయగారి చమత్కారానికి మనస్ఫూర్తిగా బిత్తరపోయారు.

అప్పటికే ఆత్రేయగారు ఉన్న ఆస్తులన్నీ పోగొట్టుకొని, ఆర్థికంగా చాలా చితికిపోయి వున్నాడట. తనకు నాలుగు సినిమాల్లో నాలుగు పాటలు రాసే అవకాశం ఇస్తే, తనకు తిండి గడుస్తుందనే విషయాన్ని అంత సులభంగా చెప్పటం చూసి అక్కడున్నవాళ్ళు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారట. కళ్ళనీళ్ళు పెట్టుకునే బదులు తలా కొంత ఆర్థికంగా ఆత్రేయగార్ని ఆదుకుని ఉంటే సినిమా ఫీల్డులో వుండేవాళ్ళు విశ్వాసఘాతకులు అనే నింద తాలూకు బరువు కొంత తగ్గి వుండేదేమో!" అని చెప్పి ఫీలయ్యాడు రామబ్రహ్మం.

అతనితోపాటు అక్కడున్న అందరూ ఆ మహాకవికి, సంక్షిప్తతకి మారుపేరైన ఆ మహాజ్ఞానికి పట్టిన ఆర్థిక దుస్థితికి చాలా బాధపడ్డారు.

సరిగ్గా అదే సమయంలో అక్కడకొచ్చాడు హీరో విమల్.

"సారీ కొంచెం లేటైంది" అంటూ.

డైరెక్టర్ లేచి షూటింగ్ స్పాట్‌వేపు అడుగులు వేశాడు.

* * * * *

కెమెరామేన్ లైటింగ్ ఆరేంజ్‌మెంట్స్ చూసుకుంటున్నాడు.

డైరెక్టర్ బృంద దగ్గిరికి వచ్చి-

"అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు చెప్పింది అర్థమైంది కదా... ఫ్రెండ్స్‌తోపాటు హోటల్ రూమ్‌లో కూర్చున్న హీరో దగ్గిరికి మీరొస్తారు. అప్పటికే అక్కడ డ్రింక్ పార్టీ జోరుగా సాగుతుంటుంది. మీరు రావడం చూసి ఆ ఫ్రెండ్స్ వెళ్ళిపోతారు. ఎందుకు రమ్మన్నావ్ ఇక్కడికని అడుగుతారు మీరు" సీనంతా మరోసారి చెప్పాడు డైరెక్టర్.

సాలోచనగా అతని కళ్ళవేపే సూటిగా చూసిందామె. మళ్ళీ ఆమెలో ఏవో దీర్ఘమైన ఆలోచనలు...

"ఓ.కే" అంటూ ముందుకు కదిలాడతను.

ఆర్టిస్ట్స్ పొజిషన్‌లోకి వెళ్ళగానే-

"స్టార్ట్... కెమెరా" అని డైరెక్టర్ అనగానే...

కెమెరా ఆన్ అయింది.

"ఏక్షన్" అని అన్నాడు డైరెక్టర్ తిరిగి.

బృంద రూమ్ డోర్ భళ్ళున తెరిచి సూటిగా హీరోవేపు చూస్తూ నిలబడింది. ఫ్రెండ్స్ నెమ్మదిగా కదిలి వెళ్ళిపోయారు. అప్పుడు హీరో ఒక్కడే అక్కడున్నాడు.

"కరెక్ట్ టైమ్‌కొచ్చావ్. ఇంతసేపూ నీకోసం ఎదురుచూసి, ఎదురుచూసి బోరుకొట్టి...."

"బీరు తాగుతున్నావా?" అడిగింది బృంద.

నవ్వాడతను. నవ్వుతూ తన జేబులోంచి ఒక విజిటింగ్ కార్డు తీసిచ్చి-

"ఈ విజిటింగ్ కార్డు పట్టుకెళ్ళి చూపించావనుకో, నువ్వేం మనీ పే చెయ్యక్కర్లేదు. అన్నీ సక్రమంగా జరిగిపోతాయి" అన్నాడు హీరో.

ఆ విజిటింగ్ కార్డువేపు చూసింది బృంద.

డాక్టర్ చంద్రకళ... దిల్‌సుఖ్‌నగర్."

"నేనక్కడకెందుకెళ్ళాలి?" సూటిగా ప్రశ్నించిందామె.

"ఎబార్షన్ చేయించుకోడానికి."

"ఎబార్షన్?"

"ఏం అలా ఆశ్చర్యపోతున్నావ్? ఇట్స్ కామన్ ఇన్ దీస్‌డేవ్. ఆ డాక్టర్ ఇలాంటి కేసుల్లో స్పెషలిస్ట్. ఆల్‌రెడీ అడ్వాన్స్ పే చేసేశాను." గ్లాసందుకుంటూ అన్నాడు హీరో.

"నా ప్రాణం పోయినా నేను అబార్షన్ చేయించుకోను."

"ఏం?"

"నేను బిడ్డను కంటాను."

"బిడ్డను కంటావా?" క్రూరంగా ఆమెవేపు చూసి, దగ్గరగా వస్తూ అన్నాడు.

"కంటాను... కంటాను... కంటాను."

"ఇప్పుడు నీకు మూడో నెల. తొమ్మిది నెలలూ మోయాలి."

"మోస్తాను."

"మోస్తావా... మోయలేవు... ఎందుకంటే... నువ్వు అంతవరకూ బ్రతకవు కాబట్టి."

"ఏం చంపుతావా?"

"లేదు."

"నేను అమ్మాయిల్తో ఆడుకుంటాను గాని చంపను... చంపిస్తాను. చాలా కూల్‌గా... ఏం చచ్చిపోవాలనుకుంటున్నావా?" కూల్‌గా అడిగాడు హీరో.

"బెదిరిస్తున్నావా?"

"బుజ్జగిస్తున్నాను. ఎందుకో తెలుసా... నీ మీద ఇప్పటికీ కాస్త ప్రేమ వుంది కాబట్టి."

"కట్" అరిచాడు డైరెక్టర్.

అందరూ చప్పట్లు కొట్టారు. ఆ సీన్ బాగా వచ్చినందుకు హేపీగా తన సీట్లోకొచ్చి కూర్చుంది బృంద.

"బృంద... మీరు భలే యాక్ట్ చేస్తున్నారే... ఎక్కడా... ఒక కొత్తమ్మాయినే బెదురు లేకుండా... టేక్స్ తీసుకోకుండా... వాటే వండర్... రియల్లీ అయ్ ఎప్రిషియేట్యూ" అంటూ కూల్‌డ్రింక్‌ను అందుకున్నాడు హీరో విమల్.

బాయ్ తెచ్చిచ్చిన కూల్‌డ్రింక్‌ని తిరస్కరించిందామె.

"మరేంలేదు కదా" అంది అప్పుడే అక్కడికొచ్చిన డైరెక్టర్ని.

"లేదు... థాంక్యూ... మేడమ్ డిన్నర్ ఏర్పాట్లు జరుగుతున్నాయ్. చేసి వెళ్ళిపోదువుగానీ" అన్నాడాయన.

"నో థాంక్స్... వస్తానండి" ఎవరివేపూ చూడకుండా మెట్లుదిగి హాల్లోంచి నడుచుకుంటూ పోర్టికోలోకొచ్చి కారెక్కింది బృంద. మరుక్షణంలో ఆ కారు స్టార్టయింది.

* * * * *

గెస్ట్‌హౌస్‌కొచ్చి బెడ్‌మీద వాలిపోయింది. ఏ.సీ. చల్లదనం కూడా ఆమె మనసులోని వేడిమని చల్లార్చలేకపోతోంది.

పావుగంట తర్వాత-

తను నిద్రలోంచి ఇప్పుడే లేచానా? లేక షూటింగ్‌కు వెళ్ళొచ్చానా! నిజమా...? కలైనా, నిజమైనా ఆ విషయం తనతో అలా చెప్పిన వ్యక్తి హీరో విమల్ కాదు. ఎవరు? ఇంకెవరు?

పరి, పరి విధాలుగా ఆలోచిస్తోంది బృంద.

సరిగ్గా అలాంటి సమయంలోనే లోనికొచ్చాడు పి.ఎ. రామావతారం.

"అవతారం... మిమ్మల్నో ప్రశ్న వేస్తాను... మరేం అనుకోవద్దు అందామె.

"చెప్పండి."

"నేను మధ్యాహ్నం నుంచి ఇప్పటివరకూ రూమ్‌లో వుండి. నిద్ర పోయానా... లేక...." ఆ ప్రశ్న వేసిన బృంద ముఖంలోకి విస్మయంగా చూశారాయన.

"జ్ఞాపకం లేక అడుగుతున్నారా... లేక...."

"జోక్ చేయడంలేదు. చెప్పండి."

"మీరు ఏడున్నరకి హోటల్ జపతికి షూటింగ్ కొచ్చారమ్మా. ఒకే ఒక్క సీన్ జరిగాక, అరగంట క్రితమే మీరిక్కడికి వచ్చారమ్మా మీతోపాటు వద్దామని వెయిట్ చేస్తున్న నన్ను కూడా వదిలేసి రావడం ఇది రెండోసారి" చెప్పాడతను.

"నేన్నమ్మను."

"ఏమిటి?"

"మిమ్మల్ని వదిలేసి రావడం ఏంటి?" తనలో తాను అనుకున్నట్లుగా అనుకుంది బృంద.

"పోనీ షూటింగ్ జరిగినట్టుగానైనా గు...ర్తుం...దా...అమ్మా...."

"గుర్తుంది.... గుర్తుంది.... హీరో విమల్ కదూ?"

"అవునమ్మా... విమల్ లేక ఇంకెవరైనా అనుకుంటున్నారా?" రామావతారం వేసిన ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేకపోయింది బృంద.

ఇంకెవరైనా అనుకుంటున్నారా?

తనకు తెల్సినట్టుగా అన్పించిన ఆ సన్నివేశంలో హీరో విమల్ కాకుండా, ఇంకెవరు?

ఆ ప్రశ్నకు బృంద దగ్గర జవాబులేదు.

డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ నిజంగా జరిగిన వాస్తవాన్నే ఆధారం చేసుకుని ఈ సినిమా కోసం తయారుచేసిన కథ అని చెప్పారు. జరిగిన కథ అంటే ఎక్కడ జరిగింది? ఎవరి జీవితంలో జరిగింది? వీళ్ళకా విషయం ఎలా తెల్సింది?

తను హీరోయిన్‌గా నటిస్తున్న కథలో, ఒరిజినల్ అమ్మాయి ఎవరు?? ఇప్పుడామె ఎక్కడుంది?

బృంద మెదడులో రకరకాల ప్రశ్నలు.

జవాబులేని ప్రశ్నలు.

"రామావతారంగారూ– ఒక్కసారి రైటర్ సూర్యవంశీ ఎక్కడున్నాడో కనుక్కుంటారా?" చటుక్కున బెడ్‌మీంచి లేస్తూ అందామె.

"అలాగేనమ్మా" అంటూ పక్క గదిలోకెళ్ళి ఫోనందుకుని ఎవరెవరికో ఫోన్‌చేసి అయిదు నిముషాల తర్వాత వచ్చి–

"హోటల్ శాంతిలో ఉన్నార్టమ్మా" జవాబు చెప్పాడతను.

ఆ వెంటనే గోడగడియారం వేపు చూసిందామె.

రాత్రి పది నలభైనిముషాలు."

"డ్రైవర్ ఉన్నాడు కదా...."

"ఉన్నాడమ్మా...."

"పదండి... హోటల్ శాంతికెళదాం" అంటూ లేచి నిలబడింది బృంద. నిశ్శబ్దంగా ఆమెను అనుసరించాడు, ఆశ్చర్యపోతూ రామావతారం.

*     *     *     *     *

ఫైనల్ డైలాగ్ వెర్షన్‌ని దూసుకుంటూ, అక్కడక్కడ చిన్న చిన్న మార్పులు చేస్తున్నాడు సూర్యవంశీ.

కాలింగ్‌బెల్ మోగడంతో గడియారం వేపు చూశాడు.

రాత్రి 11:15 నిముషాలు...

ఈ సమయంలో తన దగ్గరికి వచ్చేవారెవరు? డైరెక్టర్ ఆయనకి నిద్రపట్టక పోతే ఏ టైంలోనైనా వచ్చి "ఇప్పుడు ఆ సీట్లో" అంటూ మొదలుపెట్టడం అలవాటు. ప్రదీప్‌లోని ఆ అలవాటుకి మాత్రమే విసుక్కుంటాడు సూర్యవంశీ. అదే మాట ఆయనతో అంటే-

"నేను చాలా బెటర్ బ్రదర్. మరికొంత మందున్నారు. వాళ్ళు ఒక సినిమా కథకోసం వేల కథలు వింటారు. పలానా ఇంగ్లీషు నవల చదివావా? అందులో పలానా పాత్ర బావుంది, పలానా ఇంగ్లీషు క్యాసెట్ చూశావా? అందులో పలాన సీన్ బావుందంటూ ఎప్పటికీ కథను ఫైనలైజ్ చేయకుండా సినిమా తీయాలని ప్రొడ్యూసర్ పారిపోయేదాకా జీడిపాకంగా లాగుతారు. తన మేథస్సుకి అదో గొప్ప ఆయువుపట్టు అనుకుంటారు.

ప్రొడ్యూసర్‌కి సకాలంలో సినిమా తీసిపెట్టి, రిలీజయి నాలుగు వారాలు ఆడేలాచేసి నాలుగు రూపాయలు ప్రొడ్యూసర్ తినేలా చూడని డైరెక్టర్స్ అవసరాలతో, అప్పులతో సతమత మయిపోతుంటారు. ఎందుకండీ ఇదంతా మంచిది అనుకున్న కథని ఫైనలైజ్ చేసి వేగిరంగా సినిమా తీసెయ్యొచ్చుగా అంటే నేను మామూలువాడ్ని కాదు. నాకు కథ ఓ పట్టావు నచ్చదు. నన్నెవరూ అంత త్వరగా కథ చెప్పి ఒప్పించలేరంటూ గొప్పలు కొడుతుంటారు. అలాగని ఇంట్లో లక్షలు మూలుగుతున్నాయా అంటే పూట పూటకి వెతుక్కోవడమే. పోనీ టైమిస్తే వీళ్ళేమన్నా పథేర్‌పాంచాలి. కలియుగ్, అక్రోష్, లాంటి అవార్డు సినిమాలు తీస్తారా అంటే. వాటి అర్థమే వీళ్ళకి తెలీదు. వీళ్ళేమిటో, ఎందుకు వీళ్ళు సినిమా డైరెక్టర్స్ అవ్వాలనుకుంటారో, వీళ్ళకే తెలీదు" అని అంటుంటాడు ప్రదీప్.

సూర్యవంశీ ఆలోచనల్లో వుండగానే డోర్‌తీసిన చప్పుడయింది.

డోర్‌తీసి అక్కడ నుంచున్న బృందని చూసి ఆశ్చర్యపోయాడు.

ప్యాచ్ కాగితాలు, ఆ పక్కన సిగరెట్ ప్యాకెట్.

"మీరు... ఇప్పుడు... ఈ టైంలో...! ఫోన్‌చేస్తే నేనే వచ్చేవాడ్నిగా" అన్నాడతను.

"డిస్ట్రిబ్ చేసానా... మీతో మాట్లాడాలి. అందుకే...."

"అంటే" అతనికేం అర్ధంకాలేదు. ఏ విషయం అయి వుంటుందో అతనికి తట్టడంలేదు.

ఛైర్‌ని ఆఫర్‌చేసి తనొక ఛైర్‌లో కూర్చుంటూ అడిగాడు సూర్యవంశీ.

"చెప్పండి."

"మన సినిమా కథేంటి...." అలాంటి ప్రశ్న ఆమె సీరియస్‌గా వేస్తుందని వూహించలేదు సూర్యవంశీ.

"మగవాడి మోసానికి గురైన ఒక ఆడపిల్ల కథ...."

ఆ కథను మీరే రాశారా?"

"అవును... ఎందుకొచ్చిందా డౌటు...?' సందేహంగా అడిగాడు అతను.

"ఈ కథకు ఇన్‌స్పిరేషన్ ఎంటి?"

"ఎందుకలా అడుగుతున్నారు? సాధారణంగా రైటర్స్ జరిగిన సంఘటనకు ప్రతిస్పందించి కథలల్లుతారు... వర్ణనాత్మకంగా విశ్లేషస్తారు" చెప్పాడతను.

"జరిగిన సంఘటన... అంటే మీ జీవితంలోనా?"

"కాదు."

"మరి?!"

"కథను గాని, కథా నేపథ్యాన్ని గానీ ఎవరికీ చెప్పకూడదని డైరెక్టర్ కండీషన్... ఫస్ట్ పిక్చర్‌కదా... ఫీల్డ్‌లో కాంపిటేషన్ ఎలా ఉందో మీకు తెల్సు. ఒక ఫ్లోర్లో షూటింగ్‌ను చూసి ఇంకో ఫ్లోర్లో కథలల్లేస్తున్న పరిస్థితి వుంది."

"డైరెక్టర్‌గారి సెంటిమెంట్‌ను నేను గౌరవిస్తాను... నా కేరెక్టర్ నుంచి కేరెక్టర్... యు రోట్ గుడ్ స్క్రీన్‌ప్లే అండ్ డైలాగ్స్... నాకిది మొదటి సినిమా...

నా పెర్‌ఫామెన్స్ ఇంకా బావుండాలంటే, కథ పూర్తిగా తెలిస్తే బావుంటుందికదా... అందుకే ఈ రిక్వెస్టు–" బృంద కన్విన్సింగ్‌గా అడిగింది.

తటపటాయిస్తూ బృంద ముఖంలోకే చూశాడతను.

"నేను మీకు కథ చెప్పినట్టుగా డైరెక్టర్‌గారికి తెలియకూడదు. ఆ కండిషన్ మీదైతే చెపుతాను" అన్నాడు ఆఖరికి సూర్యవంశీ.

"అలాగే!" ఆ తర్వాత నలభై నిమిషాలసేపు కథనంతా సూర్యవంశీ బృందకు చెప్పాడు.

ఆ కథ బృంద కథే!

'తనకు జ్ఞాపకం వున్నంతవరకూ తన కథే. సంఘటనలు కూడా దాదాపు అవే, కానీ ఏదో మతిమరుపు. పూర్తిగా వ్యక్తులు జ్ఞాపకం రావడం లేదు' అనుకుందామె!

"మీ కథలో హీరోయిన్ మంజరి... మీకు తెలుసా?"

"తెలీదు."

"మరి ఎలా రాసారు."

"మూడేళ్ళ క్రితం ఈనాడు పేపర్లో ఒక న్యూస్ ఐటమ్ వచ్చింది ఆ న్యూస్ ఐటమ్‌ని చూడగానే దానిని కట్ చేసుకుని అందులోని సంఘటనలను నవలగా రాయాలన వివరాలు సేకరించాను."

"ఎలా?"

"ఆ రిపోర్టర్ని కలిశాను."

"ఏ ఊళ్ళో?"

"మహబూబ్‌నగర్...." చెప్పాడతను.

"మ...హ...బూ...బ్...నగ...గ...ర్...." ఒక్కొక్క అక్షరాన్నే వత్తి పలుకుతూ అందామె.

"ఆ ఊరు మీకు తెలుసా? ఎప్పుడయినా వెళ్ళారా? పక్కనే పిల్లలమర్రి కూడా వుంది" అన్నాడతను.

"పిల్లలమర్రి...."

"అంటే...."

"వెయ్యేళ్ళనాటి మర్రిచెట్టు అక్కడుంటుంది."

"వెయ్యేళ్ళనాటి మర్రిచెట్టు... తర్వాత...." ఆ పేర్లు ఎక్కడో విన్నట్టుగా వుంది బృందకు.

"ఆ రిపోర్టర్ని కలిశాను... అతని పేరు...." అడిగిందామె.

"పరుశురామ్!"

"ఒకమ్మాయి జీవితంలో జరిగిన దారుణమైన కథని అతనే ఇన్వెస్టిగేట్ చేసి రాశాడు. మొత్తం కథను అతను చెప్పగా రాశాను."

"సినిమాలోలాగే, నిజజీవితంలో కూడా ఆ హీరోయిన్, ఆ హీరోని అలాగే చంపుతుందా?"

ఆ మాటకు నవ్వాడు సూర్యవంశీ.

"ఎందుకలా నవ్వుతున్నారు?" అడిగిందామె.

"నిజంగా జరిగిన సంఘటనలో ఆ అమ్మాయి మంటల్లో చిక్కి చనిపోయింది."

"మంటల్లో చిక్కి చనిపోయిందా... ఇప్పుడా అమ్మాయి లేదా...?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"లేదు."

"ఆ అమ్మాయి పేరు?"

"మంజరి."

"రిపోర్టర్ పరశురామ్‌తోకల్పి నేను పోలీస్‌స్టేషన్ క్కూడా వెళ్ళాను. పోలీస్ రికార్డర్స్‌ను వెరిఫై చేయించాను. ఆ అమ్మాయి శవం గానీ, ఇతర ఆధారాలుగానీ దొరకలేదు. నేరస్తులు కూడా దొరకలేదు. ఫైల్ మాయమైంది."

"ఆ అమ్మాయి బంధువులెవరూ లేరా?"

"ఏమో తెలీదు."

"ఆ అమ్మాయి మంటల్లో చిక్కుకుని చనిపోవడానికి కొన్నిరోజుల ముందే ఆ అమ్మాయికి ఉన్న ఒకే ఒక్క అన్నయ్య... ఆ వూర్నించి రాత్రికి రాత్రే మాయమై పోయాడు. పిచ్చివాడయిపోయాడని కొంతమంది, చనిపోయాడని మరికొంత మంది చెప్పారు."

"తల్లిదండ్రులు?"

"తెలీదు."

"ఆ అమ్మాయిని ప్రేమించి, మోసం చేసిన ఆ మగవాడ్ని కలిశారా?"

"లేదు."

"ఏం?"

"అప్పటికే అతను ఆ వూరినుంచి ఎక్కడికో వెళ్ళిపోయాడని తెల్సింది. బహుశా ముంబాయి అనుకుంటా."

"అతని పేరు?"

"తెలీదు."

"అతని ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్?"

"పెద్ద పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్... ఆ ఫ్యామిలీ అంటే పోలీసులకి కూడా భయమే. ఆ వూళ్ళో ఆ ఫ్యామిలీ గురించి ఎవర్నయినా ఆటోవాళ్ళని, కనీసం రిక్షావాళ్ళనడిగినా మనం ప్రమాదంలో పడినట్టేలెక్క చెప్పాడు సూర్యవంశీ.

"ప్రస్తుతం ఆ రిపోర్టర్ ఎక్కడున్నాడు?"

"చెప్పానుగా... ఈ న్యూస్ ఐటమ్ పేపర్లో వచ్చాక, ఆ రిపోర్టర్ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు ఫ్యామిలీతోసహా... ఎక్కడికి వెళ్ళాడు తెలీదు."

"సో... ఒక రియల్‌స్టోరీ ఆధారంగా మీరీ కథను రాసారన్నమాట ఈ కథనే మీరెందుకు రాశారు?"

ఈ సమాజంలో రకరకాలుగా ఆడవాళ్ళు మోసపోతున్నారు.... మోసపోయే మహిళలకు ఆత్మహత్య పరిష్కారం కాదని ఈ కథలో మంజరి నిరూపించింది. ఆమె తనని మోసం చేసిన వ్యక్తికి ఎలా బుద్ధి చెప్పిందో, ఆ పరిష్కారమే నన్ను ఆకట్టుకుంది. ఇందులో సందేశం వుంది. రకరకాల వ్యామోహాలకు ఆకర్షణలకు గురవుతున్న ఈరకం అమ్మాయిలను అద్భుతమైన హితబోధ వుంది. మార్గదర్శకత్వం వుంది పురుష సమాజపు దుర్మార్గం వుంది.

రాముడు కాలంనాటి దుర్మార్గంవేరు. ద్రౌపతి కాలంనాటి దుర్మార్గం వేరు. మునిపత్నులు ఉదాహరణకు తారలాంటి మహిళలకు ఎదురయింది దుర్మార్గం వేరు. ఇంతెందుకు అమెరికన్ ప్రెసిడెంట్ బిల్‌క్లింటన్ కేసునే తీసుకోండి... నాకయితే లెవెన్‌స్కీది తప్పని నేననుకోను. ఆమె ఒక టీనేజ్

అప్పుడే దాటిన అమ్మాయి. బ్యూటీఫుల్ గర్ల్... ఇన్ఫాట్యుయేషన్‌కు లోనైంది. బిల్‌క్లింటన్ బాగానే వున్నాడు. లెవెన్‌స్కీ గురించి ఇప్పుడెవరయినా ఆలోచిస్తున్నారా...." ఆవేశంగా ప్రశ్నించాడు సూర్యవంశీ.

"బిల్‌క్లింటన్‌ది తప్పంటారా?' ప్రశ్నించింది బృంద.

"తప్పో... ఒప్పో... అది వేరు. పురుషాంకారం స్త్రీ జాతిమీద దమనత్వానికి నిదర్శనం" అన్నాడతను.

"ఇవన్నీ చూసే అక్కడక్కడ చిరుమార్పులతో మంజరి కథను రాసాను. ఇది లక్కీగా సినిమా అవుతోంది కాబట్టి మీలాంటి సహజమైన నటి, ఆ పాత్రలో జీవిస్తున్నారు కాబట్టి ఎంతోకొంత సందేశం నేను ఇచ్చానన్న మానసికమైన సంతృప్తి నాకుంటుంది."

సూర్యవంశీ మాటలకు ఏమీ అనలేదు బృంద.

"మీ ఆశయం గొప్పదే సూర్యవంశీగారూ! ఇప్పుడు నాకు పూర్తిగా వివరాలు తెలిసాయి కాబట్టి పర్‌ఫెక్షన్ కోసం ప్రతయత్నిస్తాను" అంటూ లేచింది బృంద.

ఈ కథ విషయంలో ఆమెకెందుకింత ఇంట్రెస్ట్? కేవలం నటించటానికేనా? లేకపోతే ఇంకేమైనా కారణముందా? అనే విషయమై ఆమె వెళ్ళిపోయాక ఆలోచించాడు సూర్యవంశీ.

గెస్ట్‌హౌస్ కొచ్చిన బృందకు నిద్రపట్టడంలేదు.

మసక బారిపోయిన పెయింటింగ్‌ను చూసినప్పటి అనుభూతి.

ఏదో జ్ఞాపకాల వలలు? ఆ వలల్లో చిక్కుపడిపోయినప్పటి మానసిక స్థితి.

డ్రెస్ ఛేంజ్ చేసుకుని నైటీలోకి మారిందామె.

నిలువుటద్దం ముందు నుంచుని తన ముఖంలోకి చూసుకుంది.

ఆ ముఖం వెనుక...

రెండు చేతులతో ముఖాన్ని తడిమి చూసుకుంది.

మెత్తని చర్మ స్పర్శ.

గెస్ట్‌హౌస్ కారిడార్లోకొచ్చి నిలబడింది. బయట మంచుకురుస్తున్న చిరుసవ్వడి. ప్రపంచమంతా చీకట్లో మునిగిపోయి వుంది. దూరంగా ఉన్నా ఏదో కోటలాంటి భవనంలో కాగడాల్లా వెలుగుచున్న దీపాలు...

ఒక చల్లటిగాలి నెమ్మదిగా బృంద ముఖానికి తాకి, పెదవులను స్పర్శించ వెళ్ళిపోయింది.

ఆ పెదవుల స్పర్శ... తడిపెదవుల స్పర్శ.

ఏవేవో అస్పష్టాస్పష్ట జ్ఞాపకాలను ఆహ్వానిస్తున్న ఆమె మనసునిండా చీకటి.

అలా ఎంతసేపు ఆలోచించిందో తెలీదు.

ఆఖరికి ఆమె ఒకే ఒక ప్రశ్న వేసుకుంది.

నేనెవరు?

రామ్‌కాశ్యప్ ఎవరు?

ఈ జీవితానికి ముందు తనెవరు? తనెక్కడ పుట్టింది? ఎక్కడ పెరిగింది? ఏం చదివింది? తన తల్లిదండ్రులు ఎవరు?

ఏమీ గుర్తుకురావటంలేదు. ఎంత ఆలోచించినా, జ్ఞాపకాలకు ఎంత పదును పెట్టినా ఉద్రిక్తత పెరుగుతోందే తప్ప సమాధానం శూన్యం.

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఆమె చేతివేళ్ళు కనురెప్పల మీదికెళ్ళాయి. ఆ కనురెప్పల చివర ఒక తడి బిందువు, ఆ కన్నీటి బిందువు వేడిగా వుంది.

భారంగా నిట్టూర్చి కారిడార్లోంచి లోపలికి అడుగేసింది. డోర్ లాక్‌చేసింది.

అంతవరకూ ఆ కారిడార్ చివర చీకట్లో స్థంభం పక్కన నిలబడి ఆమెను గమనించిన ఆ వ్యక్తి, ఆమె రూమ్ లోపలికి వెళ్ళిపోగానే గబగబా నడుచుకుంటూ మెట్లమీదుగా కిందికి దిగి, తన రూములోకి నడిచి, డోర్‌వేసుకుని, టెలిఫోన్ అందుకుని, ఒక నెంబర్ ప్రెస్ చేశాడు.

ఫోన్ రింగవుతున్న శబ్దం వినిపించింది.

ఫోన్ రిసీవర్ ఎవరో ఎత్తిన శబ్దం.

"రామ్‌కాశ్యప్ హియర్."

"నేనే" అన్నాడతను.

"చెప్పు రామావతారం! ఏంటీ ఇంత అర్ధరాత్రి...." అడిగాడతను.

బృందను తను పరిశీలించిన విషయాన్ని చెప్పాడు రామావతారం.

* * * * *

రెండో రాత్రి-

"అమ్మాయ్ బృందా" రూము తలుపు తట్టాడు రామావతారం. రెండు నిమిషాల్లో డోర్ తెరుచుకుంది.

"మీరా? చెప్పండి" అందామె.

"ఏంటమ్మా డల్‌గా వున్నావ్? భోంచేసావా?" అడిగాడతను.

"టిఫిన్ చేసాను."

"బేరర్‌తో చెప్పాను... పడుకునే ముందు నీకు మిల్క్ ఇవ్వమని నిద్ర కోసం నువ్వు కాంపోజ్ టేబ్లెట్స్ వాడుతున్నావని తెల్సింది. అవి వాడటం మంచిది కాదు. కాసేపు యోగా మెడిటేషన్ చేసి, తర్వాత స్నానం చేసి, తాగి పడుకో, మంచి నిద్ర పడుతుంది. ఏదైనా అవసరమనుకుంటే నాకు ఫోన్ చెయ్యి" చెప్పాడు రామావతారం.

"మీరు నా గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు...." అంది బృంద.

"ఇట్స్ మై డ్యూటీ" అని అంటూ-

"మర్చిపోయాను... చూడు బృందా! జెమినీ టీవీ వాళ్ళట, నిన్ను ఇంటర్వ్యూ చేయడానికి వస్తున్నారు. షూటింగ్ స్పాట్‌కి రమ్మన్నాను" చెప్పాడు ఆయన,..

"నన్నా? ఇంటర్వ్యూ చేస్తారా? ఎందుకు?"

"ఎందుకంటే ఏమిటమ్మా? కొత్త నటివి... ఈ సినిమా గురించి ఇప్పటికే ఇండస్ట్రీలో గుడ్‌టాక్ వచ్చింది... బయ్యర్స్ కూడా ఎప్రోడ్ అవుతున్నారని తెల్సింది. సినిమాకే కాదు- నీక్కూడా పబ్లిసిటీ చాలా అవసరం. అందుకు" అన్నాడతను.

చిన్నగా నవ్వింది అతనివైపు చూసి బృంద.

కళాంజలి కాటన్ చీరలో, కొండపల్లి బొమ్మలా వుంది బృంద. షూటింగ్ స్పాట్‌కి కొంచెం దూరంలో ఫౌంటెన్ పక్కన లాన్‌లోకొచ్చిందామె. అప్పటికే

ఆమె కోసం ఎదురుచూస్తున్నారు జెమినీ టీవీ, ఈ టీవీ స్టాఫ్, ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి వరంగల్‌కి ఎందుకొచ్చారో అర్థం కాకుండా వుంది ఆమెకు. వాళ్ళలా రావటం వెనుక రామ్‌కాశ్యప్ హస్తం వుందని తెలీదు బృందకు.

ఆ టీవీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ బృందకు నమస్కరించి-

"వి ఆర్ వెయిటింగ్ ఫర్‌యూ మేడం" అన్నాడు.

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీలో కూర్చుందామె.

క్లోజప్ షాట్స్ తీస్తున్నాడు కెమెరామెన్. మరికొన్ని నిమిషాల తర్వాత ఇంటర్వ్యూ మొదలైంది.

"మీరు చిన్నప్పటినుంచి హీరోయిన్ కావాలనుకున్నారా?"

"లేదు."

"ఏం కావాలనుకున్నారు?"

"గృహిణిగా స్థిరపడాలనుకున్నాను. నేను, నా భర్త, పిల్లలు, స్వీట్‌హోమ్, ఎట్సెట్రా."

"మరి ఈ ఫీల్డ్‌లోకి రావటానికి కారణం...."

"లోన్‌లీనెస్ భరించలేక."

"లోన్‌లీనెస్ భరించలేకపోవడం చాలామంది అమ్మాయిలకుంటుంది. అందరికి అవకాశాలు రావు. ఈ విషయంలో మీరు చాలా అదృష్టవంతులు అవునా?"

"అవును."

"ఈ ఫీల్డ్‌లోకి కొత్త కొత్త అమ్మాయిలొస్తున్నారు. వాళ్ళ పోటీని తట్టుకుని నిలబడగలరా?"

"నేను పర్మినెంట్‌గా ఈ ఫీల్డ్‌లో వుండటానికి రాలేదు."

"ఈ సినిమాలో మీరు నటించడానికి కారణం?"

"అవకాశం వచ్చింది గనుక."

"ఈ ఒక్క సినిమాలోనే నటిస్తారా?"

"ఇప్పుడే చెప్పలేను."

"అంటే?"

"మనం అనుకున్నవి చాలాజరగవు. అనుకోనివి జరుగుతుంటాయి దిసీజ్ లైఫ్. జీవితంలో ప్రతి సంఘటనకూ ఎంతో కొంత వాల్యూ ఉందని నేను భావిస్తాను."

"మీకు పిలాసఫీ ఇష్టమా?"

"లైఫన్నా ఒక ఫిలాసఫీ."

"ఈ సినిమాలో మీ కారెక్టరేమిటి?"

"డైరెక్టర్ గారిని అడిగితే బావుంటుంది."

"ఒక పర్సనల్ క్వశ్చన్... ప్రేమ మీద మీ అభిప్రాయం ఏంటి?" ఆమె కళ్ళలోకి సూటిగా సూచ్తూ అడిగాడు కో-ఆర్డినేటర్.

"ప్రేమంటే... ఒక మోసం... ఇట్స్ ఏ చీటింగ్...." రాష్‌గా ఆమె నోటి వెంట వచ్చిన ఆ జవాబుకి ఆశ్చర్యపోయాడతను.

"అందరి దృష్టిలోనూ అంతేనంటారా?"

"అంతే...."

"మీరెవరినైనా ప్రేమించారా?"

"ప్రేమించా...నా" అని తడుముకుంటూ-

"ప్రేమించాను" అంది.

"ఎవరా వ్యక్తి?"

"జ్ఞాపకం లేదు."

ఆ జవాబుకి కెమెరామెన్, కో-ఆర్డినేటర్, పక్కనున్న వ్యక్తులూ అందరూ నవ్వారు.

"ఆర్ యూ జోకింగ్...."

"నో... ఇట్స్ సీరియస్...."

"ఎక్కడుంటాడు?"

"తెలీదు."

"ప్రేమించిన వ్యక్తి ఎవరో, ఎక్కడుంటాడో తెలీకపోవడం... అన్యాయం మేడమ్. మమ్మల్ని మీరు ఫూల్స్ చేస్తున్నారు."

"లేదు! నిజమే చెప్తున్నాను."

"అతను మిమ్మల్ని మోసం చేశారా?"

"ప్రేమంటే మోసమేగా...." నవ్వుతూ అందామె.

"మీరు పెద్ద ఇండస్ట్రీయలిస్ట్ రామ్‌కాశ్యప్‌గారి మేనకోడలై వుండి సినిమాల్లో నటించడానికి కారణం?"

"ఆయనకు నేను మేనకోడల్నని ఎవరు చెప్పారు?"

"మేం జర్నలిస్టులం... ఇన్వెస్టిగేటివ్ జర్నలిజమ్ మా ప్రొఫెషన్" అన్నాడతను.

"మా టీ.వీ. ఛానల్‌కు మీరిచ్చే సందేశం ఏమిటి?" అడిగాడతను.

"సందేశం ఇచ్చేంత పెద్దదాన్ని కాకపోయినా అమ్మాయిలకు మాత్రం ఒక విషయం చెప్పదలిచాను. ప్రేమించండి కానీ, ప్రేమించే ముందు, మీరు ప్రేమించే వ్యక్తిని బాగా పరిశీలించి ప్రేమించండి."

"మా టీ.వీ. సీరియల్స్ మీద మీ అభిప్రాయం?"

"బావుంటున్నాయి... కానీ మీ ఛానల్స్ వారందరికి ఒక రిక్వెస్టు...."

"ఏమిటది చెప్పండి."

"ఈ మధ్య తెలుగు నవల్స్ కొంతమంది ఇతర భాషల్లోకి తను పేరుమీద అచ్చేయించుకుని అమ్మేసుకుంటున్నారని ఎక్కడో చదివాను. టీ.వీ. సీరియల్స్‌కి మాత్రం ఆ దుర్గతి పట్టించకండి...." నవ్వుతూ లేస్తూ అందామె.

"థాంక్యూ" ఆ కో-ఆర్డినేటర్, కెమెరామెన్ వేపు వెళ్ళగా, లాన్‌లోంచి పోర్టికోలోకి వస్తున బృంద, ఫస్ట్ ఫ్లోర్లోంచి మెట్లు దిగుతున్న వ్యక్తివేపు చూసింది.

తనకు చాలా తెల్సిన ముఖంలా అనిపించడంతో, మళ్ళీ సూటిగా చూసింది. అతన్ని ఎక్కడో చూసినట్టు వుందామెకు, జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తోంది.

ఎక్కడ చూసింది? ఎవరతను?

అతను అయిదడుగుల ఆరంగుళాల పొడవున్నాడు. బలిష్టంగా వున్నాడు. మందంగా మీసాలు... రేబాన్ కళ్ళజోడు... భుజాలవరకూ పెరిగిన జుట్టు... హిందీ విలన్ మహేష్ ఆనంద్‌లా వున్నాడు.

అతను కూడా లోనికొస్తున్న బృంద వేపు చూశాడు.

ముందుకెళ్ళబోతున్నవాడల్లా ఆగి, తల పక్కకు తిప్పి చూశాడు బృందను చూడగానే అతనికి ఎక్కడో చూసినట్టు అనిపించి, పేరును జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు.

అప్పటికే బృంద లోనికెళ్ళిపోయింది.

కారు దగ్గరకి వెళ్ళిన ఆ వ్యక్తి. అప్పుడే కెమెరా పట్టుకొని లోపలికొస్తున్న కెమెరామెన్‌ని ఆపి.

"ఎవరావిడ?" అని అడిగాడు.

"కొత్త హీరోయిన్ బృంద...."

"ఏ సినిమాలో?"

"ఇంకా పేరు ఎనౌన్స్ చేయలేదు."

"బృంద...." అని లోలోనే ఉచ్ఛరించుకుంటూ వెళ్ళి కారులో కూర్చున్నాడు. ఆ కారు స్టార్టయి ముందుకు దూసుకుపోతోంది.

"హైదరాబాద్‌కేనా సాబ్?" అడిగాడు డ్రైవర్.

"అవును...." చెప్పి సెల్‌ఫోన్ అందుకొని ముంబాయిలోని ఒక నెంబర్‌ని ప్రెస్ చేశాడు.

అట్నించి గొంతు వినిపించగానే.

"హలో... నేను...." అన్నాడతను.

"ఎక్కడ్నించి కిషోర్‌దాస్? ఏమైంది నువ్వు వెళ్ళిన పని?" అడిగాడు అవతల వ్యక్తి.

"రైన్ ఇన్ ద మిడ్‌నైట్... ఇంగ్లీషు సినిమా నైజాం రైట్స్... తేజ ఫిలింప్ వాళ్ళు తీసుకొన్నారు."

"ఎంతకి?"

చెప్పాడు కిషోర్‌దాస్.

"ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రైట్స్ మనకే రావాలి... ఇంకో అయిదు లక్షలు పడెయ్... ఎగ్రిమెంట్ చేసుకొని వచ్చెయ్...."

"ఓ.కె... కానీ... భాయ్ చిన్న షాకింగ్‌న్యూస్."

"మనకి షాకింగ్ న్యూస్ ఏంది భాయ్... మనమంటేనే ఇతరులకు షాక్ గదా...."

"అదికాదు.... మంజరి...."

ఆ మాట విన్పించగానే అటుపక్కనుంచి మాట వినబడలేదు.

"మంజరి జ్ఞాపకం వుందా?"

"ఉంది... ఏంది కత?"

"కత లేదుగానీ... ఇవాళ నేనో అమ్మాయిని చూసాను. సినిమా ఫీల్డులోకి కొత్తగా వచ్చిందట... పేరు బృంద. దగ్గర దగ్గరగా మంజరిలాగే వుంది. ముఖంలోనే ఏదో తేడా...."

"చూడు కిషోర్‌దాసూ... నీకు బొజ్జ పెరిగింది తప్ప బుర్ర పెరగలేదు. ప్రపంచంలో ఏడుగురు వ్యక్తులు ఒకలాగే వుంటారని చదవలేదా?"

"లేదు!"

"అందుకే నీకా డౌట్ వచ్చింది... చచ్చిపోయిన మంజరి బతికి రావటం ఏంటి?"

"నా డౌట్ అంతే... జస్ట్ లైక్ దట్."

"ఓ పనిచెయ్... డౌట్ డౌటుగానే వుండిపోకూడదు... ఎందుకైనా మంచిది, ఆ బృంద ఫ్యామిలీ వివరాలు కనుక్కొని రేపు వచ్చెయ్" సెల్‌ఫోన్ కట్ అయింది.

ముంబాయి నుంచి సెల్‌ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి పేరు అరవింద్.

*  *  *  *  *

ఆరోజు రాత్రి బృందకు చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు. కాంపోజ్ టాబ్లెట్స్ వేసుకున్నాగానీ, ఆమె కంటిమీదకు కునుకురాలేదు.

*  *  *  *  *

రామన్న గుడిదగ్గర హీరో విమల్‌మీద కొన్ని సీన్లు తీస్తున్నాడు. డైరెక్టర్ ప్రదీప్. ఆరోజు బృందకు వర్క్‌లేదు. నైట్ షూటింగ్ కూడా లేదు. షూటింగ్ పూర్తయ్యాక నేరుగా బృంద దగ్గరికి వచ్చాడు విమల్.

"ఈవెనింగ్ మీకేం ప్రోగ్రాం లేదుకదా?" అడిగాడతను.

"లేదు."

"వరంగల్ అవుట్ స్కర్ట్స్‌లో నుంచి దాబా హోటల్ వుందట. సరదాగా వెళ్దాం" అన్నాడతను.

"అలాగే...." అంది బృంద.

*　　　*　　　*　　　*　　　*

సాయంత్రం ఏడు దాటింది.

గెస్ట్‌హౌస్‌లోంచి దిగి కారెక్కిందామె... గోధూళి రంగు సల్వార్. పైజమాలో సంపెంగపువ్వులా వుందామె.

వరంగల్ సిటీకి మూడు కిలోమీటర్ల దూరంలో పచ్చని తోటల మధ్య వుంది ఆ పంజాబీ దాబా, చాలా ఆర్టిస్టిక్‌గా వుంది. అప్పటికే అక్కడ కమేడియన్ రామబ్రహ్మంతోపాటు వెయిట్ చేస్తున్నాడు హీరో విమల్.

"మీరు పాపులర్ హీరో, నేను పాపులర్ కమెడియన్‌నికదా. మన దగ్గరకు ఎవరూ ఆటోగ్రాఫ్‌ల కోసం రావటం లేదేంటండి... నాకేం అర్థం కావడంలేదు" గత మూడ్రోజుల నుంచి గింజుకుపోతున్న ప్రశ్న వేశాడు రామబ్రహ్మం.

"దానికి ఒకటే కారణం అయుండొచ్చు" అన్నాడు విమల్.

"ఏమిటది?"

"సినిమా తెరమీద నువ్వూ, నేను విగ్గులతోనూ, మీసాలతోనూ, జీన్స్ పాంట్స్‌తోనూ కనబడతాం. ఇక్కడేమో విగ్గులులేవు... మీసాలూ లేవు. షర్టూ... పాంటూ... బహుశా అదే అయ్యుంటుంది" అన్నాడతను చిరాగ్గా.

"మనవి బట్టతలలు కదా...!" అన్నాడు కమెడియన్ కన్ని నవ్వుతూ.

అదే సమయంలో అక్కడకొచ్చిన బృందను చూడగానే రామబ్రహ్మం లేచి దూరంగా ఉన్న ఆర్టిస్టుల గ్రూపు దగ్గరికెళ్ళిపోయాడు.

గుబురు మామిడి చెట్టుకింద కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ. స్పీకర్లోంచి మంద్ర స్థాయిలో బొంబాయి సినిమా రెమో ఫెర్నాండజ్ పాడిన అరబిజ్ కడలందం పాట వినబడుతోంది.

"ఈ సాంగ్ని మనం ఫుల్సౌండ్లో, మెటాలిక్ సౌండ్లో వినాలి. ఎ.ఆర్. రెహమాన్ ఆర్కెస్ట్రయిజేషన్ సూపర్స్...." విమల్ అన్నాడు.

అతనివేపు చూసి నవ్వింది బృంద.

విమల్ది మంచి పర్సనాలిటీ. ఇరవై ఏళ్ళనుంచీ ఫీల్డులో ఉన్నాడు. ప్రొడ్యూసర్స్ హీరో అతను. ఇండస్ట్రీ, ఇండస్ట్రీలోని వర్కర్లు పదికాలాల పాటు సుఖంగా వుంటాలని, స్టార్ ఇమేజ్ వచ్చిందని, రూటు పెంచేస్తే ఇండస్ట్రీ దెబ్బతింటుందని అతని అభిప్రాయం.

"సాంగ్ షూటింగ్ ఎప్పుడు?" అడిగింది బృంద.

"వచ్చేవారం...."

"ఎక్కడ?"

"హైద్రాబాద్లోనే...."

"ఏం... సింగపూరని డై రెక్టర్ గారన్నట్టు గుర్తు.

"నేనే వద్దన్నాను. పాట బాగుంటే అంటే రచన, మ్యూజిక్ రెండూ బాగుంటే, సింగపూర్లో తీసినా, నక్లెస్రోడ్మీద తీసినా ఒకటే... నా దృష్టిలో అదంతా అనవసరమైన ఖర్చు, హీరో, హీరోయిన్ల స్టేటస్... విదేశాల్లో పాటలు తీయడంవల్ల రెండు డజన్ల డ్రెస్సులు మార్చడంవల్లా రాదు. అలా డ్రస్సులు మారుస్తున్నప్పుడు ప్రొడ్యూసర్ డ్రెస్సు, అడ్రెస్సు మారిపోకుండా చూసుకొంటే, ఆ నిర్మాత ఇంకో సినిమా తీయగలుగుతాడు...." తెలుగు తెరకు పట్టుకున్న విదేశీ సాంగ్స్ జబ్బు తలుచుకొని.

"ఇప్పుడొస్తున్న సినిమాలు మీకు నచ్చుతాయా, పాత సినిమాలు నచ్చు తాయా?" అడిగింది బృంద.

"పాత సినిమాల స్కూల్ వేరు. వినోదం, సామాజిక ప్రయోజనం రెండూ వుండేవి. వినోదంలో ఉదాత్తత వుండేది. ఇప్పుడవి లోపిస్తున్నాయని నా అనుమానం. ఫాస్ట్ఫుడ్ సెంటర్ల వల్ల ఆకలి ఎలా తీరదో, ఈ సినిమాలవల్ల లాభం కూడా అంతే...

సినిమా కాని, టీ.వీ. కాని, వీక్లీస్‌కాని మిగతా పీరియాడికల్ కాని, అవన్నీ సృజనాత్మకమైన కళ కిందకి వస్తాయి. క్రియేటివిటీ లోపించి. కమీషన్ బిజినెస్‌లా తయారైతే ఆర్టిస్టు అన్న పదానికి అర్థం వుండదు. నా అభిప్రాయంతో కొంతమంది ఏకీభవించామనుకోండి... అది వేరే విషయం...."

"దానిక్కారణం...."

"కారణాలు అందరికీ తెలిసినవే. ఒకప్పుడు సినిమా ఉమ్మడి కుటుంబాల్లా హాయిగా వుండేది. ఇప్పుడు అపార్ట్‌మెంట్ బతుకులా అయిపోతుంది. అదే తేడా... అవునూ... ఇలా సీరియస్ సబ్జెక్ట్ మాట్లాడుకోవడానికే ఇక్కడికొచ్చామా?" అన్నాడు నవ్వుతూ విమల్.

"మీరే ఏదైనా మాట్లాడండి. ఎలా వుంది హీరోయిన్‌గా అనుభవం?"

"ఇంటర్వ్యూనా?" నవ్వుతూ అంది బృంద.

"ఏం... జెమినీ ఇంటర్వ్యూలో చాలా పర్సనల్ విషయాలు చెప్పారట...."

"మీకా విషయం ఎవరు చెప్పారు?"

"మీది సీక్రెట్ ఇంటర్వ్యూ కాదుగా. బృందా... బీ ఫ్రెండ్లీ... ఏ విషయం గురించైనా మనం ఇక్కడ నిర్మొహమాటంగా మాట్లాడుకోవచ్చు." అన్నాడతను. అతనెందుకు అలా అన్నాడో ఆలోచిస్తోంది బృంద.

"ఏమిటాలోచిస్తున్నారు?"

"ఏమీలేదు."

"నాకో డౌటు.... నేను రెండువందల యాభై సినిమాలు చేసుంటాను. హిట్ అవుతాయనుకున్న సినిమాలు ఫ్లాపయ్యాయి. ఫ్లాపవుతాయి అన్న సినిమాలు హిట్ అయ్యాయి. ఒక జీవితం హిట్ అయిందో, ఫ్లాపయిందో ఎలా తెలుస్తుంది? తెలిస్తే మీరు చెప్పండి" అన్నాడు విమల్.

అవును. చాలా చిత్రమైన సందేహం.

"మనం ప్రాక్టికాలిటీస్‌ని పక్కనపెడితే... లైఫ్... హిట్టో, ఫ్లాపో తెలుస్తుందేమో."

"అంటే...?"

బేరర్ రెండు ప్లేట్లలో చికెన్ బిర్యాని, షెర్వా తెచ్చి టేబుల్‌మీద పెట్టాడు.

"ఏంలేదు... ఎదుగుతున్న మనిషి తన జీవితం ఇలా వుండాలని భావించడం సహజం. అందుకనుగుణంగా కృషి చేయడం సహజం... ఆ కృషి ఫలిస్తే జీవితం హిట్ అయినట్టే, ఆ మనిషి కలలుకంటూ ప్రాక్టికాలిటీకి దూరంగా వెళ్ళిపోయాడనుకోండి... ఆ జీవితం ఫ్లాప్ అయినట్టే" అంది బృంద.

"గుడ్ అనాలసిస్... మీకు అందమంటే ఇష్టమా... అంతరంగ మంటే ఇష్టమా?"

"అంతరంగం...."

"యూ హేవ్ వండ్రఫుల్ బ్యూటీ... అందాన్ని అందం ఇష్టపడాలి. మీరలా ఇష్టపడతారని నేననుకున్నాను."

"అందం శాశ్వతమంటారా?"

"ఎందుకుకాదు... సినిమా ఫీల్డులో ప్రతి ఒక్కరూ భావించేది అందం శాశ్వతమనే... నాకు తెల్సిన ఒక సినిమా నటి, చాలా అందంగా వుండేది. ఏదో షూటింగ్ సమయంలో ముఖంమ్మీద యాసిడ్‌పడి, ఆ ముఖం వికృతంగా అయిపోయింది. ఆమె చాలా నేచురల్ ఏక్ట్రెస్. కురూపిగా మారిన తర్వాత ఆమెకు వేషాలు లేవు.

అంటే దానర్థం ఏమిటి? ఆమె నటన ఎవరికీ అక్కర్లేదన్నమాట. అందాన్ని మాత్రమే గుర్తించారు. అలాంటి సంఘటన ఎవరి జీవితంలోనైనా జరిగితే, ఫీలింగ్స్ ఎలా వుంటాయి?" మామూలుగా అడిగాడతను.

ఆ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేదామె.

"కొన్ని సంఘటనలను భరించడానికి మానసికంగా ఎదగాలేమో...." అంది సంశయంగా బృంద.

"మీది అద్భుతమైన, సహజమైన అందం... షూటింగ్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. మీ ముఖం పూర్తిగా కాలిపోయింది. హాస్పిటల్లో చేరారు. కోలుకున్నాక మీ ముఖం వికృతంగా, చూపరులకు భయంకరంగా కన్పిస్తోంది.

మీరు ఆ ముఖాన్ని దాచేసుకోడానికి కాస్మిటిక్ సర్జరీ చేయించు కుంటారా?" కాకతాళీయంగా అడిగాడతను.

సూటిగా అతనివేపే చూస్తోంది బృంద. ఒక్కసారి ఆమె ముఖంలో మారిన రంగులు, లైట్ల వెలుగులో అతనికి కనిపించడంలేదు. ఆమె గుండె వేగం హెచ్చడం,

చేతులు వణకడం, తనను తాను కంట్రోల్ చేసుకోడానికి చేసే ప్రయత్నం విఫలం కావడం...

ఒక్కసారిగా లేచి నిలబడిందామె.

బిర్యానీ ప్లేటును తీసుకుని గోడకేసి కొట్టింది. కాళ్ళతో టేబిల్‌ని తంతే, అది అంతదూరంలో పడింది. చేతుల్తో కుర్చీ తీసి విసిరేస్తే, అది రామబ్రహ్మానికి తగిలింది.

"హీరోయిన్లందిరూ అమ్మవారి వేషాలేస్తున్నారు. ఈవిడ ఏమిటి వాయనోయ్... మేకప్ లేకుండానే అమ్మవారైపోయింది." అంటూ విస్తుపోతున్నాడతను.

"బృందా... బృందా... వాట్ హేపెండ్?" అయోమయంగా అడిగాడతను.

విసురుగా బయటికొచ్చి కారువేపు పరుగెత్తింది.

"డ్రైవర్" దూరం నుంచి పరుగు పరుగున వచ్చాడతను.

డోర్ తెరుచుకుని కూర్చొని "పోనీ.... అర్జెంట్...." అరిచిందామె.

డ్రైవర్ అఘమేఘాలమీద కారుని స్టార్టు చేశాడు.

హీరో విమల్ పరుగు పరుగున వచ్చాడు. అప్పటికే కారు ముందు కెళ్ళిపోయింది.

రామబ్రహ్మం గుంపులో వున్న రామావతారం పరుగు పరుగున వచ్చి అయోమయంగా విమల్ వేపు చూస్తూ.

"ఏమైంది సార్?" అడిగాడు.

"ఎందుకో ఇరిటేట్ అయింది బృంద...." తను ఆ టాపిక్ ఎత్తకుండా వుండాల్సిందని అనుకొని బాధపడుతున్నాడతను.

తర్వాత కారెక్కి కూర్చున్నాక అతనిలా అనుకున్నాడు. బృంద కాస్మోటిక్ సర్జరీ టాపిక్కే ఎందుకు ఇరిటేట్ అయింది?"

"అవును. ఎందుకు ఇరిటేట్ అయింది?

*          *          *          *          *

విశాలమైన బెడ్‌రూమ్... ఎ.సీ. చప్పుడు సుతిమెత్తగా వినిపిస్తోంది. బెడ్‌మీద నిద్రపోతున్న బృంద, మారువేషంలో వున్న దేవకన్యలా వుంది. వెల్వెట్

రంగు చీర, జాకెట్, పాయలు, పాయలుగా తలగడమీద పరుచుకున్న జుత్తు, నుదుటిమీద చెరిగిన జుత్తు.

అకస్మాత్తుగా ఏవో మాటలు వినిపించడంతో, చటుక్కున కళ్ళిప్పింది బృంద. తనెక్కడుందో వెంటనే ఆమెకు అర్థంకాలేదు.

మగతగానూ, మత్తుగానూ వుంది. కనురెప్పలు బరువుగా వున్నాయి. ఎదురుగా రామ్‌కాశ్యప్, ఆ పక్కన పి.ఎ. రామావతారం. ఆ పక్కన సైకియాట్రిస్ట్ విశ్వనాథ్... పక్కన లేడీ డాక్టర్.

"వాట్ అంకుల్ ఏమిటిది? వాట్ హేపెండ్?" లేడీ డాక్టర్ వేపు. సైకియాట్రిస్ట్ విశ్వనాథ్‌వేపు చూస్తూ పిల్లోని గోడకు చేరవేసుకుని కూర్చుంది బృంద.

"గంటల తరబడి నువ్వు నిద్రపోతుంటే నాకు భయం వెయ్యదూ?" అన్నాడు రామ్‌కాశ్యప్ నవ్వుతూ, డాక్టర్‌వేపు చూపిస్తూ.

"సార్... నే వెళతాను. రేపొచ్చి చూస్తాను...." అని అంది లేడీ డాక్టర్.

"థాంక్యూ డాక్టర్" అని అన్నాడు రామ్‌కాశ్యప్.

లేడీడాక్టర్ ముందుకడుగేసింది. అదే సమయంలో బృంద–

"డాక్టర్" అనిపిలిచింది. తల వెనక్కితిప్పి వెనక్కొచ్చి– "ఏమిటమ్మా?" అని అడిగిందామె.

"ఫర్ యువర్ కైండ్ ఇన్‌ఫర్‌మేషన్... రేపు మీరు రావక్కర్లేదు. ఎందుకంటే అయామ్ ఆల్‌రైట్ కనుక. అంకుల్... ఏమిటీ హడావుడి అంతా–ప్లీజ్ లీవ్‌మి ఎలోన్" కొంచెం విసుగ్గా అంది.

ఆ సమయంలో సైకియాట్రిస్ట్ విశ్వనాథ్, రామ్‌కాశ్యప్‌వేపు ఒక్కసారి చూసి, లేడీ డాక్టర్‌తోసహా ఆ రూమ్‌లోంచి బాల్కనీలోకొచ్చారు.

పి.ఎ. రామావతారం కూడా కదలబోతుండగా–

"అమ్మా!" అంటూ ఆమెవేపు చూశాడతను.

"నిన్నేం జరిగింది నాకు ఆ సమయంలో మీరక్కడే వున్నారుకదా ఉన్నారా?" అడిగింది బృంద.

"నేనిక్కడే వున్నానుకదమ్మా! మీకు జ్ఞాపకంలేదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రామావతారం.

"మనం షూటింగ్‌కు రామప్పగుడికెళ్ళాం... తర్వాత హీరో... ఏం పేరు ఆయన పేరు" ఆ పేరును గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు అందామె.

"విమల్" అన్నాడు రామావతారం.

"విమల్‌తోపాటు, పంజాబీ దాబాకెళ్ళాను. అక్కడేం జరిగింది?" అక్కడేం జరిగిందో చెప్పొద్దన్నట్లుగా రామ్‌కాశ్యవ్ చూపులలతోనే సంజ్ఞ చేశాడు రామవతారానికి.

"అక్కడేం జరిగిందో తర్వాత చెప్తాడుకానీ, ముందు నువ్వు పాలు తాగి రెస్ట్ తీసుకో... ఓకె" అంటూ టీపాయ్ మీదున్న గ్లాసునితీసి అందించాడు రామ్‌కాశ్యవ్.

ఆ మరుక్షణం ఆ ఇద్దరూ అక్కడి నుంచి బయటికొచ్చేశాడు.

సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"మీతో ఫైవ్ మినిట్స్ మాట్లాడాలి" అంటూ తన పర్సనల్ విజిటర్స్ ఛాంబర్‌లోకి తీసుకెళ్లాడతన్ని.

డోర్ క్లోజ్ చేశాడు.

"బృంద బిహేవియర్ చూశారుగా. దీనికి ట్రీట్‌మెంట్ లేదా డాక్టర్" అడిగాడు రామ్‌కాశ్యవ్ తన సీట్లో కూర్చుని.

ఆయనెదురుగా వున్న సీట్లో కూర్చున్నాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్. టేబిల్ మీదున్న గుండ్రటి పేపర్‌వెయిట్‌ని తిప్పుతున్నాడు ఆలోచిస్తూ. ఆ పేపర్ వెయిట్‌కి నాలుగువేపులా నాలుగు కలర్స్ వున్నాయి. లైట్ అండ్ షేడ్స్‌కి అనుగుణంగా కలర్స్ మారుతున్నాయని.

రెండు మూడుసార్లు తిప్పాడతను.

తనవేపు గ్రీన్ వచ్చినప్పుడు రామ్‌కాశ్యవ్ వేపు రెడ్ కలర్ వస్తుంది. తనవేపు రెడ్‌కలర్ వచ్చినప్పుడు అతనివేపు గ్రీన్‌కలర్ వుంది.

విశ్వనాథ్ చెప్పడం ప్రారంభించాడు.

"కొంతమందికి ఫైర్ ఫోబియా వుంటుంది. మరి కొంతమందికి ఎయిర్ ఫోబియా... అంటే ఉప్పెనలాంటి గాలొస్తే వాళ్ళు ప్రాణభయంతో పారిపోతారు. ఇంకొంతమందికి డిజర్ట్ ఫోబియా... ఆ మధ్య మేగజైన్లో చదివాను. ఒక అమెరికన్ ప్రొఫెసర్, థార్ ఎడారిలోకెళ్ళాడు... ఎడారిలో క్రీవర్స్‌కి లైఫ్ రేట్ ఎక్స్‌పెరిమెంట్స్ కోసం అక్కడ అతను ఆ పరిశోధనల్లో వుండగా ఉప్పెనలాంటి గాలి వచ్చింది. అది గాలి కాదు, ఇసుక... కెరటాల్లా ఇసుక ఎగరడం, పెనువేగంతో మనిషిని ఢీ కొట్టడం అతనికి తెలీదు. ఆ ఇన్సిడెంట్‌ని చూసి తట్టుకోలేక అక్కడికక్కడే హార్ట్ ఫెయిల్యూరై చనిపోయాడు.

ఆ మధ్య ఓ అమెరికన్ లేడీకి వరసగా కలలొచ్చేవి. ఆ కలల్లో ఆలియన్స్ (ఇతర గ్రహవాసులు) రాత్రివేళల్లో ఆమె బెడ్‌మీద కొచ్చేవారు. ఆమెతో సంభోగించి వెళ్ళిపోయేవారు. ఆ కలలు ఆమెకు చాలాఇష్టంగానూ, ఆసక్తి దాయకంగానూ వుండేవి. ఆ కలలు ఆమెకు కొన్నాళ్ళపాటే వచ్చాయి. తర్వాత ఆగిపోయాయి. ఆ కలలు రావడం ఆగిపోయిన రెండో రోజున ఆమె చనిపోయింది.

కారణం ఏమిటి?

మనకు తెల్సిన ఇంకో సాధారణమయిన సంఘటనని చూద్దాం. సినిమాల్లో ఒక భయంకరమైన ఇన్సిడెంట్‌కి హార్ట్ ఫెయిల్యూరై చనిపోవడం తెలుసు. కొన్నేళ్ళ క్రితం బొంబాయిలోని మినర్వా టాకీస్‌లో ఒక హారర్ సినిమా విడుదలైంది. దానిపేరు ది సిమెట్రీ. పిల్లులు పగబట్టి మనుష్యుల్ని చంపుతాయి. ఆ సినిమాను వరుసగా పదిసార్లు చూసిన ఒక ప్రేక్షకుడు పదకొండోరోజున పిల్లిలా అరుచు కుంటూ, పిల్లిలా చేష్టలుచేస్తూ ఆ హాలుని ధ్వంసం చేశాడు. అతన్ని పోలీసులు అరెస్ట్‌చేసి తర్వాత మెంటల్ ఆస్పత్రిలో చేర్చారు.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే ప్రతి సంఘటన వెనుక పరోక్షంగా, ప్రత్యక్షంగా కారణాలుంటాయి. ఆ కారణాలు మనకు కనిపించవు. కారణాలకు జరిగిన తేదీలకు సంబంధంలేదు. ఆ సంఘటనలు నిన్న మొన్న జరిగి వుండాల్సిన అవసరంలేదు. ఎప్పుడో ఊహ తెలియనప్పుడు జరిగి వుండవచ్చు. లేదా నిన్న సాయంత్రం జరిగి వుండొచ్చు. అలాంటి కారణాలవల్ల బృంద ఈ రకంగా

ప్రవర్తిస్తోంది. సైకాలజికల్ ఫోబియా చిన్న సమస్య, దీన్ని సైకలాజికల్‌గానే మనం ట్రీట్ చేయాలి. ఆ ట్రీట్‌మెంట్ చేసే ముందు, మీరు నాకు కొన్ని విషయాలు స్పష్టంగా చెప్పాలి."

"అడగండి."

"బృందకు, మీకు మధ్యగల రిలేషన్ ఏంటో నాకు తెలియాలి." అలా అంటూ సూటిగా ఆయన ముఖంలోకి చూశాడు విశ్వనాధ్.

"అంత అవసరమా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రామ్‌కాశ్యప్.

"ఎస్."

"నో రిలేషన్ బిట్వీన్ అజ్... అంటే బ్లడ్ రిలేషన్ లేదని, ఆమెపట్ల నాకు కేవలం కృతజ్ఞత మాత్రమే వుంది."

"కృతజ్ఞత" భృకుటి ముడిచాడు విస్మయంగా విశ్వనాథ్.

"వెయ్యికోట్ల ఆస్తికి వారసులు మీరు, కృతజ్ఞతకోసం ఒకమ్మాయిని మీ ఇంట్లో వుంచుకుంటారా?"

"ఎస్!"

"ఆ కారణం తెలుసుకోవచ్చా?"

"మీరు ఆసక్తిగా అడుగుతున్నారా, లేక ఆమె ట్రీట్‌మెంట్‌కు అవసరమా?"

"రెండూనా" చిన్నగా నవ్వుతూ అన్నాడు విశ్వనాథ్.

"కూతురులాంటిది. లేదనుకుంటే కోడలులాంటిది...." ముభావంగా అన్నాడతను.

"సైన్స్‌పరంగా రెంటిమధ్యా చాలా డిఫరెన్స్ వుంది" అని అంటూ "అర్థమైందిలెండీ. మరీ డీటైల్స్ నాకవసరంలేదు. రెండో పాయింట్ ఆ అమ్మాయి మీకెన్నేళ్ళనుంచి తెలుసు?"

"కరెక్టుగా చెప్పాలంటే ఎనిమిది నెలలు."

"ఆర్యూ ష్యూర్."

"ఆ అమ్మాయి గతం మీకు తెలుసా?"

"తెలీదు."

"పెళ్లయిందా?"

"తెలీదు."

"నేటివ్ ప్లేస్?"

"దీనికి నా సమాధానం తెలీదే" నవ్వుతూ చెప్పాడు రామ్‌కాశ్యప్.

"నాకు మిగతా వివరాలేవీ అక్కర్లేదు. మీరు మీ అమ్మాయి కనిపించిన మొట్టమొదటి క్షణంలో ఆ అమ్మాయి ఎలా వుంది? డ్రెస్, ఫేస్ ఫీలింగ్స్, ఎట్సెట్రా."

రెండు సెకండ్లపాటు ఆలోచించాడు రామ్‌కాశ్యప్.

"జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పటల్... ఇంటెన్సివ్‌కేర్ యూనిట్లో వున్న నాకు ఆకస్మాత్తుగా మెలకువ వచ్చింది. కళ్ళిప్పాను. ఎదురుగా... ఎదురుగా ఆ వ్యక్తిని చూడగానే నాకు భయమేసింది. ఒక్క క్షణం కళ్ళు మూసుకొని తర్వాత కళ్ళు తెరిచాను. అప్పుడా వ్యక్తి నా ఎదురుగా లేదు."

"ఆ వ్యక్తి ఎవరు?"

"బృంద."

"కళ్ళిప్పగానే ఎందుకు భయమేసింది?"

"ఆ అమ్మాయి ముఖం వికృతంగా, అసహ్యంగా వుంది కాబట్టి."

ఆ జవాబుకి నిర్ఘాంతపోయాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్.

"తర్వాత...."

హాస్పిటల్‌లో ఆమె నాకు సపర్యలు చేసింది. ఫ్లయిట్ యాక్సిడెంట్‌లో గాయపడిన విషయం మీకు తెలుసు. మీరు హాస్పిటల్‌కి వచ్చి పరామర్శించారు కూడా" జ్ఞాపకం చేశాడు రామ్‌కాశ్వవ్.

"ఆ సమయంలో నాకు బృంద అక్కడ కనిపించలేదు" టక్కన చెప్పాడతను.

"నన్ను ఆదుకున్న ఆ అమ్మాయికి హెల్ప్ చేయాలనిపించి బొంబాయికి తీసుకెళ్ళి కాస్మోటిక్ సర్జరీ చేయించాను. తననుంచి ఏ వివరాలూ రాకపోవడంతో, నా ఇంట్లోనే వుంచుకున్నాను. ఆమెలో అద్భుతమైన హిడెన్ టాలెంట్ వుందని తెల్సుకుని సినిమా హీరోయిన్‌గా...." ఆగిపోయాడు రామ్‌కాశ్యవ్.

వాక్యం పూర్తిచేయలేదు.

"ఈ విషయం బృందకు తెలియకూడదు" డోర్‌వేపు చూస్తూ అన్నాడు.

అయిదు నిముషాలసేపు అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

"ఓ.కే. కాశ్యప్ సాబ్! ఆ అమ్మాయిమీద, టీనేజ్ సమయంలో లేదో, బాల్యంలోనో జరిగిన కొన్ని ప్రత్యక్ష విపరీత సంఘటనల ప్రభావం వుంది. అది ఆమె పర్సనల్ అనుభవమా, లేక పరోక్షానుభవమా అనేది ఆమె జీవితం కథ తెలిస్తే కానీ తెలీదు."

"హిప్నటైజ్ చేసి మీరు తెలుచుకోవచ్చనుకుంటాను" క్యాజువల్‌గా అన్నాడు రామ్‌కాశ్యప్.

"నాకు సైంటిఫిక్‌గా హిప్నాటిజమ్ గురించి తెలీదు."

"చాలామంది మీకు తెలిసిన వాళ్లుంటారనుకుంటాను."

"ఉన్నారు... కానీ కొంతమంది డబ్బుకోసం వాస్తును శాస్త్రంగా అమ్ముతూ ప్రజలనెలా భయభ్రాంతుల్ని చేస్తున్నారో, వీళ్ళూ అంతే... ఇంట్లో నాలుగు స్పీకర్స్ పెట్టి నువ్వొస్తున్నావు... నేవెళ్తున్నాను అంటే హిప్నాటిజమ్ అయిపోదు. వాళ్లు డాక్టర్లూ అయిపోరు. బృంద జీవితంలో జరిగిన కథను తెలుసుకుంటాను. రేపు మీకు ఫోన్ చేస్తాను" ఇంకో అపాయింట్‌మెంట్ వుండడంతో అక్కడనుంచి లేచాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్.

* * * * *

జూబ్లీహిల్స్‌లోని సినిమా ఆఫీసు...

ఫోటోగ్రాఫర్ తెచ్చిచ్చిన స్టిల్స్ చూస్తున్నాడు డైరెక్టర్ ప్రదీప్. మధ్య మధ్యలో వస్తున్న ఫోన్స్‌ని రిసీవ్ చేసుకుంటూ.

కొన్నింటిని సెలెక్ట్‌చేసి, "హాల్లో కూర్చున్న రిపోర్టర్‌కిచ్చెయ్. కొంచెం ప్రొమినెంట్‌గా వేయమని చెప్పు."

"వాళ్లకీ ఏవో గిఫ్ట్స్ ఇస్తామన్నారట" అన్నాడు ఫోటోగ్రాఫర్.

"ముందు మేటర్‌ని ఎక్స్‌క్లూజివ్‌గా కవర్ చెయ్యమను. గిఫ్ట్స్‌ని ఆడియో రిలీజ్ ఫంక్షన్ రోజున ఇద్దాం" చెప్పాడు ప్రదీప్.

"గిఫ్టులతోపాటు కవర్స్ వుంటాయా?" డౌట్‌గా అడిగాడతను.

"ఉంటాయి" చెప్పాడు ఫోటోగ్రాఫర్ స్టిల్స్ పట్టుకొని వెళ్ళిపోతుండగా, లోనికి ఎంటరైంది బృంద.

"నమస్తే!"

"గుడ్‌మార్నింగ్! షూటింగ్ లేదుగా, దేనికి పిలిచారు" అడిగిందామె సోఫామీద కూర్చుంటూ.

"యు ఆర్ ఎ లక్కీ గర్ల్... నిన్ను కల్సుకోవడానికి ఫైనాన్స్ కంపెనీ ఎమ్.డి. వస్తున్నాడు అందుకు."

"ఫైనాన్స్ కంపెనీ ఎమ్.డి... దేనికి?"

"ఏంలేదు... ఆయనేదో సినిమా తీస్తున్నాడట. లేడీ ఓరియంటెడ్ సబ్జక్టట" చెప్పాడు ప్రదీప్.

"డైరెక్టర్ ఎవరు?"

"తెలీదు... ఆ విషయమే నీతో ముందుగా చెప్దామని."

"నీకు మంచి ఫ్యూచరుంది. మన సినిమా రిలీజయ్యాక నువ్వు టాప్ పొజిషన్లోకి వెళతావని వూహించాను. కానీ అది ముందుగానే జరుగుతోంది... నువ్వు టాప్ పొజిషన్లోకి వెళ్ళాలంటే గుర్తుపెట్టుకోవాల్సిన విషయాలు కొన్నున్నాయి. చెప్తాను విను... ఒకటి మంచి బ్యానర్, రెండు మంచి ప్రొడ్యూసర్... మూడు... మంచి కథ... నాలుగు... మంచి డైరెక్టర్. బైదిబై కొత్త ప్రొడ్యూసర్‌తో మాట్లాడు. ఆ సందర్భంలో నన్ను డైరెక్టర్‌గా పెట్టుకోమని రికమెండ్ చెయ్. నా స్వార్థం నాది కదా...." అన్నాడు నవ్వుతూ.

"నాకేం తెల్సు... మీరే డిస్కస్ చేస్తే బావుంటుంది కదా!"

"ముందుగా నేను ఇన్‌వాల్వ్ కావడం బావోదు. ఎందుకంటే డైరెక్టర్ ఎవరో తెలీదు కదా! మన సినిమా మెయిన్ ప్రొడ్యూసర్ సుమంతరావు చెన్నైనుంచి వచ్చారు. హోటల్ గ్రీన్‌పార్క్‌లో వున్నారు. ఆయన్ని కల్సి వస్తాను" అని అంటుండగానే ఒక ఎనభై కేజీల భారీకాయం అందులో సగం కేజీల అల్పకాయం లోనికి ప్రవేశించాయి.

వాళ్ళిద్దరూ తమను తాము పరిచయం చేసుకున్నాక ప్రదీప్ ఆఫీసు నుంచి బయటికొచ్చేశాడు.

ఎనభై కేజీల భారీకాయం పేరు అమరేశ్వర్. సూట్ వేసుకున్నాడు వెదురు బద్దలతో చేసిన టోపీ, నలభై కేజీల కాయం పేరు శతాఘ్ని. ఇద్దర్నీ చూసి మనసులోనే నవ్వుకుంది బృంద.

"చెప్పండి" అంది బృంద.

"కొత్తగా వస్తున్న టాలెంట్స్‌ని పట్టుకోవడం నా హాబీ. నేను చిట్‌ఫండ్స్‌లో సక్సెస్ అవడానికి కారణం అదే... శతఘ్నిలోని టాలెంట్ చూశాక, అతని కోపమైనా ఒక సినిమా తీయాలనుకున్నాను. బడ్జెట్ ఫిల్మ్, మేం అనుకున్న కథ ప్రకారం హీరోయిన్‌గా మీరైతేనే సరిపోతారని ఫోటో చూసి అనుకొన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు. కాబట్టి మీరే సరిపోతారని కన్‌ఫర్మ్ చేసుకున్నాం" అన్నాడు అమరేశ్వర్.

"నా పేరు శతఘ్నిలోంకర్... బెంగాలీ. స్థిరపడింది మాత్రం అనకాపల్లి దగ్గర తుంపాలలో. పన్నెండు టీవీ సిరియల్స్ డైరెక్ట్ చేశాను. అందులో దూరదర్శన్‌లో ఒకటొచ్చింది. మిగతావి వివిధ ఛానల్స్‌లో వచ్చే సంవత్సరమో, రెండు సంవత్సరాల తర్వాతో రావచ్చు" చెప్పాడు శతఘ్ని.

"మీ రెమ్మునరేషన్ ఎంతో చెపితే...." అడిగాడు అమరేశ్వర్.

"ముందు కథ ఏంటో తెలుసుకోవాలిగా, స్టోరీ వుందా మీ దగ్గర?" అడిగింది శతఘ్నిని.

"అంటే?!"

"ఫైల్ లాంటిది."

"మీకు చెప్పాక... రాసుకోవచ్చు... డైలాగ్స్ కూడా ఎక్కువ వుండవు. ఇంట్రవెల్ ముందు రెండు. తర్వాత రెండు అంతే. ఆర్ట్‌ఫిల్మ్ అంటే కొన్ని రూల్స్ సక్రమంగా పాటించాలి కదా!"

"మొత్తం నాలుగు డైలాగులేనా?"

"అవును."

"ఏమిటో ఆ డైలాగులు? తెలుసుకోవచ్చా?" ఆసక్తిగా అడిగిందామె.

"ఒకచోట హీరో వేసిన ప్రశ్నకు హీరోయిన్ 'అవును' అని జవాబు చెపుతుంది. మరోచోట 'కాదు' అని చెపుతుంది. ఇంట్రవెల్ తర్వాత కూడా ఇవే డైలాగులు రిపీటవుతాయి."

"మరి కథెలా నడుస్తుంది?" నవ్వుతూ అడిగిందామె.

సరిగ్గా అదే సమయంలో హీరో విమల్ అక్కడకు ప్రవేశించాడు. విమల్‌ని చూడగానే వాళ్ళిద్దరూ దేవుడ్ని చూపినట్టు చూసి, నమస్కారాల మీద నమస్కారాలు చేసి–

"మీరూ వినండి సార్!" అంటూ శరమ్ని చెప్పడం ప్రారంభించాడు.

"ఒక పల్లెటూరు. వాటర్ ప్రాబ్లెమ్. ఎండాకాలంలో అయితే మరీను. బావులన్నీ ఎండిపోతాయి. ఊళ్ళో చెరువులేదు. ఊళ్ళో చెరువు తవ్వించాలని హీరో అందర్నీ సమీకరిస్తాడు. దానికి విలన్ ఎదురుతిరుగుతాడు. ఆ విలన్ కూతురు మాత్రం రహస్యంగా హీరోనే సమర్థిస్తుంది. స్ట్రగుల్ స్టార్ట్. ఓ అర్ధరాత్రి జనాన్ని పోగేసి హీరో చెరువు తవ్వడం ప్రారంభిస్తాడు. హీరోయిన్ తండ్రిని ఎదిరించిన హీరోతో చేతులు కలుపుతుంది.

చెరువు తవ్వడానికి చాలా కష్టపడతారు. తవ్వుతారు. కానీ నీళ్ళేలేవు. ఇక్కడ ఇంటర్వెల్... తర్వాత దగ్గరలో వున్న సముద్రం నుంచి నీళ్ళని తమ చెరువుకి పంపేటట్టు చేయమని కలెక్టర్‌ని కలుస్తాడు హీరో. అక్కడ నుంచి ప్రాబ్లెమ్ మళ్లీ స్టార్ట్.

చివరకు పెద్ద ఉద్యమం... రాస్తారోకోలు, ధర్నాలు జరిగాక ప్రభుత్వం సముద్రం నుంచి చెరువుకు నీళ్ళు పంపడానికి అంగీకరిస్తుంది. కాని ఆ ప్రజలు దురదృష్టవంతులు. అదే రోజు, రాత్రి భయంకరమైన భూకంపం. తవ్విన చెరువు మర్నాటికి వుండదు. ఆ ఊళ్ళోని ఇళ్ళన్నీ నేలమట్టమైపోతాయి. బండరాళ్ళ కిందపడి హీరోహీరోయిన్లు చనిపోతారు. ఒరిజినల్ కథ ఇది" ఆయాసపడుతూ చెప్పి, ఒపీనియన్ కోసం బృంద వేపు చూశాడు.

"సినిమాకేనా ఈ కథ...?" హీరో విమల్ అడిగాడు.

"ఏం ఫిల్మ్ కదండీ- పదిలక్షలే" అన్నాడు శతఘ్ని.

"కమర్షియల్ హిట్‌కి ఛాన్సెస్ వున్నాయంటారా...." అడిగింది బృంద.

"మీకూ, మాకూ అదే తేడా. ఇప్పుడొస్తున్న సినిమాలను తీసుకోండి... వరసగా ప్రేమ-ప్రేమ. బ్రేక్ ఇవ్వాలని నా సంకల్పం. ఎవరూ ఇవ్వకపోతే ఎలా? ఏదో చెరువు కదా- కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయా అని మీ డౌట్ - వుంటుంది. హీరో హీరోయిన్స్ చెరువుకి నీళ్ళొచ్చినట్టు ఊహించుకొని ఆ నీళ్ళల్లో తడుస్తూ పాట పాడతారు. అక్కడ సెక్స్ అప్పీల్ టెన్‌పర్సెంట్. ఫైట్స్ ట్వంటీఫైవ్ పర్సెంట్... 'చెరువులు తవ్వుతకోండిరా నరులారా చెరువులు తవ్వుకోండిరా' అని హీరో ప్రజల్ని ఉద్దేశించి పాడే పాట. అందులో గాంధీని, ఇందిరాగాంధీని, ఆఖరికి ప్రియాంకా గాంధీని చూపెడతాం. అంటే దేశభక్తి

టెన్‌పర్సెంట్. ఇంకా విలన్ దగ్గర వాంప్ డాన్స్... కమర్షియల్ ఎలిమెంట్ వచ్చేసిందిగా- ఏమంటారు?" అని అడిగాడు శతఘ్ని.

"మీరు అంగీకరించినట్టే కదా? మరి రెమ్మునరేషన్?" అంటూ సూట్‌కేస్ తెరిచాడు అమరేశ్వర్. అందులోంచి చెక్‌బుక్ తీశాడు.

"ఇప్పుడు వద్దులెండి- మా డైరెక్టర్‌గారితో మాట్లాడి వస్తాను" అంది బృంద.

"మేడమ్.... ఈ సినిమాలో నటించడానికి మీరొప్పుకొంటే రెండో సినిమాని మీ డైరెక్టర్‌గారితో తీస్తాను" అన్నాడు హుషారుగా అమరేశ్వర్.

"అయితే రేపు ఫోన్ చేస్తాను" అంది బృంద. ఇద్దరూ లేచి పదేపదే నమస్కారాలు పెట్టి బయటికెళ్ళిపోయారు.

నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నాడు హీరో విమల్.

"ఏంటీ... ఈ ప్రొడ్యూసర్ మీద మీ కామెంట్?" అడిగింది బృంద.

"ప్రతీవాడూ సినిమాలు తియ్యకుండా గవర్నమెంట్ కొన్నిరూల్స్ పెట్టాలి" అన్నాడు విమల్ చిరాగ్గా.

నవ్వింది బృంద. డైరెక్టర్ కోసం వచ్చాడు అతను.

రామావతారం రావడంతో ఆఫీసులోంచి బయటికొచ్చి కారెక్కింది బృంద.

* * * * *

ముంబాయి...

మడ్ ఐలండ్‌లో ఖరీదయిన బిల్డింగ్... దూరంగా సముద్రం, పెద్ద పెద్ద బిల్డింగుల్లా కనిపిస్తున్న లంగరు వేసిన షిప్పులు.

టెర్రస్‌మీద తిరుగాడుతున్న అరవింద్ లుంగీ, స్పోర్ట్ షర్ట్. వేసుకున్నాడు. పచ్చటి వెల్తురు మసక మసకగా అతనిమీద పడుతోంది.

ఎదురుగ టీపాయ్, దాని మీద రెడ్‌లిప్స్ ఫారిన్ విస్కీ బాటిల్ వుంది.

లోన రూమ్‌లోంచి గ్లాస్‌తో వచ్చిన వర్ష, విస్కీని గ్లాసులో పోసి షోడా కలిపి అతనికిచ్చింది.

సిప్ చేస్తూ మరో చేత్తో ఆమెను లాక్కొని పెదవులమీద ముద్దు పెట్టుకొని రెడ్‌లిప్స్ అంటే ఇవే అన్నాడతను. చిన్నగా నవ్వి విడిపించుకొని తనో గ్లాసులో విస్కీ పోసుకొని తాగుతోందామె.

పాతికేళ్ళ వర్ష అతని భార్య కాదు. టీ.వీ. నటి.

అప్పుడే సెల్ మోగింది. చేత్తో అందుకొని–

"అరవింద్ హియర్" అన్నాడతను గంభీరంగా.

అవతలి నుంచి గొంతు స్పష్టంగా విన్పిస్తోంది వర్షకు.

"ఆ బేల్‌పూరీవాలా రమేష్‌చంద్ హీరోయిన్‌ని ఫిక్స్ చేసేసుకున్నాడు. కమలాముఖర్జీని" చెప్పాడతను.

"హీరో ఎవరు?" అడిగాడు అరవింద్.

"షోయబ్‌ఖాన్."

"వాడికి చెప్పు.... కమాలాముఖర్జీని తీసేసి మన వర్షని పెట్టుకోమని...."

"కుదరదు. నా చేతుల్లో లేదు. నువ్వు డైరెక్టుగా ఎంటరైతే తప్ప పని జరగదు" అన్నాడతను.

"రమేష్‌చంద్ సెల్ నెంబరెంత?"

"చెప్పాడతను.

"నేను మాట్లాడతాను" అంటూ విసురుగా రమేష్‌చంద్ సెల్ నెంబరు నొక్కాడు.

రమేష్‌చంద్ లైన్‌లోకొచ్చాడు.

"రమేష్‌చంద్... మై అరవింద్‌రెడ్డి.'

"అరవింద్ సాబ్... చాలా రోజులకి ఫోన్‌చేశారు చెప్పండి."

"ఏంలేదు. నువ్వు సినిమా తీస్తున్నావుగా? హీరోయిన్‌ని మార్చెయ్. వర్ష అని మన కాండిడేట్ అన్ని రకాలుగా బాగా కోపరేట్ చేస్తుంది" అని నవ్వాడు.

"సారీ అరవింద్‌సాబ్! కమలాముఖర్జీ కూడా ఏమీ దాచుకోదు. చాలా కోపరేట్ చేసే మంచిపిల్ల. నేను ప్రామిస్ చేశాను. నెక్ట్స్ సిన్మాలో చూద్దాం."

"నీ ప్రామిస్ కంటే నా ప్రామిసే ముఖ్యం. వర్షాని హీరోయిన్‌గా పెట్టుకుంటే నార్త్ సైడ్ డిస్ట్రిబ్యూషన్ నేను తీసుకుంటాను. అడ్వాన్సుగా కోటిరూపాయలిప్పుడే పంపిస్తాను."

"లేదు భాయ్."

"సీరియస్‌గా చెపుతున్నాను."

"ఏం అరవింద్ బాయ్ బెదిరిస్తున్నావా? నీలాంటివాళ్లు నా దగ్గర పది మందున్నారు."

"నువ్వెక్కడున్నావ్?"

"నువ్వు నా దగ్గరికి వస్తావా?"

"ఎక్కడున్నావ్?"

"బాంద్రాలోని గెస్ట్‌హౌస్‌లో."

"నీ పక్కన ఎవరున్నారు?"

"ఎవరూలేరు."

"అబద్ధం చెప్పకు. నీ పక్కన కమలాముఖర్జీ వుంది అవునా?" అన్నాడు అరవింద్.

"నీకెలా తెల్సు?" అన్నాడు రమేష్‌చంద్ర.

"ఓకే! ఫిర్‌మిలేంగే...." అని ఫోన్ పెట్టేసి ఒక నెంబర్ని ప్రెస్ చేశాడు.

"విన్నీ టిక్కాహియర్!"

"విన్నీ... నేను అరవింద్‌ని! జాగ్రత్తగా విను. ఇప్పుడు టైము ఏడున్న రయింది. పది, పదిన్నరమధ్య రమేష్‌చంద్ర తెలుసుగా? బేల్‌పూరీ వాలా గెస్ట్‌హౌస్‌లోంచి కమలాముఖర్జీ బయటకొచ్చి కారెక్కుతుంది. ఆ కారులోని కమలాముఖర్జీ ఇంటికెళ్ళకూడదు. అండర్‌స్టాండ్...."

"అర్ధమయింది-ఓకే డన్. పదకొండు గంటలకు ఫోన్ చేస్తాను" అని ఫోన్ పెట్టేశాడు పేరుమోసిన రౌడీ విన్నీటిక్కా.

* * * * *

సరిగ్గా పదకొండు గంటలయింది.

నాలుగు పెగ్గులు తాగిన నిషాలో ఉన్నాడు అరవింద్. అతని ఒళ్ళో దాదాపు నగ్నంగా వుంది వర్షం.

ఆ సమయంలో సెల్ మోగింది. అందుకొన్నాడు అరవింద్.

"భాయ్... నేనే విన్నీటిక్కాని... ఖతమ్ హువా" అన్నాడతను హేపీగా.

"ఎలా?" ఆనందంగా అడిగాడు అరవింద్.

"కమల కారెక్కింది. బాంద్రా రైల్వేస్టేషన్ జంక్షన్‌లో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు కారాగింది. అప్పుడు వేసేసాం... స్పాట్‌డెడ్. డ్రయివర్ కూడా పోయాడు. ఇప్పుడేం చేయమంటావ్?"

"బాంద్రా పోలీస్‌స్టేషన్ కెళ్ళి సి.ఐ. చతుర్వేది ఉంటాడు. వాడికి లక్ష రూపాయలు ఇచ్చేసిరా" చెప్పి, సెల్ ఆఫ్‌చేసి మళ్ళీ రమేష్‌చంద్ర నెంబర్ ప్రెస్ చేశాడు.

"భాయ్... అరవింద్ భాయ్ ఇప్పుడే తెల్సింది. నువ్వింత సీరియస్‌గా వున్నావని నాకు తెలీదు. నా సినిమాలో హీరోయిన్ వర్షం. రేపు ఆఫీసుకు పంపించు. అగ్రిమెంట్ రాయంచుకుంటాను" అని భయం భయంగా అన్నాడతను.

"గుడ్! కొన్ని విషయాలలో జాగ్రత్తగా ఆలోచించటం చాలా అవసరం" అని సెల్ ఆఫ్ చేశాడు.

అతని ఒడిలో వున్న వర్ష ఎగిరిలేచి అతన్ని గట్టిగా కౌగలించుకొని–

"మై స్వీట్ డార్లింగ్! నేనంటే నీకు ఇంత ఇష్టమని నాకు తెలీదు" అందామె తన్మయత్వంగా.

"ఎవర్నయినా నేను రెండు నెలలకంటే ఎక్కువ ఎంటర్‌టైన్ చెయ్యను. వదిలించుకునే ముందు వాళ్ళకి లాభం చూపించడం నా హాబీ" అన్నాడతను సిగరెట్ వెలిగించుకుంటూ.

సరిగ్గా అప్పుడే గబగబా లోనికొచ్చాడు కిషోర్‌దాస్.

అతన్ని చూడగానే అక్కడినుంచి లోపలి రూమ్‌లో కెళ్ళిపోయింది వర్ష.

గబగబా గ్లాస్ తీసుకుని విస్కీని పోసుకుని తాగి. సిగరెట్ వెలిగించి అరవింద్ వేపు చూడసాగాడతను.

"రైన్ ఇన్ ది మిడ్‌నైట్ సినిమా మనకే వచ్చేసింది. ముఖ్యంగా హీరోయిన్ బృంద వివరాలు కనుక్కున్నాను. ఇండస్ట్రియలిస్టు రామ్‌కాశ్యప్ తెలుసా?"

"పేరు విన్నాను."

"అతనికి రిలేషన్. ఎలాంటి రిలేషన్‌నో తెలీదు. కాని ఫేసులో చిన్న మార్పు తప్ప అంతా మంజరే. నాకేదో అనుమానంగా వుంది."

"ఫోటో తెచ్చావా?"

"తెచ్చాను" అంటూ బృంద క్లోజప్ ఫోటో ఇచ్చాడు అరవింద్‌కి.

ఆ ఫోటోని చూడగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడతను. మళ్ళీ మళ్ళీ ఆ ఫోటో వేపు చూశాడు.

"నో డౌట్. ఇది బృంద కాదు మంజరే" దృఢంగా అన్నాడు అరవింద్.

"మంజరి మంటల్లో పడి చావటం మనం కళ్ళారా చూసాంకదా?" గబగబా పెగ్ తాగేసి అన్నాడతను.

విస్కీ గ్లాసు అందుకుని లేచి పచార్లు చేస్తూ కాసేపు ఆలోచించి–

"ఒక్కొక్కప్పుడు ఓవర్ కాన్ఫిడెన్స్ ప్రమాదాన్ని తెస్తుంది... దేన్నీ అశ్రద్ధ చేయకూడదు. ఒక విషయంలో నేను అశ్రద్ధ చేశాను అని ఇప్పుడు తెలుస్తోంది."

"ఏ విషయంలో?"

"ఆ అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎక్కువసేపు వుండకపోవడం" అన్నాడతను.

"నేనున్నాను కదా?"

"నువ్వుండడం వేరు... నేనుండడం వేరు."

"ఇప్పుడేం చేద్దాం?"

"ఆ బృంద, మంజరి అని అనుకుంటే, ఆ మంజరికి అన్నయ్య వున్నాడు. వాడ్ని మనం అప్పుడు బెదిరించాం. వాడు మహబూబ్‌నగర్ విడిచి పారిపోయేటట్టు చేసాం. ఇప్పుడు వాడెక్కడున్నాడు?" అడిగాడు అరవింద్.

"బరంపురంలో."

"ఏం చేస్తున్నాడు?"

"ఏదో బ్యాంక్‌లో... అడ్రెస్ నా డైరీలో వుంది...." చెప్పాడు కిషోర్‌దాస్.

"నువ్వోపనిచెయ్" అంటూ ఏం చెయ్యాలో అతనికి చెప్పాడు అరవింద్.

"ఎలాంటి వేషంలో వున్నా, అన్నయ్యను గుర్తుపట్టకుండా ఏ చెల్లెలూ వుండదుకదా?" అన్నాడు పెద్దగా నవ్వుతూ అరవింద్.

"అన్నా... నువ్వు క్రిమినల్‌గా పుట్టావుకానీ... నీ తెలివితేటల్ని ఇంకొకవేపు మళ్ళిస్తే నీకు పద్మశ్రీనో, పద్మభూషణో లేక రాజ్యసభ మెంబరుషిప్పో వచ్చేది."

"ఆ మూడోది అతి త్వరలో వస్తుందిలే...." అన్నాడు అరవింద్ దీమాగా.

*  *  *  *  *

"జూబ్లీహిల్స్‌లో... అపోలో ఆస్పత్రి... టెంపుల్ వుంది చూసావుగా, టెంపుల్‌కి వెళ్ళే గేట్‌కి అనుకుని వున్న రోడ్... రాత్రి పదిగంటల సమయం ఒక కారొచ్చి ఆగింది. ఆ కారులో హీరో, నువ్వు వున్నావ్. ఆశ్చర్యపోతూ నలువేపులా చూస్తున్నావు నువ్వు. కొంచెం ముందుకెళ్ళి ఎత్తయిన మేడ" అంటూ నడిచాడతను. నువ్వూ అతన్ని అనుసరించావు.

"ఇప్పుడిక్క డెందుకనే" నువ్వడిగావు.

"ఇక్కడ బ్రీజ్ బావుంటుంది అందుకు" అన్నాడతను. నిజంగానే అక్కడ బ్రీజ్ బావుంటుంది.

అయిదు నిమిషాలు గడిచాక-

"చూడు మంజరీ! దిల్‌షుక్‌నగర్ డాక్టర్ దగ్గరికి వెళ్ళమన్నాను వెళ్ళలేదు. పోనీ అనుకున్నాను. నేను తెచ్చిన టాబ్లెట్స్ వేసుకుంటే బావుండేది కదా?"

"బావుండదు ఎందుకంటే ఆ టాబ్లెట్స్ నా గర్భాన్ని నాశనం చేస్తాయని నాకు తెలుసు"

"అన్నీ తెల్సిపోయాయే" నవ్వుతూ అన్నాడతను.

"ఇలాంటప్పుడు నువ్వు బ్రతకడం అనవసరం." అని సిగరెట్ వెలిగించుకొన్నాడు హిరో." చెప్పాడు అపాడు డైరెక్టర్ ప్రదీప్.

డైరెక్టర్ ప్రదీప్, హీరోయిన్ బృంద, ఆ పక్కనే హీరో విమల్ కూర్చున్నారు. అపోలో ఆస్పత్రి, టెంపుల్ గేట్‌కి కొంచెం దూరంలో షూటింగ్ ఏర్పాట్లు అప్పటికే పూర్తయ్యాయి.

కెమెరామెన్ అరిచే అరుపులు విన్పిస్తున్నాయి.

వాతావరణం నిశ్శబ్దంగా, హాయిగా వుంది. కొంచెం దూరంలో వున్న బిల్డింగ్ విండోనుంచి ఎవరో ఆసక్తిగా ఆ షూటింగ్ చూస్తున్నారు.

"డైరెక్టర్‌గారూ... ఇక్కడ చిన్న విషయం చెప్పనా" అంది బృంద.

"చెప్పమ్మా" అన్నాడతను.

"హీరో హీరోయిన్లు కారులోంచి దిగుతారు. కానీ ఏవీ మాట్లాడుకోరు. దేవాలయంవేపు చూస్తాడు. మెట్లు మీద ఎవరో ఒక వ్యక్తి పడుకొని వుంటాడు. హీరో, హీరోయిన్‌ని ఎత్తయిన కొండమీదికి తీసుకెళ్ళి దూరంగా కన్పిస్తున్న గోల్కొండ కోటను చూపిస్తాడు."

"ఒకప్పుడు ఎంతో వైభవంగా వున్న ఆ కోట. ఇప్పుడు ఎలా అయి పోయిందో తెల్సా?" అని అంటాడు.

"ఎలా?"

"ఆ కోట ఒక శవంలా లేదూ?" అంటాడు. అతని భావుకత్వానికి ఆశ్చర్యపోయి అతని ముఖంలోకి చూస్తుందామె.

"శవం అంటే భయపడ్డావా" అని అడుగుతాడు అతను.

"నాకెందుకు భయం" అంటుందామె.

"అవును. మర్చిపోయాను. ఆ దిల్‌షుక్‌నగర్ డాక్టర్ దగ్గర కెళ్ళావా?"

"లేదు" అంటుందామె.

"ఏం" అని అడుగుతాడు హీరో.

"అబార్షన్ ఎందుకు? పాపో... బాబో.. పుడితే బాగుంటుందిగా."

"నీకు పుడితే బావుంటుంది. నాకు పుడితే బాగోదు" అంటాడతను సీరియస్‌గా.

"ఏమిటి నీ ఉద్దేశ్యం?"

"నువ్వు అబార్షన్ చేయించుకొని తీరాలి."

ఇద్దరూ కొండ పైభాగానికొస్తారు. కింద లోయ.

"నిన్నప్పుడు ఇక్కడనుండి తోసేస్తే... చచ్చిపోతావు.... ఆత్మహత్య చేసుకొని చనిపోయావని అందరూ అనుకొంటారు... నీకు అది ఇష్టమా?"

"అబార్షన్ చేయించుకోమని నువ్వెప్పుడయితే బలవంతం చేశావో, అప్పటి నుంచి నామీద అతి ప్రేమను చూపిస్తున్నావు. ఆ విషయం నేనెప్పుడో గ్రహించాను. ఇక్కడికి వచ్చేముందు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి వచ్చాను" అందామె.

"సరిగ్గా ఆ సమయంలో ఆ రోడ్‌లోకి ఒక పోలీస్ జీప్ ప్రవేశించింది. ఆ జీపును చూడగానే అతను తత్తరపడ్డాడు."

"మంజరీ... నిన్ను టెస్టు చేయడానికి అన్నాను... నేనంటే నీకెంత ప్రేమో నాకు తెలీదా... డోంట్ టేక్ సీరియస్... పద వెళదాం... గోల్కొండం హోటల్‌కెళ్ళి డిన్నర్ చేసి, నిన్ను డ్రాప్ చేస్తాను" ఇద్దరూ నడుచుకొంటూ కారు దగ్గరకొచ్చి కారెక్కారు.

కారుస్టార్టయి నెమ్మదిగా ముందుకెళ్ళిపోయింది. రోడ్డు పక్కన ఆగిన జీపులోని సి.ఐ. వాళ్ళిద్దరివేపూ చూస్తూనే వున్నాడు.

"ఇదీ జరిగిన ఇన్సిడెంట్ మీరేమో ఏదేదో అంటున్నారు" అంది బృంద.

రెండుసార్లు కరెంట్‌షాక్ తిన్నవాడిలా అయిపోయాడు డైరెక్టర్ ప్రదీప్. కాసేపయ్యాక తేరుకొని. తన చేతిలో వున్న ఫైల్‌లోని పేపర్సుని తిరగేస్తూ–

"రైటర్ సూర్యవంశీ ఇలా రాయలేదు" అన్నాడు.

"యదార్ధగాథ అన్నారు.... మరి రియలిస్ట్‌గా వుండాలిగా."

"యు ఆర్ కరెక్ట్... కానీ సినిమా అన్నాక కొన్ని మార్పులు తప్పవుగా" అన్నాడు ప్రదీప్.

"నేను లైఫ్ గురించి చెప్తున్నాను" అంది బృంద.

"అంటే... జరిగిన సంఘటన" మధ్యలో కలుగజేసుకుంటూ ఆశ్చర్యంగా అడిగాడు హీరో విమల్.

"అంటే మీకు తెలియదనే కదా అర్థం... నాకు తెలుసో తెలియదో."

"ఛీఫ్‌గెస్ట్ జయభూషణ్‌గారు వచ్చేశారు కాబట్టి ఈ నవ్వుల ప్రోగ్రామ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నాను" అని పక్కకు తప్పుకుంటున్న దశలో–

దాదాపు ఆరడుగుల పొడవు భారీ విగ్రహం కళ్ళకు రేబాన్ గ్లాసెస్, కుర్తా... పైజామా... భుజంమీద కండువాతో అందరికీ నమస్కరిస్తూ లోనికి అడుగుపెట్టాడతను.

నిర్మాత డైరెక్టర్‌తో అతన్ని ఆహ్వానించి వేదికమీదకు తీసుకెళ్ళాక పొగడ్తయ్యాక "నేడే విడుదల" సినిమా పాటల కాసెట్‌ను ఆవిష్కరించి తలకో కాసెట్ ఇచ్చారు.

జయభూషణ్ ఎంటరైన దగ్గర్నించీ అతనివైపే కళ్ళప్పగించి చూస్తోంది బృంద. క్యాసెట్‌ని తనకిచ్చినప్పుడు పరిశీలనగా అతని ముఖంలోకి చూసింది. అదే సమయంలో జయభూషణ్ కూడా ఆమె ముఖంలోకి చూశాడు. ఆ ముఖాన్ని తనెక్కడో చూసినట్టుగా అన్పించింది కానీ, పెద్దగా పట్టించుకోలేదు.

కానీ బృంద చూపులన్నీ అతనిమీదే వున్నాయి.

అందరికీ క్యాసెట్స్ ఇచ్చాక అతనుపన్యాసం ప్రారంభమైంది.

"మా రాజకీయ నాయకులకు ఇలాంటి ఫంక్షన్లకు రావడం సరదాగా వుంటుంది. ఎందుకంటే పొలిటికల్ మీటింగ్స్‌లో మేం ఆడేవన్నీ అబద్ధాలే. ఆ సంగతి అందరికీ తెలుసు. ఇలాంటి సభల్లో అబద్దాలకి చోటులేదు. అతని అంటూ 'నేడే విడుదల' సినిమాలోని పాటల క్యాసెట్‌ని విన్నాను. పాటలన్నీ బావున్నాయి. కథ చాలా సంచలనాత్మకమైన రియల్‌స్టోరీ అని విన్నాను. మంచి కథలు రావాలి. ముఖ్యంగా స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల నేపథ్యంలో కథలు వస్తేనే బావుంటుంది."

కొత్త హీరోయిన్‌నిపెట్టి తీస్తున్న సినిమా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను" చెపుతూ అందరికీ నమస్కారంపెట్టి సెలవు తీసుకుని బయటకు వెళ్ళిపోయారు జయభూషణ్. మీటింగ్ అయిపోవడంతో అందరూ లేచారు.

గబుక్కున బృంద స్టేజీ దిగిపోయి, చుట్టూ జనంతో వెళుతున్న అతనివేపు పరిగెత్తింది. జనాన్ని తప్పించుకుని వెళ్ళేలోగా జయభూషణ్ కారెక్కి వెళ్ళిపోయాడు. బృంద అలా వెళ్ళటాన్ని ఒకే ఒక వ్యక్తి చూశాడు. ఆ వ్యక్తి రచయిత సూర్యవంశీ.

మరో అరగంట తర్వాత–

తన రూంలో వుంది బృంద.

జయభూషణ్ ఇంతకు పూర్వం తనకు తెలుసు. ఎలా.... ఎక్కడ కల్సుకున్నది అతన్ని...?

ఆలోచిస్తోందామె.

సరిగ్గా సమయానికి ఫోన్ మోగితే కార్డ్‌లెస్ అందుకుంది.

"బృందా....! నేనమ్మా... రామ్‌కాశ్యప్ అంకుల్ని... ఏం చేస్తున్నావ్... ఫంక్షనైపోయిందా... ఇవాళ షూటింగేం లేదుగా?"

"లేదంకుల్."

"ఈవెనింగ్ నీ కాల్షీట్ కావాలి నాఉ ఇస్తావా?'

"ఏంటంకుల్. మీరు నన్ను టైమ్ స్పేర్ చేయమని అడగడం ఏంటి? చెప్పండి?"

"చెప్పను... నిన్ను సడన్‌గా సర్‌ప్రైజ్ చేయాలని... కరెక్ట్‌గా ఏడు గంటలకు రెడీగా వుండు... నేనొస్తాను" చాలా హేపీగా చెప్పి, ఫోన్ పెట్టేశాడు రామ్‌కాశ్యప్.

రామ్‌కాశ్యప్ గొంతులోనూ, మాటలోనూ ఏదో వ్యత్యాసం వున్నారాయన, ఎందుకో, కారణం ఏమైవుంటుంది?

జయభూషణ్ వివరాలు కనుక్కోవాలి. మధ్యాహ్నం రెస్ట్ తీసుకొనే ముందు అనుకొంది బృంద.

* * * * *

రాత్రి ఏడు అయిదు నిమిషాలైంది.

పోర్టికోలో కారు ఆగగానే ఆ కారుకోసమే వెయిట్‌చేస్తున్న బృంద మేడమెట్లు దిగి పోర్టికోలోకెళ్ళింది.

"హాయ్... కమాన్...." స్టీరింగ్ దగ్గర కూర్చొన్న రామ్‌కాశ్యప్ చాలా ఉల్లాసంగా వున్నాడాయన.

ఓరకంటితో బృంద అలంకరణ వేపు చూసి కారు స్టార్ట్ చేశాడు ఆయన.

క్రీమ్ బ్లాక్ కాంబినేషన్‌లో రబ్బర్ ప్రింటెడ్ కాటన్‌శారీ, బ్లాక్ కలర్ జాకెట్, నుదుటున చిన్న బొట్టు, చేతులకు ఎర్రటి గాజులు, గోళకు నైల్‌పాలిష్... మెడలో ఒంటిపేట గోల్డ్‌చైన్, పెదవులకు లిప్‌స్టిక్...

మర్వలెస్ బ్యూటీ...

"అందంతోపాటు కరుణ, మమత అన్నీ వున్నాయి బృందలో" అనుకున్నాడతను.

"ఏంటంకుల్... ఇవాళ మీరే డ్రైవ్ చేస్తున్నారు...? డ్రైవర్ లేడా?"

"ఉన్నాడు. కొన్ని సందర్భాల్లో మన కారుని మనమే డ్రైవ్ చేసుకోవాలి... జీవితంలాగే...." నవ్వాడాయన.

"ఎక్కడికి అంకుల్?" అడిగింది బృంద.

కారు సికింద్రాబాద్ మెయిన్ రోడ్ దగ్గర మలుపు తిరిగి జీడిమెట్ల రూట్‌లో వెళుతోంది.

"చెప్పానుగా. సస్పెన్స్ అని."

"మీరు సస్పెన్స్ కబుర్లు చెప్పడం ఎప్పటినుంచి నేర్చారు...?" నవ్వుతూ అడిగిందామె.

"నాలో ఏదయినా మార్పు కనిపిస్తోందా నీకు?" అడిగాడాయన.

"అవును."

"మా ఆవిడ బతికున్న రోజుల్లో నేనెప్పుడు హేపీగా ఉంటానో, మూడీగా వుంటానో తెలీక... నా ఫేస్ ఫీలింగ్స్ మొదట అబ్జర్వ్ చేసేది" అన్నాడు నవ్వుతూ.

వాళ్ళావిడ గురించి బృందతో మాట్లాడడం అదే మొదటిసారి రామ్‌కాశ్యప్.

"ఏంటీ... ఆంటీని గుర్తుచేసుకుంటున్నారు సడన్‌గా?" అని అడిగిందామె.

తలతిప్పి బృంద వేపు ఒకసారి చూసి–

"కరెక్టేకదూ... ఎందుకు గుర్తుచేసుకుంటున్నానో కాసేపయ్యాక నీకే తెలుస్తుంది...." కారు విశాలమైన రోడ్‌మీద పరుగెడుతోంది.

అరగంట తర్వాత–

రోడ్డుకి ఎడమవేపున ఉన్న పెద్ద ఫార్మ్‌హౌస్‌లోకి వెళ్ళింది.

చుట్టూ వందలాది పూలమొక్కలు. దూరంగా స్విమ్మింగ్‌ఫూల్... పోర్టికో ముందు పాలరాతి శిల్పం!

అప్పటికే పోర్టికోలో ఆగిన వెరైటీ కార్లవేపు చూస్తోంది ఆశ్చర్యంగా బృంద.

పోర్టికోలోంచి విశాలమైన హాల్లోకి నడిచారు.

హాల్లో పెద్ద షాండిలీర్... అక్కడక్కడ నుంచున్న ఆడ–మగ వ్యక్తులు యాభైమందివరకూ వున్నారు.

సోఫా మీద కూర్చోమని చెప్పి ముందుకు నడిచి, ఒకోవ్యక్తి దగ్గర కెళ్ళాడు.

రామ్‌కాశ్యమ్‌ను చూడగానే ఆ వ్యక్తి ఎవరితోనో మాట్లాడుతున్న మాటల్ని కట్‌చేసి.

"మీరు లేటయ్యారేంటి?" అన్నాడు.

"ఒన్ మినిట్...." అంటూ ఆ వ్యక్తి కుడిచేతిని పట్టుకుని సోఫా మీద కూర్చున్న బృంద దగ్గరకు తీసుకొచ్చాడు.

ఆ వ్యక్తిని చూడగానే బృంద లేని నుంచుంది. ఆ వ్యక్తి దాదాపు పొడవున్నాడు. కర్లిగ్ హెయిర్... గోల్డ్ ఫ్రేమ్ గ్లాసెస్... పొడవాటి ముక్కు... లోతైన కళ్ళు... చిన్న గెడ్డం... తెల్లటి పాలరాతి వంటి శరీరం... స్లిమ్‌గా, స్లీక్‌గా వున్నాడతను.

"షి ఈజ్ బృంద...." పరిచయం చేశాడు రామ్‌కాశ్యప్.

"అయామ్ అనంత్ కాశ్యప్... సన్ ఆఫ్ రామ్‌కాశ్యప్...." అంటూ నవ్వాడు అనంత కాశ్వప్.

అనంత్ కాశ్యప్... రామ్‌కాశ్యప్ కొడుకు!

అతను వస్తున్న విషయం కనీసం, తనకెందుకు చెప్పకుండా దాచా యాడన? ఇందుకేనా?

"కమాన్...." అంటూ ముందుకు నడిచి, మేడమీద ప్రత్యేకంగా వీ.వీ.ఐ.పి. గెస్టులకోసం ఏర్పాటుచేసిన టేబుల్ దగ్గరకు తీసుకెళ్ళాడు అనంతకాశ్యప్.

బృంద, రామ్‌కాశ్యప్ కూర్చున్నాక–

దూరంగా ఉన్న సర్వర్‌ని పిలిచి, అతని ట్రేలో ఉన్న టిన్ కూల్ డ్రింక్‌ని ఇద్దరికీ యిచ్చి–

"ఫైన్‌మినిట్స్‌లో వస్తాను డాడ్...!" అంటూ మెట్లు దిగి కింది కెళ్ళాడు అనంతకాశ్యప్.

"అమెరికా నుంచి అనంత్ ఎప్పుడొచ్చినా, వాడికోసమే ప్రత్యేకంగా కట్టించిన ఈ గెస్ట్‌హౌస్‌లోనే వుంటాడు. వచ్చిన ప్రతిసారీ... ఫ్రెండ్స్ అందర్నీ కల్సి పార్టీ ఇవ్వడం వాడికలవాటు. ఈ వారంలోజులూ రోజుకో బ్యాచ్. మా అబ్బాయి ఎలా వున్నాడు? నచ్చాడా?" చిలిపిగా అడిగాడు రామ్‌కాశ్వప్.

ఆ ప్రశ్నకు చాలా వింతగా వుంది బృందకు.

"కారులో మీ ఆనందానికి కారణం ఇదన్నమాట! ఎప్పుడొచ్చారాయన?"

"నిన్న రాత్రి. నా ప్రశ్నకు జవాబు చెప్పమ్మా!"

"వెరీ క్యూట్...." అంది బృంద.

అయిదు నిమిషాల తర్వాత గబగబా వచ్చి వాళ్ళకెదురుగా కూర్చుంటూ– "డాడ్... ఇక్కడెవరైనా సినిమా యాక్టర్ వున్నారా? మా ఫ్రెండ్స్ అడుగుతున్నారు. ఏదో సినిమా మాగజైన్‌లో చూశార్ట."

"అవును చెప్పడం మర్చిపోయాను. షి ఈజ్ సినిమా హీరోయిన్ వండ్రఫుల్ ఆక్ట్రెస్! ఫస్ట్‌ఫిల్మ్ అతి త్వరలో విడుదల" చెప్పాడు రామ్‌కాశ్యప్.

"అదా క్రేజీ... అమెరికాలో క్రేజీ వుండదు. రెస్పెక్ట్ వుంటుంది" అన్నాడు తనొక కూల్‌డ్రింక్ టిన్ తీసుకుంటూ.

ఎవరో పలకరించడంతో రామ్‌కాశ్యప్ కింద హాల్లోకెళ్ళాడు.

అనంత్ కాశ్యప్ వేసే చూస్తోంది బృంద. మగవాళ్ళలో ఆ సున్నితత్వం చాలా అరుదుగా కన్పిస్తుంది.

"ఆ మధ్య ఫోన్ చేసినప్పుడు డాడీ చెప్పారు. ఐ లైక్ మీటింగ్స్ విత్ ష్యూ పీపుల్స్... న్యూ అట్మాస్ఫియర్... మీకే ఫిలాసఫీ ఇష్టం?"

"ఫిలాసఫీ... ప్రత్యేకంగా ఇష్టాలేమీ లేవు. ఐటూ లైక్ ఫిలాసఫీ!!"

"ఐ లైక్ ఇండియన్ ఫిలాసఫీ! ముఖ్యంగా కర్మసిద్ధాంతం... లక్– బేడ్ లక్... పవర్... విల్‌పవర్... మనీ ఫేమ్... లైఫ్‌లో ఏదయినా పూర్వజన్మ సుకృతంవల్లే కలుగుతాయని నా నమ్మకం. అందం కూడా అంతే!" అన్నాడతను.

"అంటే...." తనని పొగుడుతాడేమోననుకొంది బృంద.

"అంటే... రోజ్‌ఫ్లవర్‌ని తీసుకోండి. ఎన్ని రెక్కలు... ఎన్ని మడతలు... ఎంత బావుంటుంది! దానికి సువాసన ఎలా వచ్చింది? మనం ఆర్టిఫిషియల్‌గా గులాబీల్ని తయారు చెయ్యగలం. సెంట్స్‌కని తయారు చేయగలం కానీ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌లోంచి సువాసనను సృష్టించలేం! దట్స్ కాల్డ్ గాడ్ క్రియేషన్... అలాగే మనుషులు."

దూరం నుంచి చూస్తే వాళ్ళిద్దరూ ఫిలాసఫీ గురించి మాట్లాడుకుంటు న్నారని ఎవరూ అనుకోరు. రామ్‌కాశ్యప్ దూరంగా వెళ్ళిపోయింది వాళ్ళిద్దరి ఏకాంతం కోసమే!

"ఫిలాసఫీ తర్వాత మీకిష్టమైన సబ్జెక్?"

"బుక్స్...." చెప్పింది బృంద.

"లేటెస్ట్ బుక్స్ ఏం చదివారు?"

"మోర్ పార్టీ జోక్స్" చెప్పింది బృంద.

"వెరీగుడ్ జోక్స్."

"యాక్టింగ్‌లో పడ్డాక.. .ఐ హేవ్ నో టైమ్ టు రీడ్."

"నేను కొత్త బుక్స్ చదువుతాను. అమెరికాలో నా లైబ్రరీ చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. బుక్స్ తర్వాత నాకు ట్రెక్కింగ్ ఇష్టం... అయామ్ మెంబర్ ఇన్ ట్రెక్కింగ్ క్లబ్... ఇన్ న్యూయార్క్...

బాయ్‌ని పిలిచి ట్రేలో వున్న రెండు గ్లాసుల్ని అందుకున్నాడు బృంద చేతికి ఒక గ్లాసును అందించి, తనొక గ్లాసును తీసుకొని సిప్‌చేసి

"షాంపైన్‌లో సోడా వెయ్యకూడదు తెలీదు కదా! ఇక్కడి డ్రింక్స్ అనుకొని ఎవరో వేసినట్టున్నారు...." అని అన్నాడు.

"తీసుకోండి."

"ఫస్ట్‌టైమ్" అంది బృంద మొహమాటంగా. సరిగ్గా అదే సమయంలో అక్కడికి కొచ్చాడు రామ్‌కాశ్యప్.

"మొహమాటం ఎందుకు. పార్టీల్లో డ్రింక్ తప్పదు" అన్నాడాయన తన చేతిలోని డ్రింక్‌ను సిప్‌చేస్తూ.

సిప్‌చేసి గ్లాసు పక్కన పెట్టింది బృంద.

అనంత్ కాశ్యప్ సీట్లోంచి లేచి వేరే టేబిల్ దగ్గరకెళ్ళాడు.

"ఏమంటాడు మా వాడు...." అడిగాడు రామ్‌కాశ్యప్.

"నైస్‌మేన్" అంది బృంద.

"నైస్‌మేన్ ఏంటి... వెరీగుడ్‌మేన్. చాలా జాలీగా వుంటాడు. ఎట్మాస్ఫియర్‌నీ అలాగా వుంచుతాడు. కొన్నికోట్ల బిజినెస్‌ను డీల్ చేస్తున్నా, ఆ విషయాలు కానీ, ముఖంలో అలసట కానీ కన్పించదు. చూశావా... దట్స్ కాల్డ్ ఎంటర్‌టయినర్ షిప్" పొంగిపోతూ అన్నాడు రామ్‌కాశ్యప్.

నలభై నిమిషాలు గడిచాయి. మధ్యమధ్యలో వచ్చి మాట్లాడి వెళుతున్నాడు. అనంతకాశ్యప్. డిన్నర్ పూర్తయ్యాక గెస్టులందరూ వెళ్ళిపోయాక–

"ఓ.కె... అనంత్ వెళ్తాను. రేపు ఆఫీసుకొస్తావా, ఇంటికొస్తావా?"

"రేపు ఇంట్లో లంచ్ అన్నాడు కదా... పది గంటలకు ఆఫీసుకొస్తాను. తర్వాత లంచ్‌కి ఇంటికెళదాం" అన్నాడు అనంత్ వాళ్లిద్దరితో పాటు కారు వరకూ వచ్చి.

"ఫ్రెండ్స్ వచ్చారని మిస్‌చేస్తే కుదరదు" కారెక్కుతూ అన్నాడు రామ్‌కాశ్యప్.

"ఛ...ఛ... ఐ డోంట్ మిస్ బృందా! మనందరం కలిసి లంచ్ తీసుకొందాం" అన్నాడు అనంత్.

"అలాగే" అంటూ కారెక్కింది బృంద.

హిందూ పద్ధతిలో అనంత్ కాశ్యవ్ చేసిన నమస్కారానికి ముగ్ధురాలైంది బృంద.

కారు సిటీలోకి ఎంటరయ్యేవరకూ ఏం మాట్లాడలేదు రామ్‌కాశ్యప్. ఆ తర్వాత ఒక ప్రశ్న వేశాడతను.

"బృందా... అనంత్ మీద నీ అభిప్రాయం ఏమిటి... నీకు నచ్చాడా?"

ఆ ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు బృందకు.

* * * * *

మహబూబ్‌నగర్...

రామావతారం మెయిన్ రోడ్‌లోనూ, ఆ పరిసర ప్రాంతాల్లోనూ వున్న బట్టలషాపు లన్నింటిలోనూ బృందకు చెందిన చీరను చూపించి "ఈ చీర ఎవరు కొన్నారో చెప్పగలరా?" అని అడిగితే చాలామంది ఆశ్చర్యంగా చూశారు. మరి కొంతమంది పిచ్చివాడనుకొన్నారు. లాండ్రీషాపుల్లో అడగడం ప్రారంభించాడు. ఒక లాండ్రిషాపు వ్యక్తి మాత్రం.

"ఊరికి ఉత్తరంలో ఒక చెరువుంది. రజకులందరూ బట్టలు వుతికేది అక్కడే. వివరాలు తెలిస్తే వాళ్ళకే తెలుస్తాయి" అని సలహా చెప్పడంతో ఆ రాత్రి అక్కడే వుండిపోయాడతను.

మర్నాడుదయాన్నే ఆ చెరువు దగ్గరకెళ్ళాడు.

దాదాపు ఏభైమంది ఆడ, మగ అక్కడున్నారు. ఒక్కొక్కరికి చీర చూపించ సాగాడు.

"అయ్యా! ఈ చీరను నేనుతికినట్టుంది" అని ఒకావిడ అనడంతో రామావతారంలో అంతవరకు వున్న నిరాశ, నిస్పృహ మాయమయిపోయాయి.

"బాగా జ్ఞాపకం తెచ్చుకొని చెప్పమ్మా" అంటూ ఒక చెట్టుకింద కూర్చుని అడిగాడు.

"మూడేళ్ళకింద అనుకొంటాను బాబూ! జెండా వీధిలోని ఓ ఇంట్లో వాళ్ళు ఆ చీరను వేశారు. ఈ పువ్వుల చీర నాకెందుకు గుర్తుండిపోయిందంటే, ఈ చీరమీద రక్తపు మరకలున్నాయి.

ఒక్క మరక కూడా లేకుండా చెయ్యమని, ఆ వేసినావవిడ నాకు అయిదు రూపాయలు ఎక్కువ ఇచ్చింది" చెప్పిందామె.

"రక్తపు మరకలు... అంటే దేనికి సంబంధించినవి?" ప్రశ్నించాడు రమావతారం.

"ఏమో... ఏక్సిడెంట్‌లో దెబ్బ తగిలిందేమో... ఆ టైమ్‌లో ఆవిడ ఆ చీర కట్టుకొందేమో."

"ఆవిడను నువ్వు చూశావా?"

"చూశాను."

"ఎంత వయసుంటుంది?"

"ఇరవై ఏళ్ళుంటాయి."

"ఇప్పుడు ఆవిడెక్కడుంది. ఆ ఇంట్లోనేనా?"

"తెలీదు."

"ఆ ఇల్లు నాకు చూపించగలవా?"

"అలాగే!"

అరగంట తర్వాత కారులో జెండా వీధిలోకొచ్చాడు. రామావతారం, ఆ రజక స్త్రీని తీసుకుని.

ఆమె ఆ వీధిలోని ఇంటిని చూపించింది. ప్రస్థుతం ఆ ఇంటిలో ఎవరూ లేరు. పడగొట్టి ప్లాట్స్ కడుతున్నారు. మూడేళ్ళక్రితం ఎవరున్నారో ఎవరికీ తెలీదు.

తన దగ్గరున్న ఫోటోను ఆ రజక స్త్రీకి, మిగతా వాళ్ళక్కూడా చూపించాడు. తను చూసిన అమ్మాయి ఆమె కాదు.

"గుడిలో అడగండి. ఆ గుడిలో పూజారి చాలా ఏళ్ళనుంచి అక్కడే వుంటున్నాడు."

"గుడ్ ఐడియా!"

రామావతారం పూజారిని కలిసి మూడేళ్ళక్రితం ఆ ఇంట్లో ఎవరుండే వారో? అడిగాడు.

యశోద కొడుకును, చెల్లినీ చదివించుకుంటూ వుండేది. తను ఆజంజాహి మిల్స్‌లో టైపిస్ట్‌గా పనిచేసేది.

వెంటనే ఫోటోతీసి చూపించాడు రామావతారం.

"చూపినట్టుగానే వుంది. నాకు యశోద మాత్రం బాగా తెలుసు. ఈ అమ్మాయి యశోద చెల్లెలేమో హైదరాబాద్‌లో చదువుకుంటూ వుండేది కదా... అసలు వాళ్ళది ఈ వూరు కాదనుకుంటాను."

"ఏ వూరు?" వెంటనే అడిగాడు రామావతారం.

"నారాయణపాలెం" చెప్పాడతను.

"ఇక్కడికెంత దూరం?"

"అక్కడికెళితే ఏమైనా తెలుస్తుందంటారా?"

"ఇంకేం తెలియాలి మీకు?"

"ఆ యశోద... ఆ కొడుకు."

"వాళ్ళ గురించి... వాళ్ళు అప్పుడే ఫైర్ ఆక్సిడెంట్లో చనిపోయారు ఈ పిల్ల కూడా చనిపోయిందని అనుకున్నారు."

అతనికి కృతజ్ఞత చెప్పి కారెక్కాడు రామావతారం. రజక స్త్రీకి రెండు వందలిచ్చి మళ్ళీ కలుస్తాననిచెప్పి, నారాయణపాలెం వెళ్ళాడు.

అది మూడువేలు జనాభా కలిగిన గ్రామం.

ఊరి మధ్యలో కోటలాంటి ఇల్లు.

చిన్న టీ బడ్డీముందు కారాపి, అక్కడున్న బెంచీమీద కూర్చుని టీ అడిగి కోటలా కన్పిస్తున్న ఇంటివారి వివరాలు అడిగాడు.

"ఎవరిదా ఇల్లు?"

"ఆ టీ బడ్డీ ఆసామీ విచిత్రంగా రామావతారం వేపు చూసి–

"తెలీదా! ఊరికి కొత్తా?" అని అడిగి" ఎవరికోసం వచ్చారు?" అని అడిగాడు.

"చిన్న వివరం చెప్తావా...?" అంటూ తన జేబులోని ఫోటోతీసి చూపించాడు రామావతారం.

"ఈ అమ్మాయి వివరాలు కావాలి. తెలుసా?"

ఆ ఫోటోవేపు చూశాడతను.

"నువ్వు పోలీసోడివా?" అడిగాడతను.

కాదని చెప్పాడు రామావతారం.

"పోలీసోడివి అయినా కాకపోయినా ఈ వూళ్ళోకొచ్చి ఇలాంటి వివరాలు అడక్కూడదు. అడిగినా ఎవరూ చెప్పరు. విరూపాక్షనాయుడు గారికీ విషయం తెలిస్తే... నువ్వు, నీ కారు ఇక్కడే సమాధి అయిపోతారు.

ఒకప్పుడు వాళ్ళ తమ్ముళ్ళు వున్నప్పుడు నీలాంటివాళ్ళు ఇలా అడుగు పెట్టడం... అడగడం వుండేదా? వెళ్ళిపో... కొత్త వ్యక్తిని నువ్విక్కడ కనిపిస్తే చావబాదుతారు. ప్రాణాలకు ముప్పు తెచ్చుకోకు.

మరి చేసేదిలేక హైదరాబాదుకు తిరుగు ప్రయాణం కట్టాడు రామావతారం. జరిగిందంతా పూసగుచ్చినట్టు విశ్వనాథ్‌కి చెప్పాడు రామ్‌కాశ్యప్ కొడుకు వచ్చిన హడావుడిలో వుండటంవలన అతనిని కలవడం కుదరలేదు రామావతారానికి.

* * * * *

మర్నాడు-

సరిగ్గా పన్నెండు గంటలకు, రామ్‌కాశ్యప్ ఇంట్లో విశాలమైన డైనింగ్ హాల్లో రామ్‌కాశ్యప్ ఎదురుగా అనంత్ కాశ్యప్ కూర్చున్నాడు.

"మేడమ్! బృంద ఎక్కడ?" అడిగాడతను.

"షూటింగ్‌కి వెళ్ళింది. ఎట్టి పరిస్థితుల్లోనూ లంచ్‌కి వచ్చేస్తానని చెప్పింది" చెప్పాడు రామ్‌కాశ్యప్.

గంటసేపు అమెరికాలో బిజినెస్ విశేషాలన్నీ చెప్పాడు అనంత్ కాశ్యప్. అవన్నీ విన్నాక అడిగాడు రామ్‌కాశ్యప్.

"నిన్న బృంద కంపెనీ ఎలా వుంది?"

ఆ ప్రశ్న అడిగిన తండ్రి కళ్ళల్లోకి సూటిగా చూశాడతను.

"వెరీనైస్ లేడీ" అన్నాడు అనంత్ కాశ్యవ్.

"బృంద అందమైంది... చదువుకొంది. కాలక్షేపంకోసం నా బలవంతం మీద సినిమాలో నటిస్తోంది. కానీ... ఆ అమ్మాయికి ప్రత్యేకంగా ఆ ఇంట్రెస్ట్ లేదు. గొప్ప ఇంటికి కావలసిన అర్హతలన్నీ ఆ అమ్మాయికి వున్నాయి. ఏమంటావ్?"

"యస్! యూ ఆర్ కరెక్ట్ డాడీ!"

"అనంత్! బృంద విషయం డైరెక్టుగా చెప్పేస్తున్నాను... ఆ అమ్మాయి నాకు కోడలైతే బాగుంటుంది. నువ్వేమంటావ్?" సూటిగా అడిగాడు రామ్‌కాశ్యవ్.

చిన్నగా నవ్వాడు అనంత్ కాశ్యవ్.

"సారీ డాడీ! మీరు బృందను ప్రపోజ్ చేయడం కరక్టే... నా గురించే మీ ఆలోచనలుంటాయని నాకు తెలుసు... కానీ, ఐయామ్ లవ్వింగ్ నియమ. షి టూ లవ్స్ మీ... బెంగాలీ అమ్మాయి... అమెరికాలో సెటిలర్స్... అన్ని రకాలుగా మనకు తగిన అమ్మాయి. వాళ్ళింట్లో వాళ్ళు కూడా ఈ ప్రపోజల్‌కి ఎస్ అన్నారు. ఆ విషయాన్ని మీతో స్వయంగా చెప్పడానికే వచ్చాన్నేను...." నిర్మొహమాటంగా చెప్పేశాడు అనంత్ కాశ్యవ్.

ఒక్కక్షణం రామ్‌కాశ్యవ్ ఏం మాట్లాడలేదు. అంతవరకూ అతని ముఖంలో వున్న ప్రసన్నత మాయమైంది.

కొడుకుని హర్ట్ చేయటం అతనికిష్టంలేదు.

అయితే తండ్రి హర్ట్ అయినట్టు కొడుక్కి తెలీదు.

తనతో తెచ్చిన వీడియో కేసెట్‌ని ప్లేచేసి, తను పెళ్ళి చేసుకోబోతున్న నియమని, వాళ్ళ ఫ్యామిలీని, ఫ్యాక్టరీని చూపించాడు అనంత్.

రామ్‌కాశ్యవ్ దృష్టిలో బృంద లేకపోతే ఆ ప్రపోజల్‌కి ఎంతో అభినందించే వాడు.

వెయిట్‌చేసి, వెయిట్‌చేసి భోజనం చేస్తున్న సమయంలో పరుగు పరుగున వచ్చి "సారీ" చెప్పింది బృంద.

అప్పుడు సమయం రెండుంపావయింది.

ఏవో పొడిపొడి మాటలు తప్ప తండ్రీకొడుకులు ఎక్కువ మాట్లాడుకోలేదు. క్రితంరోజు ఈవెనింగ్ మాట్లాడినట్లు ఇవాళ అనంత్‌కాశ్యప్ మాట్లాడకపోవడం చాలా ఆశ్చర్యంగా వుంది బృందకు.

"సీయూ... మేడమ్ బృంద... డాడీ... టచ్‌లో వుంటాను" అని మూడు గంటల ప్రాంతంలో వెళ్ళిపోయాడు అనంత్ కాశ్యప్.

తర్వాత–

"అంకుల్! ఏమిటలా డల్‌గా వున్నారు? ఏనీథింగ్ సీరియస్?" అడిగిందామె.

"నో... నాటెటాల్... ఇంతసేపూ అమెరికాలోని బిజినెస్ విషయాలు చెప్పాడు అనంత్. బిజినెస్ అంటే తలనొప్పే కదా... తలనొప్పిగా వుంది. కాసేపు రెస్ట్ తీసుకుంటాను. ఈవెనింగ్ కలుద్దాం" అనేసి తన బెడ్‌రూమ్‌లో కెళ్ళిపోయాడు రామ్‌కాశ్యప్.

తన రూమ్‌లోకొచ్చి బెడ్‌మీద వాలిపోయింది బృంద.

ముందుగా వచ్చి అనంత్ కాశ్యప్ కాసేపు మాట్లాడితే బావుండేది అనుకుందామె.

"బృందా! అనంత్‌మీద నీ అభిప్రాయం ఏమిటి?" అని రామ్‌కాశ్యప్ అడిగిన ప్రశ్న గురించే ఆలోచిస్తోందామె.

మార్నింగ్ ఏడున్నరయింది.

అప్పుడే మార్నింగ్ వాక్‌నుంచి వచ్చి, తనే రెండు గ్లాసుల్లో ఫ్రూట్ జ్యూస్ కలిపి లాన్‌లోకొచ్చాడు రామ్‌కాశ్యప్.

"గుడ్‌మార్నింగ్ అంకుల్!" ఆ పలకరింపుకి తలెత్తి చూశాడు రామ్‌కాశ్యప్.

"నీ గురించే అనుకుంటున్నాను" అంటూ దగ్గరగా వచ్చిన ఆమె చేతికి ఫ్రూట్ జ్యూస్ గ్లాసును అందించి.

"ఇవాళ షూటింగ్ లేదమ్మా...." అని అడిగాడు ఫైబర్ ఛైర్లో కూర్చుంటూ.

నెమ్మదిగా వీస్తున్న గాలి చల్లగా వంటికి తగులుతోంది.

అప్పుడే నిద్రలేచిన బృంద అలాలేదు. ఫ్రెష్‌గా వుంది. మిలమిల మెరిసిపోతున్న తెల్లటి ముఖం. సుకుమారాన్నీ, సౌందర్యాన్ని పోతపోసినట్టుగా వుందామె.

"లేదంకుల్... ఇవాళ డబ్బింగ్... నాకేం పనిలేదు" అందామె.

"అయితే ఓ పనిచేద్దాం... అనంత్‌ని రమ్మని ఫోన్ చేస్తాను. ముగ్గురం ఎక్కడైనా సరదాగా స్పెండ్ చేద్దాం...." అన్నాడాయన ఉత్సాహంగా.

అనంత్ కాశ్యప్ తనో అమ్మాయిని ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసు కొంటానని స్పష్టంగా చెప్పినప్పటికీ ఆయనలో ఏదో మూల ఒక ఆశ.

బృంద తన కోడలయితే బావుంటుందని, అలా జరుగుతుందని కూడా.

"మీ ఇష్టం అంకుల్" అని అనగానే కార్డ్‌లెస్ అందుకున్నాడు రామ్‌కాశ్యప్, నెంబర్ ప్రెస్ చేశాడు.

"హాయ్ డాడీ! ఇంత ఎర్లీ మార్నింగ్...." అటునుంచి గొంతు మార్దనంగా విన్పించింది.

"ఏం చేస్తున్నావ్?"

"ఎక్సర్‌సైజ్."

"ఏంటీ నీ ప్రోగ్రామ్?"

"ఎప్పుడు?"

"టుడే... ఇట్ సెల్ఫ్ మై బాయ్."

"ఓ బిజినెస్ కాన్ఫరెన్స్‌కి ఎటెండవుతున్నాను. మధ్యాహ్నం లంచ్ అక్కడే... ఈవెనింగ్... ఫ్రెండ్."

"ఆ ఫ్రెండ్స్‌తో ప్రోగ్రామ్ కాన్సిల్ చేసుకోగలవా?"

"ఏం?"

"నీతో గడుపుదామని నేనూ, బృంద అనుకుంటున్నాం" కొడుకు రిప్లయ్ కోసం అన్నాడతను.

"ఓ బృందా... జంటిల్, లేడీ... ఓ.కె... వైనాట్... బట్ వన్ రిక్వెస్ట్...." వినయంగా అన్నాడతను.

"టెల్‌మీ మైబాయ్."

"నా తరపున ఇంకో గెస్ట్‌ను తీసుకురావచ్చా... ఆ ఫ్రెండ్ ఇంకో అర గంటలో అమెరికా నుంచి వస్తున్నారు" అన్నాడతను.

గెస్టును తీసుకురావచ్చా అని అడగడం అమెరికన్ కల్చర్‌లో ఒక భాగం. ముందు పర్మిషన్ తీసుకోవడం, స్పెసిఫిక్ టైంను ఫిక్స్ చేసుకోవడం వాళ్ళ అనవాయితీ.

"కమ్ ఎలాంగ్ విత్ దట్ గెస్ట్... ఓ.కే."

"థాంక్యూ డాడ్...." ఫోన్ కట్ అయింది.

"ఇవాళ నా ప్రోగ్రామ్స్ అన్నీ కేన్సిల్ చేసుకుంటాను బృందా... సాయంత్రం మనం ఎక్కడికి వెళ్దాం చెప్పు... గ్రీన్‌పార్క్, తాజ్ రెసిడెన్సీ, లేదా అవుట్ స్కర్ట్స్" అడిగాడతను.

"తాజ్ రెసిడెన్సీ."

"గుడ్! రామావతారం ఎలాగూ వుంటాడు. విశ్వనాథ్‌గారిని కూడా పిలుద్దాం. ఆయన సైకియాట్రిస్ట్‌గానే తెలుసు. మంచి యాక్టర్, మంచి మిమిక్రీ ఆర్టిస్ట్ కూడా."

"నాకు తెలీదే" అందామె ఆశ్చర్యంగా.

"అందుకే చెప్పాను" అన్నాడు నవ్వుతూ.

అదే సమయంలో ఫోన్ మోగితే, కార్డ్‌లెస్ అందుకుని మాట్లాడి నీకే అని బృందకిచ్చాడు రామ్‌కేశ్యవ్.

"చెప్పండి వంశీగారూ!"

"కంగ్రాచ్యులేషన్స్."

"దేనికి?"

"ఇంకో సినిమాలో హీరోయిన్‌గా నటించబోతున్నారు. హీరో కూడా విమల్, స్టోరీ, డైలాగ్స్ నేనే" చివరి మాటకు ఆనందంగా చెప్పాడతను.

"ఇంకో సినిమాలోనా... ఆ ప్రొడ్యూసరూ, డైరెక్టరూ వచ్చి, చెరువు కథ చెప్పి వెళ్ళారు. నాకైతే నమ్మకంలేదు. సబ్జెక్టుమీద కాదు. వాళ్ళమీద."

"మీరు చెప్పిన ఈతాకుల టోపీ ఆయన కాదు బృందగారూ... బొంబాయి పార్టీ... చాలా పెద్ద పార్టీ... మీరు ఎస్ అంటే ఆ ప్రొడ్యూసర్‌ని తీసుకొస్తాను."

"రేపు పెట్టుకుందామా?" అంది బృంద.

"ఓ.కే... కాని ఇలాంటి విషయాల్లో వెంటనే తేల్చేసుకోవడం బెటర్. అయితే రేపు కలుద్దాం" ఫోన్ కట్ అయింది.

"ఎవరో ప్రోడ్యూసరట. ఇంకో సినిమా" చెప్పింది బృంద.

"ఒప్పుకుంటున్నావా?" అడిగాడాయన. సమాధానం చెప్పలేదామె.

"కెరీర్‌ను ఇప్పుడే సీరియస్‌గా ప్లాన్ చేసుకో. నటిగా కొనసాగుతావా?" అడిగాడాయన.

"మీరే చెప్పండంకుల్! నన్నేం చెయ్యమంటారు? నా లోన్లీ నెస్‌ను తరియేయడానికి మీరే కదా యాక్టింగ్‌లోకి తీసుకొచ్చారు."

రామ్‌కాశ్యప్ వెంటనే జవాబు చెప్పలేదు. చాలా నిదానంగా, ఆయన ఆ సమయంలో ఆలోచిస్తున్నాడు.

తన ఇంటికి బృందకు తీసుకొచ్చిన దగ్గర్నుంచి ఆమె పర్సనల్ విషయాలేవీ ప్రత్యేకంగా అడగలేదు. ఒకసారి ఒక సందర్భంలో నేను అనాధను, ఒంటరిని, మీ అభిమానం నాపట్ల లేకపోతే నేనెలా వుండేదాన్నో" అంది.

"నేను చెప్పిందాన్ని వింటావా... యాక్టింగ్‌ని కెరీర్‌గా తీసుకుంటే నువ్వు సాధించే లక్ష్యాన్ని కూడా మార్క్ చేసుకో. లేదా సరదాగా రెండు మూడు సినిమాల్లో నటించాక బిజీనెస్ వేపు, అడ్మినిస్ట్రేటర్‌గా వస్తావా... ఓ.కే... ఐయామ్ రెడీ టు ఆఫర్ యూ వండ్రఫుల్ పోస్ట్ ఎట్ ఎనీ టైమ్. కానీ ఇంకో విషయం... మ్యారేజ్ మీద నీ అభిప్రాయం ఏంటి? అకస్మాత్తుగా అలా అడుగుతాడని వూహించని బృంద కొంచెం కంగారుపడింది.

"ప్రత్యేకంగా అభిప్రాయం ఏం లేదంకుల్."

"పెళ్ళి చేసుకుంటావా... చేసుకోవా...." సన్నగా చిరునవ్వు నవ్వుతూ అడిగాడతను.

జవాబు చెప్పలేదామె, సందర్భం కలిసొచ్చినప్పుడే సమస్యను పరిష్కరించిండం ఆయన అలవాటు.

ఇప్పుడు సందర్భం కలిసొచ్చింది కాబట్టి.

"పెళ్ళిలాంటి విషయాలు డైరెక్ట్‌గా ఆడపిల్లల్తో డీల్ చేయకూడదని నాకు తెలుసు. మీ పెద్దవాళ్ళెవరయినా వుంటే... మాట్లాడడానికి బావుండేది. అమ్మా, నాన్న, అక్క, అన్నయ్య... ఎవరయినా, ఎక్కడయినా ఉంటే చెప్పు... నిముషాల్లో

నిముషాల్లో రప్పిస్తాను... యూ హేవ్ గుడ్ ఫ్యూచర్... అందుకే నాక ఇంట్రెస్టే...." ఆమె కుటుంబ వ్యక్తుల గూర్చి మాట్లాడుతున్నప్పుడు ఆమె ముఖకవళికల్ని పసిగట్టడానికి ప్రయత్నంచేస్తూ అన్నాడతను.

అంతవరకూ ప్రసన్నంగా వున్న బృంద ముఖంలో ఎన్నో మార్పులు, రక్తమంతా దగ్గరగా కూడిపోయి ఎర్రగా అయిపోయిందా ముఖం, గార్డెన్‌లోని పూల మొక్కలవేపు తదేకంగా చూస్తోందామె నిశ్శబ్దంగా.

"చెప్పడం ఇష్టంలేదా?"

అయినా ఆమె సమాధానం చెప్పలేదు.

"నన్ను పరాయి వాడికనుకుంటున్నావా? జీవితంలో ఏం కోల్పోయావు... ఎందుకు కోల్పోయావు తెలియదు. నువ్వు మానసికంగా ఎంతో బాధపడుతున్నావని మాత్రం తెలుసు. ఆ బాధకు కారణం ఏమిటి...? తండ్రిగా అడుగుతున్నాను చెప్పు? ఎలాంటి సమస్యనయినా సాల్వ్ చేసిన డబ్బు, ఈ క్షణంలో నీ సమస్యను సాల్వ్ చెయ్యడానికి ఎన్ని లక్షలైనా ఖర్చు పెడతాను... చెప్పు... ఎందుకంటే నీకున్న బ్రయిట్ ఫ్యూచర్ నాకు తెలుసు గనుక... నువ్వు ముందు సమస్యల్లోంచి బయటికొస్తే నీకు మంచి జరుగుతుందని నాకు నమ్మకం వుంది... నా మీద నమ్మకం, ప్రేమ, గౌరవం వుంటే చెప్పు."

బాధల్లోని మనిషికి బుజ్జగింపే ఒక అద్భుతమైన ఔషధం.

"నీదే వూరు...? ఎక్కడ పెరిగావు...? ఎక్కడ చదువుకున్నావ్? తల్లి దండ్రులేం చేస్తున్నారు...? ఎక్కడున్నారు... జ్ఞాపకం వున్నంత వరూ చెప్పు...?" ఆమె ముఖంలోని ప్రకంపాల్ని పరిశీలిస్తూ అడిగాడతను. ఆమె రియాక్షన్ కోసం చూస్తున్నాడతను.

ఆ ప్రశ్నలకు బృంద ఎంతో ఉద్వేగానికి లోనయ్యింది.

తను కొన్ని సమయాల్లో చాలా హిస్టీరిక్‌గా ప్రవర్తిస్తోందని, తననే కాకుండా, తనలోని సమస్యల్ని వెలికి తీసేందుకే రామ్‌కాశ్యప్ విశ్వనాథ్, రామావతారం ద్వారా ప్రయత్నిస్తున్నాడని కొన్ని రోజుల క్రితమే ఆమెకు అర్థమైంది. అప్పటినుంచీ ఆమె షూటింగుల్లోనూ, ఇంట్లోనూ తనకిష్టంలేని, తమ ఉద్వేగానికి

లోనయ్యే సందర్భం వచ్చినప్పుడు సంయమనాన్ని పాంటించడాన్ని అలవాటు చేసుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది.

ప్రధానంగా వరంగల్ సంఘటన తర్వాత ఆమెలో మానసికంగా ఆ మార్పు కనిపిస్తోంది.

నిజానికి ఆమెకేం జ్ఞాపకం రావడంలేదు.

తనదే ఊరు... మహబూబ్‌నగరా... కావచ్చేమో... అక్కడే చదువు కుందా... అవునేమో... తల్లీ, తండ్రీ ఉన్నారా... ఏమో... తను అనాథకాదని అనిపిస్తోంది... కనీసం తన జీవితానికి సంబంధించి ఏ విషయం గురించయినా తనకు జ్ఞాపకం వస్తుందా...? రీకలెక్ట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

కానీ సాధ్యం కావడంలేదు.

అతి కష్టంమ్మీద తనని తాను కంట్రోల్ చేసుకొని...

"సారీ అంకుల్... నాకే సంగతి తెల్సినా... ముందు మీకే చెప్తాను." అనేసి గబగబా నడుచుకుంటూ తన బెడ్‌రూమ్‌లో కెళ్ళిపోయి బెడ్‌మీద విస్రాణగా పడిపోయింది బృంద. గబగబా రెండు కాంపోజ్ టాబ్లెట్లు తీసి వేసుకుంది.

* * * * *

మధ్యాహ్నం మూడు గంటలు...

ఆమె బెడ్‌రూమ్‌లోకొచ్చిన రామావతారం, నిద్రపోతున్న బృందను చూసి బయటకు వెళ్ళిపోయేంతలో–

అప్పుడే అకస్మాత్తుగా మెలకువ వచ్చింది బృందకి.

"ఏంటంకుల్... చెప్పండి...." అంటూ లేచి కూర్చుంది.

"ఉదయం టిఫిన్ చేయలేదు... లేమ్మా...." అని అన్నాడు అభిమానంగా.

"ఆకలిగా లేదంకుల్..."

"రేపు షూటింగ్ వుంది...." జ్ఞాపకం చేశాడతను.

"కాన్సిల్ చెయ్యమని చెప్పానులెండి...."

"అదికాదమ్మా... నీరసంగా ఉంటే ఎలా యాక్ట్‌చేస్తావ్...." అంటూ ఫ్రూట్ జ్యూస్ గ్లాస్‌ను ఆమెకందించాడు.

"అంకుల్ ఎక్కడున్నారు?" అడిగిందామె.

"ఆఫీసులో... ఏడుగంటలకి వస్తానని నీతో చెప్పమన్నారు. ఈవెనింగ్ రాజ్ రెసిడెన్సీలో డిన్నెర్ ప్రోగ్రాముంది...."

"మీరు రావడంలేదా?"

"నేను లేకుండా వుంటుందా...." అని నవ్వేసి "రైటర్ సూర్యవంశీ ఫోన్ చేశాడమ్మా... నిన్ను ఫోన్ చేయమన్నాడు...." చెప్పి బయటకెళ్ళి పోయారాయన.

ఆ సమయంలో రామావతారం అక్కడకు రావడానికి ప్రధాన కారణం బృంద మానసిక స్థాయిని అంచనా వేయడానికి.

కింద హాల్లోకెళ్ళి రామ్‌కాశ్యప్‌కి ఫోన్‌చేసి–

"షీ ఈజ్ ఆల్‌రైట్... ఆమెలో కొంత మార్పు కనిపిస్తోంది. కరెక్ట్ ట్రిట్‌మెంట్ ఈ సమయంలో అందితే... ఆమె ఎవరో ఆమెకి తెలుస్తుంది. సమస్యలన్నీ పరిష్కారమైపోతాయి...." చెప్పాడు రామావతారం.

"నాకు కావాల్సింది కూడా అదే... ఎందుకంటే...." మిగతా విషయాన్ని చెప్పలేదాయన.

ఆయన ఆలోచిస్తున్న విషయం అనంత కాశ్యప్ పెళ్ళి గురించి... బృందను అనంత్ పెళ్ళి చేసుకొంటాడని సిక్త్స్ సెన్స్ ఆయనకు చెప్తోంది. అనంత్ కాశ్యప్ ప్రేమించిన అమ్మాయి మాటేమిటి?

ఆ సమస్యను కాలం పరిష్కరిస్తుందన్న నమ్మకం ఆయనకు వుంది.

బృందను అనంత్ కాశ్యప్‌తో సాధ్యమైనన్ని ఎక్కువసార్లు కలిపితే. ఆమె అద్భుత సౌందర్యంపట్ల అనంత్ ఆకర్షితమయ్యే అవకాశం వుంది. అలాగే మాటల్లోనేకదా మానసిక సౌందర్యం గురించి తెలిసేది.

కాలాన్ని నమ్మినవారెవరూ చెడిపోరు.

కాలాన్ని ఎవరూ నియంత్రించలేరు. కాలాన్ని ఎవరూ శాసించలేరు.

*          *          *          *          *

తాజ్ రెసిడెన్సీలోని ఫ్యామిలీ రెస్టారెంట్ ఆ రోజు రామ్‌కాశ్యప్ కోసం బుక్ చేయబడింది.

"రెస్టారెంట్ మొత్తాన్ని బుక్ చేశారా...?" కార్లో అడిగింది బృంద ఆశ్చర్యంగా రామ్‌కాశ్యప్‌ని.

"ఏం?"

"మీరు, నేను, మీ అబ్బాయి... రామావతారం... నలుగురి కోసం రెస్టారెంట్‌ని బుక్ చేయడమంటే...."

"అవును... లక్షలు చెల్లించాల్సి వుంటుంది... ప్రశాంతంగా, ఫోక్ కల్చర్‌తో గ్రామీణ వాతావరణానికి అద్దంలా వుంటుందా రెస్టారెంట్... నా భార్య బతికున్న రోజుల్లో ఇక్కడికే తీసుకెళ్ళమని అడిగేది... ఎప్పుడయినా...."

"రెలిటివ్ సెంటిమెంట్స్‌వల్ల చాలామంది తక్కువ చూపు చూస్తారు. భార్యాపిల్లల ఇష్టాలు... తనిష్టం కూడా.

మనిషికి చిన్న చిన్న కోరికలు అంతర్లీనంగా వుంటాయి. గొప్ప కష్టాన్ని, చిన్న సుఖాన్ని కూడా అనుభవించినప్పుడే జీవితం ఆనంద మయంగా వుంటుంది.

ఆ మానసికమైన ఆనందాన్ని డబ్బుతో ఎవరూ కొనలేరు.

రామ్‌కాశ్యప్ చెప్పినట్లుగానే ఆ రెస్టారెంట్ అందమైన పల్లెటూరులా వుంది. గోడకు నిలువెత్తు తాటిచెట్ల పెయింటింగ్స్... ఒక పక్క చిన్న చెరువు... రెండు మూడు గుడెసెలు... నులకమంచాలు...

సర్వ్‌చేసే సర్వర్లు పల్లె డ్రస్సులనే వేసుకొన్నారు. సన్నగా వినిపిస్తున్న జానపద సంగీతం...

రాత్రి ఎనిమిది గంటలైంది.

రామ్‌కాశ్యప్ ఎదుట బృంద, కొంచెం దూరంలో రామావతారం కూర్చున్నారు. పెద్ద బండను డైనింగ్ టేబులాగా మలిచారు, గ్లాసులు, ప్లేట్లు అన్నీ ఇత్తడివే... నేలమీద కార్పెట్ బదులుగా ఈతచాపలు...

సర్వర్ ముందుగా చెప్పిన ప్రకారం పెద్ద కూజాను, మట్టి గ్లాసుల్నీ తెచ్చాడు. ఆ కూజాలోని డ్రింకుని మట్టిగ్లాసుల్లో పోసిచ్చాడు.

"ఏంటంకుల్ ఇది?"

"తాగి చూడు...."

"ఏదో డ్రింక్ వాసన వేస్తోంది...." అంది ఆ గ్లాసుని సిప్‌చేసిన బృంద.

"డ్రింక్‌లాంటిదే.. తాటికల్లు అంటారు దీన్ని... ఆరోగ్యానికి చాలా మంచిది...." అన్నాడాయన.

"మా చిన్నప్పుడు చెట్లకింద కూర్చుని, చారణా ఇస్తే నాలుగుగ్లాసులిచ్చే వారు. ఇప్పుడీ కూడా ఖరీదు అయిదువేలు, పాత కల్చర్‌ని కొనుక్కుంటేనేగానీ దొరకని పరిస్థితి ఏర్పడింది" కామెంట్ చేసాడు రామావతారం.

"హలో" ఎవరో పలకరించడంలో అటువేపు చూసిన బృందకు రామబ్రహ్మం కనిపించాడు. అతను నేరుగా బృంద దగ్గరకొచ్చి.

"కంప్లీట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌నే బుక్ చేసుకుంటే ఎలా మేడమ్? అందుకే ఎక్కడ వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మీరు కనపడ్డారు...." అని అన్నాడు.

రామబ్రహ్మాన్ని రామ్‌కాశ్యప్‌కి పరిచయం చేసింది బృంద.

"నేను సినిమాలు చూడను... చిన్నప్పుడెప్పుడో రాజ్‌కపూర్ సంగం చూశాను... ఆ తర్వాత చూడలేదు. రాజ్‌కపూర్ చనిపోయాడనుకుంటాను...."

"అవున్సార్! మీరసలు తెలుగు సినిమాలు చూడలేదా సార్?"

"ఒక్కటంటే ఒక్కటి...."

"చాలా విచిత్రంగా ఉందండి... మన హీరోల పేర్లయినా విన్నారా?"

"సారీ... లేదు...." జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించి,

"ఒకసారి మాత్రం ఫ్రెండు ఒకతను, మద్రాసులో వాహినీ స్టూడియోకి తీసికెళ్ళాడు... అక్కడ నాగయ్యను చూశాను. ఆయన గొప్పనటుడని విన్నాను. ఆయన హీరోగా యాక్ట్ చేస్తున్నాడా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"నాగమ్మ హీరోగా యాక్ట్ చేయడం... అంటే... సార్... మనకి స్వాతంత్ర్యం వచ్చి యాభైఏళ్ళయింది సార్. ఈ యాభైఏళ్ళలో ఇండస్ట్రీ పూర్తిగా మారిపోయింది సార్...." అంటూ ఎవరెవరువచ్చారో, ఎవరెవరున్నారో సుదీర్ఘంగా చెప్పాడు రామబ్రహ్మం.

"చాలా మార్పులు జరిగియాన్నమాట... నేనెక్కడ ఫారిన్‌లో, అందులోనూ జర్మనీలో వుండటంవలన నాకేం తెలీదు. మీరేం చేస్తుంటారు" ఆఖరికి అలా అడగటంతో రామబ్రహ్మం వెర్రిముఖం వేసుకొని బృంద వేపు చూశాడు.

"చెప్పానుకదా అంకుల్! కమేడియన్... ఒకటి రెండు సినిమాల్లో హీరోగా కూడా చేశారు."

"మీ కమెడియన్స్‌లో రేలంగి ఫేమస్ ఆట కదా... ఎవరోచెప్పారు. ఆయనెక్కడుంటారు? మద్రాసులోనా? హైద్రాబాద్‌లోనా?"

"సార్... మీరు కొట్టండి... తిట్టండి... పిస్టలుంటే కాల్చి చంపండి... కానీ ముప్పై నలభై సంవత్సరాలక్రితం విశేషాల్ని మాత్రం అడక్కండి సార్...." రామబ్రహ్మం ఏడుపు ముఖంతో అన్నాడు.

"ఓహో... మీరు ఇండస్ట్రీకి కొత్తగా వచ్చినట్టున్నారు...." అని అనేసరికి మరింత తెల్లబోయాడు రామబ్రహ్మం.

"అమ్మా... బృందా! వస్తాను తల్లీ... ఈ దెబ్బతో అరడజను బీర్లు, ఒక ఫుల్లు కొట్టకపోతే నేను మనిషిని కాలేను" అని అక్కడినుంచి హడావిడిగా వెళ్ళిపోయాడు రామబ్రహ్మం.

"మీరాయన్ని బెదరగొట్టేశారంకుల్...." అంది పడీపడీ నవ్వుతూ బృంద.

బేరర్ జీడిపలుకుల్ని, వెజిటబుల్ సలాడ్‌ని తెచ్చి టేబుల్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు.

బృంద చేతి వాచీ చూసుకుంది. ఎనిమిదిన్నరైంది.

"ఇంకా రాలేదేమిటి మీ అబ్బాయి?" అని అంటుండగా లోనికొస్తూ కనిపించాడు అనంత్ కాశ్యప్. పాలరాతి రంగులో మెరుస్తున్న సూట్‌లో హుందాగా, మేన్లీగా వున్నాడతను.

"హలో డాడ్... హలో మిస్ బృందా! గుడ్ ఈవెనింగ్ టు ఎవ్విరీ బడి. సారీ ఫర్‌ద లిటిల్‌బిట్ లేట్...." నవ్వుతూ కూర్చుని నలువేపులా చూశాడు అనంత్‌కాశ్యప్.

అతను లోనికి అడుగుపెట్టగానే ముందుగా చెప్పిన ప్రకారం రెండు స్కాచ్‌బాటిల్స్, అరడజన్ ప్లేట్లలో ఈటింగ్స్ అన్నీ వచ్చేసాయి.

"నాకు మీరు పార్టీ యిస్తున్నారా డాడ్?" అంటూ బృందవేపు చూశాడతను.

బృంద అతని కళ్ళలోకి నేరుగా చూడటానికి ఎందుకో సిగ్గుపడింది. అది గమనించిన రామ్‌కాశ్యప్ చిన్నగా నవ్వుకున్నాడు.

సిగ్గు ప్రేమకు మొదటి మెట్టు అని అతనికి తెలుసు.

తనే స్వయంగా నాలుగు గ్లాసుల్లో డ్రింక్‌పోసి అందరికీ స్వయంగా అందించాడు రామ్‌కాశ్యప్.

ఛీర్స్ కొట్టాడు ఆనందంగా.

ఇవాళ తాడో పేడో తేలిపోవాలి అనుకున్నాడతను.

ప్రేమమీద నమ్మకం వున్నా, తనంటే ఏ మాత్రం గౌరవం ఉన్నా బృందను పెళ్ళి చేసుకోమని బృంద ఎదురుగానే అడిగి అనంత్ కాశ్యప్‌చేత కన్‌ఫర్మ్ చేయించాలని అతనెంతో పట్టుదలగా వున్నాడు.

ఏవేవో మాట్లాడుకుంటున్నారు. అకస్మాత్తుగా రామ్‌కాశ్యప్ ఏదో విషయం జ్ఞాపకానికొచ్చి–

"అమెరికా నుంచి ఎవరో గెస్ట్ వస్తారన్నావ్. రాలేదా?" అని అడిగాడు కొడుకుని.

"మిమ్మల్నందర్నీ సర్‌ప్రైజ్ చేయడానికి ఫిఫ్టీన్‌మినిట్స్ లేట్‌గా పార్టీ కొస్తారు ఆ గెస్ట్... డాడీ మీరు ఆశ్చర్యపోవడం ఖాయం. ఆ గెస్టును చూసి... మీరు కూడా...." అంటూ బృందవేపు చూసి పెద్దగా నవ్వాడు అనంత్ కాశ్యప్.

ఆ గెస్ట్ ఎవరై వుంటారా? అని రామ్‌కాశ్యప్ ఆలోచిస్తున్న సమయంలో సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ రెస్టారెంట్‌లోకి అడుగుపెట్టాడు చేతిలో చిన్న క్యారీ బ్యాగ్‌తో.

"సారీ రామ్‌కాశ్యప్‌గారూ! బయలుదేరుతుండగా... ఎవరో పేషంట్... తప్పదుగా, అందుకే లేట్" అన్నాడతను బృంద పక్కన కూర్చుంటూ, అతన్ని అనంత్‌కి రామ్‌కాశ్యప్ పరిచయం చేశాడు.

"సైకియాట్రిస్ట్... మీలాంటి స్పెషలిస్టులకు అమెరికాలో చాలా ఎక్కువ వేల్యూవుంది. ఎందుకంటే... అక్కడ రోజూ అలాంటి కేసులు, నేరాలు ఎక్కువ" అన్నాడు అనంతకాశ్యప్ అతనికి డ్రింక్ గ్లాసుని అందిస్తూ.

తన చేతిలోని క్యారీ బ్యాగ్‌ను టేబుల్‌మీద పెట్టాడతను. అతనా పార్టీకి ఒక ప్లాన్ ప్రకారం వచ్చాడు. తన ప్లాన్ సక్సెస్ అవుతుందనే నమ్మకం వుందతనికి.

మాటిమాటికీ చేతిగడియారం వేపే చూసుకుంటున్నాడు అనంత్ కాశ్యప్.

ఎనిమిది నలభై అయిదు నిముషాలైంది.

అప్పుడు రెస్టారెంట్లోకి వచ్చింది ఆ గెస్ట్, నియమ, అనంత్ కాశ్యప్ ప్రేయసి... కాబోయే భార్య.

డిసెంబర్ పూలరంగులో జరీచీర... జాకెట్టు... నుదుటున బొట్టు... చేతికి గాజులు, తెల్లటి దేహచ్ఛాయ...

నియమను దూరంనుంచి చూడగానే అంతకుముందురోజు క్యాసెట్లో ఆమెను చూడటంవల్లనే వెంటనే గుర్తుపట్టాడు రామ్‌కాశ్యప్. మీరు ఆశ్చర్య పోవడం ఖాయం అని అనంత్ కాశ్యప్ ఎందుకన్నాడో ఇప్పుడర్థమయిందతనికి. నిజానికిది–

సర్‌ప్రయిజ్ కాదు... షాక్...!

బృందవేపు చూశాడతను. బృంద కళ్ళు తదేకంగా టేబుల్ దగ్గర కొస్తున్న నియమ మీదే వున్నాయి.

"హలో నియమా... నీకు లేటెందుకయిందో నాకు తెలుసు... మార్వలెస్‌గా అలంకరించుకోవడంలో...." అంటూ చనువుగా ఆమె చెయ్యి పట్టుకొని ముద్దు పెట్టుకొని తండ్రికి పరిచయం చేశాడు.

"షి ఈజ్ నియమ, మిగతా వివరాలు మీకు తెలుసు...."

నియమ రెండు చేతులూఎత్తి రామ్‌కాశ్యప్‌కి నమస్కరించింది.

మిగతా వాళ్ళని పరిచయం చేశాడు అనంత్‌కాశ్యప్. బృందను ప్రతేక్యంగా పరిచయం చేసి–

"మిస్ బృంద బ్యూటీని చూస్తే నువ్వు జలసీకి లోనవుతావు "అని అన్నాడు. అనంత్ కాశ్యప్‌లోని ఫ్రాంక్‌నెస్ బృందకి బాగా నచ్చింది.

అందంగా చిరునవ్వు, నవ్వుతూ అనంత్‌కి, రామ్‌కాశ్యప్‌కి మధ్య కూర్చుంది నియమ.

ఆమెను స్కాచ్ గ్లాసందించాడు అనంత్. అందుకని థాంక్స్ చెప్పింది.

రామ్‌కాశ్యప్‌కి ఏం మాట్లాడాలో అర్థంకాలే. అతని పరిస్థితి డెఫ్ అండ్ డమ్ స్కూల్లో పిల్లవాడి పరిస్థితిలా వుంది.

సైకియాట్రిస్ట్ విశ్వనాథ్, బృందతో మాట్లాడుతున్నాడు. ఏదో జోక్ వేస్తే బృంద నవ్వుతోంది.

ఆ సమయంలో అడిగాడు అనంత్ కాశ్యప్, తండ్రిని.

"హౌ ఈజ్ షి... వాటీజ్ యువర్ ఓపీనియన్...."

"ప్రెటీగర్ల్... యువర్ సెలెక్షన్ ఈజ్ ఆల్వేస్ గుడ్...." అంతకు మించి ఏం మాట్లాడలేకపోయాడు.

"థాంక్యూ డాడ్...."

నియమ కూడా అంతవరకూ భయంగానే వుంది. రామ్‌కాశ్యప్ ఓపీనియన్ ఎలా వుంటుందోనని, ఆయన ఒపీనియన్ విన్నాక, ఆమెకిప్పుడు హేపీగా వుంది.

"థాంక్యూ అంకుల్" అందామె. ఇప్పుడామె ధైర్యంగా తన ఫ్యామిలీ కబుర్లు చెప్తోంది.

స్కాట్ ఒక బాటిల్ పూర్తయింది. రెండు బాటిల్ ఓపెన్ అయింది.

బృంద ఫస్ట్ పెగ్గులోనే వుంది. నియమ రెండో పెగ్గులో వుంది.

"మాది కూడా ఆర్థోడాక్స్ ఫ్యామిలీయే అంకుల్... మా డాడీ బెంగాలీ... మమ్మీ పంజాబీ... ఎప్పుడో అమెరికా వెళ్ళిపోయాడు. లెదర్ బిజినెస్... మా ఇంట్లో అంతా హిందూ కల్చర్. మా మమ్మీ, డాడీ రోజూ దుర్గాదేవికి పూజ చేస్తారు. ప్రతి శనివారం నేను వెంటేశ్వర టెంపుల్‌కి వెళతాను. అనంత్‌తో నా పెళ్ళి, పెద్ద పెళ్ళిపందిరలో శాస్త్రోక్తంగా జరగాలని నా కోరిక" చెప్పుకు పోతోందామె.

మరొక సమయంలో అయితే సంప్రదాయంవట్ల ఆమెకున్న గౌరవానికి, ఆమె సౌందర్యానికి, ముగ్ధత్వానికి పొంగిపోయేవాడు, కానీ తాను అనుకొన్న బృంద స్థానంలో ఆమె వున్నందున మనస్ఫూర్తిగా ఆ మాటల్ని వినలేక పోతున్నాడు రామ్‌కాశ్యప్.

"మీ ఇద్దరిమధ్యా ఎన్నాళ్ళనుంచి పరిచయం...." అడిగాడు రామ్‌కాశ్యప్.

"త్రీ ఇయర్స్... అనంత్ ఇష్టాయిష్టాలు... చిన్నచిన్న సెంటిమెంట్స్... పెద్దల పట్ల గౌరవం అన్నీ నాకు తెలుసు. మీ వైఫ్. అదే మా కాబోయే అత్తగారు

లేరని నాకు తెలియగానే ఏడుపొచ్చింది. అత్తగారికి కోడలిగా కాకుండా, కూతురిలా సేవ చేయాలని నా కోరిక."

తన భార్యవల్ల ఆమెకున్న గౌరవానికి నిజంగా ఆనందించాడు రామ్‌కాశ్యప్. ఇంతలో సెల్ మోగితే అందుకున్నాడు రామ్‌కాశ్యప్.

చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ దగ్గర్నుంచి ఫోన్. అతను చెప్పిన విషయానికి కొంచెం కలవరపడ్డాడు రామ్‌కాశ్యప్.

"ఆ దాడినుంచి మనం తపిపంచుకోవాలంటే...." ఏదో చెప్తున్నాడు పి.ఎఫ్.ఎమ్. ఫోన్‌కి అటువేపు నుంచి.

ఇరవై నిమిషాలు మాట్లాడక.

"నేనిప్పుడే వస్తున్నాను" అని లేచి, "అనంత్... అర్జంట్‌గా నేను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుకెళ్ళాలి. ఏదో ఐ.టి. గొడవ... మీరు డిన్నర్ చేసేయండి, మార్నింగ్ కలుద్దాం." అని అందరితోచెప్పి గబగబా ఆ రెస్టారెంట్లోంచి బయటికి వెళ్ళిపోయాడు రామ్‌కాశ్యప్.

పది నిమిషాల తర్వాత.

అనంత్ నియమ మాటల్లో పడ్డారు.

రామ్‌కాశ్యప్ అక్కడినుంచి వెళ్లిపోవడం కొంచెం నిరుత్సాహంగా వుంది బృందకు. తనూ వెళ్ళిపోదామనుకుంది. కానీ, అనంత్ కాశ్యప్ తన గురించి ఏమనుకుంటాడోనని సంశయం.

అనంత్ కాశ్యప్ లాంటి వ్యక్తులకు ఫ్రెండ్స్ వుండడం మామూలే. గర్ల్ ఫ్రెండ్స్ కూడా వుండటం సహజమే. వాళ్ళిద్దరి మాటూ, నవ్వుతూ, వేసుకుంటున్న జోక్స్... వారిద్దరి మధ్యనున్న సన్నిహితత్వానికి నిదర్శనంగా వున్నాయి.

"ఆ అమ్మాయి నిన్ననే అమెరికానుంచి వచ్చింది. అనంత్ ఫ్రెండ్" రామావతారంకు కూడా అంతకంటే ఎక్కువ తెలీదు.

బృందలో ఏదో తెలీని జెలసీ...

"మిస్ బృందా... మీరు సినిమానటి అని చెప్పాను. మా నియమ తెలుగు సినిమా షూటింగ్ చూడాలనుకుంటోంది. తనకి సినిమాల సరదా చాల ఎక్కువ. కాలేజీ రోజుల్లో మోడలింగ్ చేసిందట...." చెప్పాడు అనంత్.

"వైనాట్! రేపు రండి" అంది బృంద.

"రేపా! రేపు ఈవెనింగ్ నేను అమెరికా వెళ్ళిపోతున్నానుకదా. ఈయన రమ్మన్నారని అక్కడ ప్రోగ్రామ్స్ అన్నీ కాన్సిల్ చేసుకొని వచ్చాను. ఈసారి వస్తాను. అతిత్వరలో ఇక్కడో నెలరోజులుండబోతున్నాంకదా... ఆ సందర్భంగా" అంటూ అనంత్ వేపు చూసి అందంగా నవ్విందామె.

"ఆ సందర్భంగా అంటే ఏంటో అర్థంకాలేదు బృందకు.

ఆమె దృష్టిలో పెళ్ళి అమెరికాలో జరిగితే హనీమూన్ ఇండియాలో జరుగుతుందని.

సరిగ్గా అలాంటి సమయంలో సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ తన ప్యాదట్లోకి చేతిని దూర్చి న్యూస్‌పేపర్స్ మధ్యలో వున్న వస్తువును టేబుల్‌మీద పెట్టాడు.

అది బృంద సూట్‌కేసులోంచి ఆమెకు తెలీకుండా తీసిన పువ్వుల చీర.

ఆ చీరను చూడగానే ఆమె ఎలా రియాక్ట్ అవుతుందోననే ఉద్దేశంతోనే వాంటెడ్‌గానే అతనా పార్టీకి వచ్చాడు.

అందరికీ డిన్నర్ రావడంతో కబుర్లాడుకుంటూ చేస్తున్నారు.

కందిపొడి కలుపుకుని, నెయ్యి వేసుకుని తినబోతున్న బృంద న్యూస్ పేపర్స్ మధ్యలోంచి కన్పిస్తున్న పువ్వుల డిజైన్‌వైపు చూస్తోంది.

ఆ డిజైన్‌ను తనెక్కడో చూసినట్టుగా అనిపించిందామెకు.

"ఏంటి డాక్టర్... ఆ న్యూస్ పేపర్ మధ్యన...." అడిగిందామె విశ్వనాథ్‌ను.

అతనా మాటను విననట్లు నటించి భోజనం చేస్తున్నాడు. బృంద నెమ్మదిగా ఎడంచేత్తో న్యూస్ పేపర్స్‌ని పైకెత్తి చూసింది.

చీర...!

తన సూట్‌కేసులోని చీర ఇక్కడికెలా వచ్చింది?

అంతే... అంతవరకు మాత్రమే జ్ఞాపకం...

ఆ తర్వాత అక్కడ అనూహ్యమైన ధ్వంసం జరిగింది.

బృంద తన ముందున్న ప్లేట్‌ని విసిరికొట్టింది. గ్లాసుల్ని విసిరి కొట్టింది.

"డాక్టర్... ఈ చీర... ఈ పువ్వులచీర... ఇక్కడికెలా వచ్చింది? ఎవరు తెచ్చారు?... ఎందుకు తెచ్చారు... మిమ్మల్నే... విశ్వనాథ్ మొహంలోకి క్రోధంగా చూస్తూ అడిగింది.

ఆమె ముఖం ఆ సమయంలో రౌద్రంగా వుంది. ఆ రౌద్రత్వానికి రామావతారం భయపడిపోయాడు.

టేబిల్‌మీద స్కాచ్ బాటిల్స్‌ని విసిరేసి, క్లాత్‌ని లాగి పారేసి చైర్స్‌ని కాలితో తన్నేసి–

బోరున ఏడ్చేసి, ఆ చీరను ఫర్... ఫర్‌మని చింపేసి... ఏడుస్తూ పరుగు పరుగున కిందకెళ్ళిపోయిందామె.

ఆమె వెనకు పరుగెత్తాడు రామావతారం.

"అమ్మా! బృందా... బృందా...." ఆ పిలుపును ఆమె వినిపించుకోలేదు.

కారెక్కి కూర్చుని–

"పోనీ... అర్జంటుగా పోనీ–" అని అరిచింది. ఆ అరుపుకు కారు డ్రైవర్ భయపడిపోయాడు.

కారు సగం దూరం వెళ్ళాక రోడ్డు పక్కన ఆపించి– "నువ్వెళ్లిపో... నాకు పనుంది... తర్వాత వస్తాను....' అనిచెప్పి కారుదిగిపోయి రోడ్డుమీద ఒంటరిగా నడవసాగింది.

మూడు నిముషాలసేపు బృంద వెళ్ళిపోతున్నవేపే చూసిన డ్రైవర్‌కి ఏమీ అర్థంకాలే. కారుని తీసుకుని ఇంటికెళ్ళిపోయాడు.

*      *      *      *      *

రాత్రి 12-40 నిమిషాలు...

రామావతారం చెప్పిందంతా విన్నాడు. అంతకుముందే గెస్ట్‌హౌస్‌కి నియమతోచేరి తండ్రికి ఫోన్‌చేసి జరిగిందంతా చెప్పిన అనంత్ కాశ్యప్.

"అయ్‌థింక్... షి మే బీ సఫరింగ్ ఫ్రమ్ సైకలాజికల్ డిసిజ్... హారిబుల్ డాడ్... నియమ అయితే బెదిరిపోయింది. అరిచేసింది కూడా, ఆ అమ్మాయికి మంచి ట్రీట్‌మెంట్ చేయించండి. బైదిబై రేపు ఈవెనింగ్ ఫ్లయిట్‌కి బొంబాయి వెళ్ళిపోయి, అక్కడినుంచి ఆమెరికా వెళ్ళిపోతుంది. నియమ, మార్నింగ్ మీతో పర్సనల్‌గా చెప్తానంది. గుడ్‌నైట్ డాడీ...."

ఆ మాటలు విన్న రామ్‌కాశ్యప్ మరింత హతాశుడయ్యాను.

బృంద సేపు అనంత్ మనసును డైవర్ట్‌చేసి, ఆమెపిచ్చి అనంత్‌తో పెళ్ళి జరిపించాలనుకొన్న తన ఆశలు, అడియాసలైపోవడంతో అతనికేం చెయ్యాలో తోచలేదు.

ఆకస్మాత్తుగా నియమను చూసినప్పుడే, తను అనుకొన్నదానికి విరుద్ధంగా అంతా జరుగుతున్నట్టనిపించిందతనికి. రెండో సంఘటన అతను వూహించనిది.

"సారీ రామ్‌కాశ్యప్. ఇంత బిట్టర్ ఎక్స్‌పీరియన్స్ ఎదురయితుందని నేననుకోలేదు" ఎదురుగా కూర్చున్న విశ్వనాథ్ అన్నాడు.

"ఆ చీరకు, ఆమె జీవితానికి చాలా దగ్గర సంబంధం వుందంటారు" సాలోచనగా అడిగాడు రామ్‌కాశ్యప్.

అనేక రకాల ఆలోచనలతో సతమతమవుతున్న తనని తాను సంభాశించుకుంటూ "ఆ విషయాలు ఇప్పుడెందుకు? మీరు బాగా అలసిపోయినట్టున్నారు. నేను వెళతాను" లేచి నిలబడ్డాడు విశ్వనాథ్.

"నో విశ్వనాథ్! ఐయామ్ ఆల్‌రైట్! నేనేం చెయ్యాలో నాకిప్పుడే అర్ధమవుతోంది. ఎందుకంటే ఒకరకంగా నాకు జీవితాన్నిచ్చిన వ్యక్తి బృంద. ఆమె గనక ఆ సమయంలో ధైర్యసాహసాలు ప్రదర్శించి రక్షించకపోతే... నేననేవాడ్ని ఇవాళ మీ ఎదురుగా వుండేవాడ్నికాను. నా ఒక్కగానొక్క కొడుకు అష్టయిశ్వర్యాలు వుండీ అనాధ అయిపోయేవాడు. ఇన్ దిస్ ఎంటైర్స్ యూనివర్స్... మై లవింగ్ థింగ్ ఈజ్ మైచైల్డ్, నేనివాళ నా కొడకు ఆనంత్‌ని చూసి గర్వపడుతున్నానంటే... నేను బతికుండబట్టేకదా! నాకు జన్మనిచ్చిన వ్యక్తి బృంద.

ఆమెలో ఎన్ని మానసిక నమస్యలున్నాసరే.... షి ఈజ్ మై సేవియర్... సో... అయ్ వాంట్ యు సేవ్ హర్... దిసీజ్ మై మోరల్ అబ్లిగేషన్... కానీ ఆమె ఎదుర్కొంటున్న సమస్యలు విభిన్నమైనవి, విభ్రాంతికరమైనవి... ఆ సమస్యల్లోంచి బృందను బయటకు తీసుకురావడానికి ఏం చేయాలన్నా నేను చేస్తాను. ఆమెకు నేను చేసే సహాయం పూర్తిగా నా వ్యక్తిగతమైనది."

కొద్దిసేపు అక్కడ మౌనం రాజ్యమేలింది.

"నేనేం చెయ్యాలో చెప్పండి" మళ్ళీ అడిగాడు రామ్‌కాశ్యప్.

తన అనుమానాలన్నీ మళ్ళీ చెప్పాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్.

"ఓ.కె. ఆమె జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తి మామూలు వ్యక్తికాదు. అందుకు సాక్ష్యం... నారాయణపురంలోని వ్యక్తి అంటే ఆ వ్యక్తి ఆ వూరికి చెందినవాడై వుంటాడని నా అనుమానం...

రెండు... ఆమె గతం పూర్తిగా మనకు తెలియాలంటే, ఇంకొన్ని టెస్టులు చెయ్యాలి. ఆమెను లోతుగా పరిశీలించాలి...

మూడు– చాలా ఇంపార్టెంట్ పాయింట్... సినిమాలోని హీరోయిన్, బృందే అనుకొంటే... బృంద దగ్గరకు ఆమెను మోసం చేసిన వ్యక్తి ఖచ్చితంగా వస్తాడు... ఆ తర్వాత పరిణామాలెలా ఉంటాయో తెలీదు...." అన్నాడు విశ్వనాథ్.

రెండు నిమిషాలసేపు దీర్ఘంగా ఆలోచించాక–

"ఆ విషయం నాకొదిలెయ్యండి. బృందక్కూడా తెలియకుండా రేపట్నుంచి అరడజనుమంది స్పెషల్ కమెండోల్ని నేను ఏర్పాటు చేస్తాను. వాళ్ళందరి దగ్గరా లైసెన్స్ పిస్టల్స్ వుంటాయి. బృందకు ఏ రకంగానైనా హాని చేయడానికి వచ్చినా... వాడి పని సఫా...." కసిగా అన్నాడు రామ్‌కాశ్యవ్.

ఆయా సందర్భాల్లో బృందకు ప్రమాదాలెదురైనప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, మరో అరగంటసేపు చర్చలు జరిగాయి. అప్పటికి రాత్రి రెండు గంటలు దాటింది.

*　　*　　*　　*　　*

మర్నాడు ఉదయం–

అనంతకాశ్యవ్ ఫోన్‌తో మెలకువ వచ్చింది రామ్‌కాశ్యవ్‌కి.

"డాడ్... నియమను బొంబాయి ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చెయ్యడానికి నేనూ వెళతాను.... బొంబాయిలో వారం రోజులు నాకు పనుంది. వీలైతే... మిమ్మల్ని పర్సనల్‌గా కలుస్తాను. లేకపోతే... ఫోనుందిగా... వెళ్ళాక న్యూయార్క్ నుంచి ఫోన్ చేస్తాను...." చెప్పి నియమకు పోనిచ్చాడు అనంత్.

"గుడ్‌మార్నింగ్!"

"హాయ్ అంకుల్... నా విషయంలో మీకు డౌట్స్ వున్నాయి కదూ...." అందామె.

ఆ ప్రశ్నకు మొదట రామ్‌కాశ్యప్ ఆశ్చర్యపోయాడు.

"సందేహాలంటే...?"

"అంకుల్... ప్రపంచంలో మీరు అమితంగా ప్రేమించే వ్యక్తి మీ కొడుకు అనంత్‌కాశ్యప్... యామైరైట్... రేపు అనంత్ పెళ్ళిచేసుకుంటే అతని జీవితంలో ఏవిధమైన అసంతృప్తి వుండకూడదని మీ అభిప్రాయం... నన్ను పెళ్ళి చేసుకోవడం వల్ల ఏ విధమైన అసంతృప్తికైనా అతను లోనవుతాడని సందేహం.

కానీ అంకుల్... చిన్న విషయం. నాకు జీవితంలో సెన్సిటివిటీ అంటే ఇష్టం. వాల్యూప్ అంటే ఇష్టం.... నా రిక్వెస్టు ఒకటే... పూర్తిగా నామీద నమ్మకం ఏర్పడ్డాక ఆ విషయం నాకు తెలియచేయండి... అప్పటి వరకూ అనంత్ కోసం ఎదురుచూస్తుంటాను. సరేనా...?" చాలా సీరియస్‌గా, ప్రేమగా చెప్పిన ఆ మాటలవల్ల నియమ వ్యక్తిత్వాన్ని కొంతలో కొంత అర్థంచేసుకోగలిగాడు రామ్‌కాశ్యప్.

"అది కాదమ్మా...." ఏదో చెప్పబోయాడు.

"అయ్ నీడ్ యువర్ బ్లెస్సింగ్స్ అంకుల్...." అందామె.

"అయ్ విష్‌యూ ఆర్ ఛీర్‌ఫుల్... అడ్ సక్సెస్‌ఫుల్ లైఫ్... ఓ.కె...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"థాంక్యూ అంకుల్... న్యూయార్క్ వెళ్ళగానే ఫోన్ చేస్తాను...." చెప్పి ఫోన్ డిస్కనెక్ట్ చేసింది నియమ.

బెడ్‌మీద నుంచి లేచి, అలా కారిడార్లోకి రాగానే ఎదురైన బృందకు అలా చూస్తూ వుండిపోయాడు రామ్‌కాశ్యప్.

"అంకుల్... కాఫీ...." చిరునవ్వుతో కాఫీ కప్పును అందించి – "షూటింగ్ కెళుతున్నానంకుల్... మళ్ళీ నైట్ కలుస్తాను...." అంది బృంద.

పసుపుపూల అమెరికన్ సిల్క్‌చీర, జాకెట్టు... గాలికి ఎగురుతున్న కురులు... కళ్ళకు కాటుక... ఎర్రటి లిప్‌స్టిక్ పెదాలు...

"బృందా... అనంత్ బొంబాయి వెళుతున్నాడు. అక్కడి నుంచి అమెరికా వెళ్ళిపోతాడనుకుంటాను. నీతో చెప్పమన్నాడు" చెప్పాడు రామ్‌కాశ్యప్.

"మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"తెలీదు...."

"వెరీ నైస్‌మేన్... ఎప్పుడైనా తీరుబడి దొరికితే గంటో... రెండు గంటలో ఫోన్లో మాట్లాడతానని, ఈసారి ఫోన్ చేసినప్పుడు ఆయనతో చెప్పండి...." అని నవ్వుతూ అనేసి ముందుకెళ్ళిపోయింది.

రాత్రి తాజ్ రెసిడెన్సీలో జరిగిన సంఘటనకు సంబంధించి సారీ అంకుల్ అని ఏదైనా చెపుతుందేమోనని ఊహించిన రామ్‌కాశ్యప్. బృంద కనీసం ఆ ప్రస్తావన కూడా తీసుకురాకపోవడంతో నిరుత్తరుడైపోయాడు.

జరిగిన సంఘటన ఆమెకు జ్ఞాపకం వుందా? లేదా?

ఆలోచిస్తున్నాడతను.

*        *        *        *        *

జూబ్లీహిల్స్‌లో ప్రైవేట్ బిల్డింగ్‌లో షూటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ బిల్డింగ్ ముందు కారు ఆగగానే, పోర్టికోలోనే కనిపించిన రచయిత సూర్యవంశీని విష్ చేసింది బృంద.

అతన్ని చూడగానే నిన్నటి ఫోన్ విషయం గుర్తుకొచ్చింది బృందకు. బృందకు ఎదురెళ్ళిన సూర్యవంశీ.

ఆమెను కొంచెం దూరంలో వున్న చెట్టుకిందకు తీసుకెళ్ళాడు.

అక్కడ రెండు ఫైబర్ కుర్చీలున్నాయి.

"చూడండి బృంద... ఫోన్‌లో అన్ని విషయాలూ చెప్పడం బావోదు కదా. మంచి బొంబాయి పార్టీ... ప్రొడ్యూసర్‌తో నేనే స్వయంగా మాట్లాడాను. ఆ ప్రొడ్యూసర్ పేరు కిషోర్‌దాస్. ఇప్పుడొస్తారు. కథేంటి అని అడిగితే ఏదో ఒకటి నేను చెప్పాను. మీక్కూడా బాగా నచ్చిందని చెప్పండి. రెమ్మునరేషన్ ఎంతైనా ఫర్వాలేదు. అడ్వాన్స్ తీసుకోండి. మన ప్రదీప్‌గారు డైరెక్టర్... ఆయన అడ్వాన్స్ గురించి ఆయన మాట్లాడుకొంటాడు ఎమంటారు?" వర్రీ బర్రీగా చెప్పాడతను.

"ఎందుకంత కంగారు పడిపోతున్నారు?" నవ్వుతూ అడిగింది బృంద.

"ఎందుకంత కంగారు పడిపోతున్నారు?" నవ్వుతూ అడిగింది.

"ఎందుకా... ఇప్పుడు ఇండస్ట్రీ ఎలాగుందో, మీకేం తెలుసు మేడమ్... కరెక్టు ప్రొడ్యూసర్స్ లేరు. ఇండస్ట్రీని నమ్ముకుని కొన్నివేల మంది మలమల మాడిపోతున్న పరిస్థితి ఇవాళుంది. మూడు నెలలపాటు ఒక్క సినిమా షూటింగ్ సజావుగా జరిగితే ఎంతమంది ఆకలి తీరుతుందో మీకు తెలీదు" ఆవేదనగా చెప్పాడు సూర్యవంశీ.

సరిగ్గా అదే సమయంలో అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు వచ్చి "మేడమ్" అంటూ నించున్నాడు.

"బొంబాయి వాళ్ళ సినిమా బ్యాంక్ డ్రాప్... తీసుకొంటే బావుంటుం దంటారా... మీక్కూడా కాస్త వెరైటీ అవుతుంది" అన్నాడు సూర్యవంశీ.

"మీ ఇష్టం" అంది బృంద.

"ఓ.కె. ఇది కూడా రియల్ ఇన్సిడెంట్... ఒకరకంగా చెప్పుకోవాలంటే ఇప్పుడు నేడే విడుదల సినిమా ఎక్కడ స్టార్టయిందో, మన కొత్త సినిమా అక్కడ ఎండవుతుంది."

సడన్‌గా ఎలర్టయి సూటిగా అతని కళ్ళలోకి చూసింది బృంద.

"అంటే?" అడిగిందామె.

"ఇందులోని హీరోయిన్ బాల్యం. రియట్ ఇన్సిడెంట్‌ని వర్కవుట్ చేయాలి" అని సూర్యవంశీ చెపుతుండగా–

అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు "మేడమ్" అని తిరిగి పిలిచాడు. తలెత్తి చూసిందామె.

ఏం మాట్లాడలేదు సోమరాజు.

"మేడమ్... మేడమ్ అని పిల్చి వూరుకుంటావేంటయ్యా... చెప్పు." అన్నాడు సూర్యవంశీ చిరాగ్గా.

"డైరెక్టర్‌గారు పిలుస్తున్నారు" నెమ్మదిగా అన్నాడు సోమరాజు.

"ఆ విషయం గట్టిగా చెప్పచ్చుగదయ్యా! స్లో మోషన్ కేరక్టర్‌లా అలా వుండిపోబట్టే నీ ఫ్యూచర్ ఇలా తగలబడింది. అసిస్టెంట్ డైరెక్టర్ ఎలా వుండాలి. చురుగ్గా వుండాలి. కీ ఇచ్చిన బొమ్మలా చకచకా పరిగెత్తాలి" అన్నాడతను.

"అయిందా. లేదా– అని ప్రతిదానికి డౌట్ రాబట్టే నేను డైరెక్ట్ చేసిన ఏ ఒక్క సినిమా కూడా బయటకు రాలేదు." తనలో తను అనుకుంటూ ముందుకు నడిచాడు సోమరాజు.

అతన్ని అనుసరించింది బృంద.

బృంద పక్కనే నడుస్తూ ఏదో మాట్లాడుతున్నాడు సూర్యవంశీ.

*  *  *  *  *

షూటింగ్ స్టార్టు అయింది.

కెమెరా రన్ అవుతోంది.

హీరోయిన్ బెడ్‌రూంలోని అణువణువూ వెతికి, ఆఖరికి ఒక అరలో రహస్యంగా దాచిన లవ్ లెటర్స్‌ని తీసి, బయటకు వస్తుండగా హీరో తలుపు తెరుచుకుని వస్తాడు. ఇద్దరిమధ్యా వాగ్వివాదం జరుగుతుంది.

బలవంతంగా ఆమెను బెబ్‌మీదకు తోసేసి ఆ లెటర్స్‌ని ఆమె చేతిలోంచి లాక్కుని, గ్యాస్‌స్టవ్ ఆన్‌చేసి ఆ లెటర్స్‌ని దగ్ధం చేస్తాడు. అది సీన్.

షూటింగ్ మధ్యలో వచ్చాడు ఫైనాన్సియర్ భాగ్యరాజ్. అతని వెనక కిషోర్‌దాస్, వాళ్ళు రాగానే అతిథి సత్కారం చేసి పక్కనే కూర్చున్నాడు సూర్యవంశీ.

కిషోర్‌దాస్ బృందనే గమనిస్తున్నాడు.

మూడు నిముషాల తర్వాత తనతోపాటు వచ్చిన వీడియోగ్రాఫర్‌కి సైగ చెయ్యగానే, వీడియోగ్రాఫర్ బృందను షూట్ చెయ్యటం మొదలెట్టాడు.

"ఏటిసార్ అది?" అడిగాడు సూర్యవంశీ.

"ఆమె యాక్టింగ్‌ని రికార్డుచేసి, బొంబాయి ఫైనాన్షియల్‌కి చూపించాలి కదా" అన్నాడు కిషోర్‌దాస్.

"అంటే తెలుగులోనూ, హిందీలోనూ ఒకేసారి తీస్తారా?" ఆశగా అడిగాడు సూర్యవంశీ.

"ఔ... లేకపోతే వర్కవుట్ కాదు. ఈ పిల్ల బాగానే చేస్తున్నటుంది. హిందీలో కూడా ఈ అమ్మాయికి ఛాన్సిద్దాం. ఏమంటావ్?" అన్నాడు కిషోర్‌దాస్.

తను రాయబోయే రెండో కథో హిందీలో కూడా సినిమగా వస్తుందనే ఆలోచనే సూర్యవంశీలో అమితోత్సాహాన్ని నింపింది.

నలభై అయిదు నిముషాలు గడిచాయి.

షూటింగ్ పూర్తయింది.

సూర్యవంశీ డైరెక్టర్ ప్రదీప్‌ని, హీరో విమల్‌ని పరిచయం చేశాడు. హీరోయిన్ బృంద డ్రస్ చేంజ్ చేసుకొని వచ్చి, వాళ్ళకెదురుగా కూర్చున్నాక పరిచయం చేశాడు.

ఫ్లడ్‌లైట్ల వెలుగులో కిషోర్‌దాస్ బృందకు, బృంద ముఖం కిషోర్‌దాస్‌కు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

బృందని పరిచయం చేశాడు.

వెంటనే ఏం మాట్లాడలేదు కిషోర్‌దాస్.

“బృంద మంజరి అవునా కాదా?” అనే సందేహంలో కొట్టుమిట్టాడుతున్నాడు కిషోర్‌దాస్.

“ఏం డైరెక్ట్రుగారూ! మీరే ఈ సినిమాక్కూడా చేయండి. హీరో విమల్‌గారూ, మిగతా టెక్నిషియన్స్ అందరూ వర్క్ చేయండి. బృంద యాక్టింగ్ నాకు నచ్చింది. ఓ.కే. డన్” అన్నాడు కిషోర్‌దాస్.

అందరి ముఖాలూ ట్యూబ్‌లైట్లల్లా వెలిగిపోయాయి ఆ మాటకి.

“అయిదు నిమిషాల్లో స్టోరీలైన్ చెప్పేస్తాను... మీరు ఓ.కే. అంటే స్క్రీన్‌ప్లే... డైలాగ్ వెర్షన్‌కి వెళ్ళిపోదాం” డైరెక్టర్ ప్రదీప్‌వేపు చూస్తూ అన్నాడు సూర్యవంశీ.

“కథకేం వుంది ప్రిపేర్ చెయ్యండి. బొంబాయి పార్టీతో ఒకసారి మాట్లాడాక – ఒక వారంలో మిమ్మల్ని కలుస్తాను. మధ్యలో ఫోన్‌చేస్తాను” అని బృందవేపు సీరియస్‌గా చూసి–

“మీదో ఓ అయిదు నిమిషాలు మాట్లాడాలి” అని వాళ్ళందరికీ దూరంగా చెట్టుకింద కుర్చీలవైపు నడిచాడు.

అక్కడలైట్లకాంతి మసక – మసకగా పడుతోంది.

ఏ విషయంలోనూ అంతసేపు ఓపికపట్టలేదు కిషోర్‌దాస్. డీలింగ్సులో ఎప్పుడూ లేదు.

“మీ పేరు బృంద. అవునా?”

“అవును.”

"పుట్టినప్పటి నుంచీ అదే పేరా? మధ్యలో పెట్టుకున్నారా?"

"వెంటనే జవాబు చెప్పలేదు, కాసేపయ్యాక-

"అదే పేరనుకుంటాను."

"అనుకోవడం ఏమిటి? తెలియదా?" నవ్వాడతను.

ఆమె మౌనంగా వుండిపోయింది.

"మీరు నన్నెప్పుడయినా చూసారా?" ఆ ప్రశ్నకు విస్తుపోయింది బృంద.

"లేదు. లేదనుకుంటాను."

"అవునో కాదో కరక్టుగా చెప్పండి. నన్ను కన్ఫ్యూజన్ పెట్టకండి" అసహనంగా అన్నాడు కిషోర్‌దాస్.

"క్రితంసారి వరంగల్‌లో... హోటల్లో మిమ్మల్ని చూశాను... మీరేనా?"

షాక్ తిన్నట్టుగా బృందవేపు చూశాడు కిషోర్‌దాస్.

అంతకంటే ముందు...."

"చూశాడో లేదో తెలీదు. అయినా ఈ విషయాలన్నీ ఇప్పుడు ఎందుకు?"

"మీ నేటివ్ ప్లేస్?"

"ఇక్కడే."

"ఇక్కడే అంటే?"

"హైదరాబాద్."

"తల్లీ తండ్రి, అక్కా, అన్నయ్యా?"

"ఎవరూ... ఎవరూలేరు... నాకెవరూ లేరు."

"అంటే మీ చిన్నప్పుడే చనిపోయారా? యాక్సిడెంటా?"

"అవుననుకుంటాను."

"అవుననుకుంటాను ఏంటీ? అవునో కాదో చెప్పండి" కొంచెం కోపంగా అన్నాడు కిషోర్‌దాస్.

"తెలీదు."

"మీకంతా తెలుసు."

"ఏంటీ?"

"మీకంతా తెలుసు, మిస్ మంజరీ."

"మంజరి... అవిడెవరు? రచయిత సూర్యవంశీ కూడా మంజరీ కథ ఆధారంగానే ఈ కథ కూడా రాసానన్నాడు. ఈ కథకు, మీకు ఏమిటీ సంబంధం?"

ఆ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేదు కిషోర్‌దాస్.

"సంబంధం ఏంటో తెలిస్తేగానీ నువ్వు మంజరివని ఒప్పుకోవా?" కోపంతో హెచ్చుగొంతుతో అడిగాడు కిషోర్‌దాస్.

"చూడండీ! మీరెవర్నో చూసి ఎవరో అనుకుని పొరపాటు పడుతున్నారు. ఆయామ్ బృంద, అంతే నాకు తెలుసు" అంటూ లేచి విసురుగా సూర్యవంశీ దగ్గరకొచ్చేసింది బృంద.

అంతవరకూ తన కూర్తాబేజులో ఆన్‌చేసి వున్న టేప్‌రికార్డర్‌ని ఆఫ్‌చేసి లేచి వాళ్ళ దగ్గరకెళ్ళాడు.

"ఓ.కే. సూర్యవంశీ! ఫోన్ చేస్తాను" అని భాగ్యరాజ్ వెంటరాగా, వెళ్ళి పోయి కారెక్కాడు కిషోర్‌దాస్.

ఎవరితోనూ ఏదీ చెప్పకుండా కారెక్కేసింది బృంద.

ఆ కారు ఆ బిల్డింగ్ పోర్టికోలోంచి బయటకొచ్చాక డ్రయివర్ ప్రక్కనే ముందు సీట్లో కూర్చున్న రామావతారం అడిగాడు బృందకు...

"అమ్మా! నేనేమైనా ప్రశ్న వేయవచ్చా ఇప్పుడు?"

"ఫర్వాలేదు అడగండి" నవ్వుతూ అంది బృంద.

"ఆ కిషోర్‌దాస్ మీతో ఏం మాట్లాడాడు?" అని అడిగాడు రామావతారం.

"ఎవరో తనకు తెల్సిన వ్యక్తి గురించి అడిగాడు. ఆ వ్యక్తి నువ్వేనా అని అడిగాడు కాదన్నాను."

"ఆ తెల్సిన వ్యక్తి ఎవరు?"

"మంజరి అట" చెప్పింది బృంద.

"మంజరి అతనికెలా తెల్సు." తనలో తను ప్రశ్నించుకున్నాడు రామావతారం. ఇంటికి చేరగానే షూటింగ్ స్పాట్‌లో కిషోర్‌దాస్, బృందని

కల్సిన విషయాన్ని రామ్‌కాశ్యప్, సైకియాటిస్టు విశ్వనాథ్‌కి ఫోన్‌చేసి చెప్పాడు రామావతారం.

*     *     *     *     *

రెండోరోజు సాయంత్రం...

లాన్‌లో కూర్చున్నారు సూర్యవంశీ, బృంద.

"ఇవాళ కామెడీ సీన్లు బాగా వచ్చాయా?" అని అడిగిందామె.

"నేను వెళ్ళలేదు. బొంబాయి పార్టీకి చెప్పాలిగా! ఆ వర్క్‌లో ఉన్నా మీతో కొన్ని విషయాలు పర్సనల్‌గా మాట్లాడాలని వచ్చాను...." ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు సూర్యవంశీ.

"అడగండి" అందామె.

సూర్యవంశీ చెప్పడం ప్రారంభించాడు.

"మొదటిరోజు ఇంటర్వ్యూ దగ్గర్నుంచి, మొన్న కిషోర్‌దాస్ మీతో మాట్లాడిన సందర్భం వరకూ మిమ్మల్ని నిశితంగా పరిశీలిస్తూ వస్తున్నాను. ముఖ్యంగా స్క్రిప్టు విషయంలో మీ రియాక్షన్ సమ్‌థింగ్ అన్ యూజువల్ అండ్ బిహేవియర్ ఆల్సో సమ్‌థింగ్ నేచురల్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ద కేరెక్టర్... అండ్ ఫీలింగ్ ఆల్సో...

నేను పదేళ్ళనుంచీ ఫీల్డ్‌లో వున్నాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసిస్టెంట్ రైటర్‌గా చేశాను. చాలామంది కొత్త నటీనటులతో మంచి ఫ్రెండ్లీ రిలేషన్స్ వున్నాయి. కానీ ఇంత సహజంగా ఒకే క్యారెక్టర్‌లో, ఒక నటి లేదా నటుడు నడించడం చాలా అరుదయిన విషయం.

చెప్పండి. మీరు ఆ రోజు నేనుండే హోటల్‌కి వచ్చి కథ గురించి అడిగినప్పుడు ఆ విషయాన్ని అప్పుడు సీరియస్‌గా తీసుకోలేదు. మీరు జూబ్లీహిల్స్ రోడ్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు ఇన్సిడెంట్ అది కాదని చెప్పినప్పుడు కానీ, మరో ఇన్నాళ్ళూ అనుకున్నాను. కానీ అది కదాని నేను ప్రస్తుతం గాఢంగా విశ్వసిస్తున్నాను.

ఈ కథకు, మీకు సంబంధం ఏమిటి?

మీరెవరు? కిషోర్‌దాస్ ఎవరు? ఎందుకొచ్చాడు?

"నేను మీ వెల్‌విషర్‌ని... మీరంటే నాకిష్టం... మీలాంటి అందమైన అమ్మాయి పక్కనుంటే... రచయితలకు మరింత భావుకత వస్తుంది. అందుకు...." నవ్వుతూ అన్నాడు సూర్యవంశీ.

పడమటి సంధ్య వింతగా మెరుస్తోంది.

ఆకాశంనిండా నలుపు, తెలుపు చారలు ఎమ్.ఎఫ్. హుసేన్ వేదిక పెయింటింగ్‌లా విశాలమైన గార్డెన్ మధ్యలో వాటర్ స్ప్రింకిల్‌లోంచి వస్తున్న నీటిధారలు వంకీలు వంకీలుగా తిరుగుతూ వింతగా మెరుస్తున్నాయి.

భారంగా ఉచ్ఛ్వాస విడిచి చెప్పడం ప్రారంభించింది బృంద.

"సూర్యవంశీగారూ... నేనెప్పుడైనా సరదాగా మాట్లాడానా... ఎందుకంటే ఐలైక్ యువర్ సెన్సిటివిటీ... అండ్ క్రియేటివిటీ ఆల్సో. నేను మిమ్మల్ని నిజమైన ఫ్రెండ్‌గా అనుకొన్నాను. అందుకే మనము విప్పి చెప్తున్నాను.

నేనే మంజరి అని మీరనుకుంటున్నారు. కాదని నేను అనుకుంటున్నాను. కానీ షూటింగ్ సమయంలో ఆ ఇన్సిడెంట్స్‌ని మార్చమనడం... ఆ ఇన్సిడెంట్స్ నా జీవితంలో జరిగినట్టుగా నేను నటించడం కేవలం యాదృచ్ఛికం మాత్రమే...." అందామె.

"కాదు బృందా... నేన్నమ్మను. మీరు నా దగ్గరేదో రహస్యాన్ని దాస్తున్నారు...." అన్నాడతను సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

"రహస్యం... రామ్‌కాశ్యప్ అంకుల్ దగ్గర, మీ దగ్గర నాకు రహస్యాలు ఏమీలేవు, వుండవు" ఖండితంగా అందామె.

"లేదు... మేడమ్! ఓపెన్ యువర్ సెల్ఫ్. ఆయా సందర్భాల్లో మీ రియాక్షన్స్ మామూలు రియాక్షన్స్‌లా లేవు. చెప్పానుకదా అన్‌యూజ్‌వల్ అని... ప్లీజ్ నాతో చెప్పండి."

రెండు నిమిషాలసేపు ఆలోచనలో పడింది బృంద.

"ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పగలను వంశీగారూ... నేనే ఎవరో తెలీని మానసిక పరిస్థితి నాలో వుంది. నేనే మంజరి అయితే... నాకు ద్రోహం

చేసిన వ్యక్తి ఎవరు? నా వాళ్ళందరూ ఎక్కడున్నారు? నేను రామ్‌కాశ్యప్ అంకుల్ దగ్గరకి ఎలా వచ్చాను? అంతకుముందు నేనెక్కడున్నాను? నన్ను వేధిస్తున్న ప్రశ్నలు కూడా ఇవే. నిజం...." చేతివేళ్ళతో కనురెప్పలు మూసుకుంటూ అంది బృంద.

"పోనీ ఈ ప్రశ్నకైనా జవాబు చెప్తారా?"

"అడగండి...."

"కిషోర్‌దాస్‌కి మీకు మధ్య జరిగిన సంభాషణ ఏమిటి?"

"ఆయన కూడా నువ్వు మంజరివా? అని అడిగాడు. ఆ జవాబుకి ఆశ్చర్యపోయాడు సూర్యవంశీ.

"ఇంతకుముందు ఆయన మీకు తెలుసా?"

"తెలీదు...."

"నిజం చెప్పండి...."

"ఆయన్ని కూడా ఎక్కడో చూసినట్టుగా వుంది."

"ఎక్కడ...?"

"అదే జ్ఞాపకం రావడంలేదు...."

"అతన్ని చూడగానే మీ రియాక్షన్స్... పాజిటివా... నెగెటివా?"

"నెగెటివే... అతను కూడా నా శత్రువు అనే భావమే నాకు ఇప్పటికి కలుగుతోంది. అతను నాకేం అన్యాయం చేసాడో మాత్రం తెలీడం లేదు."

సన్నటి చీకటి దగ్గంగా అలుముకుంది.

వాళ్ళిద్దరికీ కొంచెం దూరంలో దట్టమైన గుబురు... ఆ గుబురువెనక దాదాపు వాళ్ళ సంభాషణ ప్రారంభమైన దగ్గర్నుంచీ రామ్‌కాశ్యప్ అక్కడున్నాడని వాళ్ళిద్దరికీ తెలీదు.

"నాదో సీరియస్ క్వశ్చన్...."

"అడగండి...."

"మీరు మంజరి అవునో కాదో తెల్సుకోవడం ఎలా?"

"చాలా చిత్రమైన ప్రశ్న. నేను కాదని నేనేచెప్తున్నాప్పుడు... మీరీ ప్రశ్న వెయ్యడం ఆశ్చర్యంగా లేదూ...? నేను మంజరి అయితే ఏం జరుగుతుంది?

కాదు అనుకుంటే ఏం జరుగుతుంది? దానివల్ల మీకు ప్రత్యేకంగా ఏదైనా లాభం వుందా?"

ఆ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు సూర్యవంశీ.

"ప్రత్యేకంగా లాభంలేదు. కాని నష్టం వుంది."

"ఏమిటా నష్టం...?"

"కిషోర్‌దాస్ నిజంగా ప్రొడ్యూసర్ అయితే... అతను సినిమా తియ్యకపోతే నేను నష్టపోతాను. అందుకే ఈ బాధ... పైగా మీరంటే ఇష్టం...." ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడతను.

"అవున్నిజమే... అందుకు నన్నేం చేయమంటారు?"

"మీరు చెప్పిన మాటలన్నీ ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను ఎందుకో తెలుసా?" అంటూ తనతో తెచ్చిన ప్లాస్టిక్ ఫోల్డర్‌ని ఓపెన్ చేస్తూ అన్నాడతను.

"మళ్ళీ ప్రశ్న మొదటికొచ్చిందా?"

"లేదు... మిమ్మల్ని మంజరిగా ప్రూవ్ చేసుకోవాల్సిన సమయం వచ్చింది...." అంటూ తన బండిల్‌తీసి, దానికున్న రబ్బర్ బాండ్‌ని పక్కన పడేసి, ఆ బండిల్‌ని టేబుల్‌మీద పెట్టాడు.

"ఈ ఉత్తరాలన్నీ... జెమిని టి.వి.కి కొన్ని... మీ ఫోటోని ముఖచిత్రంగా ప్రచురించిన సితార, జ్యోతిచిత్ర ఆఫీసులకు కొన్ని వచ్చినని, మీరే చదవండి...." అంటూ దాదాపు వందకు పైగా వున్న ఆ ఉత్తరాల్లో కొన్నింటిని ఆమెకిచ్చాడతను.

ఆ ఇన్‌లాండ్ కవర్స్‌ని ఒక్కొక్కదాన్ని ఓపెన్ చేసి చదువుతోందామె. ఇంటర్వ్యూ గురించి ప్రశంసలు ఎక్కువగా వున్నాయి. మీ సినిమాకోసం ఎదురు చూస్తున్నామని కొంతమంది, మీ ఫోటో పంపమని ఇంకొంతమంది రాశారు.

వాటిల్లోంచి పది ఉత్తరాలను ప్రత్యేకంగా తీశాడు.

"ఈ ఉత్తరాలను చదివి చెప్పండి" అన్నాడు సూర్యవంశీ, తను చదువు తున్న లెటర్స్‌ని పక్కనబెట్టి, ఆ ఉత్తరాల్లో ఒక ఉత్తరాన్ని ఓపెన్ చేసింది. అందులోని సంబోధన చూడగానే ఉలిక్కిపడింది.

డియర్ మంజరీ!

నువ్వేనా... నీ ఫోటో సితార సినిమా పత్రిక ముఖచిత్రమ్మీద చూడగానే చాలా ఆశ్చర్యానికి లోనయ్యాను. నాతో చదువుకొన్న మంజరి సినిమా యాక్టరైందని తెలియగానే ఎంత సంతోషానికి లోనయ్యానో తెలుసా? మా కాలనీ వాళ్ళందరికీ చెప్పాను. మనతో చదువుకున్న ఫ్రెండ్స్ రమా, పద్మా, కళ్యాణి, మోతీలక్ష్మి, కమల, ముంతాజ్ వీళ్ళందరూ ఎక్కడున్నారో కానీ... ఎంతో ఆనందిస్తారో కదా...."

అవునూ... నీ ముఖం చూడగానే నువ్వు కాదని అనుకొన్నాను. ముఖం అంతగా మారిపోయిందేమిటి? సినిమా యాక్టర్స్ రకరకాల మేకప్‌లు వేసుకుంటారట కదా... అందువల్ల అలా మారిపోయిందా? నీ వరకూ ఈ ఉత్తరం వస్తుందని నాకైతే నమ్మకంలేదు. కానీ, నువ్వు ఈ ఉత్తరం చదివితే, నీ. పి.ఏ. చేతనైనా... కనీసం నాకు ఉత్తరం రాయిస్తావు కదూ!

నీ ఉత్తరం కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తుంటాను.

పి. శైలజ
శ్రీకాకుళం.

"శైలజ అనే ఆమె మీ క్లాస్‌మేటని తెలుస్తోంది. ఆమె మీకు జ్ఞాపకం వుందా? ఎక్కడ చదువుకొన్నారు మీరు?" అడిగాడు సూర్యవంశీ.

లేచి నిలబడి జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది బృంద.

కానీ జ్ఞాపకం రావడంలేదు.

శైలజ... ఉహు... గుర్తురావడంలేదు. అస్సలు నేను చదువుకొన్న విషయమే నాకు గుర్తురావడలేదు...." పాలిపోయిన ముఖంతో చెప్పిందామె.

"పోనీ ఈ ఉత్తరం చదవండి...." అంటూ ఇంకో ఉత్తరాన్ని ఆమె చేతికిచ్చాడతను.

హాయ్ మంజూ...

హౌ అర్యూ... నేను ప్రియను. ప్రస్థుతం శ్రీవారు, పిల్లలతో అవకాపల్లిలో వుంటున్నాను.

ఏమీ తోచక ఒకరోజు జెమిని టి.వి. ఆన్ చెయ్యగానే నువ్వు కనిపించావు. నీ మాటలు వినిపించాయి. ఎన్నాళ్ళయిందోకదా నిన్ను చూసి... ఏమైపోయావు

నువ్వు అని చాలాసార్లు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అనుకునేదాన్ని, నువ్వు సడన్‌గా సినిమా యాక్టర్‌ని అయ్యావని తెలియగానే మనం కల్సితిరిగిన రోజులు గుర్తు కొచ్చి ఎంత సంతోషించానో తెలుసా?

సినిమాలంటే నీకు అసహ్యంకదా... సినిమా హీరోయిన్‌ని అయ్యావేంటి? నా ఫ్రెండ్ సినిమా యాక్టర్ అని చెప్పుకోవడం నాకు చాలా గొప్పగా వుంది తెలుసా?

మనిద్దరం మన డాబామీద రాత్రిళ్ళు పడుకొని, గంటలు గంటలు కబుర్లు చెప్పుకొనే వాళ్ళంకదా... అది నాకిప్పటికీ జ్ఞాపకం వుంది. సినిమా వాళ్ళందరూ వైజాగ్ సూటింగ్‌కి వస్తారుకదా, నువ్వు కూడా వస్తావా? నాతో మాట్లాడటానికి వీలవుతుందా? నీ సంతకంతో నీ ఫోటో పంపు అవునూ... బృంద ఏమిటి? నాకైతే మంజరి పేరే బాగుంది. ఉంటాను...

విత్ స్వీట్ మెమరీస్

నీ ప్రియ

చదివి సూర్యవంశీవేపు చూసి "ఈ ప్రియ ఎవరో కూడా నాకు జ్ఞాపకం రావడంలేదు" అందామె. దాంతో చాలా నిరుత్సాహానికి గురయ్యాడు సూర్యవంశీ.

ఇంకో మూడు ఉత్తరాలు కూడా అలాంటివే...

"వీళ్లందరూ మీతో చదువుకున్న క్లాస్‌మేట్స్ అండ్ నైబర్ ఫ్రెండ్స్... కానీ ఎక్కడ చదువుకున్నారో, ఎక్కడుండేవాళ్ళో రాయలేదు. మీక్కూడా ఆ విషయా లేమీ జ్ఞాపకం లేదు. మీరు ఇన్‌సోమ్నియా అనే వ్యాధితో బాధపడుతున్నారను కొంటాను. ఏ విషయాలు కూడా గుర్తించలేకపోవడం బాధగా వుంది."

సూర్యవంశీకి ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో అర్ధంకావడం లేదు. ఆ సమయంలోనే గుబురు పొదల్లోంచి బయటకొచ్చి వాళ్ళవేపు నడిచాడు రామ్‌కాశ్యప్.

'ఏమిటి! సీరియస్‌గా చూస్తున్నారు. కథ గురించా?"

ఆయన్ని అక్కడ, ఆ సమయంలో చూడటంతో కొంచెం విస్మయానికి లోనైంది బృందా.

"బృంద జీవితమనే కథ గురించి...?" నవ్వుతూ అన్నాడు సూర్యవంశీ.

"సూర్యవంశీగారూ! నా లైఫ్‌మీద సీరియస్‌గా పరిశోధన చేస్తూన్నారంకుల్" అంది బృంద నవ్వుతూ.

"మీ డిస్కషన్ అంతా విన్నాను. మిస్టర్ సూర్యవంశీ... నాదోసలహా... ఉత్తరాలు రాసిన ఫ్రెండ్స్‌ను కలిసి, మాట్లాడితే అన్ని వివారలు తెలుస్తాయనుకొంటాను. ఏమంటావ్?"

"బ్రిలియంట్ ఐడియా... ఇన్వెస్టిగేషన్ నా హాబీ... బృంద అంగీకరిస్తే నేనాపని చేస్తాను" ఉత్సాహంగా అన్నాడు సూర్యవంశీ.

"ఇన్వెస్టిగేషన్ ఎందుకూ? నా మానావ నన్ను వదిలేయకూడదూ" అంది బృంద చేతులుజోడిస్తూ.

"లేదు బృందా! యాక్షన్స్. రియాక్షన్స్, నీ బిహేవియర్ ఏర్పడుతున్న కొత్త అట్మాస్పియర్ అంతా కొత్తమలుపుకి దారితీస్తుందని నా అభిప్రాయం, నీకేదైనా ఆపద సంభవించడానికి అవకాశం వుందా అనేది పాయింట్...."

"నాకా? ఆపదా? ఎందుకు?" ఆమెలో ఒక్కసారిగా సీరియస్‌నెస్ చోటు చేసుకుంది.

"సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ ఎనలైజేషన్ ప్రకారం... గతంలో నీ చుట్టూ కొన్ని సంఘటనలు జరిగాయి. వాటికి నువ్వు సాక్ష్యంగా నిలిచావు. ఆ సాక్ష్యం లేకుండా చెయ్యడానికి కొంతమంది ప్రయత్నిస్తే...."

"ఎవరా కొంతమంది?"

"ఎవరో, ఎవరికీ తెలీదు...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"నేను మాత్రం కిషోర్‌దాస్‌ని అనుమానిస్తున్నాను" అన్నాడు సూర్యవంశీ.

అయిదు నిముషాలసేపు అక్కడెవరూ మాట్లాడుకోలేదు.

బృందలో మొదటిసారి భయం చోటు చేసుకుంది.

తన మానసిక ఉద్వేగం, రియాక్షన్స్... తనకేమీ జ్ఞాపకం లేకపోవడంతో, వీటన్నిటికీ ప్రబలమైన కారణాలేవో వుండి వుంటాయనే విషయం ఆమె కూడా నమ్ముతోంది. తను మళ్ళీ మామూలు మనిషి కావాలని ఆమె కూడా కోరుకుంటోంది.

"ఎస్... సూర్యవంశీగారూ... మన సినిమా షూటింగ్ వైజాగ్‌లో వుందా?"

"ఉంది. కైలాసగిరి కొండమీద... సాంగ్ పిక్చరైజేషన్...." చెప్పాడతను.

"నెక్ట్స్ షెడ్యూల్‌లో ఆ సాంగ్ పిక్చరైజేషన్ పెట్టండి. ఈలోపు మీకు నాకు ఉత్తరాలు రాసిన ఫ్రెండ్స్‌ని కలిసిరండి. వాళ్ళను అక్కడకు రమ్మనండి. వాళ్ళతో మాట్లాడదాం...."

"ఏమిటా కథ?" అడిగిందామె అసక్తిగా.

"ఒక ఈగ తనపేరు మర్చిపోయిందట" సంక్షిప్తంగా కథను చెప్పాడు సూర్యవంశీ.

అంతా విని నవ్వాడు రామ్‌కాశ్యప్. బృంద.

"ఈగ సరే... ఆ కథలో విలన్ లేడుగా" అన్నాడు రామ్‌కాశ్యప్.

ఆ జోక్‌కి పెద్దగా నవ్వింది బృంద.

"నే వెళ్తాను–" లేచి నిలబడ్డాడు సూర్యవంశీ.

"మీరేం వర్రీ కాకండి, అన్నీ మన మంచికే... గుడ్‌నైట్" చెప్పి బయటికి వెళ్ళి కారెక్కాడు సూర్యవంశీ.

లాన్‌లోంచి ఇంటికెళుతూ అడిగింది బృంద.

"అంకుల్... నేనిప్పుడు ప్రమాద పరిస్థితిలో వున్నావా?" ఆమె కళ్ళల్లో చిన్న భయం. అది గమనించాడు రామ్‌కాశ్యప్.

"డోంట్‌వర్రీ... నేను లేనూ... అనంత్ లేడూ... అనంత్ లైక్స్. యూ వెరీమచ్" అంటూ హాల్లోకెళ్ళి తన బెడ్‌రూమ్‌వేపు నెమ్మదిగా నడుస్తున్నాడతను.

తలవని తలపుగా అనంత్ ప్రశక్తిని ఎందుకు తెచ్చాడు రామ్‌కాశ్యప్.

ఏదో విధంగా తన ఎదుట అనంత్ ప్రసక్తి తీసుకువస్తున్న రామ్‌కాశ్యప్ ఆలోచన ఏమిటి? తన రూమ్‌కెళుతూ ఆలోచించిందామె.

*  *  *  *  *

వీడియో ప్రొజెక్టర్ ఆన్ అయింది.

టీ.వీ. తెరమీద మొదట సన్నని గీతలు తర్వాత సినిమా షూటింగ్ హడావిడి... అటూ ఇటూ తిరుగుతున్న లైట్‌బోయ్స్... హీరో విమల్‌కి టచప్ చేస్తున్న మేకప్‌మ్యాన్...

ఇంకో పక్క డైరెక్టర్ ప్రదీప్ అరుపులు... సెలైన్స్... సైలెన్స్ అని.

సడన్‌గా తెరమీద ప్రత్యక్షమైంది బృంద... ఆమెను చూడగానే ఈజీచైర్లో చేరబడి కూర్చున్న అరవింద్, నిటారయ్యాడు. టీపాయ్ మీదున్న సిగరెట్ తీసి వెలిగించి, కళ్ళార్పకుండా స్క్రీన్‌వేపే చూడసాగాడు.

స్పష్టంగా... అతిస్పష్టంగా కనిపిస్తున్న బృంద వివిధ రకాల ముఖ కవళికలు... శరీర భంగిమలు – అరవింద్... స్వేదగ్రంధుల్లోంచి సన్నటి తడి... ఎర్రటి అతని ముఖంమీద అలుముకున్న చమట.

ఆ క్యాసెట్‌ను పావుగంటసేపు మాత్రమే చూశాడతను. కిషోర్ దాస్ బృందను ఇంటర్వ్యూ చేసిన ఆడియో క్యాసెట్‌ని ప్లేచేసి ఆ మాటల్ని జాగ్రత్తగా విన్నాడతను.

ఆ సమయంలో అతని ఎదురుగా కిషోర్‌దాస్, ఇంకో ఇద్దరు పరిచయస్తులు వున్నారు.

అరవింద్ రియాక్షన్స్ ఎవరికీ అర్ధంకావు. భయంకరమైన విషాద సమయంలో అతను నవ్వగలడు. అందరూ నవ్వుకునే ఉత్సాహకరమైన సమయంలో అతను విషాదంగా వుంటాడు.

“క్యాసెట్‌లో అమ్మాయి బావుంది. గుడ్ పెర్‌ఫామెన్స్” అంటూ మిగతా ఇద్దరు వ్యక్తులవేపు చూశాడు.

కిషోర్‌దాస్ ఆ వీడియోక్యాసెట్‌ని, అడియో క్యాసెట్‌ని తీసి అరవింద్ సర్పనల్ బీరువాలోపెట్టివచ్చి కూర్చున్నాడు. అరవింద్ ఆ క్యాసెట్‌లోని బృందను చూడగానే ఎగిరి గంతులేసి విధ్వంసం చేస్తాడని అతను వూహించాడు. అందుకు విరుద్దంగా అంతా జరిగింది.

“మీరు టచ్‌లో వుండండి. వీలైతే ఆదివారం కనిపించండి. ఆ జ్యూయలర్ మర్చంట్ కిషన్‌కుమార్ శనివారం రాత్రిలోగా ఆ ఐదులక్షలు తెచ్చిస్తే సరి. లేకపోతే ప్రతి ఆదివారం ఉదయం బాంద్రాలోని వినాయక టెంపుల్‌కి అతను వెళతాడు. అక్కడ ఫినిష్ చేసేయ్యండి. ఎందుకైనా మంచిది. ఈ రెండ్రోలుజు టెంపుల్ దగ్గర ఎట్మాస్ఫియర్‌ని వార్‌చేయండి” కూల్‌గా చెప్పాక వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

సరిగ్గా అదే సమయంలో మొబైల్ ఫోన్ మోగింది.

హైదరాబాద్‌లోని పార్టీ ప్రెసిడెంట్ జయభూషణ్ వింది.

"ఆ... నేనే చూడు అరవింద్... ఈమధ్య చిన్న విచిత్రం జరిగింది. ఏదో సినిమా ఆడియో ఫంక్షన్‌కి వెళ్ళాను చీఫ్‌గెస్టిగా, అందులో ఆ సినిమా హీరోయిన్‌ని చూసి స్టన్ అయ్యాను. మంజరి... నీ మంజరీ లాగానే వుంది."

"మంజరి బతికే వుందా? నాకెందుకు చెప్పలేదు?"

"ఆ అమ్మాయి చనిపోయిందనే, మరేం ఫికర్‌లేదని చెప్పావ్?"

అయిదు నిముషాలసేపు ఏకధాటిగా మాట్లాడాడు జయభూషణ్.

జయభూషణ్ మంజరి గురించి ఫోన్ చేస్తాడని వూహించని అరవింద్ అంతా విన్నాక. "మంజరిని నువ్వు చూశావా?" అని అన్నాడు తడారిపోయిన గొంతుతో.

"ఆ అమ్మాయి మంజరి కాదని అందరూ అంటున్నారు."

"మనలాంటి క్రిమినల్స్ ఏ విషయంలోనూ అజాగ్రత్తగా వుండకూడదు. రెండు నెలల్లో ఎలక్షన్స్ వస్తున్నాయి. మనం ఇప్పుడు రైజింగ్ పొజిషన్‌లో వున్నాం మంజరి బతికే వుంటే మనకి నష్టం కాదనుకో. వదిలేసెయ్! నువ్వే స్వయంగా తేల్చుకో, అర్థమైందా? నీ ఫోన్ కోసం వెయిట్ చేస్తుంటాను" ఫోన్ కట్టయింది.

జయభూషణ్ ఫోన్ వచ్చాక చిరాకుపడ్డాడు అరవింద్.

"ఆదివారం కిషన్‌కుమార్ వ్యవహారం ముగిశాక మనం హైదరాబాద్ వెళుతున్నాం" అని కిషోర్‌దాస్‌తో చెప్పి పక్కరూమ్‌లోకి వెళ్ళిపోయాడు అరవింద్.

ఆదివారం అప్పటికి రెండు రోజులుంది.

* * * * *

విశాఖపట్నంలో కైలాసగిరి కొండ.

కొండమీద ఒకపక్కన శివపార్వతుల విగ్రహం, మరోపక్క వెంకటేశ్వర స్వామి నామాల విగ్రహం. మండుటెండలో మిలమిల మెరుస్తున్నాయి.

కొంచెం దూరంలో ఒకపక్క షూటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోపక్క డాన్స్ డైరెక్టర్, హీరోయిన్ బృంద, హీరో విమల్ చేత రిహార్సల్ చేస్తున్నాడు. ఆ వాతావరణం చాలా బాగుంది బృందకు.

అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలయింది. మరో అయిదు నిముషాల తర్వాత షూటింగ్ స్టార్ట్ అయింది.

నగారాలోంచి వినిపిస్తున్న పాటకు అనుగుణంగా పాటను చిత్రీక రిస్తున్నాడు డాన్స్‌డైరెక్టర్.

ఒక్కొక్క షాట్ చిత్రీకరించటానికి గంటకుపైగా సమయం పడుతోంది.

రెండు గంటలు గడిచాయి.

చెట్టుకింద కూర్చున్న రైటర్ సూర్యవంశీ కళ్ళు కొండమీద కొచ్చి పార్కింగ్ ప్లేస్‌లో ఆగుతున్న వాహనాలమీదే వుంది.

అక్కడకు షూటింగ్‌కు రావటానికి ముందురోజు బృందకు ఉత్తరాలు రాసిన ఫ్రెండ్స్ ఇద్దరికీ టెలిగ్రామ్స్ కొట్టాడు సూర్యవంశీ బృంద పేరు మీద.

మీట్ మి ఎట్ కైలాసగిరి ఆన్ సండే ఈవెనింగ్ 5 ఓ క్లాక్.

–యువర్స్ మంజరి. మూవీ ఆర్టిస్ట్.

బృందకు ఉత్తరాలు రాసిన శైలజ, ప్రియ వస్తారన్న నమ్మకంతోనే ఆ పార్కింగ్ ప్లేస్ వైపు చూస్తున్నాడు సూర్యవంశీ. మాటిమాటికీ చేతి వాచీ వైపు చూసుకుంటున్నాడతను.

సరిగ్గా 5.15 నిముషాలయింది.

రెండు కార్లు వచ్చి ఆగాయి. ఒక కారులోంచి ఇద్దరు మహిళలు దిగారు. వాళ్ళిద్దరికీ దాదాపు నలభైఏళ్ళ వయసుంటుంది.

వాళ్ళు షూటింగ్ జరుగుతున్న ప్రదేశానికి వస్తుండటంతో ఎదురు వెళ్ళాడు సూర్యవంశీ.

"మీరు శైలజా, ప్రియ అవునా?"

"అవునండి."

"కూర్చోండి." చెట్టుకింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీలు చూపిస్తూ అన్నాడు. వాళ్ళిద్దరూ ముభావంగా వున్నారు. ఇద్దరి ముఖాల మీద పట్టిన చెమటను తుడుచుకొని నలువేపులా చూస్తున్నారు.

బృందను చూడటానికి, కలుసుకోవడానికి వచ్చిన ఆనందం వారి ముఖాల్లో కనిపించడంలేదు. సూర్యవంశీ లేచి బృంద దగ్గర కెళ్ళాడు.

మరో అయిదు నిమిషాలకు బృంద అక్కడికొచ్చింది.

వారి ముగ్గురికీ దూరంగా నుంచున్నాడు సూర్యవంశీ.

"చెప్పండి. మీ ఉత్తరాలు అందాయి. మిమ్మల్ని కల్సుకోవడం నాకు ఆనందంగా వుంది. మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుగా వుంది" అంది బృంద తనని చూడగానే వాళ్ళు ఎగిరి గంతేసి, కౌగిలించుకుని పాత ముచ్చట్లన్నీ చెప్తారని ఊహించిన బృందకు కొంచెం నిరాశగా వుంది.

"అయామ్ సారీ బృందగారూ! అయ్‌మీన్ మంజరిగారూ. మిమ్మల్ని ఫోటోలో చూసి మా మంజరి అనుకొన్నాం... కాదు...." అంటూ శైలజ పక్కనున్న ప్రియవేపు చూసింది.

"అవును... మీరు మంజరి కాదు...." ప్రియ కూడా అంది.

ఆశ్చర్యపోవడం సూర్యవంశీ పనైంది.

ఫోటో చూసి నువ్వు మంజరివని అంత అభిమానంగా ఉత్తరం రాసిన ఆ శైలజ, ప్రియలు ఏదో కృత్రిమంగా ప్రవర్తిస్తున్నారని అన్పించింది సూర్యవంశీకి.

"సారీ ఫర్ స్ట్రంబింగ్ యూ...." అని లేచి నమస్కరించారు శైలజ, ప్రియ.

నేను మంజరిని కానా? మరి నేనెవరు? మళ్ళీ మొదటి ప్రశ్న తలెత్తింది.

వాళ్ళిద్దరూ ముందుకెళుతూ సూర్యవంశీ దగ్గర ఆగారు.

"హీరోయిన్, బృంద ఏ హోటల్‌లో వుంటున్నారు?" అడిగింది శైలజ.

"ఏం?"

"ఫోన్‌లో మాట్లాడొచ్చా?" అంది ప్రియ.

"అరగంటసేపు మీరిక్కడే మాట్లాడొచ్చు" అన్నాడు సూర్యవంశీ.

"మీరెవరు? ఆవిడ పి.ఏ.నా?" అడిగింది శైలజ.

"అవును."

"మీ ఫోన్ నెంబర్. సెల్ నెంబర్ నాకిస్తారా?" అడిగిందామె.

తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు సూర్యవంశీ.

"చెప్పండి. ఆమె మీ ఫ్రెండ్ మంజరీయేనా?" అడిగాడు సూర్యవంశీ.

"నేను ఫోన్ చేస్తాను. బృందతో మాట్లాడతాను" అంటూ కారెక్కారు ఇద్దరూ.

కారు ముందుకెళ్ళిపోయింది. ఆ కారువేపే చూస్తూ బృంద దగ్గర కొచ్చాడు సూర్యవంశీ.

"వాళ్ళు మిమ్మల్ని గుర్తు పట్టలేకపోయారా?" సూటిగా ప్రశ్నించాడు అతను.

"తెలీదు. కొత్త వ్యక్తిని చూసినట్టుగానే చూశారు. కానీ వాళ్ళ మొహంలో నాకెందుకో సంతోషం కనిపించలేదు. నేను వాళ్ళ ఫ్రెండ్‌ని కాకపోయినా, ఒక సినిమా యాక్టర్‌గా వాళ్ళలో కొంతైనా సంతోషం కనిపించాలిగా. మరీ అయిదు నిమిషాలు కూడా వుండకుండా వెళ్ళిపోయారేమిటి?"

"మిమ్మల్ని వాళ్ళు మంజరిగా గుర్తుపట్టి కూడా గుర్తు పట్టనట్టుగా నటించి వెళ్ళిపోయారేమో" సాలోచనగా అన్నాడు సూర్యవంశీ.

"అలా ఎందుకు?" కొంచెం భయంగా అంది బృంద.

ఇంతలో అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు అక్కడకు రావడంతో షూటింగ్ స్పాట్‌కి వెళ్ళిపోయింది బృంద.

కుర్చీలో కూలబడ్డాడు సూర్యవంశీ, అతని మెదడు నిండా చిక్కుముళ్ళ లాంటి ప్రశ్నలు. అతనక్కడ గమనించిన విషయం ఒకటుంది.

శైలజ, ప్రియలు రావడానికి ముందు ఒక మారుతి అక్కడికి వచ్చి ఆగింది. అందులో క్లోజ్ చేసిన కలర్ గ్లాస్‌లోంచి ఒకవ్యక్తి వాళ్ళిదర్ని గమనించి వాళ్ళిద్దరూ కారెక్కిపోయాక రిలాక్స్ అయ్యాడు.

శైలజ, ప్రియ వెళ్ళిన అంబాసిడర్ కారు వెనకే ఆ మారుతీకారు కూడా వెళ్ళిపోయింది.

ఆ మారుతీకారు కొంతదూరం వరకూ అంబాసిడర్ కారును అను సరించింది.

ఆ తర్వాత ఆ కారులో కూర్చున్న వ్యక్తి డ్రైవర్‌తో యిలా చెప్పాడు.

"నేరుగా ఎయిర్‌పోర్ట్‌కి పోనీ."

ఆ కారు మరో ఇరవై నిమిషాల తర్వాత ఎయిర్‌పోర్ట్‌లో ఆగింది.

వైజాగ్ నించి హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్ మరో పది నిముషాలు తర్వాత రావడం, అతనందులో ఎక్కి కూర్చోవడం జరిగిపోయాయి.

ఆ వ్యక్తి ఎవరు? ఎందుకు శైలజ, ప్రియల్ని అనుసరించాడు? నిజంగా శైలజ, ప్రియలు బృందను గుర్తుపట్టలేదా?

*  *  *  *  *

హోటల్ డాల్ఫిన్‌లో, తన రూమ్‌లో కూర్చుని బొంబాయి పార్టీ కోసం స్క్రీన్‌ప్లేని తయారు చేస్తున్న సూర్యవంశీ.

సెల్‌ఫోన్ మోగడంతో, దానికోసమే ఎదురుచూస్తున్నట్టుగా వెంటనే అందుకొని బటన్ ప్రెస్ చేశాడు.

"సూర్యవంశీ... స్పీకింగ్...."

"నేను... శైలజ... ఈవెనింగ్ కైలాసగిరికి వచ్చాంకదా...."

"చెప్పండి...."

"మంజరి అక్కడలేదా...?" ఆ పిలుపుకు షాక్ తిన్నాడు సూర్యవంశీ.

"మంజరి అంటే బృంద. ఆమె రూమ్‌లో వున్నారు. రాత్రి పదకొండయి పోయిందిగా... బెడ్‌మీదకు వెళ్ళిపోయుంటారు. రేపు షూటింగ్ వుంది. డిస్టర్బ్ చేయడం బావోదు. చెప్పండి. ఫర్వాలేదు... సాయంత్రం మీరు ఆమె మీ ఫ్రెండ్ మంజరి కాదన్నారు కదూ...." గుర్తుచేశాడు సూర్యవంశీ.

"చూడండి సార్... బృందను చూడగానే ఆమె మంజరీయే అని మేం గుర్తుపట్టాం... మంజరి చచ్చిపోలేదని చాలా సంతోషించాం. కానీ, మంజరిని మంజరిగా గుర్తుపట్టినా, అక్కడ ఎక్కువ సేపు మాట్లాడినా మాకు ప్రమాదం అని వెనక్కి వచ్చేశాం... ఈ విషయం చెప్పడానికి యిప్పుడు ఫోన్ చేస్తున్నాను."

ఈ న్యూస్ మరీ షాకింగ్‌గా వుంది సూర్యవంశీకి.

"బృందను మంజరికూడా...."

"మాకు...? ఎందుకు...?"

"ఆమెను కలిసినా మంజరి అని గుర్తించవద్దని... మమ్మల్నొ వ్యక్తి హెచ్చరించాడు. గుర్తించకుండా వుండటానికి మా ఇద్దరికీ చెరో పదివేలు గిఫ్ట్‌గా యిచ్చాడు."

"చెరో పదివేలు గిఫ్ట్‌గా ఇచ్చాడా?"

"ఎవరా వ్యక్తి?"

"ఎవరా వ్యక్తి?"

"పేరు తెలీదు...."

"ఆ వ్యక్తి మిమ్మల్ని ఎప్పుడు కలిసాడు?"

"మంజరిని మేం కలవటానికి మూడు గంటల ముందు. మా ఇళ్ళకు వ్యక్తి స్వయంగా వచ్చాడు...." చెప్పింది శైలజ.

"ఇంకా ఏం చెప్పాడా వ్యక్తి...?" అడిగాడు సూర్యవంశీ.

"మంజరి మా స్నేహితురాలు అనే విషయం పూర్తిగా మర్చిపోమన్నాడు సార్... మా మంజరి ఏదో ప్రమాదంలో వుందని మాకనిపిస్తోంది... ఈ విషయాన్ని ఆమెకు తెలియజేయండి. ఉయ్ విష్ ఆల్‌హర్ సక్సెస్ అని కూడా తెలియజేయండి... థాంక్యూ... గుడ్‌నైట్...."

సూర్యవంశీకి వెంటనే కిషోర్‌దాస్ గుర్తొచ్చాడు.

"కిషోర్‌దాస్ శత్రువర్గానికి చెందిన వ్యక్తి అయితే మంజరిని మంజరిగా గుర్తించొద్దని ఎందుకంటాడు? అందుకు ఇద్దరికీ ఇరవైవేల రూపాయలు గిఫ్ట్‌గా ఎందుకిస్తాడు?"

ఆ వ్యక్తి బృందకు సహాయం చేయడం కోసం ఈ పని చేశాడా? లేక ఏదైనా కుట్రలో భాగంగా ఈ పని చేశాడా?

సోడా కలుపుకోకుండా మూడు పెగ్గులు తాగినా సూర్యవంశీకి నిద్రపట్టలేదు.

ఒక రియల్‌స్టోరీ, ఇంత మిస్టరీ స్టోరీగా మారుతుందని అతనూహించ లేదు.

తనకి తెల్సిన విషయం ఎవరికి చెప్పాలి!

రామ్‌కాశ్యవ్‌తోనా? విశ్వనాధ్‌తోనా?

బృందతో చెప్తే– ఆమెతో ఈ విషయమై చర్చిస్తేనే బాగుంటుందనిపించింది సూర్యవంశీకి.

శైలజ, ప్రియలు బృందను కలవడంవల్ల, బృంద జీవితానికి సంబంధించిన చాలా విషయాలు తెలుస్తాయని వూహించిన సూర్యవంశీకి చాలా నిరుత్సాహంగా వుంది.

ఆలోచిస్తున్నకొద్దీ అతనిలో భయం చోటుచేసుకుంటోంది. ఆలోచిస్తున్న కొద్దీ అతనికి బృంద మీద కూడా అనుమానం వస్తోంది.

"కీలకమైన ప్రశ్న! అలాగే అయితే...

ఎందుకొచ్చింది...?

"ఇప్పుడేం జరుగుతుంది... జరగబోతోంది...?"

ఏదో భయం... తన వెంట తెచ్చుకున్న నేడే విడుదల సినిమా స్క్రిప్ట్‌ను చూశాడు. ఆ స్క్రిప్టు ప్రకారం.

హీరోయిన్ మంజరిని గుర్తుపట్టిన విలన్ బొంబాయి నుంచి ఈ షూటింగ్ స్పాట్‌కి వస్తాడు. అది నిజంగా జరుగుతుందా...?

"అయితే ఎవరా విలన్? హీరోయిన్‌ని మోసంచేసిన వ్యక్తేనా...?"

సూర్యవంశీ పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాడు.

* * * * *

సాంగ్ పిక్చరైజేషన్ చాలా ఈస్థటిక్‌గా రావడంతో ఆనందంగా వున్నాడు డైరెక్టర్ ప్రదీప్.

ఆ రోజు రాత్రి డాల్ఫిన్ ఫామిలీ రెస్టారెంట్లో డిన్నర్ ఏర్పాటు చేశాడు ప్రొడ్యూసర్ సుమంతరావు.

హీరో విమల్, హీరోయిన్ బృంద, కమెడియన్ రామబ్రహ్మం, డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ, కెమెరామెన్ తదితరులున్నారు. సుమంతరావు ఫ్రెండ్స్ ఇద్దరు, లోకల్ ఇండస్ట్రియలిస్టులు కూడా వచ్చారు.

"మీ గురించి మా సుమంత్ చెప్పాడు. మాక్కూడా ఓ సినిమా తీయాల నుంది. నేడే విడుదల సినిమా రిలీజ్ నాడే ఆ సినిమాను ఎనౌన్స్ చేద్దాం" డైరెక్టర్ ప్రదీప్‌తో చెప్పాడు ఒక ఇండస్ట్రియలిస్టు.

"స్టోరీ లైన్ ఎలా వుండాలనుకుంటున్నారు...." అడిగాడు సూర్యవంశీ.

"ఇంకా ఏం అనుకోలేదు. వచ్చేవారం మేం మద్రాస్ వెళ్తున్నాం. హిట్టయిన తమిళం, మళయాళం సినిమాలు చూడటానికి...."

"నచ్చితే ఆ సినిమా తీసుకుంటారా...?"

"లేదండీ... అలాంటి పిచ్చిపని ఎందుకు చెయ్యడం... అదే సబ్జెక్టుతో కథ తయారుచేస్తే సరి...."

"కాపీ కథలెందుకండీ... తెలుగు ఫీల్డ్‌లో చాలామంది ప్రతిభావంతుడైన రచయితలున్నారు కదా... వాళ్ళను పిలిస్తే మంచి ఒరిజినల్ స్టోరీయే తయారవుతుందికదా" రామబ్రహ్మం అన్నాడు.

"లేదండీ. ఇదంతా లేట్ ప్రాసెస్. ఇప్పుడొస్తున్న సినిమాలు చూస్తున్నాం కదా... కొత్తదనం ఎక్కడుంది చెప్పండి" ఒక ఇండస్ట్రియలిస్టు అన్నాడు.

"కొత్తదనం అంటే ఒక్కరి ఇష్టం. కొంతమంది క్రియేటివిటీకి నిర్వచనం. దానికి ముందు నిర్మాతకు టేస్టు వుండాలి."

"టేస్ట్ ఎందుకుండదండీ... ఎంత టేస్టున్న నిర్మాతయినా, వ్యాపారం కోసమే కదండీ సినిమా తీస్తాడు. వ్యాపారం అంటే లాభమేకదా... లాభం ష్యూర్‌గా వస్తుందని గ్యారంటీ వుంటుంది కాబట్టే మిగతా భాషల సినిమాలమీద మక్కువ."

"తెలుగులో ఒకప్పుడు గొప్ప సినిమాలొచ్చాయి. ఇప్పుడూ వస్తున్నాయి. గొప్ప సంభాషణలొచ్చాయి. మరపురాని మధురమైన పాట లొచ్చాయి... దానిక్కారణం తెలుగు రచయితలు కారా... మారుతున్న కాలానికి అనుగుణంగా మారడంలో తప్పులేదు. కానీ, మన ప్రతిభను మనమే కించపరచుకోవడం తప్పు, అన్ని విభాగాల్లో ఇవాళ యువతరానిది పైచేయిగా వుంది. వాళ్ళకింకా ఉత్సాహాన్ని కలిగించి, వాళ్ళలోని ప్రతిభను వెలికితీసే ప్రొడ్యూసర్లు ఆ రకంగా ఆలోచిస్తే బాగుంటుంది. ఉషాకిరణ్ మూవీస్ వారి లేటెస్ట్ మూవీ చిత్రం చూశారా? అంతా కొత్త వాళ్ళు, లోబడ్జెట్‌తో తెలుగు కథ– సూపర్‌హిట్" అన్నాడు డైరెక్టర్ ప్రదీప్ అసహనాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"మద్రాసులో మాకే సినిమా నచ్చకపోతే ఒరిజినల్ కథ తయారు చేయిస్తాం...." నవ్వుతూ అన్నాడు ఇండస్ట్రియలిస్టు.

ఆ చర్చ ఇంకా కొనసాగుతుండగా.

విమల్, రామబ్రహ్మం కొత్తగా వచ్చిన హృతిక్ రోషన్ సినిమా గురించి చర్చించుకుంటున్నారు.

"కహోనా ప్యార్‌హై... టీనేజ్ సినిమా... ఎక్స్‌పెరిమెంట్ ఎప్పుడైనా సక్సెస్ అవుతుంది" అన్నాడు విమల్.

"మనవాళ్ళు ఎక్స్‌పరిమెంట్స్‌కి దూరంగా వుంటాను" అన్నాడు రామ బ్రహ్మం.

"ఒక్క సోషల్ మూవీసే కాకుండా మైథాలజీ వేపూ వెళితే బావుంటుం దేమో" అని అంటూ అప్పుడే ట్రేలో డ్రింక్స్‌తో వచ్చిన సర్వర్ వేపు చూస్తూ బృంద.

"ఈ డ్రింక్స్ లేకుండా డిన్నర్ వుండదా." అంది.

"మ్యూజిక్ లేకుండా సినిమా వుంటుందా...? అలాగే ఈ డ్రింక్స్ కూడా" అంటూ గ్లాసందుకున్నాడతను.

"రెండు జోక్స్ చెప్పు భాయ్... బోరు కొడుతోంది...." అడిగాడు విమల్.

"ఓ భార్యాభర్తలకు పాతికేళ్ళు కలిసి వుండటంతో బోరు కొట్టేసింది. విడిపోదాం అనుకున్నారు.

విడిపోయి ఒంటరిగా బతకడం ఎందుకు... ఎదురింటి సుబ్బారావుతో లేచిపోతాను. అతనికి కూడా నేనంటే యిష్టమే అంది భార్య.

ఓ.కె. అయితే నేను సుబ్బారావు ఇంటి పక్కనున్న రాంబాబు వెళ్ళాంతో లేచిపోతాను. ఆమెక్కుడా నేనంటే ఇష్టమే అన్నాడు భర్త.

నువ్వబద్ధం చెబుతున్నావ్... నాకంతా తెలుసు. అందామె.

అబద్ధం ఏంటీ అనడిగాడతను.

ఆ రాంబాబు కిద్దరు పెళ్లాలు... నాకు తెలీదనుకున్నావా... వాళ్ళతో నువ్వు లేచిపోవడానికి వీల్లేదు... ఇంకెవరితోనన్నా లేచిపో. అని భార్య భర్తతో గొడవ పెట్టుకుంది. అది అంతకు అంతై బాగా ముదిరి కోర్టు వరకూ వెళ్ళింది. ఆ తగువంతా నిన్న జడ్జిగారు.

"మీకు ఒకటే శిక్ష. మీరిద్దరూ జీవితాంతం కలిసే వుండాలి" అని తీర్పు చెప్పారు.

హావభావ విన్యాసాలతో రామబ్రహ్మం చెప్పిన ఆ జోక్‌కి బృంద నిజంగా నవ్వింది.

రెండు పెగ్గుల డ్రింక్ సెషన్ ముగిసి, ఆ తర్వాత డిన్నర్ స్టార్టయింది.

"మార్నింగ్ సిక్స్ పార్టీఫైవ్‌కే ఫ్లయిట్. బృంద... మర్చిపోకండి" గుర్తు చేశాడు సూర్యవంశీ.

"సిక్స్ ఫిఫ్టీకనుకున్నాలెండి...." నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ అని, ముందుకు నడిచింది బృంద.

"మీరు జోకేశారంటే ఏదో ప్రపంచ యుద్ధం రాబోతు...." అని ఆగిపోయి, మళ్ళీ ఆవిడ ఎలా రియాక్ట్ అవుతుందో అని నెమ్మదిగా అన్నాడు రామబ్రహ్మం. ఆ మాటకు సూర్యవంశీ, విమల్ నవ్వారు.

ఒక్క బృంద తప్ప మిగతా వాళ్ళందరూ ఇంకా రెస్టారెంట్లో మాట్లాడు కొంటూనే వున్నారు.

లిఫ్ట్ దగ్గర నిలబడింది బృంద. తను ఫిఫ్త్‌ఫ్లోర్ వెళ్ళాలి.

మూడు నిముషాల తర్వాత డౌన్ ఫ్లోర్‌కొచ్చింది లిఫ్ట్.

లోపలికెళ్ళి డోర్ బటన్ ప్రెస్ చేసింది. నెమ్మదిగా డోర్ క్లోజ్ అయింది. ఫిఫ్త్‌ఫ్లోర్ బటన్ నొక్కింది.

నెమ్మదిగా పైకి వెళుతోంది లిఫ్టు.

సరిగ్గా థర్డ్‌ఫ్లోర్ కొచ్చేసరికి రెడ్ బల్బ్ వెలగడం లిఫ్టు డోర్ ఓపెన్ కావడం, అందులోకి ఓ వ్యక్తి ప్రవేశించడం జరిగిపోయాయి.

తలొంచుకుని ఏవో ఆలోచిస్తోంది బృంద.

ఆమెకు ఎదురుగా నుంచున్న వ్యక్తి తన చేతిలోని సిగరెట్‌ను కింద పడేసి బూటుకాలితో నొక్కి.

"మంజరీ" అని పిలిచాడు.

భయంగా తలెత్తి చూసింది బృంద.

ఎదురుగా అరవింద్... కనురెప్ప వెయ్యకుండా అలాగే అరవింద్ వేపు చూసింది బృంద.

అతన్ని ఎక్కడో చూసినట్టు అనిపించిందామెకు.

"మంజరీ... పేరు మార్చుకున్నంత మాత్రాన నిన్ను నేను గుర్తు పట్టలేనను కున్నావా... ఎలా బతికావ్... ఎవరు నిన్ను రక్షించారు... ఆ డైరీ ఇప్పటికి నీ దగ్గరే వుందా... చెప్తున్నాను గుర్తుంచుకో... నీకు వారం రోజులు టైమిస్తున్నాను.

ఆ డైరీ నాకిచ్చెయ్యి. లేకపోతే ప్రతి క్షణం నరకం చూసేటట్టుగా చేస్తాను. ఆ తర్వాత నిర్ధాక్షిణ్యంగా చంపేస్తాను....” భీకరమయిన గొంతుతో అన్నాడు అరవింద్.

“డైరీ ఏమిటి?” ఆశ్చర్యపోతూ అడిగింది బృంద.

“నీకెప్పటికప్పుడు డైరీ రాయటం అలవాటని నాకు తెలుసు. ఆ డైరీ ఇవ్వనందుకే... ఆ డైరీతోపాటు నిన్నూ శాశ్వతంగా మాయం చెయ్యడానికి ఫైర్ యాక్సిడెంట్‌ను క్రియేట్ చేశాడు. జ్ఞాపకం లేదా? ఒక రియల్ స్టోరీ ఆధారంగా ఈ సినిమా తీస్తున్నారట. ఆ రియల్ స్టోరీ నీ జీవితకథే అని పేపర్స్‌లో చదివినప్పుడే నాకు తెలుసు. మంజరీ–ఆ డైరీ నలభైఎనిమిది గంటలలోగా నా దగ్గరకు రావాలి....” అన్నాడు అరవింద్.

“ఆ డైరీ ఏమిటో నాకు తెలియదు... ఫర్ యువుర్ కైండ్ ఇన్ఫర్మేషన్. ఆయామ్ నాట్ మంజరి... ఇంతకీ మీరెవరు?” ఆ ప్రశ్నకు తెల్లబోయాడు అరవింద్.

లిఫ్టు ఫిఫ్త్‌ఫ్లోర్లో ఆగింది. డోర్ తెరుచుకుంది.

తెరచుకున్న లిఫ్టుడోర్ లోంచి బయటికెళ్ళి గబగబా ముందుకెళ్ళిపోతున్న బృంద ఉరఫ్ మజంరీ వేపు అలాగే చూస్తూ వుండిపోయాడు అరవింద్.

* * * * *

మరో అయిదు నిముషాల తర్వాత రెస్టారెంట్లోని సూర్యవంశీకి ఫోన్ వచ్చింది.

రెస్టారెంట్ మేనేజర్ కార్డ్‌లెస్ అతని చేతికిచ్చాడు.

“నేనే. బృందను... నేను ఇప్పుడే... ఈ క్షణమే హైద్రాబాద్ వెళ్ళిపోదామనుకుంటున్నాను. కారు ఏర్పాటు చేయగలరా?”

“ఏమైంది?”

“పర్సనల్ ప్రాబ్లమ్” ఇంతకు పూర్వంలా వైల్డ్‌గా రియాక్ట్ కాకుండా సీరియస్‌గా ఆలోచించటం బృందలో వచ్చిన కొత్త మార్పు.

మరో గంట తర్వాత బృంద హైదరాబాద్ వెళ్ళే కారులో వుంది.

రామ్‌కాశ్యప్ ఎదురుగా సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ కూర్చున్నాడు.

రామ్‌కాశ్యప్ చెప్పడం ప్రారంభించాడు.

మొదట్లో బృంద ఫ్రెండ్స్‌ని కలిస్తే ఆమె వివరాలు తెలుస్తాయని, తర్వాత ఆమె పర్సనల్ లైఫ్ తెలుసుకోవడానికి వీలవుతుందని అనుకొన్నాను. కానీ అలా తెలియడంవల్ల బృంద ప్రాణాలకు ప్రమాదం ఏర్పడితే అనే ఆలోచన రాగానే అప్పటికప్పుడు ఫ్లయిట్‌లో వైజాగ్ వెళ్ళాను. శైలజ, ప్రియలను కలిశాను. వాళ్ళని ప్రశ్నించిన మీదట మనకు అవసరమైన కొంత సమాచారం దొరికింది.

ముఖంలో కాస్మెటిక్ సర్జరీవల్ల కొన్ని పోలికలు మారినప్పటికీ బృంద.... మంజరీయే. మహబూబ్ దగ్గరున్న నారాయణపురం స్వంత వూరు. హైస్కూలు, కాలేజీచదువు మహబూబ్‌నగర్‌లోనే. శైలజ, ప్రియ డిగ్రీలో బృందకు క్లాస్‌మేట్స్. డిగ్రీలోనే ఆమె ఒక వ్యక్తి ప్రేమలో పడింది. చాలా గాఢంగా ఆ వ్యక్తిని మంజరీ ప్రేమించింది....” చెప్పడం ఆపాడు రామ్‌కాశ్యప్.

“ఆ వ్యక్తి పేరు?” అడిగాడు విశ్వనాధ్.

“వాళ్ళక్కూడా తెలీదు. మంజరి ఒకతన్ని ప్రేమిస్తోందనే విషయం వాళ్ళకి తెలుసు. మంజరి స్వయంగా వాళ్ళకా విషయం చెప్పలేదు. మంజరి డిగ్రీ చదువు తున్నప్పుడు వాళ్ళక్క యశోద దగ్గర వుండేది. యశోదకు ఒక కొడుకు వున్నాడు. అన్నయ్య వున్నా... శైలజ, ప్రియులు ఆ అన్నయ్యను ఎప్పుడూ చూడలేదు” చెప్పాడు రామ్‌కాశ్యప్.

“అయితే రామావతారం మహబూబ్‌నగర్‌లోనే తెల్చుకొన్నవన్నీ దాదాపు నిజమే.

“ఒక్క ఆ ప్రేమించిన వ్యక్తి ఎవరో మాత్రం తెలీడంలేదు....” అన్నాడు రామ్‌కాశ్యప్.

“శైలజ, ప్రియలకు మంజరిని గుర్తుపట్టనట్టుగా నటించమని ఎందుకు చెప్పారు?”

“మంజరి ప్రాణాలను రక్షించడం కోసం కావొచ్చు. బృందే మంజరి అని తెలిస్తే ఆమె ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చని నా అనుమానం. అదే కాకుండా బృంద కదలికల మీద ఎవరైనా నిఘా పెట్టి వుంటే ఆమెను ప్రత్యేకంగా

కలిసిన శైలజ, ప్రియలను ఎవరైనా కలిసి ప్రశ్నిస్తే... బృంద రహస్యం బయటపడుతుంది. అందుకే ఇరవై వేలతో వాళ్ళ నోటిని మూయించాను. బృంద అదే మంజరి వాళ్ళ ఫ్రెండ్ అనే విషయం శాశ్వతంగా మరచిపొమ్మని చెప్పాను. నా పని పూర్తిచేపుకొని వచ్చేశాను" అన్నాడు రామ్‌కాశ్యప్.

"శైలజ, ప్రియ బృందను కలుసుకోవడానికి కైలాసగిరి వెళ్ళినప్పుడు మీరెక్కడున్నారు?" అడిగాడు విశ్వనాథ్.

"ఓ ఫ్రెండ్ మారుతీకారు తీసుకొన్నాను. వాళ్ళకన్నా ముందు నేను కైలాసగిరి వెళ్ళి కారు మిర్రర్‌లోంచి వాళ్ళని అబ్జర్వ్ చేశాను. నేను చెప్పినట్టుగానే వాళ్ళు ప్రవర్తించారు. వాళ్ళక్కడినుంచి కదలగానే నేనూ వచ్చేశాను" చెప్పాడు రామ్‌కాశ్యప్.

మూడు నిమిషాలసేపు అక్క డెవరూ మాట్లాడలేదు.

"బృందకు ప్రమాదం సంభవిస్తుందని మీరు భావిస్తున్నారా?" అని అడిగాడు విశ్వనాథ్.

సరిగ్గా అదే సమయంలో లోనికొచ్చిన బృంద సరాసరి వాళ్ళ దగ్గరికెళ్ళి తనో కూర్చీలో కూర్చుంది.

"అంకుల్... నిన్న ఈవెనింగ్ వైజాగ్‌లో ఒక ఇన్సిడెంట్ జరిగింది" గ్లాసులోని నీళ్ళు తాగుతూ చెప్పింది.

"ఏమిటది?"

షూటింగ్ అయిపోవడం, రెస్టారెంట్లో డిన్నర్ అయ్యాక, తను లిఫ్ట్ ఎక్కడం, థర్డ్‌ఫ్లోర్లో ఆ లిఫ్ట్‌లోకి ఒక వ్యక్తి ప్రవేశించడం, ఇద్దరిమధ్యా సంభాషణ... అంతా పూసగుచ్చినట్టు చెప్పింది బృంద.

"చూశారా మిస్టర్ విశ్వనాథ్! ప్రమాదం ముంచుకొచ్చింది" అన్నటుగా విశ్వనాథ్ వేపు ఒకసారి చూసిన రామ్‌కాశ్యప్...

"నలభై ఎనిమిది గంటల్లో డైరీ ఇమ్మన్నాడా... ఎవరా వ్యక్తి?"

"తెలీదు" బృంద చెప్పింది.

"ఇంతకుపూర్వం నువ్వు అతన్ని చూశావా?"

"చూశాను... చాలా దగ్గరగా. అతనితో నాకు పరిచయముందనే విషయం నాకు తెలుస్తోంది. కానీ స్పష్టంగా తెలీడంలేదు."

"అంటే నువ్వు బృందవు కావు. మంజరి. అవునా?"

"అవునేమో అంకుల్... నాకేదో భయంగా వుంది."

"ఓ.కే. బృందా... నువ్వు ఇన్‌సోమ్నియా అనే వ్యాధితో బాధపడుతున్నావని నా అభిప్రాయం... నేనడిగే కొన్ని ప్రశ్నలకు స్పష్టంగా జబావులు చెప్పడానికి ప్రయత్నించు."

"అడగండి."

"మహబూబ్‌నగర్ దగ్గరున్న నారాయణపురం నీ స్వంత వూరు.

అక్కడే నువ్వు డిగ్రీవరకు చదివావు.

ఆ సమయంలో నువ్వు ఒక వ్యక్తిని ప్రేమించావు.

ఆ వ్యక్తి నిన్ను మోసం చేశాడు.

ఆ వ్యక్తి నిన్ను ఫైర్ యాక్సిడెంట్ ద్వారా చంపాలని ప్రయత్నించాడు. నువ్వు తప్పించుకొన్నావు.

నీకో అక్క, అన్నయ్య, అక్క కొడుకు వున్నారు. వాళ్ళిప్పుడు ఎక్కడున్నారో నీకు తెలీదు.

మీ అన్నయ్య అమెరికాలో వున్నాడన్నది నాకు తెలిసిన సమాచారం."

ఒక్కొక్క విషయం స్పష్టంగా చెప్పాడు విశ్వనాథ్.

ఆయన చెప్పిన విషయాలు విన్న బృంద, వాటిని పదేపదే మననం చేసుకుంటోంది.

"వీటిలో ఏ ఒక్క విషయమైనా నీకు గుర్తుందా?"

రాత్రి పదిన్నర గంటల సమయంలో వాళ్ళు కూర్చున్న ఏ.సి. రూమ్‌లో ఏ.సి. చప్పుడు నెమ్మదిగా వినిపిస్తోంది.

"లేదు. నాకే విషయమూ గుర్తులేదు...." కాసేపయ్యాక చెప్పింది బృంద.

"ఇప్పుడు నీ దగ్గర డైరీ లాంటివి ఏవైనా వున్నాయా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"లేవు."

"మరి నలభై ఎనిమిది గంటల్లో ఆ డైరీని అతనికి ఇవ్వకపోతే అతనెక్క డుంటాడని చెప్పాడు?"

"చెప్పలేదు."

"డోంట్‌వర్రీ... నీ కొచ్చిన ప్రమాదం ఏమీలేదు. ఎందుకంటే నీ దగ్గర డైరీలేదు కాబట్టి... ఇవాళనుంచి నీకొచ్చే ఫోన్‌కాల్స్ అన్నీ టేప్ చేసి రికార్డ్ చేయబడతాయి. ఆ వ్యక్తి ఎవరో తెల్సుకోవడం మన ముందున్న మొదటి పని" అంటూ విశ్వనాథ్ రామ్‌కాశ్యప్‌వేపు చూశాడు.

"బృందా... రేపు షూటింగ్ వుందా?"

"లేదు. రషెస్ చూడాలి. అంతే...." చెప్పిందామె.

"ఓ.కే. గుడ్‌నైట్" చెప్పాడు రామ్‌కాశ్యప్ నవ్వుతూ.

అక్కడినుంచి వెళ్ళిపోయింది బృంద.

"నేను మంజరీయేమో" అని బృంద అన్నమాట గురించే ఆలోచిస్తున్నాడు రామ్‌కాశ్యప్. అదే విషయాన్ని ప్రస్తావించాడు విశ్వనాథ్ ఆమె వెళ్ళిపోయాక.

"ఈ సినిమా కధకి, ఆమె జీవితానికి చాలా దగ్గర సంబంధం వుంది కనుక ఈ సినిమా పూర్తయ్యేలోపల ఈమె మంజరిగా మారిపోతుందని నా నమ్మకం. ఈలోపల ఆమె జీవితంలో జరిగిన ప్రధానమైన సంఘటన ఏమిటో తెల్సుకోవాలంటే ఏం చేయాలో నేనో నిర్ణయానికొచ్చేశాను...." అన్నాడు విశ్వనాథ్.

"మంజరి ప్రేమలో విఫలమైందని మనకు తెలుస్తోంది కదా!"

"ఈ ఒక్క కారణంవల్లే మంజరిలో మతిమరుపువ్యాధి వచ్చిందని నేననుకోను."

"మరి...."

"మీరు బృందను బెదిరంచిన వ్యక్తి విషయంలో జాగ్రత్తలు తీసుకోండి... నేను రెండ్రోజులుల్లో ఫోన్ చేస్తాను. మీరు డాక్టర్ శకుంతల దగ్గరకు ఆమెను తీసుకెళితే మనకు చాలా విషయాలు తెలిసే అవకాశం వుంది చెప్పాడు విశ్వనాథ్.

డాక్టర్ శకుంతల దగ్గరకు ఎందుకు అనే ప్రశ్న వెయ్యలేదు రామ్‌కాశ్యప్.

* * * * *

ఆకస్మాత్తుగా ఫోన్ రావడంతో సూర్యవంశీ భాగ్యరాజ్ చెప్పిన హోటల్ బ్లూమూన్‌కి వెళ్ళాడు.

అప్పటికే సూర్యవంశీ కోసం ఎదురుచూస్తున్నాడు కిషోర్‌దాస్.

“చూడు వంశీ... మన హిందీ సినిమా ఓ.కే. తెలుగు సినిమా నువ్వు తయారుచేసే కథతోనే తీద్దాం. నేడే విడుదల సినిమా కథేంటి... ఇప్పటివరకు షూటింగ్ ఎంతవరకు అయింది?” అడిగాడు కిషోర్‌దాస్.

సరిగ్గా అదే సమయంలో లోపలి రూమ్ నుంచి వచ్చిన అరవింద్ చేతిలోని విస్కీగ్లాసుతో కిషోర్‌దాస్ పక్కన కూర్చున్నాడు. అరవింద్‌ను కిషోర్‌దాస్ పరిచయం చెయ్యలేదు.

కథ ఎంతవరకు వచ్చిందో చెప్పి ప్రధానమైన మలుపులన్నీ చెప్పి-

“మీ ప్రొడ్యూసర్ కాబట్టి చెప్పాను. స్టోరీని లీక్ చెయ్యకండి” రిక్వెస్ట్ చేశాడు వంశీ.

“ఇది రియల్‌స్టోరీ అన్నారు. ఎవరి జీవితంలో జరిగింది...? ఆ జరిగిన వ్యక్తి ఎవరో తెలుసా?” అడిగాడు అరవింద్ సూటిగా సూర్యవంశీ ముఖంలోకి చూస్తూ.

పేపర్‌ని చూడటం, దాని ఆధారంగా రిపోర్టర్ పరశురాంని కలవడం, అతను చెప్పిన వివరాల ప్రకారం కథను తయారు చేసుకోవడం, డైరెక్టర్‌కి చెప్పడం... అన్నీ చెప్పాడు సూర్యవంశీ.

“అందులో మంజరి అనే అమ్మాయిని మీరు కలవలేదు” ప్రశ్నించాడు అరవింద్.

“లేదు.”

“ఈ కథను తయారు చేస్తున్నప్పుడు ఆ అమ్మాయి ఫోటోని కూడా మీరు చూడలేదా?”

“లేదు.”

“మీకీ కథ చెప్పింది రిపోర్టర్ పరశురాం... అవునా?”

“ఇంట్రవెల్ తర్వాతస్టోరీ... పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో నడుస్తుంది. విలన్‌ని, విలన్‌కి సపోర్ట్‌గా నిలబడిన పొలిటికల్ లీడర్ గుట్టురట్టవుతుంది. ఇది మీరు వూహించి రాశారు. అవునా?”

"ఔను. పవర్‌పుల్ ఎండింగ్ వుంటే బావుంటుదని రాశాను...." సూర్య వంశీ అన్నాడు.

"అవును. ఎండింగ్ పవర్‌పూల్‌గానే వుండాలి" అంటూ ఖాళీఅయిన గ్లాసులో డ్రింక్ పోసుకుని సోడా కలుపుకోకుండానే తాగి లోపలి రూమ్‌లోకెళ్ళి రెండు నోట్లకట్టలతో వచ్చాడు అరవింద్. వాటిని టీపాయ్‌మీదకు అలవోకగా విసిరాడు.

"మీ సినిమాకి అడ్వాన్సా?" అడిగాడు సూర్యవంశీ అమాయకంగా, వాటివేపు చూస్తూ.

"అడ్వాన్సే... ఇరవైవేలు... మా సినిమాకి కాదు. ఇంటర్వెల్‌నుంచి కథలో నువ్వు పూర్తిగా మార్పులు చేయాలి."

"ఏ సినిమాలో?" అడిగాడు సూర్యవంశీ.

"నేడే విడుదల సినిమాలో."

"ఇంట్రవెల్ తర్వాత అంత ప్రమాదకరమైన ఇన్సిడెంట్స్ ఏమున్నాయి... మంజరికి పూర్వజ్ఞాపకాలొస్తాయి. హీరోని చంపుతుంది. తనకు అన్యాయం చేసిన పొలిటికల్ లీడర్‌ని ప్రజల సమక్షంలో లాల్ బహదూర్ స్టేడియంలో చంపుతుంది. అంతేకదా...."

"అవ్వే మార్చెయ్. నేను చెప్పినట్టు మార్చు" ఏం మార్చాలో చెప్పాడు అరవింద్.

"కష్టం సార్! మీరెందుకు అంత పట్టుబడుతున్నారో నాకేం అర్ధం కావడం లేదు. డైరెక్టర్‌కి, నాకు ఇది ఫస్ట్ సినిమా... మా జీవితాలు ఈ సినిమాతో ముడిపడి ఉన్నాయి...." ప్రాధేయపడ్డట్టుగా అడిగాడు సూర్యవంశీ.

"మా జీవితాలు కూడా ఈ సినిమాతోనే ముడిపడి వున్నాయి... మనసులోనే అనుకున్నాడు అరవింద్.

"నేను చెప్పినట్టుగా కథ మార్చు. ఇంకో ముప్పైవేలిస్తాను. డైరెక్టర్‌కి యాభైవేలు లేదా లక్ష రూపాయలు.. ఓన్లీ ఈ స్టోరీ... ఇన్సిడెంట్స్ మార్చడం కోసం... ఈ మార్పులు ఇవాళరాత్రే జరిగిపోవాలి. రేపు ఈ టైమ్‌కి... ఆ స్క్రిప్టు నాకు చూపించాలి. అలా జరిగే పక్షంలో రేపు సాయంత్రం... మన సినిమా

ఎనౌన్స్ చేయడం జరుగుతుంది. డైరెక్టర్‌కీ, నీకూ అడ్వాన్స్‌లు ఇవ్వడం జరుగుతుంది. ఆ సినిమా తెలుగులోనే కాదు. హిందీలో కూడా తీద్దాం ఆలోచించుకో, డైరెక్టర్‌ని పిలిపించనా?" అన్నాడు అరవింద్.

"ఊ... అతన్ని పిలిస్తే తేలిపోతుందికదా" అన్నాడు సూర్యవంశీ అరవింద్ అంగీకారంతో డైరెక్టర్ ప్రదీప్‌కి ఫోన్ చేశాడు.

పావుగంటలో డైరెక్టర్ ప్రదీప్ అక్కడున్నాడు.

అంతా విన్నాక–

"సారీ సార్! ఇది నా పర్సనల్ కమిట్‌మెంట్, ఇండస్ట్రీకి వచ్చాక ఎన్నో కష్టనష్టాలను అనుభవించాను. నాకు సుమంతరావు ఫ్రెండ్లీగా ఈ అవకాశం యిచ్చాడు. మీరే కారణంచేత కథను మార్చమని అడుగుతున్నారో... లక్ష రూపాయలు లంచంగా ఇవ్వాలనుకుంటున్నారో. నాకర్థం కాలవడంలేదు. అయినా నన్ను నేను వంచించుకోలేను" సీరియస్‌గా చెప్పి సూర్యవంశీవేపు ఒకసారి చూసాడు.

సూర్యవంశీ లేచి నిలబడ్డాడు.

"నేనెప్పుడూ డైరెక్ట్‌గా ఎవర్నీ బెదిరించను. ఒకసారి రాత్రంతా కూర్చొని ఆలోచించండి. రేపుదయం... మీ ఫోన్‌కోసం నేను ఎదురు చూస్తుంటాను. తర్వాత ఏం చేయాలో అది చేస్తాను–" చాలా కూల్‌గా చెప్పాడు అరవింద్.

డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ ఆ రోజు రాత్రి చాలాసేపు ఆ విషయం గురించే ఆలోచించారు.

వాళ్ళకేమీ అర్థంకాలేదు.

"ఆ కిషోర్‌దాస్ సినిమా మనకక్కర్లేదు. నేడే విడుదల సక్రమంగా రీలీజైతే చాలు. మనం ఇండస్ట్రీలో నిలబడతామన్న నమ్మకం నాకుంది" అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

అప్పుడు రాత్రి రెండు గంటలైంది.

"రేపు మార్నింగ్ వరకూ ఎందుకు? ఇప్పుడే ఫోన్ చేదాం. ఓకే అంటూ రిసీవర్ అందుకున్నాడు సూర్యవంశీ.

అప్పుడు రాత్రి రెండు గంటలైంది.

నెంబర్స్ ప్రెస్ చేశాడు.

అరవింద్ లైన్లోకి రాగానే తమ నిర్ణయాన్ని తెలియజేశాడు.

"ఓ.కే. ఇక మీ జాతకం మీ చేతుల్లో లేదు."

"అంటే?"

"నా చేతుల్లో వుంది" అంటూ ఫోన్ పెట్టేశాడు అరవింద్.

సూర్యవంశీ, ప్రదీప్ అరవింద్ గురించే మాట్లాడుకోంటున్నా రకరకాలుగా ఆలోచిస్తున్నారు.

"ఇప్పటికే మన బృంద జీవితానికి, ఈ కథకుగల సంబంధం ఏమిటో అర్ధంకాక తల బద్దలు కొట్టుకుంటుంటే మధ్యలో వీడెవడు? వీడికీ ఈ కథకీ సంబంధం ఏమిటి?"

"అవును సంబంధం ఏమిటి?"

అనూహ్యంగా వుంది ఇద్దరికీ.

సరిగ్గా అదే సమయంలో మళ్ళీ ఫోన్ మోగింది.

"నేనే... ఆఖరిసారిగా ఛాన్స్ ఇవ్వడం నా ఆలవాటు, మీరు ఈ విషయం గురించే ఆలోచిస్తున్నారని నాకు తెలుసు. చెప్పండి... ఏ నిర్ణయానికొచ్చారో."

"కే నిర్ణయం! నేడే విడుదల కథలో ఏ విధమైన మార్పులు జరపకూడదని, సినిమా ఆపెయ్యమని బెదిరిపులు వచ్చినా, సాహసంతో ఒక స్త్రీ జీవిత కథను చిత్రీకరించిన సినిమా అవి పబ్లిసిటీలో వెయ్యాలనికూడా నిర్ణయించుకున్నాం' చెప్పాడు సూర్యవంశీ కసిగా.

"మరీ అతిగా వెళ్ళడం మహా ప్రమాదం... ఆలోచించుకోండి. మన మధ్య జరిగిన చర్చల గురించి ఏ మాత్రమైనా బయటకు తెలిసిందో మీరిద్దరూ వుండరు. గుర్తుంచుకోండి... ఫ్రెండ్లీగా చెపుతున్నాను" ఫోన్ కట్ అయింది.

ఈ బెదిరింపు విషయం బయటకు ఎందుకు తెలియకూడదు...?

మీరిద్దరూ వుండరు-అంటే చంపేస్తానని బెదిరింపేనా...?

ఎందుకు చంపడం...?

"ప్రదీప్‌గారూ! ఈ సమయంలో మనం ధైర్యంగా స్టెప్ తీసుకోవాలి. అతని బెదిరింపును ఇప్పటినుంచే పబ్లిసిటీలో వాడుకొంటే-" మూడో పెగ్గు తర్వాత ఫ్లాష్‌లాంటి అయిడియా అంటూ చెప్పాడు సూర్యవంశీ.

"అంటే?"

"రేపు... సాయంత్రం మనం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తున్నాం... సినిమా రిపోర్టర్లు అందరూ వస్తారు. మనకొచ్చిన ఫోన్‌కాల్ గురించి చెప్తాం. ఏమంటారు?"

"భాగ్యరాజ్, కిషోర్‌దాస్, అరవింద్‌ల పేర్లు చెప్తామా?" సందేహంగా అడిగాడు ప్రదీప్.

"భాగ్యరాజ్ పేరెందుకు చెప్తాం. అతను మన ఫైనాన్సీల్‌కదా... భాగ్యరాకజ్‌కి వాళ్ళు ఫ్రెండ్స్ అయినా మనకేమిటి నష్టం? అయినా మనం ఎవరి పేర్లు చెప్పం. ఆ వ్యక్తుల్ని మనం కలిసినట్టు కూడా చెప్పం... బొంబాయి రౌడీ సంస్కృతి ఆంధ్రాలో కూడా విస్తరిస్తోందని, అది మన సినిమాతో ప్రారంభమైందని, ఈ విష సంస్కృతిని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిలుపునిస్తాం...." ఆవేశంగా చెప్పాడు సూర్యవంశీ.

"ఆలోచన బాగుంది. కానీ, తర్వాత పరిణామాలెలా వుంటాయో, ఎందుకైనా మంచిది. ప్రొడ్యూసర్ సమంతరావుతో ఒకసారి చెప్తే?" సందేహంగా అడిగాడు డైరెక్టర్ ప్రదీప్.

పెద్ద గొడవకు ఇది సంకేతమని అతని మనసులో ఏదో భావం ఏర్పడింది. స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడలేకపోతున్నాడతను.

"మన సినిమా పబ్లిసిటీకి ఇది వుపయోగపడుతుందని నాకూ నమ్మకంగానే వుంది. అలాగే ప్రెస్‌మీట్ ఏర్పాటుచేద్దాం...." ఎట్టకేలకు అంగీకరించాడు డైరెక్టర్ ప్రదీప్.

* * * * *

హాస్పిటల్ బెడ్‌మీద పడుకుని వుంది బృంద.

ఆ రూమ్‌లో ఎ.సి. చల్లదనం నిశ్శబ్దంగా సుడులు తిరుగుతోంది. డోర్ తెరుచుకుని నర్స్ ప్రవేశించింది. ఆ అడుగుల చప్పుడుకి మెలకువ వచ్చిన బృంద దిగ్గున లేచి కూర్చుని నలువేపులా ఒకసారి చూసి నర్స్ వేపు చూస్తూ.

"నేనిక్కడకు ఎలా వచ్చాను...?" అండిగింది గాభరాగా.

"నీ భర్త నిన్ను తీసుకొచ్చి అడ్మిట్ చేశాడు...." చెప్పింది నర్స్ నెమ్మదిగా.

"నా భర్త... వాడెవడు...?" పులిలా గర్జించి లేవబోయింది.

పొత్తికడుపు దగ్గర ఏదో నొప్పి, తలవంచి తన చీరవేపు ఒకసారి చూసుకుంది. ఆ తెల్లటి చీరమీద అక్కడక్కడ నెత్తుటి మరకలు.

"ఏమిటీ... నెత్తురు మరకలు...." కోపంగా అడిగింది.

"నీకబార్షన్ అయింది...." చెప్పింది నర్స్.

"అబార్షన్ అయిందా.. అబార్షన్ జరిగేటట్టు చేశారా...?" దిగ్గున బెడ్‌మీంచి లేచి–

"అసలేం జరిగింది చెప్పు...." అంది ఆగ్రహంగా.

"మొన్న రాత్రి నిన్ను నీ భర్త హాస్పిటల్‌లో అడ్మిట్ చేశాడు. అప్పటికే నువ్వు స్పృహలోలేవు. నిన్న నీకు అబార్షన్ జరిగింది. అంతే. మిగతా వివరాలేవీ నాకు తెలీదు" అందామె.

"డాక్టర్ ఎక్కడ...?" విసురుగా డోర్ తెరుచుకుని బయటికొచ్చింది బృంద. డాక్టర్ రూమ్‌లోకెళ్ళి ఎవరో పేషెంట్‌తో మాట్లాడుతున్న డాక్టర్‌వేపు చూస్తూ.

"యు ఆర్ ఎ మర్డరర్... అవునా... కాదా...." సూటిగా ప్రశ్నించింది.

"నేనా...?!"

"ఎస్... యూ ఆర్ ఎ లైసెన్స్‌డ్ మర్డర్... ఎం.బి.ఎస్. పట్టాను తగిలించుకున్న క్రిమినల్. నా ప్రమేయం లేకుండా, నా అనుమతి లేకుండా ఎవడు నిన్ను అబార్షన్ చెయ్యమన్నాడు. ఇప్పుడే నేను పోలీస్ రిపోర్ట్ ఇస్తాను...." అరిచింది బృంద.

డాక్టర్‌తోపాటు పక్కనున్న నర్స్, కొంతమంది పేషెంట్స్ భద్రకాళిలా వున్న బృందను చూసి నిరుత్తరులైపోయారు.

"నన్నంటే ఏం లాభం...? స్కానింగ్‌లో నీకు ఆడపిల్ల పుడుతుందని రిపోర్టు వచ్చింది. నీకుగానీ, నీ భర్తకుగానీ ఆడపిల్ల పుట్టడం ఇష్టంలేదు. అబార్షన్ చేయించమని నీ భర్తను నువ్వడిగావు. అతను నా దగ్గరకొచ్చాడు. నేను నీకు చేసిన అబార్షన్ లీగల్‌గా చేసిందే తప్ప, ఇల్లీగల్‌గా చేసింది కాదు. అబార్షన్ చేయించుకోవడం నాకిష్టమేనని నువ్వు సంతకం చేసిన పేపర్, ఆయన ఇచ్చిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇదిగో" ట్రేలోంచి ఆ రెండు పేపర్స్‌ని ఇచ్చింది డాక్టర్.

ఆ పేపర్స్‌వేపు ఒకసారి చూసి, వాటిని పరపరా చింపి పారేసి–

"వాడు నా భర్తకాదు... చీటర్... మోసగాడు... నాకు మత్తుమందిచ్చి, నన్ను స్పృహలేకుండా చేసి నువ్వూ, వాడు కుమ్మక్కై, తన తప్పు బయటపడు తుందనే కారణంగా నాకు అబార్షన్ చేయించారు. అందుకు నువ్వు సహకరించావు. అందుకు నీకో పాతికవేలు లంచంగా ఇచ్చి వుండొచ్చు. బట్... వన్‌థింగ్. నేనూరుకోను... నేనెలా గర్భవతయ్యానో నీకు తెలుసా? నేనెలా మోసగింపబడ్డానో నీకు తెలుసా? డబ్బు... డబ్బు... నీక్కావల్సింది డబ్బు... హ్యూమన్ టీరియస్ గ్రౌండ్స్ నీకసలు అక్కర్లేదు... ఐ విల్ సీ యువర్ ఎండ్... నాట్ ఓన్లీ యువర్స్. నీ వెనుక వున్నవాడు... వాడి వెనకున్న ఆ పొలిటికల్ లీడర్... అందరికీ అతి త్వరలో శుభం పలుకుతాను గుర్తుంచుకో...." చరచరా నడుచుకుంటూ ఆ రూమ్‌లోంచి బయటకొచ్చింది బృంద.

"కట్...." డైరెక్టర్ ప్రదీప్ గట్టిగా, ఆనందంగా అరిచాడు.

ఫ్లోర్లో వున్న టెక్నీషియన్స్ అందరూ బృంద నటనకు చప్పట్లు కొట్టారు.

"వండ్రఫుల్... మార్వలెస్...." రైటర్ సూర్యవంశీ గబగబా ముందు కెళ్ళి బృందను అభినందించాడు.

ఆ ఎమోషనల్ ఫీలింగ్స్‌లోంచి బృంద తేరుకోవడానికి పది నిమిషాలు పట్టింది.

"తెలుగులో మళ్ళీ ఓ స్మితాపాటిల్‌ను చూస్తున్నాను...." అన్నాడు డైరెక్టర్ ప్రదీప్. అప్పటికి సమయం మధ్యాహ్నం నాలుగుగంటలు దాటింది.

"నేను వెళతాను" అంటూ లేచింది బృంద.

అప్పటికే దూరంగా గుంపులు గుంపులుగా కొంతమంది జనం మాట్లాడు కుంటున్నారు. వాళ్ళలో కొంతమందిని గుర్తుపట్టింది బృంద.

"ఏమిటి? ప్రెస్ రిపోర్టర్స్‌ని పిలిచారా?" ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారా?" అడిగిందామె.

"అవును. రేపు మార్నింగ్ తప్పనిసరిగా ఈనాడు పేపర్ చూడండి. డోన్ట్ మిస్" అన్నాడు రైటర్ సూర్యవంశీ.

"ఎనీథింగ్ స్పెషల్?" అడిగిందామె.

"అవును. ప్రస్తుతానికి సస్పెన్స్...." అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

నవ్వుతూ వెళ్ళిపోయింది బృంద. ఆమెను అనుసరించాడు పి.ఎ రామావతారాం.

* * * * *

సరిగ్గా సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రెస్‌మీట్ ప్రారంభమైంది. ఆ ప్రెస్‌మీట్, షూటింగ్ జరిగిన ఫ్లోర్లోనే ఏర్పాటుచేశారు. వేదిక మీద డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ, కెమెరామెన్ వున్నారు. సూర్యవంశీ మైకు అందుకుని–

"మైడియర్ ఫ్రెండ్స్! నేడే విడుదల సినిమాకు ఇప్పటికే రావాల్సినంత పబ్లిసిటీ వచ్చింది. కథలోనూ, కథనంలోనూ కొత్తదనం వుంటే నేటి ఆడియన్స్ ఆ సినిమాపట్ల షూటింగ్ ప్రారంభంనుంచే ఆసక్తి చూపుతారన్న దానికి మా సినిమా ఒక నిదర్శనమని అటు ప్రేక్షకుల నుంచి, ఇటు బయ్యర్స్, డిస్ట్రిబ్యూటర్స్ దగ్గరనుంచి వస్తున్న స్పందనను చూస్తే తెలుస్తుంది. అందుకు నాకు చాలా సంతోషంగా వుంది. కానీ ఇప్పటి ఇండస్ట్రీ పరిస్థితి ఆలోచిస్తే కొన్ని వేలమంది దీనిమీద ఆధారపడి బతుకుతున్నారు. చిన్న సినిమాలే ఇండస్ట్రీకి మూలం. ఆ మూలాన్ని నిర్దాక్షిణ్యంగా నరికెయ్యడానికి కొంతమంది పూనుకోవడం దారుణమైన విషయమని మీకు మనవి చేస్తున్నాను.

నిర్మాతను వెతుక్కునే స్థాయి దగ్గర్నుంచి డైరెక్టర్ ప్రదీప్ నేడే విడుదల సినిమా కోసం ఎంత శ్రమకు గురయ్యారో నాకు తెలుసు. నేను చెప్పిన కథ ఆయనకు నచ్చాక ఒక సామాజికాంశాన్ని తెరకెక్కించడానికి నేను వ్యక్తిగతంగా

ఎంత పరిశోధన చేశానో సినిమా చూస్తే మీకే తెలుస్తుంది. కాని ఇరవైనాలుగు గంటలక్రితం మాకో ఫోన్ వచ్చింది ఆ సినిమా కథను మార్చకపోతే దారుణమైన ఫలితాలను చూడాల్సివస్తుందని ఆ ఫోన్ ద్వారా ఒక వ్యక్తి బెదిరించాడు. కథలో సంఘటనలు, క్లైమాక్స్ మారిస్తే మాకు లంచం ఇస్తానని ఆ వ్యక్తి ఫోన్‌ద్వారా చెప్పాడు. దానిని మేం నిర్ద్వంద్వంగా తిరస్కరించాం. అందుకోసమే ఈ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటుచేయడం జరిగింది.

సినిమా అనేది ఒక కళ... ఒక వజ్రాయుధం. ఆ వజ్రాయుధాన్ని మిస్ యూజ్ చేసిన ప్రతి ఒక్కరూ... చరిత్రలో నాశనమైపోయారు. మీకు తెలుసు... మూకీల యుగంలో చార్లిచాప్లిన్ తీసిన సినిమాలు చూసి ప్రజల మీద వాటి ప్రభావం, ప్రతిస్పందనకు తమ ప్రభుత్వం కూలిపోతుందనే భయంతో అమెరికా గవర్నర్‌మెంట్ ఆయనకు దేశ బహిష్కారాన్ని విధించింది. అయినా చార్లీ చాప్లిన్ సినిమాలు తియ్యడం మానలేదు. ఏ దేశమైతే ఆయన్ను బహిష్కరించిందో ఆ దేశమే ఆయాన్ను గౌరవించింది. ఇది హిస్టరీ...

తెలుగులో రైతుబిడ్డ సినిమా వచ్చిన రోజుల్లో ఆనాటి జమిందార్లు అందరూ ఆ సినిమా ప్రదర్శన జరగకుండా ఎన్నో ఆటంకాలు కల్పించారు. వత్తిడులు తెచ్చారు. బాక్సులెత్తుకుపోయారు. సినిమా థియేటర్లను తగలెట్టారు. కానీ ఆ సినిమా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, భూపోరాటానికి నాంది పలికింది. లక్షలాది కమ్యూనిస్టువీరుల కలలకు అండగా నిలిచింది. ఇది హిస్టరీ... స్వాతంత్రోద్యమ కాలంనాటి సుమంగళి, వందే మాతరం, మాలపిల్ల, రోజులు మారాయి, కన్యాశుల్కం ఇంకా ప్రజా సమస్యలకు అద్దంపట్టిన ఎన్నో సినిమాలు మహా ఉద్యమల్లా నిలిచాయి. ప్రజల ఆలోచనా విధానాలను మార్చాయి. అంతెందుకు నిన్న మొన్నటి శంకరాభరణం గురించి మీకు తెలుసు. అణగారి పోతున్న సంగీతం విలువలను ఆ సినిమాతో మళ్ళీ మొలకెత్తాయి.

మా నేడే విడుదల అంత గొప్పదని నేను చెప్పడంలేదు. ఒక స్త్రీ జీవితాన్ని సిన్సియర్‌గా తెరకెక్కించిన చిత్రమని చెప్పగలను.

కథను గానీ, సంఘటనలను గానీ మార్చమని చెప్పడానికి ఏ వ్యక్తికిగానీ, ప్రభుత్వానికి హక్కులేదు–

నేడే విడుదల సినిమా ఇప్పటివరకు పన్నెండు రీళ్ళు పూర్తయింది. ఇంకా రెండు రీళ్ళు షూటింగ్ చేయాల్సి వుంది. ఎప్పటికప్పుడు డబ్బింగ్. రీరికార్డింగ్ పూర్తిచేస్తున్నాం. ఎడిటింగ్ పూర్తయ్యాక ఇంకా ముప్పై రోజుల్లో ఆ సినిమా మీ ముందు వుంటుందని హామీ ఇస్తున్నాను.

మా ప్రయత్నానికి ఏ అవాంతరం రాకుండా ఇండస్ట్రీలోని పెద్దలు, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆశిస్తున్నాను....” ఆవేశంగా చెప్పి కూర్చున్నాడు రైటర్ సూర్యవంశీ.

డైరెక్టర్ ప్రదీప్ మైకు అందుకుని–

“జర్నలిస్టు మిత్రులకు నమస్కారం. రైటర్ సూర్యవంశీ చెప్పిన ప్రతి విషయం యదార్థం. మేం ఇద్దరం బెదిరింపు కాల్స్‌ను రిసీవ్ చేసుకున్నాం. ప్రలోభాలకు లొంగమని చెప్పాం. ఇందుకు మీ సహకారాన్ని కోరుతున్నాను” అని చెప్పి కూర్చున్నాడు.

వాళ్ళకెదురుగా పాతికమంది ఫిల్మ్ జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లున్నారు. ఫోటో గ్రాఫర్లు ఫోటోలు తీసుకుంటున్నారు.

అందులో ఒక జర్నలిస్ట్ లేచి.

“చూడండి సూర్యవంశీగారూ... ఎవరు మిమ్మల్ని బెదిరించారో వాళ్ళ పేర్లు చెప్తే బావుంటుంది....” అని కూర్చున్నాడు.

“వాళ్ళ పేర్లు తెలీదు....”

“వాళ్ళు అని అంటున్నారు... మిమ్మల్ని బెదిరించిన వ్యక్తులు ఎంత మంది?”

సూర్యవంశీ, ప్రదీప్‌వేపు చూశాడు. చిన్నగా నవ్వి–

“ఒక వ్యక్తి....” అని అన్నాడు.

“ఆ ఫోన్ ఎక్కడికొచ్చింది... ఎక్కడినుంచి వచ్చింది?”

“నేనుండే హోటల్ రూమ్‌కి... ఎక్కడ్నించి వచ్చిందో తెలీదు....”

"మరి క్రాస్ చెక్‌చెయ్యలేదా."

"లేదు... ఈ ప్రెస్‌మీట్ తర్వాత పోలీస్ కంప్లయింట్ ఇద్దామను కుంటున్నాను."

రెండు నిముషాలు అక్కడ నిశ్శబ్దం అలుముకుంది.

ఒక సినిమా పత్రికలో కొత్తగా చేసిన ఉవ జర్నలిస్టు లేచి–

"గతంలో కొంతమంది డైరెక్టర్లు సినిమా పబ్లిసిటీ కోసం ఎక్కడనుంచో సినిమాను బ్యాన్ చేయమని వత్తిళ్ళు వస్తున్నట్లు పేర్కొని, ప్రెస్‌మీట్ ఏర్పాట్లుచేసి పబ్లిసిటీని పొందారు. అలాగే మీరు కూడా చేస్తున్నానని మేం ఎందుకు అనుకో కూడదు... ఎవరు మీకు ఫోన్‌చేసి, కథను ఇన్సిడెంట్‌ను మార్చమని చెప్పారో బాహాటంగా చెప్పండి... చెప్తేనే మాకు న్యూస్ అవుతుంది...."

ఇంకో జర్నలిస్టు అతనిక వంతపాడాడు. అతనికో యాభై ఏళ్ళుంటాయి. ఓ సినిమా పత్రికకి ఎడిటర్‌గా చేశాడు. ఓ పెద్ద హీరో ముఖ చిత్రం వేసి అతని దగ్గర్నుంచి యాభైవేలు లంచం అడిగాడు. ఆ విషయం ఆ పెద్ద హీరో ఆ పత్రిక ఎం.డి.కి ఫోన్ చేసి చెప్పడంతో అతని ఉద్యోగం పోయింది. అయినా మాజీ జర్నలిస్టుగా అన్ని ప్రెస్ కాన్ఫరెన్సులకూ అతనొస్తుంటాడు. మరీ ముఖ్యంగా ఈవెనింగ్ కాన్ఫరెన్సులకు, ఈవెనింగ్ ప్రెస్‌మీట్‌లకు మందు, కేష్ కవర్లూ తప్పనిసరి. అందుకని...

"ప్రదీప్‌గారూ... ఇప్పుడు టైం ఆరుగంటలు, ఎటూగాని టైంలో ప్రెస్‌మీట్ పెట్టారు. అది అన్యాయం. ఎక్కడా మందు వాసన లేకుండా ప్రెస్‌మీట్ ఏమిటండీ? పాయింట్‌కొస్తున్నాను. ఫేక్ అలిగేషన్స్ చేయడం వల్ల వుపయోగంలేదు. కథను, ఇన్సిడెంట్స్‌ను ఎందుకు మార్చమంటున్నాడు... ఆ అవసరం వారికైనా ఎందు కుంటుంది...? పోనీ వ్యక్తి గతంగా ఎవరి జీవితకథ ఆధారంగానైనా ఈ సినిమా తీస్తున్నారా... మీ శత్రువులెవరు... ఫలానా అని చెప్పకపోతే న్యూస్ అయిటమ్ ఎలా అవుతుందండి?" ప్రశ్నించాడతను.

అదే టైమ్‌లో వెనుకనుంచి ఎవరో అరిచారు.

"మందు పోస్తే... ఆ వివరాలేమీ లేకపోయినా న్యూస్ ఐటమ్ అవుతుంది" దాంతో జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున నవ్వారు.

డైరెక్టర్ ప్రదీప్‌మైకు అందుకుని–

“నిజానికి మా శత్రువు ఎవరో మాకు తెలీదు. తెలుస్తుందనే ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాం. మీరు ఈ న్యూస్ ఐటెమ్‌ను ఫ్లాష్ చేస్తే త్వరలో మిగతా విషయాలన్నీ బైటకొస్తాయని నా నమ్మకం. ఇక డ్రింక్ పార్టీ... రేపు మేం అన్నపూర్ణాలో బయ్యర్స్‌కోసం ఇంటర్వెల్‌వరకూ సినిమాను చూపించదలిచాం.... ఆ ప్రివ్యూ ప్రోగ్రాం తర్వాత కాక్‌టైల్ పార్టీ వుంటుంది. మీరందరూ ఆ ప్రివ్యూకి, ఆ పార్టీకి రావాలని ఆహ్వానిస్తున్నాం....”

ఆ మాటకు జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున చప్పట్లుకొట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

* * * * *

మర్నాడు ప్రముఖ దినపత్రికల సినిమా పేజీలన్నిట్లోనూ బాక్స్ ఐటెమ్‌గా ఆ వార్త వచ్చింది. ఇండస్ట్రీలో ఆ వార్త సెన్సేషన్ సృష్టించింది. ఈనాడు సినిమా పేజీలో వార్తలను చూసిన బృంద. ఆ వార్తను రామ్‌కాశ్యప్‌కు చూపించింది.

“నేడే విడుదల సినిమాకు బెదిరింపు....”

హెడ్డింగ్ కిందనున్న వార్తను చదివిన రామ్‌కాశ్యప్, బృందవేపు చూసి–

“ఏమిటిది... ప్రెస్‌మీట్ పెడుతున్నట్టు నీకు తెలుసా?” అడిగాడాయన.

“తెలీదు... నిన్న షూటింగ్ అయిపోయాక రేపు ఉదయం పేపర్ చూడండి అని రైటర్ సూర్యవంశీ చెప్పారు... ఎక్స్‌క్యూజివ్‌గా నా ఫోటో వస్తుందేమోనను కున్నాను” అందామె.

“నిజంగా బెదిరింపు వచ్చిందా...?”

ఫోన్ మోగగానే రామ్‌కాశ్వప్ స్వయంగా అందుకున్నాడు. ఫోన్ చేసిన వ్యక్తి ఫైనాన్షియర్ భాగ్యరాజ్.

భాగ్యరాజ్ తప్పుకుంటున్నారంటే... బెదిరించిన వ్యక్తులు అతనికి తేల్సే వుండాలి. అంటే... తను డైరెక్ట్‌గా రంగంలోకి రావాలా...? అలా ఆలోచిస్తున్న దశలోనే సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ రూమ్‌లోకి ప్రవేశించాడు.

అప్పటికీ బృంద షూటింగ్ కెళ్ళిపోయింది.

ఫైనాన్షియర్ భాగ్యరాజ్ తప్పుకున్న విషయం చెప్పి, బృంద సినిమా నటీ కావాలని తను ఫైనాన్స్ చేసిన విషయం చెప్పాడు రామ్‌కాశ్యప్?

"ఈ విషయం మీరు ఇంతకుపూర్వం నాకెందుకు చెప్పలేదు?" అడిగాడు విశ్వనాధ్?

"అవసరం లేదనుకున్నాను...."

"ఆ డైరీకోసం బృందను బెదిరించిన వ్యక్తే... ప్రదీప్, సూర్యవంశీలను కూడా బెదిరించి వుంటాడు... ఆ వ్యక్తి బృందను ప్రేమించిన వాడై వుండాలి. ప్రదీప్, సూర్యవంశీలను ఫోన్లో బెదిరించాడా... లేక కల్సి బెదిరించాడా... కలిస్తే అతనెలా వుంటాడో వాళ్ళకు తెలిసే వుంటుంది. కదా" అన్నాడు విశ్వనాధ్.

"వాళ్ళిద్దరితో మాట్లాడదాం...." మరో ఆలోచన లేకుండా డైరెక్టర్ ప్రదీప్‌కి ఫోన్ చేశాడు రామ్‌కాశ్యప్.

*　　　*　　　*　　　*　　　*

సుమంతరావు త్రిబుల్‌ఫైవ్ సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ చెప్పిందంతా విన్నాడు.

"భాగ్యరాజ్ తన పెట్టిన పెట్టుబడి యాభై లక్షలు వాపస్ ఇచ్చేయమన్నాడా... ఇప్పటికిప్పుడు యాభైలక్షలంటే ఎలా? ఇంతవరకూ సినిమాకు ఖర్చెంతైంది?" అడిగాడు సుమంతరావు.

"డెబ్భైలక్షలు రెండ్రోజుల్లో ఇచ్చేయమన్నాడా...?" అడిగాడు సుమంతరావు.

"అతనికి యాభై లక్షలు రెండ్రోజుల్లో ఇవ్వలేం... సినిమా ఆగిపోతుంది.... వాళ్ళకి కావల్సింది అదేననుకుంటా... అన్నాడు సూర్యవంశీ.

"నేను మరో పది చూడగలను... నాకున్న కమిట్‌మెంట్స్ నాకున్నాయి. ఎందుకైనా మంచిది. ఆ భాగ్యరాజ్‌తో స్వయంగా మాట్లాడి చూడండి" సలహా ఇచ్చాడు సుమంతరావు.

"అతను ఎదురుగానే ఆ వ్యక్తి మమ్మల్ని బెదిరించాడు... ప్రెస్ మీట్లో వాటెంట్‌గానే ఆ విషయం మేం రహస్యంగా వుంచాం" చెప్పాడు ప్రదీప్.

"సినిమా బాగానే వస్తోంది... సూపర్‌హిట్ అవుతుందని నాకు నమ్మకం. నేను ఇవాళ ఢిల్లీ వెళుతున్నాను. సాధ్యమైనంతవరకూ మీకు నేను హెల్ప్

చెయ్యడానికే ట్రై చేస్తాను. పోనీ కాంప్రమైజ్ అయితే ఎలా వుంటుంది. వాళ్ళడిగిన సీన్లు మార్చండి" సూర్యవంశీ ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు సుమంత రావు.

సూర్యవంశీ ప్రదీప్ ముఖంలోకి చూశాడు.

"నో...నో... కాంప్రమైజ్... సినిమా ఆగిపోవడానికైనా నేనొప్పుకుంటాను గానీ రాజీపడను" దృఢనిశ్చయంతో అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

ప్రదీప్ నిర్ణయం సూర్యవంశీకి చాలా ఆనందాన్నిచ్చింది.

కాసేపయ్యాక సుమంతరావు ఇలా అన్నాడు.

"అవును ప్రదీప్... ఆ వ్యక్తెవరు...? అతనికి, ఈ సినిమాలోకథకి సంబంధం ఏంటి? ఆ విషయం ఆలోచించావా?"

"లేదు...." చెప్పాడు ప్రదీప్.

తనకు తెల్సిన విషయాలు చెప్పాడు సూర్యవంశీ. చెప్పి-

"మా హీరోయిన్ బృంద లైఫే ఒక మిస్టరీగా వుంది. ఆ మిస్టరీకి, ఆ వ్యక్తికి ఏదైనా సంబంధం వుందేమోనని నా అనుమానం."

"ఈవెనింగ్ బయ్యర్స్‌కి సినిమా చూపిస్తున్నారుకదా... వాళ్ళకు సినిమా నచ్చిందనుకోండి. మీరు ఈజీగా భాగ్యరాజ్ అప్పు తీర్చేయగలుగుతారను కుంటాను" అన్నాడతను.

"అవును. కానీ రెండ్రోజుల్లో యాభై లక్షలంటే...." భారంగా నిట్టూరుస్తూ అన్నాడు ప్రదీప్.

సరిగ్గా అదే సమయంలో ఫోన్ మోగింది.

ఫోన్ రిసీవ్ చేసుకున్న సూర్యవంశీ ఒక్కక్షణం మాట్లాడి.

"ఇప్పుడే వస్తున్నాం సార్...." అని రిసీవర్ యాధాస్థానంలో పెట్టేసి-

"పదండి... రామ్‌కాశ్యప్‌గారు ఫోన్ చేశారు...." అన్నాడు ప్రదీప్.

మరో రెండు నిమిషాల తర్వాత వాళ్ళిద్దరూ ఆ రూమ్‌లోంచి బయటి కొచ్చి కారెక్కారు.

*  *  *  *  *

జరిగిందంతా రామ్‌కాశ్యప్‌కు పూసగుచ్చినట్లు వివరించాడు రైటర్ సూర్యవంశీ.

"ఆ వ్యక్తితోపాటు ఆ సమయంలో భాగ్యరాజ్, కిషోర్‌దాస్ వున్నారు" రామ్‌కాశ్యప్ పక్కన కూర్చున్న విశ్వనాథ్ అన్నాడు.

"ఏ లాడ్జిలో జరిగింది ఈ డిస్‌కషన్...?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"బేగంపేటలోని బ్లూమూన్...."

"బృంద గురించి ప్రత్యేకంగా ఏమైనా ప్రస్తావించడా?"

"లేదు... ఇంట్రవెల్ తర్వాత సీన్లు మార్చమన్నాడు" చెప్పాడు సూర్యవంశీ.

విశ్వనాథ్ వాళ్ళిద్దరితో మాట్లాడుతుండగా రామ్‌కాశ్యప్ ఆ రూమ్‌లోంచి లేచి పక్క రూమ్‌లోకెళ్ళి... సెల్‌ఫోన్ తీసుకుని తన ఆఫీసులోని పర్సనల్ ఆఫీసర్‌కి ఫోన్ చేశాడు.

"చూడు మిస్టర్ మదన్, నాకు పర్సనల్ హెల్ప్ చెయ్యాలి...."

"చెప్పండి సార్...."

"నువ్వు మంచి ఫోటోగ్రాఫర్‌వి కదూ...."

"అవున్సార్."

"అందుకే నీకే పని అప్పగిస్తున్నాను. బేగంపేటలో హోటల్ బ్లూమూన్ తెలుసా?"

"తెలుసు సార్...."

"ఆ హోటల్లో డీలక్స్... నెంబర్ 306లో ముంబాయి నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులుంటారు. వాళ్ళిద్దరి ఫోటోలు నాకు కావాలి. నువ్వు ఏం చేస్తావో... ఎంత ఖర్చు పెడతావో నాకనవసరం... ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్లో నీకెంత డబ్బు కావాలో తీసుకో... ట్వంటీఫోర్ అవర్స్‌లో నాకు వాళ్ళ డిటైల్స్ కావాలి... మోస్ట్ కాన్ఫిడెన్షియల్... ఈ విషయం మాత్రం గుర్తుంచుకో...." ఫోన్ పెట్టేసి ఆ రూమ్‌లోంచి బయటికొచ్చాడు.

తన సీట్లో కూర్చున్న రామ్‌కాశ్యప్ వేపు చూస్తూ-

"రెండ్రోజుల్లో భాగ్యరాజ్ యాభైలక్షలు ఇవ్వకపోతే... అతనేం గొడవ చేస్తాడో భయంగా వుంది. మధ్యలో షూటింగ్ ఆగిపోతే... మా కెరీర్ నట్టేట్లో మునుగుతుంది" నిరాశ ధ్వనించిన గొంతుతో అన్నాడు సూర్యవంశీ.

కాసేపు కళ్ళు మూసుకుని ఆలోచించాడు రామ్‌కాశ్యప్. ఆ తరువాత–

"మీ సినిమా షూటింగ్ ఆగదు. వెళ్ళండి... సాయంత్రం షూటింగ్ అయిపోయాక ఒకసారి రండి" చెప్పాడు రామ్‌కాశ్యప్.

ఆయనిచ్చిన హామీతో ప్రదీప్, సూర్యవంశీల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది.

"థాంక్యూ సర్... ఆ విషయమే మీతో ఎలా మాట్లాడాలో తెలీక... సతమతమవుతున్నాం. చాలుసార్... ఈ హామీ చాలు... సినిమాను సూపర్ హిట్ చేస్తాను చూడండి" చాలా హేపీగా అన్నాడు ప్రదీప్.

"ఇంకా అయిదారు ఒరిజినల్ ఇన్సిడెంట్స్ వున్నాయి. అవి కూడా కలిపి తీస్తాం" అన్నాడు సూర్యవంశీ.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

అక్కడ రామ్‌కాశ్యప్, విశ్వనాథ్ మాత్రం మిగిలారు.

*   *   *   *   *

"మిస్టర్ విశ్వనాథ్... బృంద మిస్టరీ లైఫ్ క్లైమాక్స్‌కి వచ్చిందని నాకనిపిస్తోంది... అన్నాడు రామ్‌కాశ్యప్.

"అంటే?"

"డైరీ కోసం బృందను బెదిరించిన వ్యక్తి. కథ మార్చమన్న వ్యక్తి తెల్సిపోతాడు...."

"వాళ్ళిద్దరూ వేర్వేరు అయితే...."

"ఇద్దరో, ఒకరో మనకనవరం... బృందకు ఏరకంగా ఆపద రాకుండా చూడాలి...." సాలోచనగా అన్నాడు రామ్‌కాశ్యప్.

"డైరీకోసం ఆ వ్యక్తి బృందను కలుస్తాడేమో...." సంశయంగా అన్నాడు విశ్వనాథ్.

"కమెండోస్ వున్నారు... ఇబ్బంది లేదు... పోలీస్ ప్రొటెక్షన్ కూడా వుంది. వాళ్ళందరూ మఫ్టీలో ఆమెను వెన్నంటే వుంటారు. డోన్ట్ వరీ...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"రేపు బృందకు షూటింగ్ వుందా?" అడిగాడు విశ్వనాథ్.

"ఏం...?"

"డాక్టర్ శకుంతల అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. రేపు మనకు అతి ముఖ్యమైన విషయం తెలుస్తుందనుకుంటాను. నేనూహించిందే నిజమైతే బృంద జీవితంలో ప్రతి విషయం మనకు తెల్సిపోతుంది...."

"ఏం ఊహించారు మీరు...?"

"డాక్టర్ శకుంతలను కలిసాక చెప్తాను... సస్పెన్స్.

"నాతో కూడానా...." నవ్వాడు రామ్‌కాశ్యప్.

*            *            *            *            *

దిల్‌సుఖ్‌నగర్లో రెండెకరాల విశాలమైన గార్డెన్ మధ్య వుందా గెస్ట్‌హౌస్... చుట్టూ ఎత్తయిన గోడ... ఆ గోడకు ఐరెన్ ఫెన్సింగ్. మెయిన్‌గేట్ దగ్గర నుంచున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డ్సు, ఆ పక్కన సెక్యూరిటీ రూమ్‌లో ఫోన్స్‌ని రిసీవ్ చేసుకుంటున్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్. సర్రమని దూసుకొచ్చిన టాటా సుమోను చూడగానే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పరుగు పరుగున వెళ్ళి మెయిన్‌గేట్ తెరిచి సెల్యూట్ చేసాడు.

ఆ టాటా సుమో దిగి అటూ ఇటూ చూశాడు జయభూషణ్. ఆ టాటా సుమోలో పార్టీ కార్యకర్తలెవరూ లేకపోవడంతో ఆ గెస్ట్‌హౌస్‌కి అది అతని పర్సనల్ విజిట్ అని తెలిస్సపోయిన చీప్ సెక్యూరిటీ ఆఫీసర్–

"పది నిమిషాల క్రితం అరవింద్ సాబ్ ఫోన్ చేసారు సార్...." చెప్పాడు.

"ఏం చెప్పాడు... ఇంకా రాలేదా...." అసహనంగా అనేసి లోపలికి నడిచి విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లోని సోఫాలో కూలబడ్డాడు జయభూషణ్.

"వాళ్ళని మాత్రమే లోపలికి పంపించండి... మరెవర్నీ ఎలోచెయ్యొద్దు. అలాగే నోఫోన్ కాల్స్... ఎంత ఇంపారెంట్ కాల్ వచ్చినా, ఢిల్లీ నుంచి మేడమ్ ఫోన్ కాల్స్...." అని చెపుతున్నంతలో లోనికి వచ్చాడు అరవింద్. ఆ వెనుక కిషోర్‌దాస్...

"ఏంది భాయ్... అరవింద్... ఎలక్షన్స్ ముందు సమస్యలుండ కూడదు మనకు. ఏందీ లేటు... పద...." అంటూ మేడమీదకు నడిచాడు జయభూషణ్. అతన్ని అనుసరించాడు అరవింద్.

"పిలిస్తే పైకిరా...." డ్రాయింగ్ రూమ్‌లోనే నుంచున్న కిషోర్‌దాస్‌తో చెప్పాడు అరవింద్.

సరిగ్గా ఆ సమయంలోనే హోటల్ బ్లూమూన్ నుంచి అరవింద్‌ను కిషోర్ దాస్‌ను అనుసరించిన ఒక ఆటోల ఆ గెస్ట్‌హౌస్‌కు కొంచెం దూరంలో ఆగింది. ఆ ఆటోలోంచి దిగిన రామ్‌కాశ్యప్ నియమించిన పర్సనల్ ఆఫీసర్ మదన్ ఆ గేటు దగ్గరికి వెళ్ళాడు... ఆ గేటుకి కుడిపక్కన గోడ మీదున్న నేమ్‌ప్లేట్ చూసాడు.

టి. జయభూషణ్‌రెడ్డి.

పార్టీ ప్రెసిడెంట్.

నేమ్ ప్లేట్‌ని చూస్తున్న మదన్‌ని చూసిన సెక్యూరిటీ గార్డ్ గబగబా మెయిన్‌గేట్ పక్కనున్న చిన్న గేటులోంచి బయటికొచ్చి-

"క్యాహై... క్యా కామ్ కరేగా ఇదర్...." అని అడిగాడు.

"కుచ్‌భీ నహీహై... సాబ్ హైనా అందర్... ఒకసారి కలుసుకోవాలి.

"నో... ఇది ఆయన పర్సనల్ గెస్ట్‌హౌస్... పార్టీ క్యాడర్‌ని ఇక్కడ కల్చుకోరు. సాయంత్రం పార్టీ ఆఫీస్‌లో కల్సుకోండి." మదన్ సూటు, బూటు చూసి గౌరవంగా చెప్పాడు ఆ సెక్యూరిటీ గార్డ్.

"థాంక్యూ ఫర్ యువర్ ఇన్‌ఫర్‌మేషన్...." అని మనసులో అనుకుని వెనుదిరిగాడు మదన్.

"లకడికాపూల్ పోనీ...." ఆటోడ్రైవర్‌తో చెప్పాడు మదన్.

మరో ఇరవై అయిదు నిమిషాల తర్వాత ఆటో లకడికాపూల్‌లోని జనతా ఫోటో స్టూడియో ముందు ఆగింది.

ఆటోదిగి లోనికి అడుగుపెట్టి కౌంటర్‌లో వున్న వ్యక్తికి తన జేబులో వున్న కెమెరా రీల్‌ని తీసి ఇచ్చాడు. ఏ సైజులో ప్రింట్స్ కావాలో చెప్పాడు.

"ఎప్పటికి కావాలి...."

"సాయంత్రానికి...."

"కష్టం...."

"రాత్రి పదిగంటలకు...."

"తొమ్మిదిగంటలకు స్టూడియో మూసేస్తాం."

"ఎనిమిది గంటలకు ఇవ్వగలరా?" ఆ ప్రశ్నకు ఆ వ్యక్తి మదన్ వేపు ఆశ్చర్యంగా చూసి...

"ఎక్స్ట్రా అవుతుంది...." అన్నాడు.

"అలాగే...." అంటూ అడ్వాన్స్ తీసి ఇచ్చాడు మదన్.

"కాన్ఫిడెన్షియల్" అని చెప్పి వెనుదిరిగాడు. అప్పుడే సమయం మధ్యాహ్నం మూడు గంటలు దాటింది.

* * * * *

విశాలమైన సోఫామీద కూర్చున్నాడు జయభూషణ్. నిలువెత్తు జయభూషణ్ తెల్లటి డేగలా వున్నాడు. తెల్లటి కుర్తా-పైజమాలో మెరిసి పోతున్నాడు. ఫ్రిజ్లోంచి కూల్డ్రింక్ బాటిల్ తీసి రెండు గ్లాసుల్లో పోసి, ఒక గ్లాసుని అరవింద్కి అందించి-

"చూశావా... మన స్టేట్లో పాలిటిక్స్ ఎలా టర్న్ అయిపోతున్నాయో... ప్రజలు వడ్డీవ్యాపారస్తుల్లాంటివారు... పది పైసలు ఎటొస్తే... అటే వుంటారు. కంప్యూటర్స్ వల్ల ఆకలి తీరదని వాళ్ళకి తెల్సిపోయింది. ఈసారి మన పార్టీ బాజాభజంత్రీలతో, రెండు వందల సీట్లు గెలుచుకుంటుంది. సి.ఎం. కాండిడేట్ను నేను... నువ్వు ఎలక్షన్స్లో పోటీ చేస్తావా?" అడిగాడు జయభూషణ్.

"మినిస్టర్ పదవి ఇస్తానంటే పోటీ చేస్తా... హోం మినిస్టర్ ఇస్తావా" అడిగాడు అరవింద్.

"హోమ్ మినిస్టర్ కష్టం. అది నా దగ్గరే వుంచుకుంటా... ఎందుకంటే, నామీద ఇప్పుడు యాభై కేసులున్నాయి. ఇస్తే గిస్తే ఆ మినిస్ట్రర్ నీలాంటి తెలివైన వాడికివ్వగూడదు. గ్రూపులు కట్టి సి.ఎం. పదవికి ఎసరుపెడతావ్. సరదాకి అన్నా... ఏమనుకోకు... ట్రెండ్ అలా వుంది. ఏదో మినిస్ట్రీ ఇస్తా... నాలుగు పైసలు వెనకేసుకో... అవును. ఆ మంజరి గొడవేంటి. నువ్వు ఫోన్లో చెప్పింది నాకు ఒక్కముక్క అర్థంకాలే... అర్జంటుగా కలవాలని... ఢిల్లీ జర్నీని పోస్ట్పోన్ చేసుకొని వచ్చాను. చెప్పు...." అడిగాడు జయభూషణ్.

అంతా చెప్పాడు అరవింద్.

"ఆ సినిమా ఫంక్షన్‌లో చూసినప్పుడు నాకూ, అనుమానం వచ్చింది. అందుకే గదా నీకు ఫోన్ చేసింది. అయితే నేడే విడుదల సినిమా స్టోరీ మన స్టోరీయే నంటావా... ఆ బృంద మంజరీయే నంటావా... నాకు ఏదో అనుమానం వచ్చే నీకు ఫోన్ చేశాను" అన్నాడు జయభూషణ్.

"లేకపోతే మన స్టోరీ... ఇన్సిడెంట్ బై ఇన్సిడెంట్ ఎలా తెలుస్తుంది చెప్పు...."

"ఆ మంజరి బృందగా పేరు మార్చుకుని మనమీద సినిమా తీస్తుం దంటావా... అంత డబ్బెక్కడిది... సినిమా తీసి ఏం చేస్తుంది. అయినా అనవసరంగా కథ, సంఘటనలు మార్చమని బెదిరించి నువ్వు తప్పుచేశావ్. ఆ తొందరపాటే వద్దన్నది" విసుక్కున్నాడు జయభూషణ్.

"చూడు భూషణ్... నేను చాలా ముందుచూపుతోనే ఆ డైరెక్టర్ని, రచయితను హెచ్చరించాను... ఎంతో తెలుసా... ఆ సినిమా రిలీజవుతుంది. సూపర్ హిట్ అవుతుంది. మన జిల్లాలో వాళ్ళందరికీ ఆ కథ తెల్సు... మనవల్ల మంజరి జీవితం నాశనమైపోయిందని తెల్సు.... మహిళా సంఘాలు గొడవ చేయడం తెలుసు.

అప్పటి గవర్నమెంట్ ఎంక్వైరీ కమిషన్ వెయ్యడం తెలుసు. మంజరి సడన్‌గా కనిపించకపోవడం, మంటల్లో చిక్కుకుని చచ్చిపోయిందని తెలిసాక ఆ కేసు మూసేశారు. ఆ ఫైలుని కనిపింకుండా చేసాం. కానీ, ఇప్పుడీ సినిమా రిలీజయ్యాక బృంద, అదే మంజరి మళ్ళీ పబ్లిక్‌లోకి వచ్చి నేను బతికే వున్నానని నామీద విరుచుకుపడితే...

ఈ మహిళాసంఘాలకు మరేం పనిలే. ఎవరు ఎవరితో వెళ్ళిపోయినా వీళ్ళకే కావాలి. ఇలాంటి కేసొస్తే వాళ్లు జండాలు పట్టుకుని వీధుల్లో కొచ్చేస్తారు. నిరాహారదీక్షలు, హర్తాళ్ళు, ధర్నాలు... దానికితోడు సాయంత్రంపూట మీటింగు ల్లేందే నిద్రపోని సభాసామ్రాట్టులున్నారు. వాళ్ళ ఇప్పుడే ఆ సినిమా ఆగిపోయేటట్టు చేస్తే... ఏ గొడవ వుండదుగా...." ఆవేశంగా చెప్పాడు అరవింద్.

"అయిడియా బాగానేవుంది. నువ్వు పంపిన వీడియో కేసెట్ చూశాను. ముఖంలోనే ఏదో మార్పుంది. అదే మనిషి ఎలా బతికిందంటావ్.... ప్రస్తుతం ఎక్కడుంటోంది...." అడిగాడు జయభూషణ్.

"ఇండస్ట్రీయలిస్ట్ రామ్‌కాశ్యవ్ ఇంట్లో... ఆ రిలేషన్ ఏంటో నార్థం కావడం లేదు. లేకపోతే ఎప్పుడో మరో ఆలోచన లేకుండా లేపేసే వాడ్ని, చూడు భాయ్... నేను ఒకటే నిర్ణయానికొచ్చాను. దాని దగ్గర ఒక డైరీ వుంది. ఆ డైరీ ఇమ్మని స్వయంగా హెచ్చరించాను. ఇచ్చినా, ఇవ్వకపోయినా అది వేరే విషయం. ఆ కథ మాత్రం మనదే. ఆ సినిమా రిలీజయితే మనకి నెగిటివ్ ఎఫెక్ట్ వస్తుందా... రాదా చెప్పు."

"హై కమాండ్ కూడా చెప్పిందయ్యా బాబూ... నెక్ట్స నేనే పి.ఏం.నని. అలాంటప్పుడు ఇలాంటి గొడవలుండకూడదు. నీ ఇష్టమొచ్చినట్లు చెయ్యి. ఏ న్యూస్ పేపర్స్‌లో రాకూడదు. అది మాత్రం గుర్తుంచుకో. మిగతా సహాయం నీకేం కావాలన్నా నేను వస్తాను...." చెప్పాడు జయభూషణ్.

ఆ సినిమా పూర్తికాకుండా తనేం చేయబోతున్నాడో, చివరగా మంజరిని ఎలా మాయం చెయ్యబోతున్నాడో తన ప్లాన్స్ చెప్పాడు అరవింద్.

"ఎలక్షన్స్ నోటిఫికేషన్ రావడానికి ముందే ఇవన్నీ అయిపోవాలి. అర్థమైందా" చెప్పాడు జయభూషణ్.

"మరీ అవసరమైతే ఢిల్లీ రా... ఇరవైరోజులు నేనక్కడే వుండాను. ఏరోజుకారోజు ఫోన్ చేస్తుండు" వాళ్ళిద్దరూ విడిపోయేముందు ఎయిర్‌పోర్టులో చెప్పాడు జయభూషణ్.

* * * * *

రాత్రి తొమ్మిదిగంటలు దాటింది.

షూటింగ్ నుంచి వచ్చి పావుగంట క్రితమే డిన్నర్ పూర్తిచేసి "మార్నింగ్ షూటింగ్ ఉందంకుల్" అని చెప్పి వెళ్ళిపోయింది బృంద.

డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ తనను కలుస్తున్నారన్న విషయం గానీ, భాగ్యరాజ్ హెచ్చరికనుగానీ, ఏ విషయమూ బృందతో చెప్పలేదు రామ్‌కాశ్యవ్.

ఎదురుగా కూర్చున్న సూర్యవంశీ, ప్రదీప్‌ల వేపు చూశాడు రామ్‌కాశ్యప్.

"ముందుగా ఒక గుడ్ న్యూస్ సార్... మన సినిమా నేడే విడుదల ఇంటర్వెల్ సార్ట్‌వరకూ బయ్యర్స్ కోసం ప్రివ్యూ వేశాం. ఇప్పుడక్కడ నుంచే వస్తున్నాం... ఒకపక్క జర్నలిస్టులకు పార్టీ తిరుగుతూనే వుంది. మన సినిమామీద వండర్‌ఫుల్ టాక్ వచ్చింది బయ్యర్స్ రెండ్రోజుల్లో తమ ఒపీనియన్స్‌ని చెప్తామన్నాడు" ఆనందంగా చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

"గుడ్ ప్రోగ్రెస్... మీమీద నాకు నమ్మకం వుంది. షూటింగ్ పార్ట్ ఎంత వుంది?"

"క్లయ్‌మాక్స్... రెండు కామెడీసీన్లు... మొత్తం రెండు రీళ్ళు... హీరోయిన్, హీరోని చంపే లాస్ట్‌సీన్... పబ్లిక్‌లో తీయాలి, దానికొక్కదానికే పదిలక్షలవుతుంది" డిటైల్స్ చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

షూటింగ్ ఏ ఏ ఏరియాల్లో జరపాలనుకుంటున్నారు?"

"మాదాపూర్, షూట్‌రోడ్ మీద... రాత్రిపూట... ఒక సేవ్... జూబ్లీహిల్స్ ప్రైవేట్ బంగ్లాలో ఇంకో మూడుసీన్లు... అంటే హీరోయిన్ హీరోని వేటాడే సీన్లు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో, ఫైనల్‌సీన్. లాల్‌బహదూర్ స్టేడియంలో" చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

ఒక అయిదు నిముషాలపేపు చాలా సీరియస్‌గా ఆలోచించిన రామ్‌కాశ్యప్.

"రేపు మీరు ప్రెస్‌మీట్ పెట్టండి... ఏయే ప్రాంతాల్లో మీరు ఈ సినిమా షూటింగ్స్ జరపబోతున్నారో చెప్పండి. ఆ వివరాలు పేపర్స్‌లో రావాలి" చెప్పాడతను.

"ప్రెస్‌లో ఆ వివరాలు రావడంవల్ల ఉపయోగం ఏమిటి?"

"ఉపయోగం చాలావుంది. మీరు ప్రెస్‌మీట్ పెట్టి ఎనౌన్స్ చేశాక ఆ తర్వాత ఏం చేయాలో చెప్తాను" సూటిగా వాళ్ళవేపు చూస్తూ అన్నాడతను.

"ప్రెస్‌లో ఆ వివరాలు రావడంవల్ల ఉపయోగం ఏమిటి?"

రామ్‌కాశ్యప్ ఎందుకలా చెప్పాడో వాళ్ళకర్థం కాలేదు. మరో నలభై నిముషాల తర్వాత వాళ్ళిద్దరూ వెళ్ళడానికి లేచారు.

"రేపు మీరొచ్చేముందు నేడే విడుదల సినిమాకు సంబంధించిన స్క్రిప్టు తీసుకురండి... నాకా స్క్రిప్టు చూడాలని వుంది" అన్నాడతను.

ప్రదీప్, సూర్యవంశీ అక్కడ నుంచి వెళ్ళిపోయాక అడిగాడు విశ్వనాథ్.

"బృంద జీవితానికి సంబంధించి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారను కుంటాను."

"అవును."

"షూటింగ్ ప్లేసుల్ని ఎనైన్స్ చెయ్యడం ఎందుకు? అలాగే ఆ స్క్రిప్టు ఎందుకు చూడాలనుకుంటున్నాడు?"

"చదరంగంలో అవతలి వ్యక్తి ఎత్తుగడల్ని అంచనా వెయ్యడమే గెలుపుకు పునాది. అవునంటారా?"

"యస్... యూ ఆర్ కరెక్ట్...."

"ఇదీ అంతే" చెప్పాడు అనంతకాశ్యప్.

ఆ క్షణంలో సైకియాట్రిస్ట్ విశ్వనాథ్‌కి రామ్‌కాశ్యప్ వ్యూహం అర్థంకాలేదు.

* * * * *

సాయంత్రం ఆరుగంటలు దాటింది.

నెక్లెస్ రోడ్ బిజీ, బిజీగా వుంది ట్రాఫిక్‌తో.

నెక్లెస్‌రోడ్ ప్రారంభంలో సికింద్రాబాద్ వైపు వెళ్ళే దారిలో షూటింగ్...

అక్కడక్కడ మాట్లాడుకుంటున్న జనం, మరొకపక్క దూసుకుపోతున్న కార్లు. టాంక్‌బండ్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూడటానికి వచ్చిన టూరిస్టులు!

ఆ ప్రదేశమంతా చాలా కోలాహలంగా వుంది.

నెక్లెస్‌రోడ్ సెంటర్ దగ్గర ఓపెన్ జీప్‌లో డైరెక్టర్ ప్రదీప్, జీప్ బోనెట్‌మీద కెమెరాతో కెమెరామెన్ కూర్చున్నారు.

ఆ పక్కనే నుంచున్నారు బృంద, హీరో విమల్.

"చూడమ్మా బృందా... ఇది ఛేజింగ్‌సీన్. కేకేలేసుకుంటూ హీరోని తరుము కుంటూ జనం మధ్యలోంచి నువ్వెళుతుంటావ్. నో రిస్ట్రిన్స్... ఇష్టమొచ్చినట్టుగా నువ్వెళ్ళిపో, ఎవరయినా జనం ఆడ్డోస్తే వాళ్ళని పక్కకి తోసేసి వెళ్ళిపో... సీన్ చాలా నేచురల్‌గా రావాలి. ఇది షూటింగ్ అని అనుకోవద్దు... అర్థమైందా?" చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

"ఎన్ని నిమిషాలు ఈ సీన్?" అడిగాడు విమల్.

"తెరమీద రెండున్నర నిమిషాలుంటుంది. మనం ఐదు నిమిషాలు తీస్తాం. చూడమ్మా! నీ చేతిలో ఐరన్‌రాడ్ వుంటుంది. ఈ రాడ్‌తో అతని తల బద్దలుకొట్టి చంపెయ్యాలన్నది నీ ఉద్దేశం - అర్థమైందా?" చెప్పాడు ప్రదీప్.

సరిగ్గా ఆరు పది నిమిషాలు అయింది.

జనం మధ్యలో మొదట విమల్ నిలబడ్డాడు, మామూలు డ్రస్‌లో వున్నాడతను.

పాత చీరలో వుందిబృంద.

కొంతమంది మూవీ కెమెరావేపు చూసినా, లైట్‌బాయిస్, రిఫ్లెక్టర్స్ హంగామా లేకపోవడంతో అదేదో డాక్యుమెంటరీ షూటింగేనేమోనని అను కున్నారు. పెద్దగా ఆసక్తి చూపలేదు.

"రెడీ... స్టార్ట్ కెమెరా' డైరెక్టర్ ప్రదీప్ అరిచాడు.

విమల్ పరిగెత్తడం ప్రారంభించాడు.

జనం మధ్యలోంచి ఎదురుగా వస్తున్న జనాన్ని తోసుకుంటూ పరిగెత్తు తున్నాడతను.

హీరోయిన్ బృంద కుడిచేత్తో రాడ్‌తో "యూ బాస్టర్డ్... ఐ విల్ కిల్ యూ" అంటూ గట్టిగా అరిచి అతని వెనుకే పరిగెడుతోంది.

"వాళ్ళ వెనక జీపు... జీపుమీద కెమెరా.

రోడ్డు పక్కన అంబాసిడర్ కారులో కూర్చున్న సూర్యవంశీ. సిగరెట్ కాల్చుకుంటూ ఆ ఛేజింగ్‌ని చూస్తున్నాడు.

దాదాపు ఒకటిన్నర కిలోమీటరు వుంది ఆ రోడ్.

విమల్ పరిగెడుతున్నాడు.

అతన్ని పట్టుకోవటానికి బృంద పరిగెడుతోంది.

విమల్ జనం మధ్యలోంచి స్పీడ్‌గా పరిగెత్తడం ప్రారంభించాడు.

బృందకు, విమల్‌కు దూరం ఎక్కువైపోయింది.

"హీరోగారేంటీ అప్పుడే అవుట్ ఫ్రేమ్‌లోకి వెళ్ళిపోయారు...?" అన్నాడు కెమేరామెన్ కంగారుగా.

"డోంట్ స్టాప్... క్యారీ ఆన్... మనకు జనం ముఖ్యం. ఎడిటింగ్ చూసుకుందాం. కాన్‌సన్‌ట్రేట్ ఆన్ హీరోయిన్...." కేకేసాడు ప్రదీప్.

"ఎవరు కన్‌ఫీస్ చేసారో కానీ, ఆ సీన్ తెరమీద బ్రహ్మాండంగా వస్తుంది సార్! సన్నీడియోల్ సినిమాలో గొడుగుల సీన్‌లాగా...." ఉత్సాహంగా అన్నాడు కెమెరామెన్ లెన్స్‌ని అడ్జస్ట్ చేసుకొంటూ.

నేచురల్ లైటింగ్‌లో సినిమా తీయటం ఒక ఆర్టు.

సత్యజిత్‌రే... శ్యామ్ బెనెగల్, బాపు, మణిరత్నం... వాళ్ళదో స్కూల్. నేడే విడుదల సినిమాలో కొన్ని సీన్లను ప్రత్యేకంగా రిస్క్‌తో తీస్తున్నాడు ప్రదీప్. ఆ సీన్స్ సినిమాను హిట్ చేస్తాయన్న నమ్మకముంది అతనికి.

బృందకు ముందు పదడుగుల దూరంలో వున్నాడు విమల్.

వెనుక పదడుగుల దూరంలో వుంది కెమెరా.

సరిగ్గా అదే సమయంలో-

బృంద పక్కనొచ్చి ఆగింది మారుతీకారు. విసురుగా పరిగెడ్తున్న బృంద ఒక్కసారిగా ఆగిపోయింది.

మారుతీ కారు ఆమెకు అడ్డంగా ఆగడం చూసిన ఒక కమెండో... ఏదో ప్రమాదాన్ని శంకించి, మిగతావాళ్ళని హెచ్చరించి ముందుకు పరుగెత్తడం ప్రారంభించాడు.

జనం.. జనం... అటూ ఇటూ వస్తున్న వెళుతున్న కార్లు.

మారుతీకారు బ్యాక్ డోర్ టక్‌మని తెరుచుకుంది. అందులో కూర్చున్న అరవింద్ ఆమె చెయ్యిపట్టుకొని లాగడంతో ఆమె సీట్లో పడిపోయింది. వెంటనే డోర్ క్లోజ్ అయింది.

మారుతీ కారు జనం మధ్యలోంచి ముందుకు దూసుకుపోయింది.

అంతా సెకండ్లలో జరిగిపోయింది.

"స్టాప్ కెమెరా... వాట్ హేపెండ్ దేర్...?" బిగ్గరగా అరిచాడు డైరెక్టర్ ప్రదీప్.

ఎవరికీ ఏమీ అర్థంకాలేదు.

*　　　*　　　*　　　*　　　*

ముందుకెళ్ళిన కారు బేగంపేట వేపు మలుపు తిరిగింది.

కార్లో కూలబడిన బృందకు ఏం జరిగిందో అర్థం చేసుకోవటానికి కొన్ని క్షణాలు పట్టింది.

"నేనే... ఎవరో గుర్తుపట్టావా?"

అతను... నిన్న లిఫ్ట్‌లో తనను బెదిరించిన వ్యక్తి.

"ఎవర్నువ్వు?"

"నటించకు మంజరీ? నేనెవరో నిజంగా నీకు తెలీదా?"

"నువ్వా... మీరు...."

"నీలో ఇంత నటనుందని నాకు తెలీదు. నన్ను పూర్తిగా మర్చిపోయినట్టు నటిస్తున్నావంటే నువ్వు మామూలుదానివి కాదు. ఎందుకు నటిస్తున్నావ్? డైరీ ఎక్కడుంది?" అరవింద్ గొంతు కరకుగా వుంది.

"మీరెవరో నాకు తెలీదు. నిజంగా నాకు తెలీదు... డైరీ ఏమిటి?" ప్రశ్నించింది బృంద.

"నువ్వు నటిస్తే ప్రాణాలతో వదులుతాననుకుంటున్నావా?" అంటూ బటన్‌నైఫ్ తీసి ప్రెస్ చేశాడు అరవింద్.

చివ్వున బయటికొచ్చింది నైఫ్. మిలమిలా మెరుస్తోంది.

"నిన్నిప్పుడు... ఈ కారులోనే చంపి రోడ్‌మీద పడెయ్యగలను. పెద్ద బిజినెస్‌మేన్ రామ్‌కాశ్యప్ నిన్ను రక్షిస్తాడని భ్రమపడకు. అవసరమైతే వాడ్ని లేపేస్తాను. నువ్వు డైరీ ఇస్తావా?..."

"నాకు డైరీ గురించ తెలీదు. ప్లీజ్ బిలీవ్ మీ...."

"మంజరి... నువ్వు ప్రతిరోజూ రాసేదానివని నాకు తెలుసు. ఆ డైరీలో మనం ఎప్పుడు, ఎక్కడ, ఎన్నిసార్లు కలుస్తున్నామో అన్ని వివరాలూ వున్నాయి. ఆ వివరాలు బయటి ప్రపంచానికి తెలియకూడదు నిన్ను ఫైర్ యాక్సిడెంట్‌కి గురిచేసింది కూడా అందుకే. కానీ నువ్వెలా బతికావో నాకేం అర్థం."

"మీరంటున్న ఏ విషయమూ నాకు తెలీదు...." భయంగా అంది బృంద.

ఆ సమయంలో ఆమెలో ప్రాణభయం చోటుచేసుకుంది.

అప్పటికే కారు బేగంపేట ఫ్లైఓవర్ మీదుగా పంజాగుట్ట చౌరస్తా దగ్గర కొచ్చింది. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్‌సిగ్నల్ పడటంతో తన చేతి వాచీవేపు చూసుకున్న అరవింద్–

"మరో ఇరవై నాలుగు గంటలు నీకు టైమిస్తున్నాను. డైరీ నాకు ఇవ్వు. లేకపోతే నువ్వు ఎంత సెక్యూరిటీ మధ్య వున్నా... శవంగా మారిపోవడం ఖాయం... కారు దిగు...." అంటూ డోర్ ఓపెన్ చేసాడు అరవింద్.

రెడ్ సిగ్నల్ గ్రీన్ సిగ్నల్‌గా మారడంతో కారు బంజారాహిల్స్ వేపు దూసుకుపోయింది.

కారు దిగిన బృంద అటూ – ఇటూ చూస్తున్న పరిస్థితిలో జీపు వచ్చి ఆమె పక్కన ఆగింది.

ఆ జీపులో డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ, కెమెరామెన్ వున్నారు.

*        *        *        *        *

రామ్‌కాశ్యప్ అంత వైల్డ్‌గా రియాక్ట్ అవుతాడని కమెండోస్ వూహించ లేదు.

"యూ బాస్టర్డ్స్... ఏం చేస్తున్నారు మీరు... బృంద ప్రాణాలకు ఏదైనా జరిగుంటే... మిమ్మల్ని షూట్ చేసుండేవాడ్ని" అరిచాడతను.

"సారీ సర్! అలా జరుగుతుందని అస్సలు వూహించలేదు" ఆ కమెండోస్ చీఫ్ చెప్పాడు.

"ఆ నెక్లెస్‌రోడ్‌లో మిమ్మల్ని షూటింగ్ ఎవరు పెట్టమన్నారు?" కోపంగా డైరెక్టర్ ప్రదీప్ కళ్ళలోకి చూస్తూ ప్రశ్నించాడు.

"నేచురల్‌గా వుంటుందని."

తన కోపాన్ని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు రామ్‌కాశ్యప్.

అదే సమయంలో-

మేడమీద నుంచి కిందికొచ్చిన ఫ్యామిలీ లేడీ డాక్టర్.

"డోంట్ వర్రీ సార్! బాగా టెన్షన్‌కి గురికావడంవల్ల... ఇంటికి రాగానే అన్‌కాన్షన్‌గా పడిపోయింది తప్ప మరేం లేదు... ఇంజక్షన్ చేసాను. ఆమె లేచేవరకు ఎవరూ డిస్టర్బ్ చేయకండి. నర్స్‌ని పెట్టాను. ఏదయినా అవసరం వస్తే ఫోన్ చేయండి. వస్తాను" అని వెళ్ళిపోయిందామె.

బృంద అన్‌కాన్షన్‌గా పడిపోయిందని తెలియగానే కంగారుపడినా అక్కడున్న వాళ్ళందరూ హాయిగా వూపిరిపీల్చుకున్నారు. మరీ ముఖ్యంగా సూర్యవంశీ.

మరో పది నిమిషాల తర్వాత పర్సనల్ ఆఫీసర్ మదన్ అక్కడకు రావడంతో సూర్యవంశీ, ప్రదీప్ అక్కడినుంచి వెనక్కి వచ్చేశారు.

*  *  *  *  *

లాన్‌లో కూర్చున్నారు రామ్‌కాశ్యప్, మదన్.

మదన్ తన చేతిలోనున్న కవర్‌లోంచి తీసిన కొన్ని ఫోటోలు రామ్ కాశ్యప్ చేతికిచ్చాడు.

ఆ ఫోటోల్లో ఇద్దరు వ్యక్తులున్నారు.

వాటిలో ఎడమవేపున్న వ్యక్తి కిషోర్‌దాస్, కుడివేపున్న వ్యక్తి అరవింద్.

"బ్లూమూన్ హోటల్లో వాళ్ళు మూడు రోజుల్నించి వుంటున్నారు. ఆ హోటల్లో స్పెషల్ సూట్ ఫైనాన్సర్ భాగ్యరాజ్ తన పేరుమీద బుక్ చేశాడు. ఆ

హోటల్లోంచి ఫోన్లేవీ బయటికెళ్ళలేదు. ఆ హోటల్‌కెళ్ళి వాళ్ళని కల్సిన వాళ్ళలో భాగ్యరాజ్ మొదటివాడు కాగా, డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ కూడా వున్నారు.

నిన్న మధ్యాహ్నం అరవింద్, కిషోర్‌దాస్‌తో కల్సి, పార్టీ ప్రెసిడెంట్ జయభూషణ్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాడు. దిల్‌షుక్‌నగర్‌లో వున్న ఆ గెస్ట్‌హౌస్ అరవింద్ దాదాపు నలభై నిమిషాలసేపు జయభూషణ్‌తో మాట్లాడాడు.

కాబోయే ముఖ్యమంత్రిగా ప్రచారం పొందుతున్న జయభూషణ్ ఫోటో ఏ స్టూడియోలోనైనా దొరుకుతుంది. అలాగే ఈ స్టూడియోలోనూ వుంది. ఎందుకయినా మంచిదని తెచ్చాను. జయభూషణ్ నిన్న సాయంత్రం ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళ్ళిపోయాడు. అరవింద్, ఇవాళ ఉదయం బ్లూమూన్ హోటల్‌ని ఖాళీ చేసేసాడు. బహుశా ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌కి మారి వుండవచ్చని నా అభిప్రాయం."

తను సేకరించిన విషయాల్ని రామ్‌కాశ్యప్‌కి చెప్పాడు మదన్.

"సి.బి.సి.ఐ.డిలో వుండాల్సిన వుండాల్సిన వాడివి" పొగిడాడు రామ్‌కాశ్యప్.

అప్పటికప్పుడు రామ్‌కాశ్యప్ ఒక నిర్ణయానికొచ్చాడు.

"చూడు మదన్... నీకు ప్రత్యేకమైన ఆపరేషన్ అప్పగిస్తాను. పదిహేను రోజులు నువ్వు ఆఫీసుకు సెలవుపెట్టు. నువ్వునాకు అతి ముఖ్యమై, విలువైన సమాచారాన్ని ఇవ్వగలవన్న నమ్మకం నాకుంది. అందుకే ఈ బాధ్యత నీకప్పగిస్తు న్నాను. నేను నీకప్పగించిన ఫస్ట్ ఆపరేషన్ మూడు రోజుల్లో పూర్తికావాలి. నువ్వు చేయాల్సిన పని...." అంటూ ఆ పని చెప్పాడు రామ్‌కాశ్యప్.

"జయభూషణ్ నేటివ్‌ప్లేస్ అందరికీ తెలుసు... మహబూబ్‌నగర్. ఈ అరవింద్ గురించే తెలుసుకోవాలి. జయభూషణ్‌కి. అరవింద్ బాగా సన్నిహితుడని మీరంటున్నారు కాబట్టి, అతని వివరాలు కూడా అక్కడే తెలుస్తాయని నాతో నమ్మకం వుంది.

"డోన్ట్‌వర్రీ సార్... మహబూబ్‌నగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో నాకో ఫ్రెండ్ వున్నాడు. అతను నాకు ఎలాంటి సమాచారాన్నయినా ఇవ్వడానికి వెనుకాడడు" చెప్పాడు మదన్.

"నీకిస్తున్న టైమ్ మూడు రోజులు... ఆ తర్వాత... నువ్వు ఇక్కడ చేయాల్సిన పనులు చాలా వున్నాయి" చెప్పాడు రామకాశ్యప్. అతను అక్కడినుంచి వెళ్ళిపోయేముందు.

*  *  *  *  *

రామ్‌కాశ్యప్‌కి రోజు రాత్రి చాలాసేపటివరకూ కంటిమీదకు కునుకు రాలేదు.

ఎడతెగని ఆలోచనలు...

రెండున్నర గంటల సమయంలో లాన్లో పచార్లు చేస్తున్నాడతను.

వాతావరణం పొడిపొడిగా వుంది.

సరిగ్గా ఆ సమయంలో సెల్‌ఫోన్ మోగింది.

అలాంటి సమయంలో ఫోన్ ఎవరుచేస్తారో రామ్‌కాశ్యప్‌కి తెలుసు అందుకే వెంటనే అందుకున్నాడతను.

"హలో డాడ్... హౌ అర్యూ... ఏమిటి మీరింతవరకు నిద్రపోలేదా? లేక ఇప్పుడేలేచారా?" అడిగాడు అనంత్‌కాశ్యప్.

అలాంటి సమయంలో కొడుకు నుంచి ఫోన్ రావడం చాలా హేపీగా వుంది రామ్‌కాశ్యప్‌కి. టెన్షన్స్ అన్నీ మాయమైపోయి, రిలాక్స్‌డ్‌గా అయిపోయాడతను.

"హౌ ఆర్యూ అనంత్... లా వుంది బిజినెస్... యూవర్ డెలిగేట్స్ కాన్ఫరెన్స్‌ని ప్రిపైడ్ చెయ్యమని నువ్విచ్చిన ఫాక్స్ అందింది. నా మేసేజ్ కూడా నీకి పాటికి అందే వుంటుంది."

"అది చూసే మీకు ఫోన్ చేస్తున్నాను. అంత బిజీయా మీరు?"

"అవును. అయామ్ వెరీ బిజీ నౌ... రెండు నెలల తర్వాత రాగలనేమో" అన్నాడు రామ్‌కాశ్యప్.

కాసేపు మౌనం.

"ఇన్నికోట్ల బిజినెస్. అక్కడ మీరు... ఇక్కడ నేను... ఫోన్లో పంచుకుంటున్న ఆత్మీయత మనది. మనకోసం మనం బతకలేమా డాడీ" ఫిలాసఫిగ్గా అన్నాడు అనంత్.

అవును! తను ఏదైతే ఫీలవుతున్నాడో, అనంత్ కూడా అదే ఫీల్ అవుతున్నాడు.

ఒక్కసారిగా కళ్ళు చెమర్చాయి రామ్‌కాశ్యప్‌కి.

"బిజినెస్ పద్మవ్యూహం లాంటిది అనంత్. కష్టపడితే ఎవరైనా లోపలికి వెళ్ళిపోగలరు. కానీ అందులోంచి బయటపడటమే కష్టం. అందుకే ఫామిలీ లైఫ్ చాలా ముఖ్యం" అన్నాడు రామ్‌కాశ్యప్.

"ఎగ్జాట్లీ! మీరు కాన్ఫరెన్స్‌కి వస్తే–నియమతో నా మ్యారేజ్ డేట్‌ని ఫిక్స్ చేస్తారనుకున్నాను, పోనీ... ఫోన్లోనే చెప్పండి–ఏ డేట్‌న మ్యారేజ్ ఫిక్స్ చేయమంటారు? పెళ్ళి మీ సమక్షంలోనే జరగాలని నియమ పట్టుబడుతోంది. వచ్చేనెల పెడితే బాగుంటుంది..." అన్నాడు అనంత్‌కాశ్యప్.

"కొన్ని వేలమందిని డీల్ చేస్తున్న సక్సెస్‌ఫుల్ పర్సన్‌వి నువ్వు. నీ ఇష్టానికి నేను అడ్డురాననే విషయం నీకు తెలుసు. నువ్వు, నియమ కల్సి డేట్ ఫిక్స్‌చేసి చెప్పండి. ఎరేంజ్‌మెంట్స్ కోసం రెండు రోజులు ముందు చేప్తేచాలు. ఏమంటావ్?"

"థాంక్యూ డాడీ! ఒక్క నిమిషం."

ఒక్క నిమిషం తర్వాత–

"హలో అంకుల్! నేనే నియమను. నమస్కారం..." స్వచ్ఛమైన తెలుగులో అంది నియమ.

"యూ ప్రెటీగర్ల్. నువ్వూ పక్కనే వున్నావా? చూడు నియమా! అనంత్ నిన్ను ఎప్పుడైతే ఇష్టపడ్డాడో, అప్పటినుంచి అనంత్ నీవాడు. పెళ్ళి విషయంలో మీరిద్దరూ ఎలా అనుకొంటే అలా–సరేనా?"

"థాంక్యూ అంకుల్! మీ సమక్షంలో గుడిలో, సంప్రదాయబద్ధంగా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం అంకుల్! డేట్ టు డేస్‌లో అనంత్ ఇన్ఫాం చేస్తారు బైదిబై... మా పెళ్ళి జ్ఞాపకార్థం ఒక కొత్త ప్రొడక్ట్ ఏంటో తెలుసా? పెర్ఫ్యూమ్... ఓ మంచిపేరు నేనే పెట్టాను. ఎలా వుందో చెప్పండి. ఫెయిర్ ప్లెజర్ ఎలా వుంది?" ఆహ్లాదంగా నవ్వుతూ అంది నియమ.

"వెరీనైస్! గుడ్ నేమ్."

"మేమిద్దరం దంపతులమవుతున్న శుభసందర్భంలో హైదరాబాద్‌లో మీరే ఆ ప్రొడక్ట్‌ను లాంచ్ చేస్తారు. వరల్డ్ డీలర్‌షిప్‌ని ఒక ఫ్రెంచ్ కంపెనీకిస్తున్నాం. ఆ పనిమీద నేను ఫ్రాన్స్‌కు వెళుతున్నాను. అట్నించి రాగానే..." ఏదో చెప్పబోయిన నియమ మాటలు ఆగిపోయాయి.

మళ్ళీ ఒక్కక్షణం.

"అంకుల్... అంకుల్..." మాటలు విన్పించాయి.

"ఏదో డిస్ట్రబెన్స్ వచ్చినట్టుంది చెప్పమ్మా" అన్నాడు రామ్‌కాశ్యప్.

"ఫ్రాన్స్‌నుంచి రాగానే మీకు ఫోన్‌చేసి మా మ్యారేజ్ డేట్ చెప్తాం. ఓ.కె. బై" ఫోన్ కట్ అయింది.

మొబైల్ ఫోన్‌ని టీపాయ్‌మీద పడేసి, ఏదో అడుగుల చప్పుడు వినపడితే తలెత్తి చూశాడు రామ్‌కాశ్యప్.

ఎదురుగా బృంద–

మౌనంగా వచ్చి లాన్‌లో కుర్చీలో కూర్చుంది. ఇద్దరిమధ్యా సన్నటి గాలి.

"హౌ ఆర్యూ బేబీ... ఎలా వుంది?" ప్రశ్నించాడు రామ్‌కాశ్యప్.

"అయామ్ ఓ.కె. అంకుల్! ఈవెనింగ్ షూటింగ్‌లో..." ఏదో చెప్ప బోయింది బృంద.

"నాకంతా తెల్సు. ఈ టైమ్‌లో ఎందుకమ్మా అదంతా?" అన్నాడు రామ్‌కాశ్యప్.

"అయామ్ ఆల్‌రైట్ అంకుల్! చెప్పనివ్వండి. ఫర్వాలేదు. మొన్న లిఫ్ట్‌లో డైరీకోసం నన్ను బెదిరించినవాడే... ఇవాళ మారుతీ కారులో తీసుకెళ్ళాడు. నువ్వు మంజరివా అని అడిగాడు. నేను కాదన్నాను. మర్చిపోయినట్టు నటించొద్దని హెచ్చరించాడు. డైరీ అడిగాడు. నాకేం తెలీదన్నాను. ఆ డైరీని అప్పగించడానికి మరో ఇరవై నాలుగు గంటలు టైమిచ్చాడు" చెప్పింది బృంద.

"అతను పేరు చెప్పాడా?"

"అరవింద్..."

"అతన్ని మొన్న లిఫ్ట్‌లో కాకుండా ఇంతకుపూర్వం... ఎక్కడైనా చూశావా?"

"లేదు... జ్ఞాపకం లేదంకుల్."

"లోపలికెళ్దాం పద..." అంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి దారి తీశాడు రామ్‌కాశ్యవ్.

అతన్ని అనుసరించింది బృంద.

మదన్ తనకిచ్చిన ఫోటోల్ని తీసి, బృంద చేతికిచ్చాడు రామ్‌కాశ్యవ్.

ఆ ఫోటోలోని వ్యక్తిని చూడగానే గుర్తుపట్టింది బృంద.

"ఇతనే అంకుల్... అరవింద్."

"అతని పక్కనున్న వ్యక్తి...."

"ఎవరో తెలీదు. ఎవరంకుల్ అతను?"

"జయభూషణ్... రాష్ట్రంలో పేరు పొందిన ఒక పార్టీ చీఫ్, కాబోయే ముఖ్యమంత్రి. అతన్ని కూడా నువ్వెప్పుడూ చూడలేదా?"

"లేదంకుల్!"

"కారులో నీతో అతనేం మాట్లాడాడు...?" అడిగాడు రామ్‌కాశ్యవ్.

గుర్తున్నంతవరకూ చెప్పింది బృంద.

"మనం ఎప్పుడు, ఎక్కడ, ఎలా కలుసుకున్నామో... ఆ వివరాలన్నీ ఆ డైరీలో వున్నాయని అన్నాడా?"

"అవునంకుల్."

"అంటే... అతను మంజరిని ప్రేమించిన వ్యక్తా?"

"సినిమాలోనా?"

"కాదు. జరిగిన కథలో."

"ఏమో మరి."

"నువ్వు మంజరివి కావా?"

ఆ ప్రశ్నకు పెద్దగా నవ్వేసింది బృంద.

"నేను ప్రేమించిన వ్యక్తిని నేను గుర్తుపట్టలేనా అంకుల్... నేను మతిమరుపు వ్యాధికి గురైనా... అంతగా ప్రేమించిన ప్రియుడ్ని మరచిపోయేంటత మతిమరుపు వుంటుందా?"

"ఉంటుందో, లేదో రేపు తెల్సిపోతుంది–" సాలోచనగా అన్నాడతను.

"ఎలా?"

"నేనూహించిందే నిజమైతే నాకు కల్సిన దగ్గర్నుంచి బృంద అనే ఈ కొత్త మనిషిలోంచి మంజరి అనే పాతమనిషి విడుదల కావాలి. అందుకోసం కొన్ని పరీక్షలు నీకు జరిపితే బాగుంటుందని విశ్వనాధ్ అన్నాడు. రేపు స్పెషలిస్టు శకుంతల నిన్ను టెస్ట్ చేస్తారు."

"సైకియాట్రిస్ట్ వల్ల కానిది– లేడీ స్పెషలిస్టుల వల్ల అవుతుందా?"

"ఏ పుట్టలో ఏ రహస్యముందో తెలీదుకదా...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"నేను రెడీ... ఈ సస్పెన్స్ నాక్కూడా భరించలేకుండా వుంది. ఈ కన్ఫ్యూజన్‌లోంచి నేను బయటకు రావాలి...." అంది బృంద నెమ్మదిగా.

తనకు సంబంధించిన విషయం చర్చించే సమయంలో బృంద ఇది వరలోలా ఏమాత్రం ఉద్రేకపడకుండా మామూలు మనిషిగానే ప్రవర్తించడం గమనించిన రామ్‌కాశ్యప్ కొంత సంతృప్తిపడ్డాడు.

కానీ నియమ విషయంలో అనంత్ తీసుకున్న నిర్ణయం, మానసికంగా అతనికి దుస్సహంగా వుంది.

*　　*　　*　　*　　*

యాభైఏళ్ళ డాక్టర్ శకుంతల తన నర్సింగ్‌హోమ్‌లో కూర్చుంది. తన దగ్గర అసిస్టెంట్‌గా చేస్తున్న జూనియర్ డాక్టర్ ఇరవైరెండేళ్ళ భారతి చెప్తున్న కబుర్లను వింటోంది. ఆ భారతికి క్రైమ్ స్టోరీస్ అన్నా, క్రైమ్ వార్తలన్నా చాలా ఇష్టం. పేషెంట్స్‌తో కూడా అవే చెప్తుంది. ఒక దాంతో అతనికి సెకండ్ టైమ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. ప్రాణం పోయేదే కాని... పట్టాలమీద రైలుబండిలా నిలిచింది. అప్పట్నించీ నువ్వేదైనా చెప్పాలంటే నాతో చెప్పు. పేషెంట్స్‌తో కాదు అని చెప్పింది శకుంతల. భారతిలోని అమాయకత్వం అంటే యిష్టం శకుంతలకు.

"ఇప్పుడు మన దగ్గరకు అతి ఇంపార్టెంట్ పేషెంట్ వస్తోంది. స్పెషల్ రూమ్‌లో స్ప్రే కొట్టించావా?" అడిగింది శకుంతల.

"అంతా రెడీ మేడమ్! నేను చెప్పే న్యూస్ వినండి...." అంటూ భారతి చెప్పడం ప్రారంభించింది.

"ఆ మధ్య బెంగుళూరులో జరిగిందీ సంఘటన. శివజ్ఞానం అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని పిల్లలు ఓ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుతున్నారు. మొదట్లో అప్పో సప్పో చేసి పుస్తకాలు, ఫీజులు కట్టాడు. రాన్రానూ ఆ ఫీజులు... అవీ పెరిగిపోవడంతో అతని ఆదాయం సరిపోకపోవడంతో రాత్రి పూట స్కూటర్లు, కార్లను దొంగిలించడం ప్రారంభించాడు. దొంగతనం దాగదు కదా... ఎట్టకేలకు శివజ్ఞానం పోలీసులకు దొరికిపోయాడు. శుభ్రంగా ఉద్యోగం చేసుకోక ఈ దొంగతనాలు ఎందుకు చేశావని అడిగితే... అతను చెప్పిన జవాబు విని మొదట పోలీసులు ఆశ్చర్యపడి... తర్వాత జాలిపడ్డారు. నిజమేకదా మేడమ్... ప్రతివాళ్ళు అక్రమంగా సంపాదించడానికి ఇలాంటి కారణాలు ఉండుంటాయి కదా" అంది భారతి.

"కావచ్చు... ఇంకా...."

"భర్త చనిపోయినా, ఆ భర్త ద్వారా పిల్లకు తల్లి అయింది ఓ అమ్మాయి. పెళ్ళయిన ఆరునెలలకే చనిపోయాడు– ఆ ఇరవై ఏళ్ళ భార్యను భర్తంటే ఎంతో ప్రేమ. మళ్ళీ పెళ్ళిచేసుకోవడం, పిల్లలు కనడం ఆమెకిష్టంలేదు. భర్త శవం ఇంట్లో వుండగానే ఆమెకో ఐడియా వచ్చింది. ఆ ఐడియాను డాక్టర్‌తో చెప్పి రిక్వెస్ట్ చేసింది. అందుకు డాక్టర్ కూడా ఒప్పుకున్నాడు. ఆ భర్త శవం నుంచి స్పెర్మ్ తీసి, ఆమె గర్భంలో పెట్టాడు, తొమ్మిది నెలల తర్వాత ఆ అమ్మాయి పండంటి బిడ్డకు తల్లి అయింది. భలేవుంది కదూ."

"ఔను. అందుకే సైంటిఫిక్ మెథడ్స్‌ను మనం గౌరవించాలి... నమ్మాలి" అంది శకుంతల.

"ముప్పై ఏళ్ళలోపు అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకున్నారు. ఇంకా పెళ్ళి చేసుకోలేదు. వాళ్ళిద్దరూ సరదాగా గడుపుదామని ఓ హోటల్ రూమ్ తీసుకున్నారు. పోలీసులకు ఈ విషయం తెల్సింది. పెళ్ళికాకుండా పరపురుషుడితో ఒంటరిగా వున్నందుకు ఆ అమ్మాయిని మాత్రమే అరెస్ట్ చేశారు. ఇస్లామిక్ చట్టంలో ఒంటరి పురుషుడితో అమ్మాయి వుండకూడదు. అదన్నమాట కథ, ఇది కౌలాలంపూర్లో జరిగింది. మగవాడిని ఒదిలేయడం అన్యాయం కదా...."

"అన్యాయమే" అంది శకుంతల.

"జీ టి.వి.లో వస్తున్న ఇండియన్ మోస్ట్ వాంటెడ్ సీరియల్ చూస్తున్నారా... అందులో ఈమధ్య ఒక ఎపిసోడ్ వచ్చింది. డాక్టర్ సుశీలా శ్రీవాత్సవ ఘజియాబాద్‌కు చెందిన డాక్టర్. అతను చాలామంది స్త్రీలు గర్భిణీలని నమ్మించాడు. ఎప్పటికీ గర్భవతులం కాలేమని బాధపడుతూ తన దగ్గరకొచ్చిన వాళ్ళను కొన్ని ఇంజక్షన్లు, టాబ్లెట్లూ ఇచ్చి గర్భవతులయ్యామని నమ్మకం కల్గించి పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేసేవాడు. గర్భంకొన్నాళ్ళు పెరగడంతో వాళ్ళకు అనుమానం వచ్చేది కాదు. సడన్‌గా ఆ పెరుగుదల ఆగిపోవడంతో వాళ్ళకు అనుమానం వచ్చి వేరే డాక్టర్లకు చూపించుకోగా అసలు విషయం బయటపడింది. ఇలాంటి సంఘటనలు ఢిల్లీ, ఫరీదాబాద్, ఘజియాబాద్‌ల్లో చోటు చేసుకోవడంతో కంప్లయింట్ మేరకు శ్రీవాత్సవను పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీవాత్సవ కథ ఆధారంగానే ఎపిసోడ్ తీశారు."

"ఇంకో సంఘటన" అంటూ మరొక సంఘటన చెప్పింది భారతి. చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది ఆ ఇన్సిడెంట్.

ఆ ఇన్సిడెంట్ గురించి ఆలోచిస్తున్న సమయంలోనే లోనికొచ్చిన సైకియాట్రిస్ట్ విశ్వనాథ్, ఆ వెనక బృందను చూడగానే లేచి నిలబడి ఇన్‌వైట్ చేసింది డాక్టర్ శకుంతల.

సినిమా నటి బృంద తమక్లినిక్‌కు వస్తోందనే విషయం అప్పటికే తెల్సిన కొందరు నర్సులు, కొంతమంది పేషెంట్లు ఉత్సాహంగా ఆమెను చూడడం ప్రారంభించారు.

"ఒక సినిమా నటి మా క్లినిక్‌కి రావడం ఇదే ప్రథమం. సినిమా జర్నలిస్టులకు ఈ విషయం తెలిస్తే మా క్లినిక్ మీద దాడిచేస్తారనుకొంటాను...." అంది నవ్వుతూ శకుంతల.

రెండు కూల్‌డ్రింక్స్‌ను తెప్పించి ఇద్దరికీ ఇచ్చింది.

తర్వాత–

"రా అమ్మా!" అంటూ ఆమెను టెస్టింగ్ రూమ్‌లోకి తీసికెళ్ళి డోర్స్ క్లోజ్ చేసింది. బయట 'డాక్టర్ ఇన్ బిజీ' రెడ్‌లైట్‌తో అక్షరాలు మెరుస్తూ కనిస్తున్నాయి.

నలభై నిమిషాలు గడిచాయి.

అంతవరకూ న్యూ సైంటిస్ట్ సైన్స్ మేగజైన్‌ని తిరగేస్తున్న విశ్వనాధ్... అప్పుడే లోనికొచ్చిన డాక్టర్ శకుంతలవేపు చూశాడు.

"టోటల్ బాడీ స్కాన్ చేశాను, బ్రెయిన్‌తో సహా... మరో అయిదు నిమిషాల్లో కంప్యూటర్ రిపోర్ట్ వస్తుంది" అందామె.

"బృందకి ఈ విషయం తెలుసా?"

"నేను చేసిన పరీక్షలు ఆమెకు తెలీకుండా సెడెటివ్ ఇంజక్షన్ ఇచ్చాను. మరో పావుగంటకు ఆమెకు మెలకువ వస్తుంది."

"ఆమెను చూసినప్పుడు, మాట్లాడినప్పుడు, ఆమె మెంటల్ సిక్‌నెస్‌తో పవర్ అవుతుందని ఎవరూ అనుకోరు" అంది శకుంతల.

"మిస్టరీ అదే...." అన్నాడు విశ్వనాధ్.

"బృందకు పెళ్ళయిందా?" అడిగింది శకుంతల.

"నాకు తెలీదు" అన్నాడు విశ్వనాధ్.

"బృంద రాగానే ఆమెను ప్రశ్నించాలి. కొన్ని ఇంటిమేట్ విషయాలు నాకు తెలియాలి. మీరు ఆ టైమ్‌లో పక్కరూమ్‌లో వుంటే బాగుంటుంది. మా మాటలు విన్పిస్తాయి."

"ఓ.కె...."

మరో అయిదు నిమిషాల తర్వాత బృంద అక్కడుంది.

విశ్వనాధ్ లేచి పక్కరూమ్‌లోకెళ్ళిపోయాడు.

బృందకు కొంచెం మత్తుగా వుంది డాక్టర్" అంది.

"ఇంకో మూడు నిమిషాల తర్వాత నువ్వు మామూలుగా అయిపోతావు" అని ఆ మూడు నిమిషాలూ ఏవో మాటలు మాట్లాడి–

తర్వాత–

"బృందా... నువ్వు నా ప్రశ్నలకు జవాబు చెప్పే పరిస్థితిలో ఉన్నావను కొంటాను" అంది శకుంతల.

"అడగండి...." అంది బృంద.

"నీకు పెళ్ళయిందా?"

"లేదు."

"నువ్వు గర్భవతివయ్యావా?"

"పెళ్ళికాకుండా ఎవరైనా గర్భవతి కావడం ఎలా సాధ్యం?"

"మామూలుగా కాదు... ఇల్లీగల్ కాంటాక్ట్స్ వల్ల."

"నో... నాకలాంటి కాంటాక్ట్స్ లేవు."

"మరి నీకు నేను చేసిన టెస్టుల్లో నువ్వు గర్భవతివయ్యావని, రెండు నెలల గర్భిణిగా వున్న టైమ్‌లో నీకు అబార్షన్ జరిగిందని తెలుస్తోంది."

పక్కరూమ్‌లో వున్న విశ్వనాధ్‌కు ఆ న్యూస్ షాకింగా వుంది.

బృందకు సరేసరి... ఆమె బాధగా కళ్ళుమూసుకొంది. ఉద్వేగాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తోంది. అకస్మాత్తుగా ఆమె వంటికి చెమట పట్టేసింది.

"ఆర్యూ ష్యూర్ డాక్టర్...?" వణుకుతున్న కంఠంతో అడిగింది బృంద.

సరిగ్గా అదే సమయంలో డాక్టర్ భారతి కొన్ని రిపోర్ట్స్ తెచ్చి ఆమెకిచ్చింది. అయిదు పేజీల కంప్యూటర్ రిపోర్ట్స్... ఎల్లో పేపర్స్.

ఒక్కొక్క పేజీ సీరియస్‌గా చదువుతోంది శకుంతల.

"ఏ కారణం వల్లనైనా డాక్టర్స్ అబద్ధం చెప్పినా, కంప్యూటర్ చెప్పదు. నీకు జరిగిన అబార్షన్ చాలా క్రూయల్‌గా కూడా జరిగింది. అవసరంలేని ఇంజక్షన్స్ ఇవ్వడంవలన అబార్షన్ జరిగింది. గర్భాశయంలో ఇన్‌ఫెక్షన్ సోకింది. అది తగ్గడానికి నువ్వు మెడిసిన్స్ వాడి వుండాలి."

"మీరు చెప్పే విషయాలేవీ నాకు తెలీదు" నెమ్మదిగా చెప్పింది బృంద.

ఇద్దరిమధ్య కొద్ది క్షణాలు నిశ్శబ్దం అలుముకొంది.

"అబార్షన్ అంటే ఆ రెండు నెలల పసికందు చనిపోయాడనే అర్థమా?" అడిగింది బృంద.

"మదర్ల ఇన్‌స్టింక్ట్ అంటే అదే... పెళ్ళికాకుండా నువ్వు గర్భవతివయ్యావనే విషయం కూడా నిన్ను బాధించడంలేదు. పసికందు గురించి అడుగుతున్నావ్...." శకుంతల మాటలకు ఎందుకో బృంద కళ్ళంట నీళ్ళొచ్చాయి.

వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆ హఠాత్ పరిణామానికి డాక్టర్ శకుంతల, భారతితోపోటు నర్సులు కూడా అయోమయంలో పడిపోయారు.

పక్కరూమ్‌లోంచి వచ్చిన విశ్వనాధ్ బృందను అనునయించడానికి పది నిమిషాలు పట్టింది.

ఏ విషయమూ నీకు జ్ఞాపకంలేదు కాబట్టి... ఆ విషయం గురించి నువ్వు ఆలోచించకు. ఇంటికెళ్ళి ఈ టాబ్లెట్స్ వేసుకుని నిద్రపో....” అంటూ ఓ అయిదు టాబ్లెట్స్ ఆమెకిచ్చింది శకుంతల.

“నువ్వెళ్ళమ్మా! నేను తర్వాత వస్తాను....” అన్నాడు విశ్వనాధ్. నర్సు తోడురాగా కారెక్కింది బృంద.

కారు ముందు సీట్లో పి.ఎ. రామావతారం వున్నాడు. ఆ కారు వెనుక జీపులో కమెండో గ్రూప్ వుంది.

*  *  *  *  *

మళ్ళీ ఆ రిపోర్ట్స్ సుదీర్ఘంగా పరిశీలించి పక్కనపెడుతూ–

“చూడండి విశ్వనాధ్‌గారూ... ఇందాకే మా అసిస్టెంట్... యాక్చువల్‌గా అమెరికాలో జరిగిన ఒక సంఘటన చెప్పింది. అదేమిటంటే... ముప్పై ఏళ్ళ వ్యక్తి తన భార్యకోసం అన్వేషణ ప్రారంభిచాడు. పేపర్స్‌లోనూ, టి.వి.లోనూ ప్రకటనలిచ్చాడు. ఒకరోజు ఒక రైల్వేస్టేషన్‌లో ఆమె కనిపించగానే ఎగిరి గంతేశాడు.. తన ప్రక్కన వున్న ఏడు నెలల పిల్లాడిని చూపెడుతూ, బిడ్డను కనగానే హాస్పిటల్‌నుంచి అలా వెళ్ళిపోవడం న్యాయమా... నీ కోసం ఎన్నిచోట్ల వెతికానో తెలుసా... అని కన్నీళ్ళతో చెప్పాడు. అప్పుడావిడ–

నువ్వెవరో, ఆ కుర్రాడెవరో నాకు తెలీదు అనేసి వెళ్ళిపోయింది. రైలెక్కేసింది. ఆ రైలు, తర్వాత స్టేషన్‌లో యాక్సిడెంట్‌కి గురైంది. ఆ అమ్మాయి తలకు బలమైన గాయాలు తగిలాయి. రెండు నెలల తర్వాత, హాస్పిటల్ బెడ్‌మీద ఆమెకు స్పృహ వచ్చింది. స్పృహలోకి రాగానే ఆ అమ్మాయి మాట్లాడిన మొదటిమాట... నా బిడ్డ ఏదీ... అని. వెంటనే తన బిడ్డను, భర్తను గుర్తు

పట్టిందామె. మధ్యలో జరిగిన సంఘటనలేవీ ఆమెకు గుర్తులేవు. ఆమెను స్కాన్ చేసిన డాక్టర్లు, ఆమె ఇన్‌స్టింక్ట్‌వ్ ఇంవల్సస్‌కు గురైందని చెప్పారు.

ఇన్‌స్టింక్టివ్ ఇంపల్స్ అనేది వ్యాధికాదు. ఒక మానసిక దుగ్మత.

సున్నితమైన మనసుగల ఒక వ్యక్తికి భయంకరమైన అనుభవం ఎదురైనప్పుడు షాక్‌కు గురవడం సహజం. ఆ జ్ఞాపకాలు పదేపదే ఆ వ్యక్తిని వేధించగా ఆ వ్యక్తి మనసు ఆ సంఘటనకు సంబంధించి అచేతనమైపోతుంది. వాటిని నిగ్రఫిషిమెంట్ మెమరీస్ అంటారు. ఆ వ్యక్తి లోంచి బాధాకరమైన సంఘటనలు మాయమైపోయి జరిగిందా లేదా అదే సంశయం ఏర్పడుతుంది. దీనికి కారణం నాడీరుగ్మత. దీనినే అబ్సెనల్ న్యూరోసిస్ అంటారు. ఇందులో మతిమరపు సహజం. అప్పుడప్పుడు బృంద పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడానికి కారణం అబ్సెనల్ న్యూరోసిస్ సైకో న్యూరోసిస్‌గా మారడమే. తను అబార్షన్‌కి గురైందనే విషయం మర్చిపోవడానికి కారణం కూడా అదే.

అలాగే తనకు అన్యాయం చేసిన వ్యక్తుల రూపం, మాట... సంఘటనలను మర్చిపోవడం ఇందులో భాగమే" చెప్పింది శకుంతల.

"రామ్‌కాశ్యప్ దగ్గరకు రావడానికి ముందు జరిగిన సంఘటనలన్నీ ఆమె మర్చిపోయిందంటారా?" అడిగాడు విశ్వనాధ్.

"చూడండి... విశ్వనాధ్... ఒక సంఘటన మనకు బ్రెయిన్‌లోకి అస్పష్టంగా వస్తుంది. అది ఆ వ్యక్తి ఆలోచన మేరకు స్పష్టతను పొందుతుంది కదా... మొదటి దానిని మనోవాస్తవికత అంటే సైకికల్ రియాలిటీ అంటారు. రెండవ దానిని యదార్ధ వాస్తవికత అంటారు. దీనినే యాక్చువల్ రియాలిటీ అంటారు. ఈ రెండు రియాలిటీలు నాడీ మండలం సక్రమంగా పనిచేస్తేనే ఒకటవుతాయి. లేకపోతే డిస్ట్రబెన్స్ తప్పదు. ఆ డిస్ట్రబెన్స్ ద్వారా ఏర్పడిన మెంటల్ డిసార్డర్ వల్లనే బృంద ఇన్నాళ్ళు ఇలా ప్రవర్తించింది... ప్రవర్తిస్తోంది."

"ఆమెలో మార్పు వస్తుందా? జరిగిన సంఘటనలన్నీ ఆమెకు గుర్తుకొస్తాయా?"

"వస్తాయి. ఆమె మనసుమీద ఏ సంఘటనలైతే బలంగా ముద్రవేశాయో అవి ఆమె కళ్ళెదుటకు రావాలి. ఉదాహరణకు ఆమె ఒక వ్యక్తిని ప్రేమించింది.

ఆమెకు ఆ వ్యక్తి ద్రోహం చేశాడు. అతనిమీద బృందకు ఏ సమయంలో అసహ్యం కలిగింది? ఆ సంఘటన ఏమిటి?"

"ఆమె ఫైర్ యాక్సిడెంట్‌కి గురైంది. ఏ పరిస్థితిల్లో గురైంది, ఆమెకు అబార్షన్ అయింది. అలాంటి సీన్లో ఆమె ప్రస్థుతం వుంటే ఆమెకు అక్క, అన్నకొడుకు, అన్నయ్య వున్నారు. వాళ్ళు ఆమెకు ఎదురు పడితే... లేకపోతే వాళ్ళకు సంబంధించిన బృంద ప్రమేయం గల బలమైన సంఘటనలేవైనా ఆమెకు ఎదురవ్వాలి.

అందుకు ఆమె జీవితం పూర్తిగా తెలియాలి. తెలిస్తే ఆ సంఘటనలను మనం క్రియేట్‌చేస్తే పదిహేను రోజుల్లో ఆమె మళ్ళీ మామూలు మనిషయిపో తుంది." చెప్పింది డాక్టర్ శకుంతల.

"ప్రస్తుతం ఒక వ్యక్తి ఆమెను పర్సనల్ డైరీకోసం వెంటాడుతున్నాడు. అంటే గతంలో ఆ వ్యక్తి ఆమెకు తెలిసి వుండాలి కదా. ఆ వ్యక్తిని బృంద చూసినా ఎందుకు గుర్తుపట్టలేకపోయింది? అతనెవరో తెలియదని ఎందు కంటోంది?" ప్రశ్నించాడు విశ్వనాథ్.

"చూసిన వెంటనే గుర్తుపట్టలేరు–ఇట్ టేక్స్ టైమ్. అతన్ని ఆమె ఏ సమయంలోనైనా గుర్తుపట్టవచ్చేమో. మొత్తం కథంతా ఆమెకు జ్ఞాపకం రావచ్చేమో చూద్దాం. ఇకనుంచీ ఆమెను ఏ విధమైన ప్రశ్నలూ వేసి వేధించకండి. కేవలం నటనకు మాత్రమే పరిమితం చేయండి. ప్రశాంతమైన వాతావరణంలో ఆమెను వదిలేయండి. పూర్తిగా ఎక్కడికైనా వెళ్ళడానికి స్వేచ్ఛ ఇవ్వండి. అబ్జర్వేటర్స్‌ను నియమించినా, ఆ విషయం ఆమెకు తెలియకుండా వుండాలి" చెప్పింది డాక్టర్ శకుంతల.

*　*　*　*　*

జూబ్లీహిల్స్‌లోని ఆఫీస్‌రూమ్...

నేడే విడుదల సినిమా ఇంటర్వెల్‌వరకు వేసిన ప్రివ్యూ రెస్పాన్స్.

మామూలుగా ఎదురుగా ఆహా ఓహో అనేవాళ్ళు పక్కకెళితే కష్టం. ఏవరేజ్ –మొన్న చెన్నైలో చూసిన తమిళ సినిమాయే కాపీ కొట్టేశారు. ఇలాంటి కామెంట్స్

వస్తాయి. అందుకు భిన్నంగా పేపర్స్‌లో నేడే విడుదల గురించి ఫోటోలు వేసి రాయడం విశేషం. ఆ ఫోటోలకింద షూటింగ్ షెడ్యూల్ వివరాలు కూడా ఇచ్చారు.

ఒకపక్క పబ్లిసిటీ ఇలా వుండగా, రెండో పక్క అపాయింట్‌మెంట్స్ కోరుతూ బయ్యర్స్ నుంచి ఫోన్లు. టోటల్ సినిమా రిలీజ్ రైట్స్ ఆంధ్రాకు ఇవ్వమని కొందరు. సీడెడ్‌కి ఇవ్వమని కొందరు, కోస్తాకివ్వమని ఇంకొందరు...

ఇండస్ట్రీలో ఎక్కువ సినిమాలని ఔట్‌రైట్‌గా కొన్ని డిస్ట్రిబ్యూట్ చేసే ఓ మూడు డిస్ట్రిబ్యూషన్ కంపెనీల నుంచి మేనేజర్లు రావడంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు డైరెక్టర్ ప్రదీప్.

పిక్చర్ క్రేజ్‌ని ఎప్పటికప్పుడు ఢిల్లీలో వుండి తెలుసుకుంటున్న ప్రొడ్యూసర్ సుమంతరావు వెంటనే హైదరాబాద్ వచ్చేసాడు.

అప్పటికే ఆయా ఏరియాలనుంచి అడ్వాన్స్‌లు నలభై లక్షలకు పైగా వచ్చాయి. తమిళ రైట్స్‌కోసం ఎవరో అప్రోచ్ అయ్యారు. పదిలక్షల అడ్వాన్స్ యిచ్చారు.

ఒకరోజు రాత్రి.

"మొత్తం మూడుకోట్లకు పైగా బిజినెస్ చేసేట్టుందయ్యా మనసినిమా. టోటల్‌గా నాలుగుకోట్లు చేసిందనుకో. మీ ఇద్దరికీ చెరో మారుతీ కారు నా గిఫ్టుగా సినిమా రిలీజ్ నాటికిస్తాను. అదేరోజు ఇంకో సినిమాను అనౌన్స్ చేద్దాం" హేపీగా ఆరో రౌండ్‌లో చెప్పాడు సుమంతరావు.

* * * * *

రామ్‌కాశ్యప్ డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీలవైపు చూశాడు.

"స్లంప్ పీరియడ్‌ను చూసి భయపడ్డాం. కానీ పిక్చర్ పూర్తయ్యే నాటికి మూడున్నరకోట్లు బిజినెస్ చేస్తుందని నా అంచనా సార్!" హేపీగా చెబుతున్నాడు ప్రదీప్.

రైటర్ సూర్యవంశీ అందించిన స్క్రిప్టును తిరగేస్తూ అక్కడక్కడే చదువుతున్నాడతను.

తదుపరి షూటింగ్ ఏయే ప్లేసుల్లో జరపబోతున్నారో పేపర్స్‌లో వచ్చిన న్యూస్ ఐటమ్‌ను చూపించాడు సూర్యవంశీ.

"ఇంకా ఎన్ని సీన్లు షూట్ చేయాలి?" అడిగాడు రామ్‌కాశ్యప్.

చెప్పాడు సూర్యవంశీ.

"మొదటి సీన్ ఎక్కడ తీస్తున్నారు?" అంటూ ఆ సీన్‌కు సంబంధించిన డైలాగ్ వెర్షన్ చూస్తున్నాడు రామ్‌కాశ్యప్.

"జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ బంగళాలో బర్త్‌డే పార్టీకి అటెండ్ అవుతుంది బృంద. కోలాహలంగా పార్టీ జరుగుతున్న సమయంలో కరెంట్ పోతుంది. ఆ సమయంలో బృందను చంపడానికి హత్యాప్రయత్నం జరుగుతుంది. బృంద తప్పించుకుని అక్కడినుంచి బయటపడుతుంది. అదీ సీన్."

"షూటింగ్ చేసే ప్రైవేట్ బంగళా ఎవరిది?"

"ఓ ఆర్మీ ఆఫీసర్‌ది సార్."

"మీరా బంగాళలో షూటింగ్ జరపడంలేదు." రామ్‌కాశ్వవ్ మాటకు ఆశ్చర్యపోయాడు ప్రదీప్.

"షూటింగ్ కోసం రెంట్ అడ్వాన్స్ ఇచ్చాం సార్."

"ఎంత?"

"యాభైవేలు. రెండు రోజులు షూటింగ్ కోసం ప్లాన్ చేశాం సార్."

"ఇకమీదట నేను చెప్పే ప్రాంతాల్లోనే షూటింగ్ చేయండి. అందుకయ్యే ఖర్చు నేను భరిస్తాను. బైదిబై మీరు ఫైనాన్షియర్ భాగ్యరాజ్‌కి యాభై లక్షలివ్వాలను కుంటాను" జ్ఞాపకం చేశాడు రామ్‌కాశ్యవ్.

"అవున్సార్. ఎందుచేతో భాగ్యరాజ్ మళ్ళీ ఫోన్ చేయలేదు సార్."

"నేను యాభై లక్షలకి చెక్కిస్తాను. ఇచ్చేయండి."

ఆ మాటకి ఆనందపడిపోతూ, ఆశ్చర్యపడిపోతూ ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు ప్రదీప్, సూర్యవంశీ.

"కలిసొచ్చే కాలంలో నడిచొచ్చే కొడుకు పుట్టడం అంటే ఇదే" స్వగతంగా అనుకున్నాడు ప్రదీప్.

"బృంద లైఫ్‌కి సంబంధించి మోరల్ రెస్పాన్సిబిలిటీ నాదీ... యూనిట్ మెంబర్స్‌గా మీది కూడా అనుకోండి. అందచేత ఆమెకు సంబంధించిన ప్రతి

చిన్న విషయంలోనూ మనం జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకే... ఇకమీదట షూటింగ్ మీరు పేర్కొన్న ప్రదేశాల్లో కాకుండా, వేరే ప్రదేశాల్లో జరగాలి. చాలా రహస్యంగా జరగాలి. ఎంతమంది మినియమ్ స్టాఫ్ అవసరమో వాళ్ళే ఆ ప్లేస్‌లో వుండాలి. ఇంకో విషయం... ప్రెస్ రిపోర్టర్స్‌కి ఈ విషయం అసలు తెలియకూడదు. అర్థమైందా...?" చెప్పాడు రామ్‌కాశ్యప్.

"మరి... ఈ షెడ్యూల్ మొదటి సీన్ ఎక్కడ షూట్ చెయ్యమంటారు?" అడిగాడు ప్రదీప్.

ఒక్కక్షణం కళ్ళు మూసుకొని, ఏదో ఆలోచించి–

"జీడిమెట్లలో... అక్కడో గెస్ట్‌హౌస్ వుంది" ఆ గెస్ట్‌హౌస్ తన కొడుకు అనంత్‌దేనని చెప్పలేదు రామ్‌కాశ్యప్.

"ఇకమీదట ప్రతిరోజూ ఈవెనింగ్ తప్పనిసరిగా, మీరు నన్ను కల్సుకోండి" చెప్పాడు రామ్‌కాశ్యప్, వాళ్ళు అక్కడనుంచి కదిలేముందు.

* * * * *

ఇది జరగడానికి ముందు...

దిల్‌షుక్‌నగర్‌లోని జయభూషణ్ గెస్ట్‌హౌస్‌లో...

"నాకు ఒకటే అర్థంకావడంలేదు... నన్ను చూసి, నేనెవరో తెలీనట్లు ఆ మంజరి ఎందుకు ప్రవర్తించింది? డైరీ గురించి తెలీదని ఎందుకంది?" తనలో తను ప్రశ్నించుకున్నట్టుగా అడిగాడు అరవింద్.

"ఆ పిల్ల మంజరి కాదేమో!" చెప్పాడు కిషోర్‌దాస్.

"నేను నమ్మను... మంజరి బృందగా మారడం వెనక, అంతా మర్చిపోయినట్టుగా నటించడం వెనక, ఈ సినిమా తీయడం వెనక... జయభూషణ్ చెప్పినట్టు ఏదో కథ వుండాలి. ఆ డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ మన బెదిరింపును ఖాతరు చెయ్యలేదు. తర్వాత వాళ్ళ షూటింగ్ ఎక్కడ?"

"జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ ఫార్టీఫైవ్‌లో, ఓ బిల్డింగ్‌లో."

"ఆ రైటర్, డైరెక్టర్ ఎక్కడుంటారు?" అడిగాడు అరవింద్.

చెప్పాడు కిషోర్‌దాస్.

"రేపు ఆ షూటింగ్ జరగదు."

"అంటే... మన జనాలను తీసికెళ్ళి, మొత్తం ధ్వంసం చేసేద్దామంటావా?"

"లేదు... ఈ టైమ్‌లో ఎక్కడా హత్యలు, ఖూనీలు జరగకూడదు. ఎందుకంటే... కేసుకి పొలిటికల్ టచ్ వస్తుంది. రామ్‌కాశ్యవ్ అండ లేకపోతే, ఆ మంజరిని ఎప్పుడో లేపేసేవాడ్ని, రామ్‌కాశ్యవ్ శక్తిని తక్కువ అంచనా వెయ్యకూడదు. అందుకని" అంటూ సిగరెట్ అందుకొని లైటర్‌తో వెలిగించి–

"ఆ డైరెక్టర్, రైటర్ ఇద్దరూ బ్యాచిలర్సే కదూ... ఒకేచోట వుంటున్నారనుకుంటాను."

"అవును."

"మన వాళ్ళతో వెళ్ళు... 'నేడే విడుదల' సినిమా స్క్రిప్టు మనకి కావాలి."

"కావాలంటే ఇస్తారా?"

"ఇవ్వరు... లాక్కురా. అడ్డొస్తే చంపెయ్."

"ఇద్దర్నీనా?"

"ఏం బుద్ధుడి పుస్తకాలేవైనా చదివావా ఈ మధ్య... జాలిగా మాట్లాడుతున్నావ్?" కోపంగా అన్నాడు అరవింద్.

"అదికాదు... పోలీసు కేసు... ఇప్పటికే నా మీద ఏడు కేసులు వున్నాయి."

"ఎనిమిదో కేసవుతుంది... నష్టమా?" అని అంటూ గోడ గడియారంవేపు చూశాడు అరవింద్, కిషోర్‌దాస్ లేచి నిలబడ్డాడు.

* * * * *

మానసికంగా చాలా అసహనంగా వుంది బృందకు...

తను గర్భవతి అయింది... ఎవరివల్ల? తనకు అబార్షన్ జరిగింది... ఎవరు చేయించారు?

ఒక ఆడపిల్ల జీవితంలో అతి ముఖ్యమైన విషయం తన జీవితంలో తనకు జరిగిన ఆ విషయం తనకెందుకు గుర్తులేదు?

తను ఎవరినైనా ప్రేమించి మోసపోయిందా?

అరవింద్‌కు, తనకు సంబంధం ఏమిటి?

రామ్‌కాశ్యప్ తనని ఆదరించడం వెనక కారణం ఏమిటి?

తనకు 'నా' అన్నవాళ్ళెవరూ లేరా?

మొట్టమొదటిసారి 'బృంద' తన జీవితాన్ని విశ్లేషించుకుంటోంది...

మిస్టరీ...

తనెవరినైనా ప్రేమించిందా? అయితే అతనెవరు?

లేక రేప్‌కి గురయిందా?

లేక పెళ్ళయిందా? పెళ్ళయితే భర్త ఎవరు?

నిలువుటద్దంలో ఆమె ముఖం, ఆమెకే అసహ్యంగా వుంది.

ఆమె కళ్ళంట జలజలా కన్నీళ్ళు కారున్నాయి...

"నేనెవర్ని?" పిచ్చిగా అరిచింది బృంద. సాధ్యమైనంత నిగ్రహాన్ని కూడ గట్టుకుందామన్నా ఆమె మనసు సహకరించడం లేదు...

"నేనెవర్ని... నేనెవర్ని?"

"భగవాన్... నేనెవర్ని?"

పిచ్చి పిచ్చిగా అరుస్తూ గదంతా కలియతిరుగుతోంది బృంద.

ఆ అరుపుకు అకస్మాత్తుగా మెలకువ వచ్చిన రామ్‌కాశ్యప్ పరుగు పరుగున ఆమె బెడ్‌రూమ్ దగ్గరకెళ్ళాడు.

రామ్‌కాశ్యప్‌ని చూడగానే బృంద అతని గుండెలమీద వాలిపోయింది.

"అంకుల్... నేనెవర్ని? నాకేమైంది... నన్ను మీరెప్పుడు మొదటి సారి చూసారు... నేనంటే మీకెందుకు ప్రేమ... దారుణమైన నా స్థితికి కారణం ఏమిటి?"

అలా అడుగుతున్న ఆమెను వాత్సల్యంగా అనునయించాడు రామ్‌కాశ్యప్. ఫ్రిజ్‌లోంచి చన్నీళ్ళను గ్లాసులో పోసిచ్చాడు.

ఆ గ్లాసు ఆమె అందుకుంది.

అంతకు అరగంట ముందు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ ఫోన్లో చెప్పిన విషయం రామ్‌కాశ్యప్‌కి జ్ఞాపకం వచ్చింది.

"చూడండి రామ్‌కాశ్యప్‌గారూ! బృంద జీవితానికి సంబంధించిన అతి కీలకమైన రహస్యం... ఆమె గర్భవతి కావడం... ఆమెకు అబార్షన్ కావడం... ఆ విషయం తెల్సిన బృంద. తనలో తను కుమిలిపోతుంది. అంటే... ఆమెలో మానసికమైన మార్పు వస్తున్నట్టు లెక్క. అందువల్ల... ఆమె ఎలా ప్రవర్తించినా అబ్జెక్షన్ పెట్టకండి. మరీతట్టుకోలేని పరిస్థితి ఏర్పడితే, డాక్టర్ ఇచ్చిన టాబ్లెట్స్ ఇవ్వండి... టాపిక్ మార్చి, ఆమెను హేపీగా వుంచడానికి ప్రయత్నించండి."

"చూడు బృందా! నువ్వడిగిన ప్రశ్నలన్నింటికీ త్వరలో జవాబులు తెలుస్తాయి. కష్టాలు నీకే వచ్చాయనుకుంటున్నావా? నేనెన్ని కష్టాలు అనుభవించానో నీకు తెలుసా... అనంత్ అంటే నాకెందుకంత ప్రేమనుకున్నావ్? వాళ్ళమ్మలోని చిలిపితనం, మంచితనం వాడిలో వున్నాయి కనక...." అన్నాడు రామ్‌క్యాశవ్.

అనంత్ ప్రసక్తి రాగానే, పైటచెంగుతో ముఖం తుడుచుకొని, రిలాక్స్‌డా కూర్చుందామె.

"అనంత్ అప్పుడప్పుడు ఎంత చలాకీగా, షార్ప్‌గా వుంటాడో తెలుసా... ఒకసారి వాడు నన్నెంతగా ఆట పట్టించాడో తెలుసా?" అని అన్నాడు నవ్వుతూ.

"మిమ్మల్ని ఆట పట్టించాడా?!"

"అవును... ఒకసారి మన ఆఫీసులోనే పనిచేస్తున్న ఒకావిడ్ని తీసుకొచ్చాడు, ఆవిడ చాలా బ్యూటిపుల్ లేడీ... ఎందుకో పెళ్ళి చేసుకోలేదు... ఆవిడ్ని పెళ్ళికి ఒప్పించాడు."

"ఎవరితో?" నవ్వుతూ అడిగింది బృంద.

ఆమె ముఖంలో ప్రశాంతత కనిపించడంతో టెన్షన్ తగ్గింది రామ్‌కాశ్యప్‌కు. "నాతోనే... నేను చాలాకాలం నుంచి తపస్సు చేస్తున్నాను. ఈ పిన్నిగారు నాకు దొరికారు... మీరు ఈమెను పెళ్ళి చేసుకోవాలి" అని అన్నాడు.

'నో... నెవర్' అన్నాన్నేను. ఆవిడకు 'సారీ' చెప్పాను.

అనంత్ మనస్సును అర్థం చేసుకున్న ఆవిడ ఏమాత్రం ఫీలవలేదు. చనిపోయిన నా భార్యమీద నాకున్న అభిమానానికి ముగ్ధురాలైంది.

ఈ సంఘటన జరిగినపుడు అనంత్ డిగ్రీ చదువుతున్నాడు. అందరికీ అమ్మలున్నారు. నాకెందుకు లేరని వాడి బాధ...

వాడి బాధ నాకర్థమైనా, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన నా భార్య జ్ఞాపకాలకు కూడా నేను అన్యాయం చేయదలుచుకోలేదు" నెమ్మదిగా చెప్పాడు.

అప్పటికి బృంద మూడ్ పూర్తిగా మారిపోయింది.

బాధల్లో వున్న మనిషికి, మానవత్వపు స్పర్శకన్నా మరో మందులేదు.

* * * * *

అంతకు రెండుగంటల ముందు డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ, కెమెరామన్ కూర్చుని మర్నాడు తీయబోయే సీన్ గురించి చర్చలు జరిపారు. తర్వాత టెన్‌సెకండ్స్ యాడ్‌తీసి, సాటిలైట్స్ ఛానల్స్‌లో ఇప్పటినుంచే పబ్లిసిటీ స్టార్ట్ చేయాలని నిర్ణయించారు.

ప్రొడక్షన్ మేనేజర్ వచ్చి రేపు షూటింగ్‌కు అవసరమైన జూనియర్ ఆర్టిస్టులు కూడా రెడీగా వున్నారని చెప్పి వెళ్ళిపోయాడు.

కప్‌బోర్డ్‌లో వున్న స్కాచ్ బాటిల్‌ని తెచ్చి టీపాయ్ మీదపెట్టి "మద్రాస్ నుంచొస్తూ ఒక ఫ్రెండ్ తెచ్చాడు. లీజర్‌గా మీరు దొరికితే కూర్చుందామని దాచాను" అంటూ గ్లాసులు తెచ్చి డ్రింక్ పోసాడు..

"రేపు షూటింగ్ వుంది" అంటూ గ్లాసందుకున్నాడు ప్రదీప్.

"అవును బాస్... మధ్యలో సినిమా తీస్తానని, చెరువు కథచెప్పి వెళ్ళాడే– ఆ ప్రొడ్యూసర్ అమరేశ్వర్ ఏమయ్యాడు?" అడిగాడు కెమెరామన్.

"అవును... ఏమయ్యాడు?" అడిగాడు సూర్యవంశీ.

"సినిమా తియ్యడమంటే సంతలో చింతపండమ్మడం అనుకొన్నాడేమో...." అంటూ నవ్వాడు ప్రదీప్.

సరిగ్గా అదే సమయంలో లోనికొచ్చాడు అమరేశ్వర్.

"సాయంత్రం నుంచి తిరుగుతుంటే.... ఇప్పటికి దొరికారు సార్. మీ కోసమే వచ్చాను" అంటూ ఆయాసపడుతూ కుర్చీలో కూర్చున్నాడు అమరేశ్వర్.

ముగ్గురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఎంతవరకొచ్చింది మీ సినిమా... స్క్రిప్టయిందా?" అడిగాడు సూర్యవంశీ.

"అదో పెద్ద కథ. నాతోపాటు వచ్చాడు చూశారు.... ఆ రచయితని నమ్ముకుని అయిదు లక్షలకి మునిగిపోయాను. నన్నొదిలేసి వాడెళ్ళిపోయాడు. ఇడియట్... సినిమా అంటే యింత ఛీటింగ్ అని నాకు తెలీదు."

"సినిమా అటే ఛీటింగ్ కాదండి... మీకు అలాంటివాళ్ళు కలిసారు."

"అసలేమైంది?"

"ఆ రోజు మిమ్మల్ని కలిశాక, మర్నాడు ఆ రచయిత నన్ను ఇంకో డైరెక్టర్ దగ్గరకు తీసికెళ్ళాడు. సినిమా ప్రొడ్యూసర్‌గా నలుగురైదుగురు డైర్టర్లని కలిస్తే ఎక్స్‌పీరియన్స్ వస్తుందని చెప్తే... అతను తీసికెళ్ళిన డైరెక్టర్ దగ్గర కెళ్ళాను."

"ఎవరా డైరెక్టర్?"

"నాలుగైదు సినిమాలు తీసాడు... ఒక సినిమా రిలీజై రెండో రోజునే బాక్సులు వెనక్కొచ్చేసాయి...

నేను వెళ్ళగానే అంతవరకూ ఖాళీగా వున్న ఆ డైరెక్టర్ సడన్‌గా ఫోన్ తీసుకొని, నెంబరు కూడా నొక్కకుండా ఒక హీరోతో మాట్లాడేస్తున్నాడు" అంటూ ఆ దృశ్యాన్ని వివరించసాగాడు.

"అదికాదయ్యా హీరో... నాలుగు కథల్లో ఒక కథ చాలా బాగుంది సినిమా సూపర్‌హిట్ అవుతుంది."

"ఒరిజినల్ తమిళమా... మళయాళమా?" హీరో అడిగాడు.

"ఇంగ్లీషు.. ఈ మధ్య కేసెట్ వచ్చింది. నీకైతే బాగా సూట్ అవుతుందని చెపుతున్నాను."

"కొత్త ప్రొడ్యూసరా?"

"బ్రాండ్‌న్యూ.

"అయితే మన రెమ్యూనరేషన్ కోటి రూపాయలని చెప్పు."

"కోటి రూపాయలా! కష్టం... నేను మాట్లాడతాను. ఓ.కే." ఫోన్ పెట్టేసి అమరేశ్వర్‌వేపు చూసి, "చెప్పండి" అన్నాడు డైరెక్టర్.

అమరేశ్వర్ తనని పరిచయం చేసుకొని, రచయితను కూడా పరిచయం చేశాడు.

"సరిగ్గా టైమ్‌కే వచ్చారన్నమాట. కథ రెడీగా వుంది. హీరో రెడీగా వున్నాడు. అతనితో మాట్లాడాను. కోటిరూపాయల రెమ్యూనరేషన్...."

"కొత్త ప్రొడ్యూసర్ అని ఏదో అంటున్నారు."

"అదే... నాకెదురుగా మీరున్నారుగా. మీరు కదా కొత్త ప్రొడ్యుసర్– నేనేం అబద్ధం ఆడానా? సరదాగా కూర్చుని మాట్లాడుకొందాం' అన్నాడు డైరెక్టర్.

"మనం ఇప్పుడు కుర్చీలమీద కూర్చునేకదా మాట్లాడుకుంటున్నాం సార్!" అన్నాడు రచయిత.

"సినిమా ఇండస్ట్రీలో రచయితగా నిలదొక్కుకోవాలంటే చాలా... చాలా... ఎదగాలయ్యా నువ్వు. చూడు– మన ప్రొడ్యూసర్‌గారు వెయ్యి రూపాయలిస్తారు. తీసుకొని అదుగో ఆ ఎదురుగా కనిపిస్తోంది చూడు.. ఆ షాపులో నా పేరు చెప్పు, ఫారిన్ స్కాచ్ యిస్తాడు. అది మాకిచ్చేసి, బంజారాహోటల్‌కెళ్ళు, బోన్‌లెస్ చికెన్ బిర్యాని రెండు – బిగ్‌సైజ్ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ పాకెట్లు అయిదు – బాబా కాశ్మీరీ పాన్స్ నాలుగు... తీసుకురా... జల్దీ...." అంటూ అమరేశ్వర్ వేపు చూశాడు.

అమరేశ్వర్ మనసులోనే కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ వెయ్యి రూపాయలు తీసిచ్చాడు. రచయిత వెళ్ళిపోయాడు.

"చూడండి ప్రొడ్యూసర్ గారూ! కథ గురించి, పాటల గురించీ వది లెయ్యండి. హీరో, హీరోయిన్స్ కాల్షీట్స్ దొరికితే చాలు. సగం బిజినెస్ అయిపోయి నట్టే. చెప్పండి–ఏ హీరో కావాలి. ఏ హీరోయిన్ కావాలి?"

చెప్పాడు అమరేశ్వర్.

"వాళ్ళయితే కష్టం ఖర్చు ఎక్కువవుద్ది... నేను మాట్లాడతాననుకోండి– వుండండి. ఇప్పుడే మాట్లాడతాను. మీచేత మాట్లాడిస్తా. సరేనా?" అంటూ కార్డ్‌లెస్ అందుకొన్నాడు డైరెక్టర్.

"ఆ! నేనే... కొత్త సినిమా, కొత్త ప్రొడ్యూసరు... అరవైయ్యా. ఆ విషయం మీ నోటితోనే ప్రొడ్యూసర్‌కి చెప్పండి ఆనందిస్తాడు" అంటూ కార్డ్‌లెస్‌ను అమరేశ్వర్‌కిచ్చాడు.

వణుకుతున్న చేతుల్తో ఆ కార్డ్లెస్ అందుకొని– "అలాగే... అలాగే...." అంటూ నమస్కారాలు చేసాక. ఆ ఫోన్ని అమలేశ్వర్నుంచీ తనందుకొని లోపలి గదిలోకి నడిచాడు డైరెక్టర్.

"చూడండి హీరోగారూ! ఆ అరవైకి నేనొప్పిస్తాను. కానీ పదినాకు. సరేనా?"

"అలాగైతే డెబ్భై చెప్పు."

"కుదరదు. ఇంకా చాలా విషయాలుంటాయి. దొరక్క, దొరక్క ప్రొడ్యూసర్ దొరికితే... బెదిరించి పంపేస్తే, మనకి ఫుడ్ వుండదు... వుంటాను" అని బయటి కొచ్చాడు.

తర్వాత ఓ ప్రఖ్యాత హీరోయిన్తో కూడా అలాంటి వ్యవహారమే నడిచింది.

బడ్జెట్ గురించి, మిగతా వ్యవహారాల గురించి ఏమీ మాట్లాడకుండానే హీరో, హీరోయిన్లతో మాట్లాడిన ఆ డైరెక్టర్ వ్యవహారమంతా ఆశ్చర్యంగా అనిపించింది కొత్త ప్రొడ్యూసర్ అమరేశ్వర్కి.

అంతలో మందొచ్చింది... ఆబగా బాటిల్లాక్కొని గ్లాసులో పోసుకుని తాగుతూ–

"రేపే ఆఫీసు రెంట్కి తీసుకుందాం. మీకు కారుందా? అయితే ఆ కారుని డిస్పోజల్లో పెట్టండి. ఫోన్ కనెక్షన్... ఆఫీస్బాయ్... నా అసిస్టెంట్స్ ఇద్దరు, ప్రొడక్షన్ మేనేజర్, ఒక లక్షరూపాయలు ఇనిషియల్ ఎక్స్పెండేచర్. అలాగే రేపు మంచిరోజు. ఒక లక్షరూపాయలు అడ్వాన్స్ యిస్తున్నారు. ఏమంటారు?" అని అనగానే–

"నాకు తల తిరిగిపోయింది. వచ్చేశాను. మళ్ళీ వెళ్ళలేదు. మర్నాడు ఇంకో డైరెక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు మా రచయిత" చెప్పబోతూ ఆగాడు అమరేశ్వర్.

"ఏంటీ! బోరు కొడుతోందా. అలా చూస్తున్నారు?" అడిగాడు.

"బోరు కొట్టడంకాదు. కాలింగ్బెల్ మోగింది. ఇప్పుడెవరూ" అంటూ కెమేరామెన్, ప్రదీప్, సూర్యవంశీలవేపు ఒకసారి చూసి లేచి డోర్ తెరిచాడు.

డోర్ తెరిచిన మరుక్షణం అతన్ని తోసుకుంటూ లోనికొచ్చాడు కిషోర్‌దాస్. అతని వెనుక అయిదుగురు వ్యక్తులు–

కిషోర్‌దాస్ డైరెక్టుగా సూర్యవంశీ దగ్గరికొచ్చి–

"ఆ సినిమా స్క్రిప్టు ఎక్కడ?" అనడిగాడు.

"ఏ సినిమా స్క్రిప్టు?"

"ఎన్ని సినిమాలకి రాస్తున్నావేంటి? నాక్కావాల్సింది 'నేడే విడుదల' స్క్రిప్టు."

"నీకెందుకు?" అడిగాడు ప్రదీప్.

"ప్రశ్నలు వెయ్యకు. మర్యాదగా ఇవ్వు" అంటూ అక్కడున్న పుస్తకాలను, కొన్ని ఫైల్స్‌ను వెతకడం ప్రారంభించాడు.

"నీకు ఆ స్క్రిప్టుకి ఏమిటి సంబంధం? ఏమిటిది... మర్యాదగా ప్రవర్తించు."

"నీకు, మర్యాదేంటి?" అంటూ కిషోర్‌దాస్ సూర్యవంశీని పక్కకు తోసేశాడు.

ప్రదీప్, కిషోర్‌దాస్ మీదకు కోపంగా రావడంతో, మిగతావాళ్ళు చొచ్చుకొచ్చారు.

అక్కడ అరగంటసేపు నానారభాసా జరిగింది.

ఎట్టకేలకు సినిమా స్క్రిప్టు ఫైలుని చేజిక్కించుకున్న కిషోర్‌దాస్ ముఠా గాయాలయ్యాయి.

ఆ విషయం తెలుసుకొని ప్రొడ్యూసర్ సుమంతరావు వచ్చాడు.

సూర్యవంశీతోపాటు కారులో వెళ్ళి మొదట జూబ్లీహిల్స్ పోలీస్ స్టేసన్‌ల్లో రిపోర్టు ఇచ్చి, ఆ తర్వాత ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కి సూర్యవంశీని చేర్పించాడు.

* * * * *

అదే రాత్రి రెండున్నర గంటల సమయంలో–

రెండు వందల పేజీల ఆ స్క్రిప్టులోని ప్రతి పేజీ ఫ్యాక్స్‌లో న్యూఢిల్లీ వెళ్ళింది. జయభూషణ్ మొత్తం స్క్రిప్టును క్షుణ్ణంగా పరిశీలించాక ఫోన్ చేశాడు.

"స్క్రిప్టు చూశావా అరవింద్?"

"చూశాను. అందులో హీరో నేనే. విలన్స్ గ్యాంగ్‌లో ముఖ్యంగా పొలిటికల్ లీడర్‌ని నువ్వే" అన్నాడు అరవింద్.

"ఇన్సిడెంట్స్‌లో కూడా మార్పులేదు. అంటే మన విరోధులెవరో చాలా ప్లాన్డ్‌గా ఈ సినిమా ఆయుధాన్ని మనమీదకు ఎక్కుపెడుతున్నారు. విరోధులెవరైనా అది ప్రస్తుతం మనకనవసరం. ఆ సినిమా బయటకు రాకూడదు. మిగతా సినిమా షూటింగ్ జరక్కూడదు. ఆ షూటింగ్ పాల్గొనే యాక్టర్స్ అందరికీ బెదిరింపు కాల్స్ వెళ్ళాలి. నేను రెండ్రోజుల్లో వస్తాను. వెరీ సీరియస్. ఎంత డబ్బయినా ఫర్వాలేదు" భీకరంగా విన్పించింది జయభూషణ్ గొంతు.

"రేపుదయం జూబ్లీహిల్స్‌లో షూటింగ్ వుంది. ఆ షూటింగ్‌లో మహా ప్రళయాన్ని సృష్టిస్తాను. మొత్తం హైదరాబాద్‌లోని మనరౌడీ బ్రదర్స్ అందరినీ ఇన్‌వాల్వ్ చేస్తాను. సరేనా... ఆ మంజరి విషయం ఏంచేద్దాం?"

"ఇప్పుడే మంజరి, రామ్‌కాశ్యప్ జోలికి వెళ్ళద్దు, దానికింకా టైముంది" చెప్పి ఫోన్ పెట్టేశాడు జయభూషణ్.

అప్పటికప్పుడు రకరకాల యాక్టివిటీస్‌లో వున్న సిటీలోని రౌడీ లందరికీ స్వయంగా ఫోన్ చేశాడు అరవింద్.

జయభూషణ్ గెస్ట్‌హౌస్‌లో మర్నాడు ఉదయం రాజధానిలోని రౌడీ షీటర్ల సమావేశం జరగబోతోంది.

* * * * *

జీడిమెట్లలో గెస్ట్‌హౌస్–

లోపలి ఫస్ట్‌ఫ్లోర్లో షూటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాలేజీ స్టూడెంట్స్‌గా వచ్చిన జూనియర్ ఆర్టిస్టులకు మేకప్ పూర్తయింది. హీరో విమల్ మేకప్ జరుగుతోంది.

కెమెరామన్ లైట్ అరేంజిమెంట్స్ చూస్తున్నాడు.

క్రింద డ్రాయింగ్‌రూమ్‌లో హీరోయిన్ బృందకు సూచనలిస్తున్నాడు డైరెక్టర్ ప్రదీప్–వింటోంది బృంద.

"షాట్ రెడీ సార్...!" అసిస్టెంట్ డైరెక్టర్ సోమరాజు వచ్చి చెప్పాడు.

అందరూ ఫస్ట్ ఫ్లోర్లోకి వెళ్ళారు.

అక్కడ నలుగురు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు రకరకాల మోడ్రన్ డ్రస్సుల్లో వున్నారు. వాళ్ళ మధ్యలో హీరోయిన్ బృంద. హీరో విమల్.

"యాక్షన్" అరిచాడు డైరెక్టర్ ప్రదీప్.

స్పీకర్‌లోంచి ఇంగ్లీష్ మ్యూజిక్ పెద్ద స్థాయిలో వినబడుతోంది.

పక్క రూమ్‌లోంచి వచ్చిన విమల్ "డియర్ ఫ్రెండ్స్... అందరూ వచ్చేశారా. గుడ్! మిమ్మల్నందర్నీ ఇవాళ ఇక్కడికెందుకు రమ్మన్నానో తెలుసా?" అతి ముఖ్యమైన విషయం మీతో చెప్పడానికి" అంటూ బృంద వేపు చూశాడు.

మంజరి వేషంలో వున్న హీరోయిన్ బృంద, చిరునవ్వు నవ్వుతూ అతని దగ్గరకు వెళ్ళింది. హీరో, హీరోయిన్ చేతిని తన చేతిలోకి తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు.

అందరూ 'హిప్‌హిప్ హుర్రే' అంటూ అరిచి చప్పట్లు కొట్టారు.

"మా ప్రేమ గురించి మీకు తెలుసు. పెళ్ళి గురించి మీకు తెలీదు. ఆ విషయం చెప్పడానికే ఈ పార్టీ– వచ్చే నెల పధ్నాలుగున అంటే– ఫిబ్రవరి పధ్నాలుగు... వెలెంటైన్స్‌డే... ప్రపంచ ప్రేమికుల మనసుల్ని ఆవిష్కరించే ఆ ఫిబ్రవరి పధ్నాలుగున... నా ఆరాధ్యదేవత... మంజరిని నేను పెళ్ళి చేసుకోబోతున్నాను."

మళ్ళీ చప్పట్లతో హాలంతా మార్మోగిపోయింది.

స్కాచ్ బాటిల్‌ని అందుకొని అందరి గ్లాసుల్లో పోశాడు.

హుషారుగా జోకులు, డాన్స్‌లు, కబుర్లతో పార్టీ నడుస్తోంది. కొంతమంది ఫ్రెండ్స్ కొత్తగా వచ్చి ఆ పార్టీలో చేరారు.

"ఒరేయ్... బీరురా... బీరైపోయింది" ఓ ఫ్రెండ్ అరిచాడు.

పక్కనున్న ఫ్రెండ్స్‌తో చెప్పాడు హీరో– "బీర్ బాటిల్స్ ఎక్కడున్నాయో చూడు" అని.

"అయిపోయాయి" చెప్పాడతను.

అప్పుడే అక్కడికొచ్చింది మంజరి.

"మంజూ! కింద ఫ్రిజ్‌లో రెండు బీర్ బాటిల్స్ వున్నాయి. ప్లీజ్! తీసుకురావా" రిక్వెస్ట్ చేశాడు హీరో.

మెట్లుదిగి, మంజరి కిందకెళ్ళింది.

మెట్ల పక్కన గోడవారగా వున్న ఫ్రిజ్ డోరును తెరిచి, లోనున్న బాటిల్‌ని తీసి, పక్కనున్న బెంచీమీద పెట్టి, రెండో బాటిల్‌ని తీసి, బెంచ్‌వేపు చూసిన మంజరికి బీరు బాటిల్ కనిపించలేదు.

ఏదో అడుగులు చప్పుడు వినబడటంతో తలెత్తి చూసింది.

హీరో...!

"నేను తెస్తున్నానుగా! నువ్వెందుకొచ్చావ్?" అడిగిందామె.

హీరో బీర్ బాటిల్‌ని ఓపెన్‌చేసి, గడగడా తాగి, గోడకేసి ఆ బాటిల్‌ని విసిరికొట్టి–

"అక్కడ నిన్ను పెళ్ళి చేసుకుంటానని ఎనౌన్స్ చేశాను. ఇక్కడ నిన్ను ఖతమ్ చేయటానికి ప్లాన్ చేశాను."

"నాకిష్టం లేకపోతే అబార్షన్ జరగదని నువ్వన్న మాటలు నిజమే నని నమ్మాను. అదంతా నటనేనన్నమాట...." అంటూ తప్పించుకోటానికి అటూ – ఇటూ చూస్తోంది హీరోయిన్ మంజరి.

*　　*　　*　　*　　*

సర్రుమని నాలుగు జీపులు వచ్చి జూబ్లీహిల్స్‌లోని ఆ ప్రయివేట్ బంగళా ముందు ఆగాయి. దాదాపు ఇరవైమంది రౌడీలు ఉక్కుదేగల్లా దిగారు.

"ఎవరయినా బెదిరించారా నరికెయ్యండి" అంటూ గేట్‌ను తోసి ముందుకు అడుగేసాడు అరవింద్.

దూరంగా వున్న సెక్యూరిటీగార్డు పరుగు–పరుగున అక్కడికి వచ్చాడు.

"ఏం సార్! ఏం కావాలి?"

"నేడే విడుదల సినిమా షూటింగ్ ఎక్కడ జరుగుతోంది?"

"ఇక్కడ సినిమా షూటింగ్ ఏదీ జరగటం లేదు."

"అబద్ధం చెప్పకు."

"లేదు సార్... కావాలిస్తే చూసుకోండి... అన్ని రూమ్స్‌కి తాళాలు వేసున్నాయి. ఇవిగో కీస్" తన దగ్గరున్న తాళాల గుత్తిని చూపించాడు గార్డు.

"మనం దాడి చేస్తామని ముందే తెల్సి పారిపోయారేమో భాయ్!" కిషోర్‌దాస్ అన్నాడు అనుమానంగా.

"మనం దాడి చేస్తున్నట్టు వారికెలా తెల్సు?" అటూ–ఇటూ పరికించి చూస్తూ అన్నాడు అరవింద్. అతనికి చాలా ఇన్సల్టింగ్‌గా వుంది. తన రౌడీయిజమ్ కెరీర్‌లో ఒక ప్లాన్ ఇలా నీరు కారడమన్నది ఎప్పుడూ లేదు.

"జూబ్లీహిల్స్ రోడ్లన్నీ మొత్తం గాలించండి. ఏ సిన్మా షూటింగ్ జరిగినా ధ్వంసం చెయ్యండి...." ఉక్రోషంగా అన్నాడు అరవింద్ జీపు ఎక్కుతూ.

జీపులన్నీ కదిలాయి. తలో దిక్కూ వెళ్ళాయి.

* * * * *

హీరోని దూరంగా ముందుకు తోసేసి డోర్ వరకూ వచ్చి, లాక్ చేసి ఉన్న డోర్‌ని ఓపెన్‌చేసి బయటికెళ్ళిపోయింది బృంద.

హీరో డోర్ వరకూ వచ్చి ఆగిపోయాడు.

"కట్" డైరెక్టర్ గొంతు విన్పించింది.

"మొత్తంమీద హేపీగా షూటింగ్ జరిగిపోయింది సార్! ఆ రౌడీ గ్యాంగ్ జూబ్లీహిల్స్ బిల్డింగ్‌కి వెళ్ళుంటారా?" అడిగాడు కెమెరామెన్ సిగరెట్ వెలిగించుకొని రిలాక్సవుతూ.

"వెళ్ళే వుంటారు" సాలోచనగా అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

* * * * *

"గాయాలు నుదుటిమీద, చేతులమీద కదా! నేను నడవగలను కదా! అలా బెడ్‌మీద పడుకోవడం విసుగ్గా వుంది డాక్టర్! డిశ్చార్జ్ చెయ్యండి" అన్నాడు సూర్యవంశీ, తనను చెక్‌చేయటానికి వచ్చిన డాక్టర్‌తో.

"నో... నో... రెండురోజులు తప్పనిసరిగా మీకు విశ్రాంతి కావాలి. రచయితకదా, మీరు కథ గురించి ఆలోచించుకోండి! విసుగ్గా వుండదు...." అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

సరిగ్గా అదే సమయంలో లోనకొచ్చాడు కొత్త ప్రొడ్యూసర్ అమరేశ్వర్.

"నిన్న రాత్రి నేను చాలా భయపడిపోయాను సార్! నామీద కూడా వాళ్ళు దాడి చేస్తారేమోనని...." అన్నాడతను స్టూలుమీద కూర్చుంటూ.

"మీమీదెందుకు దాడి చేస్తారు?"

"నేను కూడా సినిమా తియ్యబోతున్నాను కదా? రేపు మన సినిమా స్క్రిప్టు కూడా తయారయితే ఇలాగే లాక్కెళ్ళిపోతారా సాబ్?" అడిగాడు అమాయకంగా అమరేశ్వర్.

ఆ ప్రశ్నకు నవ్వొచ్చింది సూర్యవంశీకి.

"వాళ్ళేమీ స్క్రిప్టు దొంగలు కాదు... షూటింగ్ జరుగుతున్న చోటికల్లా వెళ్ళి స్క్రిప్టు ఎత్తుపోవటానికి... చెప్పండి ఏమిటి విశేషాలు...?" అడిగాడు సూర్యవంశీ.

"ఇంకో యంగ్ డైరెక్టర్‌తో ఇంకో అనుభవం ఎదురయిందండి. తను జీనియస్ డైరెక్టర్ అని అనుకొంటున్నాడతను. రెండు సినిమాలు తీశాడు. అవి 'ఫట్' మన్నాయి అతగాడి వ్యవహారం ఏమిటంటే, మార్నింగ్ లేవగానే బ్రేక్‌ఫాస్ట్ టైమ్‌కి ఓ ప్రొడక్షన్ ఆఫీసు కెళ్లిపోతాడు. లంచ్ టైముకి ఇంకో ఆఫీసుకి – రాత్రి మందుగొడవ– సాయంత్రం నుంచే ఎక్కడెక్కడ నిర్మాతలు, డైరెక్టర్‌లు సిట్టింగ్‌లు వేశారో ఫోన్‌చేసి కనుక్కొని వెళ్ళి కూర్చుండిపోతాడు. అతగాడికి ఆరు పెగ్గులు లేందే నిద్రపట్టదు... అందుకని మూడు సిట్టింగ్‌లకెళ్ళి మూడురెళ్ళు ఆరు పెగ్గులు కొట్టేసి ఇంటికెళ్ళిపోతాడు. అందుకే ఏ ప్రొడ్యూసరూ అతనికి మరో సినిమా ఇవ్వడం లేదు" చెప్పాడు అమరేశ్వర్.

"మరి మీ సినిమా తీసిపెడతానన్నాడా?"

"ముందు రెండు జతల జీన్స్‌ఫాంట్లు, షర్టులు తీయమన్నాడు... తర్వాత సిన్మాకథ చెబుతానన్నాడు. భయంవేసి వచ్చేశాను" చెప్పాడు అమరేశ్వర్.

నవ్వుకున్నాడు సూర్యవంశీ.

"తెలుగు సినిమా ఇండస్ట్రీకి అద్భుతమైన చరిత్ర వుంది... సృజనాత్మకమైన వ్యక్తి, ఈ ఫీల్డులోకి రావాలనుకోవడంలో తప్పులేదు. కానీ 'క్రియేటివ్ బిజినెస్'ని

'కమీషన్ బిజినెస్'గా మార్చేసి... ఆర్ధిస్టిక్ వాల్యూస్‌ని తీసేస్తూ ఇండస్ట్రీని కళంకంగా మార్చేస్తున్నారు. ఇండస్ట్రీని దేవాలయంగా గౌరవించినవాడే మళ్ళీ ఇండస్ట్రీ బాగుపడుతవుంది. కుహనా దర్శకులు, నిర్మాతలు, టెక్నిషియన్‌లను ఇండస్ట్రీనుంచి తరిమెయ్యాలి. ఎవడుపడితే వాడు సినిమా తీస్తానంటే ఒప్పుకోకూడదు. ఒక కథ రాయలంటే తయారుచేయడం కాని చేతకానివాళ్ళు కథకులుగా చెలామణి అవుతారు. స్వర్శజ్ఞానం, గాత్రశుద్ధి లేనివాళ్ళు సంగీత దర్శకులుగా, స్క్రీన్‌ప్లేకి స్పెల్లింగ్ తెలీనివాళ్ళు స్క్రీన్‌ప్లే రైటర్స్‌గా చెలామణి అవుతుంటారు. కర్మకాలి వాళ్ళు డైరెక్టుచేసిన సినిమా హిట్ అయితే అతని చుట్టూ పదిమంది చేరిపోతారు...."

అలాంటి సమయంలో లోనకొచ్చింది బృంద.

ఆమెను చూడగానే అమరేశ్వర్ లేచి అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

బెడ్ మీదనుంచి లేచి కూర్చున్నాడు సూర్యవంశీ.

"మార్నింగ్ వద్దామనుకున్నాను వీలు కాలేదు" అందామె కుర్చీలో కూర్చుంటూ.

"ఇవాల్టి సీన్ బాగా వచ్చిందా?"

"వండ్రఫుల్... అవునూ మీ దగ్గరున్న స్క్రిప్టు ఎత్తుకుపోవడం ఏంటి? ఎందుకూ... ఎవరు వాళ్ళు?"

"కిషోర్‌దాస్ అండ్ గ్యాంగ్" చెప్పాడు సూర్యవంశీ.

"వాళ్ళకెందుకు?"

"స్క్రిప్టు లేకపోతే షూటింగ్ ఆగిపోతుందనుకున్నారు వెర్రి వెధవలు... ముందే మూడు కాపీలు జిరాక్స్ తీయించాను నేను...."

మంచంమీంచి లేచి రూమ్‌లోంచి బయటకొచ్చాడు సూర్యవంశీ.

పల్చటి పచ్చిక... చల్లటి గాలి... నిశ్శబ్దంగా వుంది వాతావరణం.

"అభ్యంతరం లేకపోతే... ఇక్కడ కూర్చుందాం" అన్నాడతను పచ్చికమీద కూర్చుంటూ- అతనికి కొంచెం దూరంలో కూర్చుంది బృంద.

"హైటెక్ హాస్పిటల్స్‌లో బాధ, మూలుగులు కూడా వినపడవు... అదే విచిత్రం. రేపు హైటెక్ స్మశానాలు కూడా వస్తాయేమో."

నవ్వింది బృంద.

మఫ్టీలో సెక్యూరిటీ కమెండోలు అక్కడక్కడ విజిటర్స్‌లా తిరుగుతున్నారని ఆమెకు తెలీదు.

సమయం తొమ్మిదిన్నర దాటింది.

సినిమా బిజినెస్ వ్యవహారం ప్రోగ్రెసివ్‌గా వుండటం, ఇద్దరిమధ్యా చర్చకు వచ్చింది.

"సూపర్ డూపర్ హిట్ అవుతుందని పేపర్స్ రాస్తున్నాయి...." అంది బృంద.

"మీ పర్సనల్ స్టోరీ అని అందరూ అనుకుంటున్నారు" అన్నాడు సూర్యవంశీ కావాలనే.

ఏం జవాబు చెప్పలేదామె... కాసేపయ్యాక–

"అప్పుడప్పుడు పరిస్థితుల మీద జాలేస్తుంది నాకు" అంది బృంద.

"ఏం?..."

"చూడండి... మీకు దెబ్బలు తగిలాయి. ఒక్కరే హాస్పిటల్‌లో వున్నారు. అదే మీ భార్యా పిల్లలు వున్నారనుకోండి. వాళ్ళ ఓదార్పే మీకు సగం ఆరోగ్యాన్నిస్తుంది కదా" అందామె.

"మీరున్నారుగా" వెంటనే అన్నాడతను. అనుకోకుండా అతని గొంతు లోంచి ఆ మాట వచ్చేసింది.

ఇద్దరిమధ్యా కాసేపు మౌనం.

"ఈ సినిమా రిలీజయ్యాక మీరు చాలా బిజీ అయిపోతారు. మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోండి. ఒంటరితనం తప్పుతుంది."

సరిగ్గా అదే సమయంలో మెయిన్‌డోర్ తెరుచుకొని ఓ అంబులెన్స్ వచ్చింది. దానివేపే చూస్తోంది బృంద. అందులోంచి ఓ వ్యక్తి దిగాడు. కుంటు కుంటూ నడుస్తున్నాడు. నర్స్ అతన్ని నడిపిస్తూ లోనికి తీసుకెళ్ళింది. ఆ వ్యక్తి నలువేపులా చూస్తూ లోనికెళ్ళాడు.

"ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నా కోరిక. కానీ ఎవరూ నన్ను ప్రేమించ డంలేదు" అంటూ నవ్వాడతను.

"ప్రేమించడానికి ప్రత్యేకంగా లైసెన్స్‌లు వుంటాయా?" అడిగిందామె.

"ఆ విషయం ప్రేమికులకే తెలియాలి."

"మంచి ఈస్థటిక్ మెంటాలిటీ వున్న అమ్మాయిని చేసుకుంటే మీకు సరిపోతుంది."

"దొరకాలిగా...."

"వెతికితే దొరుకుతారు."

"వెతికితే మనుషులు దొరుకుతారు. కానీ మనసు దొరకదు. అందుకే నాకు జీవితం ఎప్పుడూ కన్నీటి కలా కన్పిస్తుంది."

"సినిమా డైలాగులు చెప్పకండి" అందామె నవ్వుతూ. ఆ చర్చను అలా పొడిగించి తనమీద బృంద అభిప్రాయాన్ని కనుక్కోవాలని వుంది సూర్యవంశీకి. అంతర్గతంగా ఆమెమీదున్న అభిమానమే అందుకు కారణం. ఆమెకు ఎలాంటి మానసిక సమస్యలున్నా త్వరలో అన్ని పరిష్కారమైపోతాయని అతని నమ్మకం.

చేతి గడియారంవేపు, దూరంగా పచార్లు చేస్తున్న పి.ఏ. రామవతారం వేపు చూసి– "నేను వెళతాను. రేపు షూటింగ్ కొస్తారా?" అంది బృంద లేస్తూ.

మరికాసేపు వుండకూడదూ అనబోయి ఆగిపోయాడు సూర్యవంశీ.

ఆ మాట అతనంటే బావుండేది– అనలేదు. అంటే, అతని జీవితంలో అనుకోని మార్పు జరిగేది.

"రేపు షూటింగ్ లేదనుకుంటాను' అన్నాడు సూర్యవంశీ.

"అవును. లేదుకదూ... మర్చిపోయాను" అని "గుడ్‌నైట్" చెప్పి లాన్‌లోంచి వరండా మీద కొచ్చింది.

ఆమె రావడం చూసిన కమెండోలు, దూర... దూరంగా ముందుకు నడుస్తున్నారు. రామావతారం గబగబా ముందుకెళ్ళి కారు దగ్గర నుంచున్నాడు.

వరండామీద కుడివేపున హాల్లో బెడ్‌మీదున్న పేషంట్స్‌ని చూస్తూ నడుస్తోంది బృంద.

పది అడుగుల దూరంలో మెట్లు.

ఆ మెట్ల దగ్గర మలుపు తిరిగితే గేటు...

అయిదు అడుగులు నడిచి, ఏదో మీద పడినట్లు అనిపించటంతో ఉలిక్కిపడి కెవ్వున కేకవేయబోయింది.

అంతవరకూ బెడ్‌మీద పేషెంట్‌లా పడుకొని వున్న కిషోర్‌దాస్ ఒక్కసారిగా లేచి ఆమె నడుం దగ్గర గట్టిగా పట్టుకుని, బటన్‌నైఫ్‌ని ఆమె కంఠానికి గురిపెట్టాడు.

ఆ అనూహ్య పరిణామానికి బిత్తపోయింది బృంద. బెంబేలెత్తి పోయారు నర్సులు. అరుపులు, కేకలతో హాలు ప్రతిధ్వనించింది క్షణాల్లో.

"రెండే రెండు నిముషాలు టైమిస్తున్నాను. ఆ రామ్‌కాశ్యప్ నిన్ను రక్షించడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా... ఇలా అనూహ్యంగా ఎటాక్ ఇవ్వడం మా ప్రత్యేకత. అరవింద్ చెప్పమన్నాడు– స్క్రిప్టు మా చేతికొచ్చేసింది. రెండోది డైరీ. ఇరవై నాలుగు గంటల్లో అది మా చేతికి రావాలి."

"ఇంకో విషయం. నీ ప్రాణాలు నీకు దక్కాలంటే... ఈ 'నేడే విడుదల' సినిమాలో వేషం మానేసి వెళ్ళిపో– ఈ రాత్రికే వెళ్ళిపోవాలి. అరవింద్ చెప్పమన్న మాట ఇది... ఈ మాటను ఏమాత్రం అలక్ష్యం చేసినా, పోలీసులకు చెప్పినా... నువ్వు శవమైపోతావ్. అర్థమైందా... వస్తా" టక్‌మని బృందని వదిలేసి పరిగెత్తి ముందుకెళ్ళిపోయాడు కిషోర్‌దాస్.

"వాడు రౌడీయా... నిజంగా పేషెంట్ అనుకున్నాను" అతనికి ఎస్కార్టుగా వెళ్ళిన నర్సు ఆశ్చర్యపోయింది.

అప్పటికే కొంతమంది కమెండోలు కిషోర్‌దాస్ వెంటపడ్డారు. కొంతమంది బృందకు రక్షణగా వచ్చారు.

ఆ సమయంలోనే పరుగు పరుగున సూర్యవంశీ వచ్చి–

"వాడు కిషోర్‌దాస్ కదూ... మిమ్మల్ని ఏదో బెదిరించినట్టున్నాడు. ఏమిటి" టెన్షన్ పడిపోతూ అన్నాడు సూర్యవంశీ.

చెప్పింది బృంద.

రామావతారం చేతిలో వున్న సెల్‌ఫోన్ అందుకొని డైరెక్టర్ ప్రదీప్‌కి, రామ్‌కాశ్యప్‌కి జరిగిన విషయం చెప్పి, బృందతోపాటు కారులో బయలుదేరాడు సూర్యవంశీ.

*        *        *        *        *

అంతా విన్నాడు రామ్‌కాశ్యప్. అక్కడ సూర్యవంశీ డైరెక్టర్ ప్రదీప్, సైకియాట్రిస్ట్ విశ్వనాథ్, రామావతారం వున్నారు.

“బృందా... ఈ సినిమాలో ఒక మీదట నువ్వు యాక్ట్‌చేస్తావా...? మానేస్తావా?” రామ్‌కాశ్యప్ సూటిగా ఆమెవేపు చూస్తూ ప్రశ్నించాడు.

“యాక్ట్ చేస్తాను” దృఢంగా చెప్పింది బృంద.

“ఎందుకు యాక్టు చెయ్యటం? నీ ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదము వున్నప్పుడు రిస్క్ తీసుకోవడం ఎందుకు?” రామ్‌కాశ్యప్ మాటలకు అందరూ ఆశ్చర్యపోయారు.

రామ్‌కాశ్యప్ ఆ ప్రశ్నను చాలా ‘టాక్టుపుల్’గా అడిగాడని ఒక్క విశ్వనాథ్‌కి మాత్రమే తెల్సు.

బృంద చెప్పే సమాధానం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

“నేను నటిస్తాను. ఎవరో బెదిరించారని నేను భయపడను. భయపడటం నా రక్తంలో లేదు” ఆవేశంగా జవాబు చెప్పింది బృంద.

“గుడ్.... హేపీగా ప్రొసీడ్ అయిపోండి. ఎల్లుండి షూటింగ్ ఎక్కడ?” అడిగాడు రామ్‌కాశ్యప్.

“నర్సాపూర్ అడవుల్లో ఓ కొండమీద.”

“ఆ విషయం పేపర్లో వచ్చింది కదా?”

“అవును సార్.”

“అక్కడ వద్దు.”

“మరెక్కడ తీయమంటారు?”

“ఏటూరు నాగారం కొండల్లో” చెప్పాడు రామ్‌కాశ్యప్.

“అలాగే సార్. అది నక్సలైట్ ప్రాంతం... కొంత రిస్క్.”

“నాకొదిలేయండి. ఇకమీదట మీ సినిమాకు అయ్యేఖర్చంతా నేను భరిస్తానన్నానుగా... అక్కడ మీకేమీ ఇరక్కుండా, బృంద మీద శత్రువర్గం దాడి చేయకుండా నేను చూస్తాను. వందమంది స్పెషల్ కెమండోస్ మీ షూటింగ్‌కి రక్షణగా వుంటారు” సీరియస్‌గా చెప్పాడు రామ్‌కాశ్యప్.

ఆయన పట్టుదల, ఆ సమయలో ఎవరికీ అర్ధంకాలేదు.

బృందతో సహా అందరూ వెళ్ళిపోయాక, సైకియాట్రిస్ట్ విశ్వనాథ్ ఒక్కడే మిగిలాడు. రామ్‌కాశ్యప్ చెప్పడం ప్రారంభించాడు.

"మదన్ ఇవాళ ఫోన్ చేశాడు. మొదట మహబూబ్‌నగర్ వెళ్ళాడు. తర్వాత నారాయణపురం వెళ్ళాడు. నారాయణపురానికి చెందిన మాజీమంత్రి పేరు విన్నారా మీరు?" అడిగాడతను.

"విన్నాను... మణిభూషణ్‌రెడ్డి."

"యు ఆర్ కరెక్టు... ఆ మణిభూషణ్‌రెడ్డి ఒకప్పటి జమిందారు. ఇప్పుడు తొంభైఏళ్ళ వయోవృద్ధుడు. ఆ మణిభూషణ్‌రెడ్డి కొడుకే జయభూషణ్. చిన్నప్పటి నుంచీ పెద్ద రౌడీ. ఆడపిల్ల వ్యామోహం ఎక్కువ. అరవింద్ కూడా అదే ఊరువాడు. పెద్ద రైతుకొడుకు. జయభూషణ్, అరవింద్ చిన్నప్పటి నుంచీ స్నేహితులు.

చేసిన పనులన్నీ కలిసే చేశారు.

అదే గ్రామానికి చెందిన మామూలు రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి శ్రీరాములు. అతనికి భార్య చనిపోయింది. పెద్దకూతురు యశోద. ఆమెకు పెళ్ళయింది. ఒక కొడుకు. ఆ తర్వాత భర్త చనిపోయాడు. ఆ యశోద చెల్లెలు మంజరి.

యశోద చాలా అందగత్తె. మంజరి కూడా చాలా అందమైన అమ్మాయి. హైస్కూల్ వరకూ అక్కడే చదివిన మంజరి, కాలేజీ చదువుకోసం మహబూబ్‌నగర్ వచ్చింది. ఆమెకు తోడుగా యశోద, యశోద అయిదేళ్ళ కొడుకు వచ్చారు. నెలకోసారి వాళ్ళు నారాయణపురం వెళ్ళడం అలవాటు. ఒకరోజు రోడ్డుమీద యశోదను జయభూషణ్ చూశాడు. ఆమె అందం అతన్ని పిచ్చెక్కినట్టు చేసింది. నెమ్మదిగా ట్రాప్ చేసాడు. భర్త లేని యశోద ఆ ట్రాప్‌లో పడిపోయింది. నిజంగా జయభూషణ్ ప్రేమిస్తునానడనుకొంది. అతనితో ఇల్లీగర్ కాంటాక్ట్ పెట్టుకుంది. జయభూషణ్ రాత్రివేళల్లో రహస్యంగా యశోద ఇంటికి వస్తూపోతుండేవాడు.

కొంతకాలానికి యశోద అంటే అతనికి మోజు తీరిపోయింది. అతని దృష్టి మంజరిమీద పడింది. ఒకరోజు యశోదతో చెప్పాడు జయభూషణ్– నీ చెల్లిని నేను పెళ్ళిచేసుకొంటానని, అందుకు యశోద ఒప్పుకోలేదు.

నా చెల్లిలిమీద నీ చెయ్యి పడిందో... మన రహస్యం వూళ్ళో బట్టబయలు చేస్తానని హెచ్చరించింది. నయానా – భయానా చెప్పాడతను. వినలేదు ఆమె. ఆమె మహామొండి.

కుటుంబ గౌరవం పోతుందని భయపడిన జయభూషణ్, అప్పుడు తన తెలివితేటల్ని ఉపయోగించాడు" చెప్పడం ఆపాడు రామ్‌కశ్యప్.

"వెరీ ఇంట్రెస్టింగ్. ఈ కథంతా చెప్తే బృంద మామూలు మనిషవుతుందా! అవ్వచ్చేమో. తర్వాత ఏం జరిగింది?" అడిగాడు విశ్వనాథ్ ఆత్రతగా.

తర్వాత ఏం జరిగిందో చెప్పాడు విశన్వానాథ్‌కి రామ్‌కాశ్యప్.

"ఈజిట్ ట్రూ??" ఆశ్చర్యపోయాడతను.

"అవును.... అందుకే మెంటల్ ఇన్‌బేలన్స్‌కి గురైంది బృంద...." అన్నాడు రామ్‌కాశ్వప్.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు విశ్వనాథ్.

సరిగ్గా అదే సమయంలో లోనికొచ్చిన మదన్‌వేపు చాలా ఆనందగా చూశాడు రామ్‌కాశ్యప్.

"యు ఆర్ జీనియస్... నీలాంటి వాళ్ళు సి.బి.సి.ఐ.డి.లో వుంటే మన దేశంలో తొంభై శాతంమంది రాకీజనాయకులు ఉరికంబం ఎక్కేవారు" అన్నాడు రామ్‌కాశ్యప్.

"సార్... చాలా వాల్యుబుల్ మెటీరియల్" అంటూ తన చేతిలోని కవర్ని రామ్‌కాశ్యప్‌కి అందించాడు మదన్.

ఆ కవర్‌ని వెంటనే విప్పాడు రామ్‌కాశ్యప్.

అదొక కార్డుసైజు ఫోటో...

ఆ ఫోటోలో ఇద్దరు మహిళలు, ఒక అబ్బాయి వున్నారు.

ఆ మొదటి వ్యక్తి యశోద, ఆ పక్కన ఆమె కొడుకు, మూడో వ్యక్తీ మంజరి... ఒరిజినల్ ఫోటో...

ఆ ఫోటోని చూడగానే దిగ్భ్రాంతికి గురయ్యాడు రామ్‌కాశ్యప్. చాలాసేపు అతను ఆలోచనతోనే గడిపాడు. ఆ ఫోటోని తీసుకొని చూసి–

"బృంద మంజరిగా మారడానికి మా ఫోటో ఏమైనా ఉపయోగపడు తుందా? బీయింగ్ ఎ సైకియాట్రిస్ట్... యు హేవ్ టు హెల్ప్‌మి' అన్నాడతను.

చాలాసేపయ్యాక విశ్వనాథ్ ఒక సలహా ఇచ్చాడు...

"గుడ్... సైకలాజికల్ ట్రీట్‌మెంట్" ఆ సలహాను మెచ్చుకున్నాడు రామ్‌కాశ్యప్.

"కానీ...." ఏదో చెప్పబోయి ఆగాడు రామ్‌కాశ్యప్.

"రక్తసంబంధం కోసం చేసే త్యాగాలు చాలా గొప్పని కదూ" అన్నాడతను.

"మంజరిలాంటి వ్యక్తి హిస్టరీలో కనిపించదు. రేర్ హ్యూమన్ బీయింగ్" అన్నాడు ప్రశంసగా.

"అందుకే... మంజరి అక్కను మనం ఆమె ఎదుట నుంచోబెడితే మంజరి మన కళ్ళెదుటకు వస్తుంది. బృంద మంజరిగా మారిపోతుంది. అంతకుముందు మీరు చెప్పిన సైకలాజికల్ ట్రీట్‌మెంట్ చేద్దాం" అన్నాడు రామ్‌కాశ్యప్.

"చనిపోయిన అక్క ఎలా వస్తుంది?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు విశ్వనాథ్.

"వస్తుంది" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ రామ్‌కాశ్యప్.

"ఒకప్పుడు వరల్డ్ ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లలో ఇజ్రాయిల్ ది గొప్ప స్థానం. వాళ్ళ ఆపరేషన్స్ ఇయర్స్ టు గెదర్ వుంటాయి. ముప్పై ఏళ్ళ తర్వాత ఒకడ్ని చంపాలనుకొంటే ఇప్పుడు ప్లాన్ వేస్తాను... మీకు తెలుసా? అడిగాడు రామ్‌కాశ్యప్.

"హిస్టరీ నాకు తెలీదు... చెప్పాడు రామ్‌కాశ్యప్.

"ఒకసారి రష్యాలోని పవర్‌ఫుల్ కె.జి.బి. ఏజెంట్‌ను చంపాలనుకొన్నారు. అందుకోసం ఇజ్రాయిల్ సీక్రెట్ సర్వీస్ గ్రూప్‌నుంచి ఒక వ్యక్తిని రిక్రూట్ చేసారు. ఆ వ్యక్తిని రష్యాలోని మారుమూలలకు పంపారు. అక్కడ చాలా సంవత్సరాలు సాధారణమైన జీవితం గడిపాడతను. ఒక రైతుగా. ఒక స్కూలు టీచరుగా, చివరికి అక్కడి అమ్మాయినే పెళ్ళిచేసుకొన్నాడు. పిల్లల్ని కన్నాడు. డిగ్నిఫైడ్ సిటిజన్‌గా పేరు పొందాడు. ఆ రోజుల్లో రష్యాలో ప్రతి సిటిజన్‌కూ ఐడెంటిటీ కార్డ్స్ వుండేవి. ప్రతి వ్యక్తిమీదా నిఘా వుండేది. ఇజ్రాయిల్ గూఢచారిపై ఎవరికీ

ఏ అనుమానం రాలేదు. కె.జి.బి. ఏజంటు గ్రామాన్ని సందర్శించినపుడు. ఇజ్రాయిల్ గూఢచారి... అతన్ని మర్యాదపూర్వకంగా కలుసుకొని, చాలా ప్లాన్డ్‌గా మర్డర్ చేశాడు. ఈ ఆపరేషన్‌కు దాదాపు ఇరవై అయిదేళ్ళు పట్టింది. ఒరిజినల్ స్టోరీ చాలా పెద్దది" చెప్పాడు విశ్వనాధ్. విశ్వనాధ్‌కు రామ్‌కాశ్యవ్ ఇన్నర్ ఫీలింగ్స్ తెలుసు.

కోటానుకోట్లకు ఎదిగిన ఒక బిజినెస్‌మాన్ సరదాగా ఒక మాట మాట్లాడాడు. బిర్లా కొటేషన్‌ని తన కొటేషన్‌గా చెప్పుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదిగాననుకుంటున్న "లూజ్ ఇండస్ట్రియలిస్ట్ లాంటివాడు. కాదు రామ్‌కాశ్యవ్.

డబ్బు ఏ మార్గాల్లోనైనా సంపాదించడం ఒక్కటే సక్సెస్‌కి ప్రధానం కాదు. నువ్వు సంపాదించే డబ్బు లక్షా తొంభైమంది శ్రామికులది అని తెలిసినవాడు నీ మార్గం నిజమౌతుంది. కారల్‌మార్క్స్ అదే చెప్పాడు. బిర్లా అదే చెప్పాడు.

అందుకే బిర్లా తన కంపెనీలో పనిచేసే సాధారణ కూలీని ఎం.డి.గా చేశాడు... అది హిస్టరీ...

గుడ్... మదన్... రేపు కల్సుకొందాం...." లేచి నిలబడ్డాడు రామ్‌కాశ్యవ్.

"నేనూ వెళతాను సార్...." అన్నాడు విశ్వనాధ్.

"రేపు కలుద్దాం... గుడ్‌నైట్...." రామ్‌కాశ్యవ్‌లో చాలా ఆలోచనలు సతమతమవుతున్నాయి. బృందమీద అపారమైన అభిమానం తన కెందుకు ఏర్పడిందో అతనికి అర్థంకావడంలేదు.

విశ్వనాధ్, మదన్ వెనుదిరిగారు.

"మదన్... నీ ఇన్వెస్టిగేషన్ అంతా నిజమేనా? ఎవరో చెప్పమన్నట్లుగా నా ఎదురుగా నువ్వు చెప్పాలి?" అడిగాడు విశ్వనాధ్.

"అయామ్ నాట్ ఎ పేషెంట్" చాలా క్రూడ్‌గా చెప్పి కారెక్కాడు మదన్.

సైకియాట్రిస్టులు చాలామంది మనుషుల్ని అనుమానిస్తారు, పోలీసుల్లా– మనసుల సంగతి వారు తెలుసుకోరు. ఆ విషయం వాళ్ళకూడా తెలీదు.

*    *    *    *    *

సూర్యవంశీకి నిద్రపట్టలేదు.

అతని కళ్ళముందు బృంద కొన్ని గంటలక్రితం ఆస్పత్రిలో ఇద్దరి మధ్య జరిగిన సంభాషణలోని ప్రతి పదం, ప్రతి అక్షరాన్ని అతను నెమరు వేసుకుంటున్నాడు.

ఎట్టకేలకు అతను, తన మనస్సునో ప్రశ్న వేసుకున్నాడు.

'బృంద తనని ప్రేమిస్తుందా? ఆమె ప్రేమని పొందాలంటే ఏం చెయ్యాలి?' అని.

రకరకాలుగా ఆలోచిస్తున్నాడు సూర్యవంశీ.

బృంద...

అతని అక్షరాలు... భావాల వెనుక బృంద ఒక ఇనిస్పిరేషన్ అయిపోయిందనే విషయం అతనికిప్పుడు తెల్సింది.

* * * * *

"బృంద నుంచి డైరీ సంపాదించలేకపోయావ్. షూటింగ్‌ను ఆపలేకపోయావ్. నిర్లక్ష్యం పెరిగిందా... నీ పవర్ తగ్గిందా?" కోపంగా అడిగాడు జయభూషణ్ అరవింద్‌ని.

"ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారన్నా" అన్నాడు అరవింద్.

"అలా వెయ్యాల్సిన అవసరం ఏముంది అంటే దానర్థం ఏంటో తెల్సా? ఆ సినిమా మనమీదే తీస్తున్నారని– ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ సినిమా రిలీజ్ కాకూడదు. అంతకుముందే బృంద చచ్చిపోవాలి" తన నిర్ణయాన్ని అంత బాహాటంగా ఎప్పుడూ ప్రకటించలేదు జయభూషణ్.

"అంటే... ఆ బృంద మంజరీయేనా?"

"అవును... చనిపోయిందని మనం అనుకున్న మంజరి బతికింది. రాజకీయంగా మనల్ని శాశ్వతంగా సమాధి చెయ్యడం కోసం, కక్ష తీర్చుకోవడం కోసం... పవర్‌ఫుల్ ప్లాన్ వేసింది. నెక్ట్స్ షూటింగ్ ఎక్కడ?"

"నర్సాపూర్ అడవుల్లో."

"ఈసారి మిస్ కాకూడదు– కడప వీరారెడ్డికి ఫోన్ చెయ్. బాంబులు తెప్పించు. యూనిట్లో ఒక్కరూ మిగలకూడదు. మిస్ కాకూడదు. పార్టీ ఆఫీసు కెళ్తున్నా...." అని చెప్పి వెళ్ళిపోయాడు జయభూషణ్.

బృందే మంజరి అని స్పష్టంగా జయభూషణ్ చెప్పడంతో అరవింద్ ఒంటికి చెమట్లు పట్టేశాయి. ఆమెకు తను చేసిన ద్రోహం మామూలు ద్రోహం కాదు. నమ్మకద్రోహం– స్త్రీత్వంతో చెలగాట మాడాడు తను. అతను చేసిన తప్పు అతనికి తెలుస్తూనే వుంది.

'బృంద చావకపోతే తనకి మనుగడలేదు' అని అనుకొని కిషోర్ దాస్‌కి ఇన్‌స్ట్రక్షన్ ఇవ్వడం ప్రారంభించాడు.

*　　*　　*　　*　　*

"నీతోపాటు ఇవాళ సినిమా షూటింగ్‌కి వస్తాను... సినిమాషూటింగ్ నేనెప్పుడూ చూడలేదు" అన్నాడు బృందతో రామ్‌కాశ్యప్.

"మీరు షూటింగ్‌కొస్తారా... అంత 'లీజర్' దొరికిందా మీకు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"ఏటూరునాగారం అడవుల్ని చూడాలని నాకెప్పట్నుంచో కోరిక. రెండ్రోజులు వీకెండ్ హాలిడేస్‌లా వుంటుందని" అన్నాడు రామ్‌కాశ్యప్.

రామ్‌కాశ్యప్ షూటింగ్‌కి ఎందుకొస్తున్నాడో విశ్వనాథ్‌కి మాత్రమే తెలుసు.

*　　*　　*　　*　　*

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన రెండు గెస్ట్‌హౌసుల్లో, ఒక గెస్ట్ హౌస్‌ని రామ్‌కాశ్యప్, విశ్వనాథ్ కోసం–

రెండో గెస్ట్‌హౌస్‌ని బృంద, సూర్యవంశీ, డైరెక్టర్ల కోసం బుక్ చేశారు.

జూనియర్ ఆర్టిస్టుల్ని వరంగల్ హోటల్‌లో వుంచారు.

నాగరిక వాతావరణానికి దూరంగా, పచ్చటి అడవులు... ఎత్తయిన కొండలు, అమాయకంగా కన్పించే గిరిజనులు, వారి గుడిసెలు... ఆ వాతావరణం చాలా నచ్చింది బృందకి.

గెస్ట్‌హౌస్‌కి కిలోమీటరు దూరంలో వున్న జలపాతం ముందర సాంగ్‌లో కొంత పార్ట్ షూటింగ్ చేస్తారు. మర్నాడు పిక్చర్‌లో అతికీలకమైన సన్నివేశం షూటింగ్...

మధ్యాహ్నం నాలుగున్నర దాటింది.

మబ్బుపట్టిన ఆకాశం– చల్లటి అడవిగాలి.

రామ్‌కాశ్యప్, విశ్వనాథ్ మాట్లాడుకుంటుండగా, సూర్యవంశీ, మేకప్‌మేన్‌ని, ఒక లేడీ జూనియర్ ఆర్టిస్ట్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు.

ఆ సమయంలో రామ్‌కాశ్యప్ చేతిలో 'నేడే విడుదల' సినిమా స్క్రిప్టు వుంది.

"రేపు షూట్‌చేసే సీన్‌లో హిరోయిన్ అక్క కేరక్టర్ వేసే ఆర్టిస్టు ఈవిడే" పరిచయం చేసాడు సూర్యవంశీ.

తన కోటు జేబులో వున్న, మదన్ నారాయణపురం నుంచి తెచ్చిన మంజరి అక్క. కొడుకు కల్సి వున్న ఫోటోను తీసి, ఆ ఫోటోలోని మంజరి అక్క యశోద ఫోటో వేపు, ఆ జూనియర్ ఆర్టిస్టు వేపు చూసి–

"కరెక్ట్ కాండిడేట్ ఫర్ కారెక్టర్" అని అన్నాడు రామ్‌కాశ్యప్.

ఆ జూనియర్ ఆర్టిస్టు వెళ్ళిపోయింది.

"కొడుకుగా వేసే అబ్బాయి రేపు షూటింగ్ సమయానికి వచ్చేస్తాడు" చెప్పాడు కుర్చీలో కూర్చుంటూ సూర్యవంశీ.

"మీరే షూటింగ్‌స్పాట్‌కి రావటం... అక్క పాత్రనువేసే జూనియర్ ఆర్టిస్టును చూడాలనుకోవడం... మేకప్ ఆర్టిస్ట్ దగ్గర కూడా మీరే వుంటాననడం... నాకేమీ అర్ధంకావడంలేదు" అడిగాడు సూర్యవంశీ.

"అన్నీ మీకే తెలుస్తాయి... రేపు సీన్ ఏంటి? ఒకసారి చెప్పండి" తన దగ్గరున్న స్క్రిప్టు బుక్‌ను సూర్యవంశీ కిచ్చాడు రామ్‌కాశ్యప్.

ఆ బుక్‌లో ఆ సీన్‌ని ఓపెన్‌చేసి, ఒకసారి తను చదువుకుని వివరంగా చెప్పసాగాడు సూర్యవంశీ–

"ప్రాణానికి ప్రాణంగా ప్రేమించి, ఆమెని చదివించింది ఆ అక్క. ఆ అక్క పేరు సినిమాలో రాజేశ్వరి... చెల్లి... బృంద. బృంద ఇష్టపడిన వ్యక్తితో పెళ్ళయ్యింది. చెల్లి అదృష్టానికి మురిసిపోయింది రాజేశ్వరి... కానీ మొదటిరోజు రాత్రి భయంకరమైన దుర్మార్గునికి బృంద జీవితం బలైంది. ఆ విషయం తెలుసుకున్న రాజేశ్వరి అందుకు కారణమైన వ్యక్తుల మీద తిరగబడింది– వారి

బలం ముందు, ఆమె బలం సరిపోలేదు. పైగా ఆ దుర్మార్గుల చేతిలో అవమానానికి గురైంది రాజేశ్వరి. ఆ అవమానాన్ని సహించలేని రాజేశ్వరి, అర్ధరాత్రి జలపాతంలో పడి చనిపోవాలని నిర్ణయించుకుని– తన కొడుకుని పక్కలో వేసుకుని నిద్రపోతున్న బృందకు ఒక ఉత్తరం రాసిపెట్టి, జలపాతం వేపు పరుగెట్టి, జలపాతంలో దూకబోతుండగా, చప్పున మేలుకొన్న బృంద ఆమె కోసం వెతికి, రక్షించడానికి పరిగెత్తుకుంటూ వెళ్ళి, అక్కని ఆత్మహత్య చేస్కోకుండా ఆపుతుంది" చెప్పడం ఆపాడు సూర్యవంశీ.

"రేపు ఈ సీనంతా షూట్ చేస్తారా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"లేదు – ఫస్ట్ డే నైట్ సీన్ షూటింగ్ అయిపోయింది. రాజేశ్వరిని అవమానించే సీన్ షూటింగ్ అయిపోయింది. రేపు సీన్... అక్కని ఆత్మహత్యా యత్నం నుంచి హీరోయిన్ కాపాడే సీన్" చెప్పాడు సూర్యవంశీ.

"గుడ్...." అంటుండగానే, మేకప్‌మేన్ వచ్చి రామ్‌కాశ్యప్‌కి నమస్కరించి నుంచొన్నాడు.

రామ్‌కాశ్యప్ తన చేతిలోని ఫోటోను అతనికిచ్చి–

"సినిమాలోని రాజేశ్వరి పాత్రను ఇన్‌స్పిరేషన్–ఒరిజినల్ కారెక్టర్– ఈ యశోద– మీరు రాజేశ్వరి ముఖాన్ని, యశోద ముఖంగా మార్చాలి– కొన్ని ఫీచర్స్ సరిపోయాయి కాబట్టి... మీ మేకప్ ద్వారా ఆ ఎఫెక్ట్‌ను క్రియేట్ చెయ్యగలర నుకుంటాను...." అన్నాడు.

"యశోద ఒరిజినల్ ఫోటో ఎలా సంపాదించారు? వండ్రఫుల్...." అంటూ మేకప్‌మేన్ చేతిలోని ఆ ఫోటోను లాక్కొని చూసి–

"మరి... ఆ పక్కనున్న అమ్మాయి...?" అని సందేహంగా అడిగాడు సూర్యవంశీ. అతనికి చాలా థ్రిల్లింగ్‌గా వుంది.

"ఆ అమ్మాయి ఒరిజినల్ మంజరి" చెప్పాడు రామ్‌కాశ్యప్.

"మంజరి...."

అయిదు నిమిషాలసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు సూర్యవంశీ.

"ఎలా సంపాదించారు... ఆ ఫోటోని?" మళ్ళీ అడిగాడతను.

సమాధానం చెప్పలేదు రామ్‌కాశ్యప్.

“మరి బృంద ఈ ఫోటోని చూసిందా?” అడిగాడతను.

“లేదు....”

“చూపిస్తే బావుంటుందిగా?”

“రేపు షూటింగ్ కానివ్వండి... తర్వాత.

“బృందకి, ఫోటోలోని మంజిరికి ఒక్క ముఖంలోనే చిన్న మార్పు. బృంద బుగ్గలు, ముక్కు, కనుబొమ్మల మధ్య ఖాళీ, గెడ్డం వంపు....” ఆ ఫోటో వేపే తదేకంగా చూస్తూ అన్నాడు సూర్యవంశీ.

“ఆ మార్పులు లేకపోతే?” అడిగాడు రామ్‌కాశ్యప్.

“బృంద... మంజరియే” కన్‌ఫర్మ్‌డ్‌గా అన్నాడు సూర్యవంశీ.

“ఈ స్పెషల్ మేకప్ చెయ్యాలంటే... కనీసం ఎనిమిదినుంచి పది గంటల సమయం అవసరమవుతుంది. ప్రత్యేకంగా మద్రాసు నుంచి కొంత మెటీరియల్ తెప్పించాలి” చెప్పాడు మేకప్‌మేన్.

“తెప్పించండి.”

“టైం సరిపోతుందా?” సందేహంగా అడిగాడు మేకప్‌మేన్.

“ట్రైన్‌లోనో, కార్లోనో వెళ్ళొద్దు... ఇవాళ సాయంత్రం ఫ్లైట్‌లో వెళ్ళి, రేపు మార్నింగ్ రాగలరా?”

“ఫ్లైట్ అయితే ఓ.కే.”

“ఎంత ఖర్చయవుంది?”

“యాభై వేలవుతుంది.” చెప్పాడు మేకప్‌మేన్.

రామ్‌కాశ్యప్, రామావతారం వేపు చూశాడు.

రామావతారం సూట్‌కేస్ తెరిచి, అందులోంచి అయిదు వందల రూపాయల బండిల్స్ తీసి, మేకప్‌మేన్‌కిచ్చాడు.

“ఫ్లయిట్ ఛార్జిస్‌కి... మిగతా ఖర్చులకి, ఇంకో పదివేలివ్వు....” చెప్పాడు రామ్‌కాశ్యప్. మరో పదివేలిచ్చాడు రామావతారం.

“మీరు నా కారులో హైద్రాబాద్ వెళ్ళిపోండి....” అంటూ కారు డ్రైవర్ని పిలిచాడు.

మరో పది నిముషాల తర్వాత మేకప్‌మేన్‌ని ఎక్కించుకున్న కారు ఏటూరు నాగారం అడవుల్లోంచి బయలుదేరింది.

"మీరు ఏం చెయ్యబోతున్నారో నాకర్థమైంది. వండ్రఫుల్... కమల్ హాసన్ భారతీయుడు సినిమాలో, ముసలి కమలహాసన్ గెటప్ గుర్తొస్తుంది నాకు" అన్నాడు సూర్యవంశీ.

సడన్‌గా అతనికి ఆ సమయంలో ఇంకో విషయం గుర్తొచ్చింది.

"మంజరి ఒరిజినల్ ఫోటో, మీ దగ్గరుందని బృందకు తెల్సా?" గాభరాగా అడిగాడతను.

"లేదు. మీరీ విషయాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ చెప్పకండి" హెచ్చరించాడు రామ్‌కాశ్యప్.

"సార్... హేట్సాఫ్ టూయూ... బృందను మళ్ళీ మామూలు మనిషిని చెయ్యడానికి మీరుచేస్తున్న కృషి ప్రసంసనీయం. అతి త్వరలో ఆమె మామూలు మనిషి అయిపోతుందన్న నమ్మకం నాకుంది" అంటూ లేచాడు సూర్యవంశీ.

* * * * *

ఫిలిం నగర్‌లోని రామబ్రహ్మం ఇంటి ముందు ఆగిన కారులోంచి నలుగురు వ్యక్తులు దిగారు. సెక్యూరిటీగార్డ్ అడ్డు పడ్తున్నా వాడ్ని లక్ష్యపెట్టకుండా ముందుకు నడిచారు. అంతలో రామబ్రహ్మం పి.ఏ. గోల్డెన్‌లెగ్ చారీ ఎదురయ్యాడు.

"ఎవరు కావాలండి?" అడిగాడు గోల్డెన్‌లెగ్.

"రామబ్రహ్మం."

"సినిమాలు లేవుగదా... ఇంట్లోనే వున్నాడు. తను నటించిన పాత సినిమాలు చూస్కుంటూ... 'ఉందిలే మంచికాలం ముందు ముందున' అని పాట పాడుకుంటున్నాడు. అతగాడేకదు... సినిమా ఇండస్ట్రీలో మిగతా వాళ్ళ పరిస్థితి కూడా అంతేలెండి ఈరోజు."

"నువ్వెక్కువ మాట్లాడుతున్నావనుకుంటాను" ఆ నలుగురుర్లో ఒక వ్యక్తి అన్నాడు. అతని ముఖంవైపు చూసి–

"మీరు ప్రొడ్యూసర్లా? చెప్పొస్తాను. విజిటర్స్ రూంలో కూర్చోండి" అని లోపలికెళ్ళాడు.

ఆ నలుగురూ విజిటర్స్ రూంలోకి ప్రవేశించారు. ఒక వ్యక్తి మాత్రమే కూర్చోగా, మిగతావాళ్ళు నిలబడ్డారు.

రామబ్రహ్మం లాల్చీ చేతుల్ని పైకి మడతబెట్టుకుంటూ, లోపల్నుంచి విజిటర్స్ రూంలోకొచ్చి–

"ఆc... చెప్పండి" అని అన్నాడు.

"ఇవాళ షూటింగ్ లేదా?" అని అడిగాడు కిషోర్‌దాస్.

"లేదు."

"రేపు?"

"రేపు కూడా లేదు."

"ఎల్లుండి?"

"ఈ వారం లేదయ్యా! సినిమాలు లేవని నేనేడుస్తుంటే నువ్వెవడి వయ్యా బాబూ... తీరుబడిగా వచ్చి యోగక్షేమాలడుగుతున్నావ్! అవునూ... ఇంతకీ మీరెవరు! ప్రొడక్షన్ మేనేజర్లా?"

"వచ్చేవారం...."

"వచ్చేవారం... ఒక్కరోజు వుంది. ఆ నేడే విడుదల... చిన్న హ్యూమర్ బిట్, ఇంతకీ మీరెవరు?"

"ఆ నేడే విడుదల షూటింగ్ ఇప్పుడు ఎక్కడ జరుగుతోంది?"

"నర్సాపూర్ అడవుల్లో.'

"మేం అక్కడనుంచి వస్తున్నాం. గొంతులెండిపోయాయి. ముందు నాలుగు బాటిల్స్ ఐస్ వాటర్ ఇవ్వు."

"అక్కడ్నుంచే వస్తున్నారా... షూటింగ్ బాగా జరుగుతోందన్న మాట."

"అది అడగడానికే వచ్చాం... ముందు నాలుగు బాటిల్స్ ఐస్ వాటర్ యివ్వు."

"కరెంట్ లేదు. ఐస్‌వాటర్ లేదు" చెప్పాడు రామబ్రహ్మం.

"ఆ ఫ్రిజ్‌ని పాత సామాన్లవాడికి అమ్మేయ్."

"నర్సపూర్ అడవులంటారు... ఐస్ వాటరంటారు... పాత సామాన్లు అంటారు. ఇంతకీ మీరెవరండి?"

"చూడు బ్రహ్మాం...." ఆ పిలుపుకి కోపం వచ్చింది – రామబ్రహ్మానికి.

బ్రహ్మాం అంటే మా ఏరియాలో ఇళ్ళు కట్టే మేస్త్రీ పేరు. నా పేరు రామ బ్రహ్మాం. కమేడియన్‌ని."

"అదేలే... చెప్పుకింద బల్లి... తనికెళ్ళ భరణి చెయ్యాలి మళ్ళీ మళ్ళీ చెల్లి పెళ్ళి" ఒకడన్నాడు.

"అదేటండీ... మీరెందుకొచ్చారంటుంటే బల్లి... చెల్లి పెళ్ళి అంటా రేమిటి" ఆశ్చర్యపోయాడు రామబ్రహ్మాం.

"ఇప్పుడు నేడే విడుదల సినిమా షూటింగ్ ఎక్కడ జరుగుతోంది...?"

"చెప్పానుకదా!"

"లేదు. అక్కడేం జరగడంలేదు. కొండలన్నీ వెతికొచ్చాం."

"కేన్సిలైందేమో!"

"డైరెక్టర్, రైటర్, ఇళ్ళల్లో లేరు. హీరోయిన్ లేదు. కెమెరామేన్ లేడు. మిగతా టెక్నీషియన్స్ కూడా లేరు. అంచేత అందరూ ఎక్కడో షూటింగ్‌లో వుండుంటారు."

"నిన్ను కనుక్కుంటే తెల్సిపోతుంది కదా" అన్నాడు అరవింద్.

"నాకూ తెలీదు."

"ఏంటీ నీకు తెలీదా...?" అంటూ అరవింద్ కిషోర్‌దాస్ వైపు చూశాడు. కిషోర్‌దాస్ ఠీవిగా ముందుకెళ్ళి, గ్లాస్ టీపాయ్‌ని రెండు చేతుల్తో పైకెత్తి గోడకేసి కొట్టాడు. అది భళ్ళున పగిలిపోయింది.

"వీళ్ళు రౌడీల్లా వున్నారు. ప్రొడక్షన్ మేనేజర్లు కాదనుకుంటాను" గోల్డెన్‌లెగ్ చారి భయం భయంగా అన్నాడు.

"ఆ విషయం వీళ్ళు ఇక్కడికి రాకముందు నాకు చెప్పాలి" అని ముత్యాల ముగ్గులో కాకరాలని రావుగోపాలరావు కొట్టిన స్టయిల్లో రామబ్రహ్మాం గోల్డెన్ లెగ్ చారిని కొట్టాడు.

"మర్యాదగా చెప్తావా లేదా?" కిషోర్‌దాస్ అడిగాడు.

"మర్యాదంటే ఇదా... ఆ టీపాయ ఖరీదు ఐదువేలు" ఏడుపు ముఖం పెట్టాడు రామబ్రహ్మాం.

కిషోర్‌దాస్ గోడ కర్టెన్‌వైపు వెళ్ళి, ఆ కర్టెన్‌ని సర్రుమని లాగి, వుండ చుట్టి, కిటికీలోంచి రోడ్‌మీదకి విసిరేశాడు.

ఆ ఇంటిలోంచి కర్టెన్లు పడుతున్నాయ్...." అనుకుంటూ కళ్ళు చిదంబరం లాంటి రోడ్‌సైడ్ లాండ్రీమేన్ ఆ కర్టెన్‌ని తీసుకుని, ఇంకొకటి పడుతుందేమోనని అక్కడే నుంచున్నాడు ఆశగా.

"ఆ కర్టెన్ ఖరీదు రెండువేలు...." గోల్డెన్‌లెగ్ అన్నాడు ఏడుపు మొహంతో.

"చెప్తావా... లేదా?"

"ఇప్పుడు నాకర్థమైంది మీరెవరో – ఆ స్క్రిప్టు ఎత్తుకెళ్ళింది... మీరేనా? నిజంగా నాకు తెలీదు. మీ సెల్ నెంబరివ్వండి. తెలిస్తే చెప్తాను" ప్రాధేయపడ్డాడు రామబ్రహ్మం.

"వారం రోజుల తర్వాత జరిగే నేడే విడుదల సినిమా షూటింగ్‌కి నువ్వు వెళ్ళకూడదు. వెళ్లావని తెల్సిందో సఫా అయిపోతావ్... అర్థమైందా?" అని లేచాడు అరవింద్.

నలుగురూ విసురుగా బైటకొచ్చి జీపెక్కారు.

వాళ్ళు వెళ్ళిపోగానే రామబ్రహ్మం, గోల్డెన్‌లెగ్ చారిని నాలుగు ఉతుకులు వుతికారు.

"ఎందుకండయ్యా అలా కొడతారు కారణం లేకుండా?"

"వాళ్ళు టీపాయ్‌ని కుదేసి, కర్టెన్ లాగేస్తుంటే, కళ్ళప్పగించి చూస్తావేరా ఇడియట్" అన్నాడతను.

"మీరూ అలాగే చూస్తున్నారు కదండయ్యా" అన్నాడు గోల్డెన్ లెగ్ చారి బిత్తరపోతూ.

* * * * *

ఆరోజు సాయంత్రం ఆరుగంటలకల్లా షూటింగ్ అయిపోయింది. గెస్ట్‌హౌస్‌కొచ్చి స్నానం చేసి, డ్రెస్ ఛేంజ్ చేసుకుని రూంలోంచి బైటికొచ్చింది బృంద.

డైరెక్టర్ ప్రదీప్, కెమెరామెన్ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రామ్‌కాశ్యప్, విశ్వనాథ్ సైట్ సీయింగ్‌కి వెళ్ళారు.

రచయిత సూర్యవంశీ కోసం ఆమె కళ్ళు వెతుకుతున్నాయి.

"సూర్యవంశీ ఎక్కడ?" అడిగింది డైరెక్టర్ని బృంద.

"ఈ అడవి బాగా నచ్చిందతనికి... బహుశా జలపాతం దగ్గరున్న కొండమీద కెళ్ళుంటాడు...." అన్నాడు ప్రదీప్.

"నేనూ అలా వెళ్ళొస్తాను...." ముందుకు నడుస్తూ అంది బృంద. అక్కడక్కడ చెట్లచాటునున్న కమెండోస్ ఆమెను రహస్యంగా అనుసరించసాగారు.

* * * * *

బారులు, బారులుగా కొండలు... ఆ కొండల వెనుక నున్న ఆకుపచ్చ ప్రకృతి... దూరంగా జలపాతం... పరిగెడుతూ వెళుతున్న లేళ్ళు... గుంపులు, గుంపులుగా ఎగురుతున్న పక్షులు... రాగాలు తీస్తున్న గాలిసందళ్ళు... మనోహరంగా వుంది ప్రకృతి రమణీయత.

తెల్లటి కుర్తా, పైజమా... పెరిగిన చిన్న గెడ్డం... కళ్ళకు కళ్ళజోడు... వంకీలు తిరిగి గాలికెగురుతున్న జుత్తు-

కొండమీద కూర్చొని ప్రకృతి వేపే చూస్తున్నాడు సూర్యవంశీ.

ఆ ప్రకృతి ప్రతి అందంలోనూ, బృంద కన్పిస్తోందతనికి.

చాలాకాలం బృందను, సూర్యవంశీ హీరోయిన్‌గానే చూశాడు. ఆ తర్వాత ఆమె అందం జ్ఞాపకం వచ్చినపుడల్లా, ఆమెలో అమ్మాయిని చూశాడు. తనతో మాట్లాడిన సందర్భాల్లో ఆమె సున్నితమైన మనసును చూసాడు. ఆ మనసు వెనుక ప్రేమను చూశాడు. హాస్పటల్లో ఆమెతో సన్నిహితంగా మాట్లాడిన తర్వాత ఆమెలో తన ప్రేయసిని చూస్కుంటున్నాడు.

అవును... బృందను ప్రేమిస్తున్నాడు... కాదు ఆరాధిస్తున్నాడు.

తన ప్రేమను ఆమెకెలా తెలియజేయడం?

అందుకే ఒక ఉత్తరాన్ని వ్రాయాలని నిర్ణయించుకున్నాడు.

ప్యాడ్‌ని అందుకుని మొదలెట్టాడు.

"డియర్ బృందా!

నాకు సంఘటనలను ఎనలైజ్ చేయడం తెల్సు. కానీ మనసుని ఎనలైజ్ చేయడం తెలీదు. అందుకే ఇన్నాళ్ళూ నా మనసుని నేను ఎనలైజ్ చేస్కోలేక

పోయాను. గత రెండు రోజులుగా నాకెందుకో రాత్రి పూట నిద్ర పట్టడంలేదు. కలకాదు, భ్రాంతి కాదు. కలత నిదుర.... ఆ నిదురలో ఏవో ఊహలు...

ఆ ఊహలనిండా బృందే... అంటే నువ్వే.

ఒక మనిషిని, ఇంకో మనిషి ప్రేమించడం అనేది గొప్ప రసాయనిక చర్యే! కానీ అది ఏ లేబరేటరీలో జరగని రసాయనికి చర్య!

నా ఫీలింగ్స్, నా అంతస్తు, నా జీవన విధానం మీకు తెల్సు.

కానీ మీ గురించే నాకు తెలీదు. మీ బ్యాక్‌గ్రౌండ్ గురించి తెలీక పోయినా, గొప్ప ఇండస్ట్రీయలిస్ట్ మీకు ఆప్తులు- మీరు కోటీశ్వరురాలు- యాదృచ్ఛికంగా సినిమాల్లోకి వచ్చారు - సరదాగా మీరు సినిమాల్లో నటించేసి వెళ్ళిపోతారు. కానీ మీలాంటి నటి ఇండస్ట్రీకి కావాలి. కలకాలం ఇండస్ట్రీలో వుండాలి... ఇందులో నా స్వార్థం ఏమిటో తెలుసా?

ఆ నటికి నేను భర్తను కావాలని...

సూటిగా చెపుతున్నాను ఏమీ అనుకోకండి...

ఇద్దరు అర్టిస్టులు ఒకచోట కలిసిబతికితే... చాలా అద్భుతంగా వారి జీవితం వుంటుంది.

ఆర్టిస్టులంటే సినిమా ఆర్టిస్టులే కాదు... రచయితలు, కవులు, పెయింటర్స్, ఇన్‌స్ట్రుమెంటల్ స్పెషలిస్ట్స్... ఇంకా...

తిండీ తిప్పలు లేకుండా... కలం మనోరథంలో కూర్చొని, కాంక్షా భరిత స్వప్నాల్నికంటూ... మిమ్మల్ని నేను ముద్దుపెట్టుకుంటూ... నన్ను మీరు కౌగిలించుకుంటూ-

జీవితాన్ని వెన్నెల జలపాతంలా చేసుకుంటే... ఎంత బాగుంటుంది. ప్రేమించే స్త్రీ పక్కన పూలబాటలో నడుస్తుంటే ఎంత బావుంటుంది!

పైనుంచి వర్షిస్తున్న చినుకులతోపాటు, కిందకు రాలుతున్న గుల్‌మొహల్ పూలమొక్కల గుబాళింపుల మధ్య చిక్కుకున్న వెన్నెల్లో, మంచులో పచ్చని పచ్చిక మీద-

మీమీద చెయ్యి వేసుకొని నేను...

నిన్న రాత్రి నా కొచ్చిన కల ఇది.

ఆ స్వప్నం నిజమైతే ఎంత బావుంటుంది.

మీకు తలుచుకుంటే, నా స్వప్నాన్ని నిజం చెయ్యగలరు.

అవును...

జీవితం ఒక చివర ఆనందం... ఒక చివర నిషాదం.

దేన్నయినా మనిషి తట్టుకోవాలి...

నేను మధ్యలో వున్నాను...

భిక్షాపాత్ర పట్టుకొని గాలిబ్‌లా నుంచున్నాను... నా పాత్రలో మీరు నాకు ఆనందాన్నిస్తారా? విషాన్నిస్తారా... అని వ్రాసి ఆపాడు సూర్యవంశీ...

"మీరిక్కడున్నారా...." చటుక్కున తలతిప్పి చూశాడు.

బృంద...

చప్పున ప్యాడ్‌మీద పేపర్‌ని తీసి, మడతలు పెట్టసాగాడు.

"ఏదో రాసుకుంటున్నట్టున్నారు... డిస్టర్బ్ చేశానా?" అంటూ అతనికి కొంచెం దూరంలో కూర్చుందామె.

లేతాకు పచ్చ చీర, జాకెట్, నుదుటి మధ్య ఆకుపచ్చటి బొట్టు, నుదుటి మీరు పడుతున్న ముంగురులు...

"లేదు...." అన్నాడతను ఆమె కళ్ళలోకి చూస్తూ.

"ఇలాంటి అడవుల్లో ఒక గుడిసె వేసుకొని ఉండిపోతే బావుంటుంది...." అందామె తన్మయంగా.

"ఉండిపోదామా...." అన్నాడు ఆశగా సూర్యవంశీ.

"మనిద్దరమూనా...." విచిత్రంగా సూర్యవంశీ కనురెప్పలవైపు చూస్తూ అంది బృంద.

"తప్పా...." అన్నాడతను.

"వుంటే మీ భార్యతో వుండాలి గదా...." అంటూ లేచి ముందుకెళ్ళింది బృంద.

ఏదో చెప్పాలనుకొని, చెప్పలేకపోయాడు సూర్యవంశీ.

నెమ్మదిగా ఆకాశంలో సూర్యుడు మాయమైపోయాడు.

మబ్బులు చీకటి ముద్దల్లా మారిపోయాయి.

అడవిలో చీకటి అందంగా వుంటుంది! అదే సమయంలో భయంగా కూడా వుంటుంది.

"వెళదామా...." అందామె.

"ఏం...."

"చలిగాలేదూ...."

అవును చలిగా వుంది...." అంటూ లేచి ముందుకడుగేశాడు. సన్నటి కాలిబాట... పక్క పక్కన నడుస్తున్నారు.

పైనుంచి హఠాత్తుగా ఎండిపోయిన కొమ్మ ఒకటి వచ్చి బృందమీద పడడంతో కెవ్వున భయంతో అరిచి, తూలి సూర్యవంశీ మీద పడింది.

విసురుకి సూర్యవంశీ మట్టిమీద పడబోయాడు. అతని గుండెలమీద బృంద.

బృంద ముక్కుపుటాల్లోంచి వస్తున్న ఉచ్ఛ్వాస, విశ్వాసలు అతని బుగ్గలకు తాకుతున్నాయి.

ఆమె ఎత్తయిన ఎదభాగం మెత్త, మెత్తగా అతని గుండెలకు తగులుతూ గిలిగింతలు పెడుతోంది.

అతని మీసాలు, ఆమె ముఖానికి తగులుతున్నాయి.

ఇద్దరి మనసుల్లో మాటలకందని మనో ప్రకంపనలు.

"సారీ...." అంటూ లేచింది బృంద.

"దేనికి?" అన్నాడు చిర్నవ్వు నవ్వుతూ.

గెస్ట్‌హౌస్ వచ్చేవరకూ ఇద్దరి మధ్యా మాటల్లేవు. మౌనంగా రూమ్‌లో కెళుతూ తలతిప్పి సూర్యవంశీ వైపు చూసిందామె.

అతను ఆమెవేపే చూస్తున్నాడు.

* * * * *

రాత్రి పదిగంటలు...

రామ్‌కాశ్యప్ ఎదురుగా మదన్ వున్నాడు. తన చేతిలో వున్న ఫోటోలో, మంజరిని చూపిస్తూ "ఈ ఫోటో ఏ మేరకు ఎన్‌లార్జ్ అవుతుంది?..." అడిగాడు రామ్‌కాశ్యప్.

"బహుశా క్యాబినెట్ సైజుకి."

"స్పష్టంగా ఫీచర్స్ అన్నీ కల్పిస్తాయి కదా?"

"కన్పిస్తాయి సార్."

"ముందు మంజరి ఫోటోను ఎన్‌లార్జ్ చేయించి, దాన్ని నెగిటివ్ తీయించండి... ఆ నెగిటివ్‌లోంచి వంద ప్రింట్స్ ఫోటోలు కావాలి."

"వంద ప్రింట్స్ మంజరి ఫోటోలా?" ఆశ్చర్యంగా అడిగాడు మదన్ తనే మళ్ళీ...." వంద ఫోటోలెందుకు సార్?" అన్నాడు.

రామ్‌కాశ్యప్ ఎందుకో చెప్పాడు.

"రేపు జలపాతం దగ్గర ఎనిమిది గంటలకు షూటింగ్... ఎన్ని గంటలవుతుందో తెలీదు... అంటే నేను, బృంద... ఎల్లుండొస్తాం. అప్పటికి నువ్వు చెయ్యాల్సిన పని...." అంటూ ఏం పని చెయ్యాలో చెప్పాడు అతను.

"అలాగే సార్" చెప్పాడు మదన్.

"నువ్వు రాత్రికి హైద్రాబాద్ వెళ్ళిపో... అంతా పక్కాగా జరగాలి" చెప్పాడు రామ్‌కాశ్యప్.

మదన్ వెళ్ళిపోయాక అడిగాడు విశ్వనాద్–

"మీరు చేపడుతున్న చర్యల వలన... ఈ వారంలోనే బృంద... మామూలు మనిషయ్యే అవకాశాలున్నాయి. తర్వాత...."

"తర్వాత నేనేం చేస్తాను? తన జీవితాన్ని సరిదిద్దుకోగలిగే ఆత్మస్థయిర్యం ఆమెకొస్తే నా కృతజ్ఞత నెరవేరినట్టే" అన్నాడతను.

చాలా రోజుల్నుంచి తగిన సమయం కోసమే చూస్తున్న సైకియాట్రిస్టు విశ్వనాథ్ ఆ సమయంలో ఒక ప్రశ్న వేశాడు.

"చాలాసార్లు చెప్తానన్నారు... మీ ప్రాణాలను బృంద ఎలా కాపాడింది?"

తలపంకించి–కొన్ని నిమిషాలు ఆలోచనల్లో గడిపి–

"ఈ టైములోనే మీకు చెపితే మంచిదనుకుంటాను...." అన్నాడు.

చెప్పండం ప్రారంభించాడు రామ్‌కాశ్వప్–

"ఎగ్జాట్‌గా నాకు గుర్తులేదు. ఆరోజు జనవరి ఫోర్టీన్త్ అనుకుంటాను.

తిరుపతిలో ఓ ఫ్రెండ్ కొడుకు పెళ్ళికెళ్ళి కారులో వస్తున్నాను... కారు కర్నూలు దాటింది. నేషనల్ హైవే. కారును నూటపది, నూటిరవై కిలోమీటర్ల వేగంతో డ్రయివ్ చేస్తున్నాడు డ్రయివర్. అంత స్పీడ్ వద్దు అని అప్పటికీ చెప్పాను. డ్రయివర్ రజాక్ వినలేదు. ఒక కొండ, కొండ పక్కనుంచి దారి... అక్కడ కారు మలుపు తిరుగుతున్న మౌనంగా వుండి తిరిగి చెప్పటం ప్రారంభించాడు.

"కళ్ళు తెరిస్తే హాస్పటల్లో వున్నాను. కళ్ళిప్పగానే కనిపంచిన ముఖాన్ని చూడగానే నాకు భయమేసింది. రెండు చేతుల్తో కళ్ళు మూసుకుని గో ఎవే... గో ఎవే అని అరిచాను. నా ఎదురుగా వున్న వ్యక్తి ముఖం బాగా కాలిపోయి వుంది.

ఆ వ్యక్తి బృంద.

కానీ కాసేపయ్యాక డాక్టర్ చెప్పిన విషయాలను నేనెంతో ఆశ్చర్య పోయాను. ఆ రోజు రాత్రి రెండుగంటల సమయంలో నేనొస్తున్న కారును అంతకన్నా ఎక్కువ స్పీడ్‌తో వస్తున్న లారీ ఢీకొంది. నా కారు లోయలో పడింది. కారు తునాతునకలైపోయింది. డ్రయివర్ రజాక్ అక్కడి కక్కడే చనిపోయాడు. నేను కొన ఊపిరితో రోడ్ పక్కన తుప్పలో పడ్డాను...

కాస్త స్పృహతో నన్ను రక్షించమని, వెళ్ళిపోతున్న లారీల్ని, కారులవేపు చూసూత అరిచాను. ఏ ఒక్కరూ... ఏ ఒక్కరూ... నన్ను పట్టించుకోలేదు. ఒళ్ళంతా రక్తం... బయట ప్రపంచానికి నేను కరోర్‌పతి రామ్‌కాశ్యప్‌ని. కాని ఆ క్షణంలో నేను దయనీమైన మనిషిని... నా ప్రాణాల్ని రక్షించమని ఎలుగెత్తి అరిచిన మనిషిని... అరిచి అరిచి నేను స్పృహ కోల్పోయాను.

అక్కడ ఆ రోడ్ పక్కన జీవచ్ఛవంలా నేను ఎన్ని గంటలు వున్నానో తెలీదు. తెల్లవారుఝామున అయిదు గంటల ప్రాంతంలో నన్ను చూసింది బృంద... ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. పది కిలోమీటర్లు నడిచి, కర్నూలు వెళ్ళి ఒకటాక్సీ తెచ్చింది. హైద్రాబాద్ అపోలో హాస్పటల్‌కి తీసుకొచ్చింది. డాక్టర్‌కు నేనెవరో ఆ సమయంలో తెలియకపోవడంవల్ల, అడ్మిషన్ చేసుకోకపోతే, తన దగ్గరున్న వెయ్యిరూపాయలని, రెండు బంగారు గాజుల్ని అమ్మి, ఆ మొత్తాన్ని కొంతమందికి లంచంగా ఇచ్చింది.

అక్కడ నేను చేరిన అయిదు రోజుల తర్వాత, నన్ను చూసి ఒక డాక్టర్ గుర్తుపట్టడంతో బయటి ప్రపంచానికి ఈ వార్త తెల్సింది. ఆ ఐదు రోజులు బృంద కన్నతల్లిలా నన్ను చూసుకుంది.

నేనెవరు? ఆమెకు నేనేమౌతాను? మిగతావాళ్ళలాగే ఆమె కూడా నన్ను చూసి మనకెందుకులే అని వెళ్ళిపోతే...

నేను ఆ క్షణంలో చనిపోయేవాడ్ని...

నో డౌట్...

లిటరల్‌గా మృత్యువునుంచి రక్షించిన నా ప్రాణదాత... బృంద... ఒక మనిషి ఆనందంతో వున్నప్పుడు పలకరించటం కాదు. దుఃఖంలో వున్నప్పుడు. బాధలో వున్నప్పుడు, అనారోగ్యగంగా వున్నప్పుడు, రోడ్డుపై వున్నప్పుడు ఆదుకోవడమే మానవత్వానికి నిదర్శనం.

నిజమైన పుణ్యమంటే అదే!

అందుకే నేను కోలుకున్న మరుక్షణం ఆమెకు కాస్మటిక్ సర్జరీ చేయించాను... మా(ద్రాస్‌లో.

ఆమెను మళ్ళీ మనిషిగా చెయ్యటానికి అనుక్షణం ప్రయత్నిస్తున్నాను... ఇది కేవలం కృతజ్ఞత కాదు... కనీస మానవధర్మం కూడా...." ముగించాడు రామ్‌కాశ్యవ్.

"ఈ సంఘటన ఇంతకు పూర్వమే నాకు తెల్సుంటే బావుండేది."

"ఏం?"

"మీరొక్కసారి ఆ రోజును జ్ఞాపకం చేస్కోండి... నేను వేసే ప్రశ్నలకు, మీకు తెల్సిన జవాబులు చెప్పండి."

"అడగండి."

"ఆమె పాత జ్ఞాపకాలన్నీ మర్చిపోయింది అనుకుంటున్నాం గదా? మీరు కల్సిన నాటికే ఆమె పరిస్థితి అలా ఉందా?"

"అవును... అప్పటికే ఆమె తన జీవితానికి సంబంధించిన ఏ సంఘటననూ చెప్పలేకపోయింది."

"మరి ఆమె పేరు బృంద అని మీకెలా తెల్సు?"

"గుడ్ క్వశ్చన్" అంటూ నవ్వాడు రామ్‌కాశ్యవ్.

"మాకు కూతురు పుడితే 'బృందావని' అని పేరు పెట్టుకుందామని చనిపోయిన మా ఆవిడ అంటుండేది. అది మా అత్తగారి పేరు. నీ పేరేం పేరు అని అడిగినప్పుడు 'తెలీదు' అని జవాబు చెప్పిన ఆమెని చూశాక 'నిన్ను నేను బృంద' అని పిలుస్తాను సరేనా అని అన్నాను. అందుకొప్పుకుందామె" చెప్పాడు రామ్‌కాశ్యవ్.

"ఆ సమయంలో... అదే మీరు ఆక్సిడెంట్‌కు గురైన సమయంలో తెల్లవారు ఝామున సమయంలో అక్కడికెందుకొచ్చింది బృంద?"

"అవును... ఈ పాయింట్‌ను నేనెప్పుడూ ఎందుకాలోచించలేదు?" బయటికే అన్నాడు రామ్‌కాశ్యవ్.

"నేను మిమ్మల్ని చావుబ్రతుకుల్లో చూశాను. రక్షించాలనిపించింది. నాకు తోచినపని చేశాను... అని ఒకసారి చెప్పింది బృంద" చెప్పాడు రామ్‌కాశ్యవ్.

"యాక్సిడెంట్ జరిగిన ప్రదేశం... హైదరబాద్, కర్నూలు నేషనల్ హైవే... ఆ ప్లేస్ కర్నూలుకి ఎంత దూరంలో వుంది?"

"బహుశా తొమ్మిది, పది కిలోమీటర్లు."

ఆలోచనలో పడ్డాడు విశ్వనాథ్.

"ఏంటాలోచిస్తున్నారు?" అడిగాడు రామ్‌కాశ్యవ్.

"మీరు అనుమతిస్తే రేపు నేను ఆ ప్లేస్‌కి వెళతాను... బృంద... అదే మంజరి ఫోటో తీస్కొని...."

"ఏదయినా ఇన్‌ఫర్మేషన్ దొరుకుతుందనుకుంటున్నారా?"

"ప్రయత్నం చెయ్యడంలో తప్పులేదుకదా...."

ఆ రాత్రి డిస్కషన్ అక్కడితో ఆగిపోయింది. మర్నాడు విశ్వనాథ్ హైదరాబాద్ బయలుదేరాడు.

* * * * *

హీరోయిన్ బృంద మీద మాత్రమే చిత్రీకరిస్తున్న సోలో సాంగ్‌లో కొన్ని బిట్స్ చిత్రీకరణ పగలు జరిగింది.

కీలకమైన సన్నివేశానికి సంబంధించిన షూటింగ్ రాత్రి ఎనిమిది గంటల నుంచి ప్రారంభమౌతుంది.

మద్రాస్ నుంచి మర్నాడుదయం తొమ్మిదిగంటలకు వచ్చిన మేకప్ మాన్, తనతోపాటు ఒక తమిళ మేకప్‌మాన్‌ని కూడా తీసుకొచ్చారు.

“ఈ మేకప్‌మేన్ భారతీయుడు సినిమాలో, పనిచేసిన వ్యక్తి. ఫేస్ మేకప్‌లో ఎక్స్‌పర్ట్... భారతీయుడు సినిమాలో అమెరికన్ మేకప్‌మేన్‌తో పనిచెయ్యడమే కాకుండా చాలా శివాజీగణేశన్ సినిమాలకి పని చేసాడు” పరిచయం చేశాడు తమిళ మేకప్‌మేన్‌ని... రామ్‌కాశ్యప్‌కి...

అతడి పేరు వడివేలు...

మధ్యాహ్నం ఒంటిగంట నుంచే, ఆ జూనియర్ ఆర్టిస్ట్ బృంద ఉరఫ్ మంజరి అక్క రాజేశ్వరికి మేకప్ వెయ్యడం ప్రారంభమైంది. ఆ రూమ్‌లోకి మరెవ్వరూ వెళ్ళకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశాడు రామ్‌కాశ్యప్.

* * * * *

తను ‘రఫ్’గా రాసుకున్న ప్రేమలేఖను అందంగా ‘ఫెయిర్’ చేశాడు సూర్యవంశీ. షూటింగ్ రాత్రి పదిగంటలకు అయిపోతుంది. ఆ తర్వాత కారులో బయలుదేరుతుంది బృంద. అదే కారులో ఆమెతో ప్రయాణం చేస్తున్నప్పుడు ఆ లెటర్‌ని ఆమెకివ్వాలి. ఇంటికెళ్ళాక చదువుకోమని చెప్పాలి.

అక్కడే చదివితే, ఆమె రియాక్షన్ ఎలా వుంటుంది...?

తనలోని భావుకత్వాన్ని ఇష్టపడే బృంద, తన ప్రేమను తిరస్కరించదనే నమ్మకం సూర్యవంశీకుంది.

ఆ లెటర్‌ని తెల్లటి కవర్‌లో పెట్టి, గమ్‌తో అంటించి, కవర్‌పైన రోజ్ ఫ్లవర్‌బొమ్మని వేశాడు ప్రేమకు సింబల్‌గా...

ప్రేమకు గులాబీ పువ్వుని గుర్తుగా ఎందుకు చెప్తారు? ఒక సందేహం వచ్చింది. జవాబు అతనిక్కూడా తెలీదు.

* * * * *

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలు...

జలపాతానికి ఇరవై అడుగుల దూరం నుంచి అటూ, ఇటూ టెన్ కె.వి. లైట్స్‌ని ఏర్పాటు చేశారు. జలపాతం దగ్గర కొండమీద కొన్ని లైట్సున్నాయి. కెమెరా యాంగిల్స్ చూసుకొని డైరెక్టర్ ప్రదీప్ వేపు చూశాడు కెమెరామేన్.

దూరంగా కుర్చీల్లో రామ్‌కాశ్యప్, సూర్యవంశీ కూర్చునా

బృంద మేకప్‌తో అప్పుడే వచ్చి నిలబడింది.

"చూడమ్మా... సినిమాలో మీ అక్క... జీవితంమీద విరక్తితో ఇంట్లోంచి బయటికొచ్చి, జలపాతంవేపు దూసుకెళ్తుంది చనిపోవడానికి. నువ్వు ఆ దృశ్యాన్ని చూసి 'అక్కా' అని అరుచుకుంటూ వెళతావు. మీ అక్క కొండమీద నుంచి దూకడానికి సిద్ధంగా వున్న పరిస్థితిలో అటువేపున్న ఆమె ముఖాన్ని ఇటుతిప్పి, ఆమె భుజాలమీద చేతులువేసి కుదుపుతూ–

"అక్కా... తల్లి లేకపోయినా, ఇన్నాళ్ళూ తల్లిగా పెంచావు. నువ్వు కూడా ఆత్మహత్య చేసుకొని, నన్ను అనాధను చేస్తావా? అని అడుగుతావు. బిగ్గరగా ఏడుస్తూ ఆమెని కౌగిలించుకొంటావు. అదీ సీన్, అర్ధమైందా?"

అర్ధమైందన్నట్లు తలూపి అటూ ఇటూ చూసింది బృంద.

"ఎవరికోసం చూస్తున్నారు?" అడిగాడు డైరెక్టర్ ప్రదీప్.

"అక్క కేరెక్టర్ వేసే ఆర్టిస్ట్... ఏరీ?"

"మేకప్...."

"అవును! మధ్యాహ్నం నుంచి మేకప్ వేస్తున్నారా... ఆవిడకి?" అనుమానంగా అడిగింది బృంద.

ఆ ప్రశ్న విననటుటగా ముందు కెళ్ళిపోయాడు డైరెక్టర్ ప్రదీప్...

*   *   *   *   *

డైరెక్టర్ చెప్పినట్టుగా ఒక చెట్టుపక్కన నిలబడింది.

అడవిలో నలువైపులా దట్టమైన చీకటి.

లైట్ల వెలుగులో షూటింగ్ స్పాట్ వింతగా కన్పిస్తోంది.

మేకప్ రూంలోంచి బయటికొచ్చిన జూనియర్ ఆర్టిస్ట్ రాజేశ్వరి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి మసక చీకట్లో నిలబడింది.

"కెమెరా స్టార్ట్...." అరిచాడు ప్రదీప్.

చీకటిలోంచి వెలుగులోకి, వెలుగులోంచి జలపాతం దిశగా పరిగెడుతుంది రాజేశ్వరి. ఆమె సగం దూరం వెళ్ళగానే బృందవేపు చూసిన డైరెక్టర్ ప్రదీప్.

"బృంద... యాక్షన్...." అన్నాడు.

బృంద ఆగు... అక్కా ఆగు...."

ముందు రాజేశ్వరి, వెనక బృంద పరిగెడుతున్నారు.

మరో కొన్ని క్షణాల్లో ఏదో జరుగుతుంది. ఏం జరుగుతోందోదన్న దిగ్భ్రమతో, ఉద్వేగంతో కుర్చీలోంచి లేచాడు రామ్‌కాశ్యప్.

ఒకటి... రెండు... మూడు... నాలుగు... అయిదు... అయిదే ఐదు క్షణాలు...

జలపాతం దగ్గర కొండ అంచు దగ్గరికి వెళ్ళిన రాజేశ్వరి ముందు కడుగు వేయబోయింది.

అదే సమయంలో ఆమె భుజంమీద బృంద చెయ్యి పడింది.

"అక్కా... అక్కా... ఏంటిది...?"

రాజేశ్వరి భుజం పట్టుకొని, ఆమె ముఖాన్ని తన కుడిచేత్తో పట్టుకుని తనవేపు తిప్పుకొని.

డైలాగ్ చెప్పబోయిన బృంద... ఒక్కక్షణం... ఒక్కక్షణం... వేయి ఓల్టుల విద్యుత్ షాక్‌కి గురైనట్టుగా మ్రాన్పడిపోయింది.

అక్క...

తన స్వంత అక్క రాజేశ్వరి...

ఇది సినిమా షూటింగా... నిజమా?

"అక్కా... నువ్వు... నువ్వు... బతికే వున్నావా?" గట్టిగా అరిచింది బృంద.

గబగబా ముందుకెళ్ళాడు రామ్‌కాశ్యప్.

"డోంట్ డిస్ట్రబ్... డోంట్ డిస్ట్రబ్ హర్... ప్లీజ్ మెయిన్‌టైన్ సైలెన్స్" డైరెక్టర్ వేపు, సూర్యవంశీవేపు చూస్తూ అన్నాడు. కెమెరామేన్‌కి కాని, లైట్‌బాయిస్‌కి కానీ ఏమీ అర్థంకావడంలేదు. కెమెరా రన్ అవుతూనే వుంది.

"అక్కా! నువ్వు బతికే వున్నావా?" భోరుమని ఏడుస్తూ ప్రశ్నించింది బృంద–ఆమె కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంలా...

"అక్కా! నేను మంజరిని. మంజరిని...."

ఏదో అచేతనాశక్తి తనలో ప్రవేశించినట్టుగా...

ఏదో పాత జ్ఞాపకాలన్నీ ఒక్కసారి ఉమ్మడిగా ఆమె మస్తిష్కంలోకి ప్రవేశించినట్టుగా–

"అక్కా! మన బాబు... నీ కొడుకుని... నువ్వు చెప్పినట్టుగానే ఊటీ స్కూల్లో చేర్పించాను. చదువుకొంటున్నాడు. వాడు... ఎంత పొడవయ్యాడో తెల్సా?

అక్కా! నువ్వు నన్ను గుర్తుపట్టలేదా?

నేను మంజరిని, నీ మంజరిని...." రాజేశ్వరి కాళ్ళదగ్గర కుప్పకూలిపోయి ఏడుస్తోంది బృంద....

సరిగ్గా అదే సమయంలో అక్కడికొచ్చిన రామ్‌కాశ్యప్, రాజేశ్వరి పాత్ర వేసిన ఆర్టిస్టుకి అక్కడ్నుంచి వెళ్ళిపొమ్మని సంజ్ఞ చేయగానే, ఆమె గబగబా చీకట్లో వెళ్ళిపోయింది.

అయిదు సెకండ్ల తర్వాత తలెత్తిచూసిన బృందకు అక్క కనిపంచలేదు. ఎదురుగా రామ్‌కాశ్యప్ కన్పించాడు.

దిగ్గున లేచిందామె.

"అంకుల్... మా అక్క... మా రాజేశ్వరి అక్క... ఇదిగో...." అంటూ అటూ ఇటూ చూసింది.

"ఆ జూనియర్ ఆర్టిస్ట్ మా అక్క అంకుల్... డైరెక్టర్‌గారు... సూర్యవంశీ గారూ... మా అక్క బతికే వుంది. చనిపోలేదు... నేను... బృందను కాదు. మంజరిని... అక్కా...." నలువైపులా చూస్తూ చీకట్లోంచి పరుగెత్తి కాళ్ళకు ఏదో బండరాయి తగలడంతో కింద పడిపోయింది మంజరి...

ఆ సంగటనని ఊహించని రామ్‌కాశ్యప్ ఆమెవైపు పరిగెత్తాడు. అచేతనంగా కిందపడిపోయిన బృంద నాడిని చూసి–

"షాక్‌కి గురైనట్టుంది... కారు తీస్కురండి... క్విక్... హాస్పిటల్ కెళ్ళాలి" అన్నాడు.

డైరెక్టర్ సహాయంతో రామ్‌కాశ్యప్ బృందని తీసుకొచ్చి కారులో ప్రదీప్, సూర్యవంశీ, కెమెరామెన్ బయలుదేరారు.

"ఏంటిసార్! ఇదంతా... సినిమాలో సినిమాలా వుంది" అయోమయంగా అడిగాడు కెమెరామెన్.

"బృంద మంజరిగా మారిపోయినట్టుంది" అన్నాడు సూర్యవంశీ.

"ఇప్పుడు మనల్ని గుర్తుపడుతుందా?" భయంగా అన్నాడు డైరెక్టర్.

మరో రెండున్నర గంటల తర్వాత–

వరంగల్‌లోని ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో వుంది మంజరి.

ఆమెకు అన్ని పరీక్షలూ జరిగాయి.

రామ్‌కాశ్యప్ చెప్పిన మేరకు డాక్టర్ శకుంతల ఫోన్‌లో ఆమె పరిస్థితిని, అక్కడి స్పెషలిస్ట్‌కి వివరించింది.

"షాక్‌కి గురై... స్పృహ కోల్పోయింది. రేపు మార్నింగ్ తీసుకెళ్ళిపోవచ్చు. కొన్ని రోజులు ఆమెకు రెస్ట్ అవసరం."

"ఆమెకి గతం గుర్తొస్తుందంటారా?" అడిగాడు రామ్‌కాశ్యప్.

"అక్కను గుర్తించినట్లుగా మాట్లాడిందన్నారుగా... చూద్దాం... రేపుదయం గానీ నేనే విషయం చెప్పలేను" అన్నాడు ఆ స్పెషలిస్ట్.

అప్పటికి రాత్రి మూడు గంటలు దాటింది.

* * * * *

ఉదయం సరిగ్గా ఏడు గంటలకు మెలకువ వచ్చింది బృందకు. ఎదురుగా నుంచున్న వ్యక్తులందర్నీ గుర్తుపట్టింది. నెమ్మదిగా లేచి కూర్చొని డాక్టర్ వేపు చూసిందామె.

"వీరెవరమ్మా!" రామ్‌కాశ్యప్‌ని చూపిస్తూ అడిగాడు డాక్టర్.

"అంకుల్... రామ్‌కాశ్యప్ అంకుల్" చెప్పిందామె.

"ఆయన..."

"డైరెక్టర్ సూర్యవంశీ."

"నీ పేరు?"

"బృంద" అంటూ రామ్‌కాశ్యప్‌వేపు చూసి–

"గతంలో మంజరి" అంది. ఆ మాటలకు రామ్‌కాశ్యప్ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"ఆర్యూ ఫీలింగ్ వీక్...."

"అవును డాక్టర్."

"గంటసేపు రెస్ట్‌తీసుకో. తర్వాత డిశ్చార్జి చేసేస్తాను" అంటూ ఆ రూంలోంచి డాక్టర్ బయటకొచ్చిన తన రూమ్‌లోకి నడిచాడు. ఆయనతో పాటు రామ్‌కాశ్యప్ కూడా వెళ్ళాడు.

"చూండి సార్! తన పేరు మంజరి అని ఆమె ఎప్పుడయితే చెప్పిందో, అప్పుడే ఆమెకు గతం గుర్తొచ్చిందని నమ్మకం. ఒక గంట తర్వాత ఆమెను హైద్రాబాద్ తీస్కెళ్ళిపోయింది. ఆమెకు కావల్సినంత రెస్ట్ ఇవ్వండి. ఆమె ఉద్దేశ్య పూర్వకంగా ఏమైనా చెప్తే వినండి. ఆమెకు ఏ మాత్రం టెన్షన్ కలిగించకండి. ఉద్వేగానికి, ఉద్రేకానికి గురికాకుండా చూడండి. ఏదైనా అవసరమొస్తే డాక్టర్ శకుంతల ఎటెండ్ అవుతారు. కాబట్టి ఇబ్బందిలేదు" చెప్పాడు ఆ డాక్టర్.

మరో గంట తర్వాత బృందకి హైద్రాబాద్ తీస్కెళ్ళిపోయారు.

* * * * *

హైద్రాబాద్, కర్నూలు మధ్య రామ్‌కాశ్యప్ చెప్పిన ప్రదేశంలో కారాపాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్.

విశాలమైన రోడ్డు, ఆ రోడ్డుకి చివర చిన్నపాక. ఆ పాక దగ్గరికి కారు పోనిచ్చాడు.

ఆ పాక చిన్న కాకా హోటల్. టీ సిగరెట్లు మాత్రమే దొరుకుతాయి. కారాపి పాకలోకి నడిచాడు. అక్కడ ఒక యాభై ఏళ్ళ వృద్ధుడున్నాడు.

"ఏం కావాలి బాబూ?"

"టీ కావాలి."

టీ ఇస్తున్న టైంలో అడిగాడు విశ్వనాథ్.

"ఈ రోడ్లో ఎక్కువ యాక్సిడెంట్స్ జరుగుతుంటాయా?"

"ఈ రోడ్‌లో తక్కువబాబూ... కుడివేపు మలుపు వుంది చూశారా! అక్కడ చాలా ఏక్సిడెంట్లు జరుగుతాయి. ఈ మధ్యలో ఒకబోర్డు పెట్టి, ప్రత్యేకంగా లైట్లు కూడా వేసిన దగ్గర్నించి యాక్సిడెంట్లు తగ్గాయి."

"ఈ సమీపంలో ఏదైనా వూరుందా?" అడిగాడు.

"ఆ మలుపుకి మూడు కిలోమీటర్లు వెళ్ళితే, ఒక చెరువు, ఆ చెరువు దాటితే కొండపల్లి గ్రామం" చెప్పాడతను.

ఎక్కడో ఏదో క్లూ దొరకవచ్చున్న ఆశ. టీ తాగి, పైసలిచ్చేసి, మలుపు దగ్గరికెళ్ళి కాసేపు పరిశీలించి, మూడు కిలోమీటర్లు లోపలికి చెరువు పక్కగా వెళ్ళాడు. అప్పుడు కనిపించింది. ఆ చెరువుకి, కొండపల్లి గ్రామానికి మధ్యన ఒక పాతకాలపు బిల్డింగ్.

ఇటీవల ఎవరూ వాడనట్లుగా వుంది ఆ బిల్డింగ్. ఆ బిల్డింగ్‌లో ఒకమూల చిన్నగదిలో వాచ్‌మేన్ వున్నాడు. ఆ వాచ్‌మేన్‌ని కలిశాడు విశ్వనాథ్.

అతని ప్రయత్నం వృథా కాలేదు.

* * * * *

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బయ్యర్స్‌కి, డిస్ట్రిబ్యూటర్స్‌కి ప్రసాద్ లాబ్‌లోని థియేటర్లో ఫిలిం యాడ్‌ని చూపించి, వాళ్ళందరూ వెళ్ళిపోయాక కారు దగ్గరకు నడుచుకుని వస్తున్నాడు డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ.

"పదిహేను రోజుల్లో డబ్బింగ్, రీరికార్డింగ్ పూర్తయిపోవాలి. సెన్సార్‌కు మరోవారం. అనుకున్న టైంకి రిలీజ్‌చేస్తే, మార్కెటల్లో మన బాసర్ వాల్యూ పెరుగుతుంది" అన్నాడు సూర్యవంశీ.

కారు పార్కింగ్ దగ్గరకొచ్చి డోర్ తియ్యబోయి ఆగిపోయాడు ప్రదీప్.

ఎదురుగా జీపు బోనెట్‌మీద కూర్చున్నాడు అరవింద్, ఆ పక్కన కిషోర్ దాస్.

"ఎక్కడ షూటింగ్ జరిగినా ఇక్కడకు రావల్సిందేగా... అందుకని...." వికృతంగా నవ్వాడు కిసోర్ దాస్.

డోరు తెరిచి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు ప్రదీప్, రెండో వేపుకి వెళుతున్న సూర్యవంశీ భుజం పట్టుకుని ఆపి–

"చూడండి... డైరెక్ట్రూ.. రైటరూ... ఇదే లాస్ట్ వార్నింగ్, తీసినంత వరకు తీశారు. ఇప్పటివరకూ ఎంత ఖర్చయింది సినిమాకి చెప్పండి. ఇంకో పాతిక లక్షలు అదనంగా ఇచ్చి తీస్కుంటాం" అంటూ చెక్‌బుక్ తీశాడు అరవింద్.

డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ ఒకరి మొఖాలొరు చూసుకున్నారు.

"ఇంకా షూటింగ్ బ్యాలెన్స్ వుంది. రీ రికార్డింగ్ వుంది" అన్నాడు సూర్యవంశీ.

"అవన్నీ మేం దగ్గరుండి చేయించుకుంటాం. కానీ... ముందు రేటు చెప్పండి. కోటి రూపాయలు చాలా" అన్నాడతను.

"మీకి సినిమా అంటే ఎందుకింత ఇంట్రెస్ట్? మా వెనకే పడ్డారు" అన్నాడు సూర్యవంశీ అసహనంగా.

"నువ్వు రాసిన కథ నచ్చిందని... అందుకే... ముందు రేటు చెప్పు" వ్యంగ్యంగా అన్నాడతను.

"సినిమా పూర్తయ్యాక రండి" అంటూ కారు స్టార్టుచేశాడు ప్రదీప్.

డ్రైవింగ్ సీటు దగ్గరున్న విండో దగ్గరకొచ్చి–

"దీసీజ్ లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్. సిటీలోని రౌడీలందరూ ఎక్కడ, ఎంత రహస్యంగా షూటింగ్ జరుగుతున్నా, రేపట్నుంచి పసికట్టేస్తారు. బాంబు లేసేస్తారు. ఆ మంజరితో చెప్పండి. ఈసారి నామరూపాలు లేకుండా అయి పోతుందని" అంటూ కారెక్కాడు అరవింద్.

ప్రదీప్ కారు స్టార్టు చేశాడు.

"మంజరికి, వీళ్ళకి వున్న లింకమిటో... నాకేమీ అర్థంకావడంలేదు" కారు ప్రసాద్ ల్యాబ్‌నుంచి రోడ్డుమీదకొచ్చాక అన్నాడు సూర్యవంశీ.

"మంజరికి గతమంతా గుర్తొచ్చిందికదా... ఇప్పుడు తెలుస్తుందేమో" అన్నాడు ప్రదీప్ గేరు మారుస్తూ.

* * * * *

ఇంటికి వచ్చాక బెడ్‌రూంలో నిస్త్రాణగా, మత్తు నిద్రలో వుడిపోయింది బృంద. మధ్యాహ్నం నాలుగు గంటలకు లేచి స్నానంచేసి, డ్రెస్ ఛేంజ్ చేసుకొని, లైట్‌గా టిఫిన్‌చేసి రామ్‌కాశ్యప్ కోసం వెలికింది.

"మీరు లేస్తే... పెద్దసార్... వీలైతే... ఆఫీస్‌కి ఫోన్ చేయమన్నారమ్మా" చెప్పింది పనిమనిషి.

వెంటనే ఫోన్ అందుకుని నెంబర్ ప్రెస్ చేసింది.

జనరల్ మేనేజర్‌తో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్న రామ్‌కాశ్యప్ ఫోన్ ఎత్తాడు.

బృంద... "అంకుల్ హౌ ఆర్యూ?" అంది హేపీగా.

బృంద ఫోన్ చేస్తుందని, అంత హేపీగా మాట్లాడుతుందని ఊహించని రామ్‌కాశ్యప్ ఆశ్చర్యానికి లోనై-

"సేమ్ టూ యూ" అన్నాడు.

"అంటే...?"

"హౌ ఆర్ యూ అని" నవ్వుతూ అన్నాడు.

"ఫైన్ అంకుల్... మీతో చాలా విషయాలు మాట్లాడాలి. ఎందుకో తెలుసా... గతంలో జరిగిన చాలా విషయాలు నాకు గుర్తొస్తున్నాయి. మనం ఒకచోటికి వెళ్ళబోతున్నాం" హుషారుగా చెప్పింది బృంద.

"సర్గిగా ఆరుగంటలకి వచ్చేస్తాను. సరేనా?" అన్నాడతను.

"అలాగే" అంటూ ఫోన్ పెట్టేసి, డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చి టీవీ ఆన్‌చేసి ఆలోచించసాగిందామె.

*     *     *     *     *

ఆరూ ఇరవై నిమిషాలయింది.

లాన్లో కూర్చున్న బృంద అడుగుల చప్పుడికి తలెత్తి చూసింది.

ఎదురుగా డైరెక్టర్ ప్రదీప్, రైటర్ సూర్యవంశీ...

అవకాశం దొరికినప్పుడు ఇవ్వటానికి సిద్ధంగా అతని చేబులో 'లవ్ లెటర్' వుంది.

"షూటింగ్ ఎప్పుడు మొదలెడుతున్నారు?" అడిగింది బృంద.

"రెండు కామెడీ సీన్లు, ఒక మెయిన్ సీన్ షూటింగ్ వుంది... ఫైనల్ సీన్‌లో మీరుండక్కర్లేదు. డూప్‌ని పెడదామని అనుకున్నాం కదా...."

"ఆ రేప్ సీన్ ఏదో అన్నారు... అదేనా?" క్యాజువల్‌గా అంది బృంద.

ఆ మాటను చెప్పటానికి వాళ్ళు మొహమాట పడ్డారు.

"అయిదు రోజుల తర్వాత మీరు డబ్బింగ్‌కొస్తే సరిపోతుంది."

"అయితే నా పార్ట్ షూటింగ్ అయిపోయినట్టేనా?" ఆశ్చర్యంగా అడిగింది బృంద.

"జెమినీ తదితర ఛానల్స్ కోసం స్పెషల్ ప్రోగ్రామం చేస్తున్నాం. దాని షూటింగ్ మానాఫీసులో వుంటుంది. ఫోన్ చేస్తాను... ఆ టైంకి మీరు వస్తే...." ఆగాడు ప్రదీప్.

"మీ ఆరోగ్యం...." అడిగాడు సూర్యవంశీ.

"అయాం... ఓకే... నౌ...థాంక్స్...."

ఆ సమయంలోనే లోనికొచ్చాడు రామ్‌కాశ్యప్, విశ్వనాథ్.

బృంద మామూలుకన్నా, చాలా సంతోషంగా వుండటం వాళ్ళిద్దరికీ చాలా ఆశ్చర్యంగా వుంది. గతమంతా గుర్తుకొచ్చిన బృంద, కొంత మూడీగా వుంటుందని వాళ్ళనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా వుండటంతో ఇద్దరూ ఆశ్చర్యపోతున్నారు.

విశ్వనాథ్ తను ట్రీట్‌మెంట్ ఇచ్చిన పేషెంట్స్ మూవ్‌మెంట్స్‌ని గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. దుఃఖంగా వున్నప్పుడు, సంతోషంగా వుండటం సాధ్యమా? అసలు దుఃఖాలేవీ లేనట్లుగా ఉండటం సాధ్యమా? ఆ ప్రవర్తనకు కారణం ఏమిటి?

అప్పుడు ఎక్కడ్నుంచి తన కథను స్టార్ట్ చేస్తుంది బృంద... సందేహంగా వుంది విశ్వనాథ్‌కి.

అతని సందేహం మరో నిమిషంలో పటాపంచలైపోయింది.

"నేడే విడుదల సినిమా స్క్రిప్టుని చదివారా అంకుల్...." రామ్‌కాశ్యప్‌ని అడిగింది బృంద.

"చదివాను" అన్నాడు.

"అది నా కథే... సూర్యవంశీ సేకరించిన ప్రతి విషయమూ నిజమే."

"కాని అందులో కొన్ని సంఘటనలు లేవు...." అన్నాడు రామ్‌కాశ్యప్.

"మీకెలా తెలుసు?"

మదన్ చెప్పిన విషయాలు చెప్పాడతను.

"కరెక్టే... నన్ను రక్షించటానికి చాలా 'స్పై' వర్క్ చేయించినట్టున్నారే" అందామె. తిరిగి తనే మొదలెట్టింది–

"అయినా నేను చెపుతాను... నాకు ఊహ తెలియక పూర్వమే తల్లీ, తండ్రీ చనిపోయారు. అక్కా, బావ నాకన్నీ అయి పెంచారు. వాళ్ళకి చాలా ఆలస్యంగా సంతానం కలిగింది. బావ చనిపోయిన... మా అక్క యశోద చాలా కష్టపడి నన్ను పెంచింది.

నారాయణపురం జమీందారు మునిభూషణ్‌రెడ్డి, అతని కొడుకు జయభూషణ్ – మా అక్కను ఇష్టపడ్డాడు, భర్త చనిపోయినా తన అందం చూసి, అతను ప్రేమిస్తున్నాడేమో అనుకుని, అతని ఇష్టాన్ని కాదనలేకపోయింది. హైస్కూల్‌నుంచి కాలేజీకి వచ్చిన నన్ను మొట్టమొదటిసారి చూశాడు జయభూషణ్ రెడ్డి... అతని కళ్ళు నామీద పడ్డాయి.

నన్ను పెళ్ళిచేసుకుంటానని మా అక్కతో చెప్పాడు జయభూషణ్ రెడ్డి. తనని పెళ్ళి చేసుకుంటాడని ఆశించిన అక్క యశోద, తన జీవితం, నా జీవితం మధ్య ఊగిసలాడింది.... అతని మనస్తత్వం అప్పటికే పూర్తిగా అర్థమైన మా అక్క యశోద–

నువ్వు నన్ను చేసుకోకపోయినా ఫర్వాలేదు. జీవితాంతం నీకు ఉంపుడు కత్తెగా వుంటాను. కానీ కూతురులాంటి నా చెల్లిని పెళ్ళిచేసుకోవాలనే ఆలోచన మానుకోమని కాళ్ళావేళ్ళా పడింది.

ఎట్టకేలకు అంగీకరించినట్టుగా నటించాడతను.

నీ సంతోషం కోసం నేనే మంచి సంబంధం చేసి పెళ్ళి చేస్తాన్నాడు. అందుకు అక్క అంగీకరించింది.

అతను తెచ్చిన సంబంధం... తనతో జులాయిగా తిరిగే అరవింద్. చూడగానే అరవింద్ నచ్చాడు మా అక్కకి... నాకు అందమైన భర్త లభించాడని ఆమె ఎంతో ఆనందించింది. కానీ ఆ వెనుకున్న కుట్ర ఆమెకు అర్థంకాలేదు.

పెళ్ళయింది...

ఫస్ట్‌డేని ఒక గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేశాడు నా భర్త...." అదే సమయంలో ఏదో చెప్పబోయి ఆగిపోయాడు విశ్వనాథ్.

"నేను నా భర్త కోసం కలలు కంటూ ఎదురు చూస్తున్నాను. ఆ సమయంలో... తొలిరేయి బెడ్‌రూంలోకి మొదట నా భర్త, తర్వాత జయభూషణ్ వచ్చారు.

నా జీవితంలో అదొక కాళరాత్రి.

ఆ రోజు ఆ ఇద్దరు... ఒకరి తర్వాత ఒకరు నన్ను భయంకరంగా అనుభవించారు... సామూహికంగా అనుభవించారు.

మా అక్కకి ఆ విషయం చెపితే, ఆమె ప్రాణాలతో వుండదని నన్ను హెచ్చరించాడు జయభూషణ్.

అరవింద్ నన్ను హైదరాబాద్ తీసుకొచ్చి ఒక అపార్ట్‌మెంట్‌లో పెట్టాడు. ఆ అపార్ట్‌మెంట్‌లో నేనొక బందీని, ఒక సెక్స్‌వర్కర్‌ని... పగలు జయభూషణ్ వచ్చేవాడు... రాత్రి అరవింద్ వుండేవాడు.

నేను గర్భవతి నయ్యాను.

ఎవరివల్ల నేను గర్భవతి నయ్యానో తెలియని దారుణమైన స్థితి... నన్ను అబార్షన్ చేయించుకోమని అరవింద్ బలవంతం చేయడం మొదలుపెట్టాడు. నేనందుకు ఒప్పుకోలేదు.

అదేరోజు నన్ను అక్కణ్నుంచి మహబూబ్‌నగర్ బోర్డర్‌లోనూ, ఇటు కర్నూలు హైవే పక్కన వున్న ఊళ్ళోని గెస్ట్‌హౌస్‌కి తీసుకువెళ్ళారు.

అదేరోజు, అనుకోకుండా నన్ను చూడటానికొచ్చిన మా అక్క నేను హైదరాబాద్‌లో లేకపోవటంతో, ఆ గెస్ట్‌హౌస్‌కి వచ్చింది.

నేను గర్భవతినని తెల్సినా, వాళ్ళిద్దరూ నన్ను టార్చర్‌చేసి, అనుభవిస్తున్న దృశ్యం చూసిన మా అక్క, ఆ దారుణానికి తట్టుకోలేక జయభూషణ్‌ని నిలదీసింది.

జయభూషణ్ ఆమెని చంపాలని ప్రయత్నించాడు. తప్పించుకొని మహబూబ్ నగర్ ఇంటికి వెళ్ళింది.

అదే రోజు రాత్రి మా అక్క దగ్గిరికి నేనూ వెళ్ళాను.

ఆ రోజు రాత్రి ఆ ఇంటికి నిప్పు పెట్టించాడు... జయభూషణ్ రెడ్డి అరవింద్ ద్వారా.

అక్కని రక్షించటానికి శతవిధాల ప్రయత్నించాను.

కానీ... కానీ...

మా అక్కను, దేవతలాంటి అక్కను రక్షించుకోలేకపోయాను... ఆ ఫైర్ యాక్సిడెంట్‌కి నా ముఖం వికృతంగా మారిపోయింది.

అక్క చనిపోతూ నాకు అప్పగించిన ఒకే ఒక బాధ్యత, అక్క కొడుకు పవన్‌ని చదివించడం, వాడ్ని పెద్దవాడ్ని చేయడం, అందుకు నేను బతకాలి. వికృతంగానైనా, వికలాంగురాలిగానైనా...

మంచికో, చెడుకో నాకు తాళి కట్టిన భర్త అరవింద్...

అతన్ని కల్సుకోవడం కోసం... ఆ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాను.

అతను నన్ను ఛీత్కరించాడు.

* * * * *

ఆ సమయంలో నాకు మనోబలాన్నిచ్చిన వ్యక్తి పరశురాం అనే రిపోర్టర్. నా కథను యథాతథంగా పేపరులో ప్రకటించాడు.

అందుకు అతనికి లభించిన ప్రతిఫలం... ఉద్యోగం పోవడం.... జయ భూషణ్, అరవింద్‌ల చేత భయంకరమైన చిత్రహింసలకు గురికావటము... వీళ్ళెంత దుర్మార్గులో పరశురామ్‌ని చూస్తే మీకే తెలుస్తుంది" చెప్పడం ఆపింది మంజరి.

"పరశురామ్ బ్రతికే వున్నాడా? ఎక్కడున్నాడు...." అడిగాడు విశ్వనాథ్.

"అతి త్వరలో మనం అతన్ని కలుస్తాం." చెప్పింది మంజరి.

"మరి మీ అక్క యశోద కొడుకు...." అడిగాడు రామ్‌కాశ్యప్.

"హాయిగా చదువుకుంటున్నాడు" చెప్పిందామె.

కాసేపు మౌనం.

మౌనం ఎప్పుడూ విషాదానికి, కోపానికి, వికృత మనస్తత్వానికి అద్దంలా వుంటుంది.

మళ్ళీ చెప్పసాగింది మంజరి.

"నా అక్కకి ద్రోహంచేసి, నన్ను మోసంచేసి, నీచాతి నీచంగా ప్రవర్తించిన వాళ్ళిద్దరి మీద కక్ష తీర్చుకోవాలి. ఎలా... మధ్యలో ఎన్నో సంఘటనలు జరిగాయి. ప్రతి సంఘటనా సిన్మాలో వుంది. అనుకోకుండా నా కథ న్యూస్‌గా రావటం, ఆ న్యూస్ ఐటంని చదివిన సూర్యవంశీ వరకు రామ్‌ని కలవడం... సినిమా స్క్రిప్టుగా తయారవడం... సినిమా తీయడం, అందులో నా పాత్రలో నేనే నటించడం... ఊహించని పరిణామం" ఆవేశంగా చెప్పిందామె.

రామ్‌కాశ్యప్ లోపల రూంలోకెళ్ళి కొన్ని ఫోటోలు తెచ్చాడు.

అదే సమయంలో విశ్వనాధ్ మంజరిని ఒక ప్రశ్న వేశాడు.

"ఇప్పుడు జయభూషణ్, అరవింద్ ఎక్కడున్నారో నీకు తెలుసా?"

కాసేపు తటపటాయించింది మంజరి.

"తెలీదు."

"అరవింద్ నిన్ను బెదిరించిన విషయం నీకు తెల్సా?"

"తెలీదు" చెప్పింది మంజరి.

"ఇప్పుడు జయభూషణ్‌ని- అరవింద్‌ని నువ్వు గుర్తుపట్టగలవా?"

"అయామ్ నౌ అబ్సల్యూట్లీ నార్మల్" చెప్పింది మంజరి.

తను తెచ్చిన ఫోటోల్లోంచి ఒక ఫోటో తీసి మంజరి కిస్తూ-

"ఈ ఫోటోలోని వ్యక్తి ఎవరు...." అడిగాడు రామ్‌కాశ్యప్.

"ఫోటోలోని వ్యక్తివైపు తేరపార చూసి, చిన్నగా నవ్వుతూ-

"మీ అబ్బాయి... అనంత్‌కాశ్యప్.

ఆ మాటలకు సైకియాట్రిస్ట్ విశ్వనాధ్ నిర్ఘాంతపోయాడు.

"ఈ ఫోటోలోని వ్యక్తి...." రెండో ఫోటో ఇచ్చాడు.

"మా అక్క యశోదలా భ్రమింపచేసి... మేకప్ ద్వారా మీరు క్రియేట్ చేయించిన జూనియర్ ఆర్టిస్ట్... రాజేశ్వరి."

ఇంకో ఫోటో నిచ్చాడు రామ్‌కాశ్యప్.

ఆ ఫోటో చూడగానే చిన్నగా నవ్వింది మంజరి.

"నా జ్ఞాపకశక్తిని మీరు టెస్ట్ చేస్తున్నారు. ఆంటీ ఫోటో చూపించి నతని అడుగుతారేంటి...."

రామ్‌కాశ్యవ్‌కి చాలా ఆనందంగా వుంది.

తన భార్య, తన కొడుకు ఫోటోల్ని గుర్తుపట్టిన మంజరి వైపు ఒక సారి చూసి, విశ్వనాథ్ వైపు సాలోచనగా చూసి–

ఇంకో ఫోటోను భయం భయంగా ఆమె కందించాడు.

ఆ ఫోటోను చూసిన మంజరి...." "జయభూషణ్" అంది ఏమాత్రం ఉద్వేగపడకుండా. ఇంకో ఫోటో కూడా ఇచ్చాడు.

"అరవింద్."

ఆ ఫోటోల్ని చూడగానే ఇంతకు పూర్వంలా ఉద్వేగంగా, పిచ్చి, పిచ్చిగా ఉద్రిక్తంగా ప్రవర్తిస్తుందనుకున్నాడు. కానీ అలా మంజరి ప్రవర్తించకపోవడాన్ని నిశితంగా ఎనలైజ్ చేస్తున్నాడు సైకియాట్రిస్ట్ విశ్వనాథ్.

"అంకుల్ మీరు నాతో ఒకసారి నా బెడ్‌రూంలోకి వస్తారా?" అని అంది మంజరి. "మీరు కూడా రండి" అంది విశ్వనాథ్‌తో.

అప్పటికే మదన్, ఆ బెడ్‌రూం నిండా మంజరి ఫోటోలను అతికించాడని తెల్సిన ఆ ఇద్దరూ అక్కడేం జరుగుతుందో నన్న సందేహంతో ఒకరి వేపు ఒకరు చూసుకున్నారు.

ఆమెను అనుసరించాడు.

మంజరి బెడ్‌రూం దగ్గరకెళ్ళి డోర్ తెరిచి–

"అంకుల్... నేను మళ్ళీ మామూలు మనిషి కావాలని, చాలా పవర్‌ఫుల్‌గా ఏటూరు నాగారంలో షూటింగ్ ఇన్సిడెంట్‌ని ప్లాన్ చేశారు. అలాగే ఇక్కడ కూడా ప్లాన్ చేశారు. ఎక్కడో ఒక దగ్గర నేను గతంలోకి వెళ్ళకపోతానా, నేను

మళ్ళీ మామూలు మనిషి కాలేకపోతానా... అనే మీ ప్రేమ పొందినందుకు ఈ క్షణంలో నేను గర్విస్తున్నాను" అంటూ రామ్‌కాశ్యప్ వేపు చూసిన మంజరి...

"చూడండి... విశ్వనాథ్‌గారూ... ఆ ఫోటోల్లో నన్ను చూడండి సార్. అమాయకమైన అందం... ఆ అందాన్ని హింసించిన వాళ్ళని నేను వదిలిపెట్టను" అందామె.

ఆమె ప్రవర్తన ప్రతిక్షణం అనూహ్యంగా, అసక్తికరంగా వుంది ఆ ఇద్దరికీ.

బృంద మానసికంగా, పూర్తిగా మారిపోవడం చాలా ఆనందదాయకంగా వుంది రామ్‌కాశ్యప్‌కి.

ఆ రూంలోంచి ముందు మంజరి బయటకు వచ్చింది.

ఆ వెనుక రామ్‌కాకశ్యప్, అతని వెనుక విశ్వనాథ్.

అయిదు నిమిషాల తర్వాత ముగ్గురూ లాన్‌లో వున్నారు. విశ్వనాథ్ ఏదో ఫోన్ వస్తే మొబైల్‌లో మాట్లాడుతున్నాడు.

అదే సమయంలో అంది మంజరి.

"నేనో పర్సనల్ విషయం మాట్లాడతాను. మీకేమైనా అభ్యంతరమా?"

"చెప్పమ్మా... ఈ విషయంలో నువ్వేం మాట్లాడినా, ఏం అడిగినా నేను కాదనను.

"నేను అడగడంలేదు. అభ్యర్థన.... మీ అబ్బాయి అనంత్ నైస్ జెంటిల్ మేన్... ఇంటలెక్చువల్... కమాండింగ్ బిజినెస్ పర్సనాలిటీ... ఆయన ఇష్టపడిన నియముతోనే పెళ్ళి చేయండి... నియమ వండర్‌ఫుల్ లేడి. నేను ఆ 'హైట్స్'లో లేని... అతి దౌర్భాగ్యురాలిని... నిజానికి నేనో ప్రాస్టిట్యూట్‌గా చేయబడిన దానిని. నేను ఆయనకు భార్యగా తగను... ఎప్పుడైనా మరో జన్మంటూ వుంటే మీ కూతురిగా పుట్టాలని నా కోరిక" ఆ సమయంలో మంజరి కనురెప్పల్లో సన్నటి తడి మెరిసింది.

ఆమె మాటలకు చలించిపోయాడు రామ్‌కాశ్యప్.

సరిగ్గా అదే సమయంలో సెల్‌ఫోన్ మోగింది.

బటన్ ప్రెస్‌చేసి "హలో" అన్నాడు రామ్‌కాశ్యప్.

ఇరవై నిముషాలసేపు ఏదో మాట్లాడి ఫోన్ పెట్టేశాడతను.

ఆ సమయంలో ఆయన ముఖంలో చోటుచేసుకున్న విషాదాన్ని ఎవరూ గమనించలేదు. అటు విశ్వనాథ్‌గానీ, ఇటు మంజరిగానీ.

ఎన్నో బిజినెస్ కాల్స్‌లో ఒక కాల్ అనుకున్నాడు విశ్వనాథ్.

అదేరకంగా భావించింది మంజరి.

ఆ కాల్ వచ్చిన తర్వాత ముభావంగా వుండిపోయాడు రామ్‌కాశ్యప్.

"ఆయనెందుకు అలా మూడీగా వుండిపోయాడో అర్ధంకావడంలేదు విశ్వనాథ్‌కి.

"ఏమైంది అంకుల్?" ఎట్టకేలకు అడిగింది మంజరి.

కొన్ని నిముషాల తర్వాత–

"బాబు.. అదే అనంత్... డిస్టర్బ్ అయ్యాడు" అన్నాడతను.

"ఆయన డిస్టర్బ్ అవడం ఏంటి?" అడిగింది మంజరి ఆశ్చర్యపోతూ.

"నియమ ఫ్లైయిట్ క్రాష్‌లో చనిపోయింది" నెమ్మదిగా చెప్పాడు రామ్‌కాశ్యప్.

ఒక్కక్షణం కనులు మూసుకుంది మంజరి.

రామ్‌కాశ్యప్ నెమ్మదిగా నడుచుకుంటూ లోపలికెళ్ళిపోయాడు.

చీకటి రాత్రిలో ఒక నిశ్శబ్దం అలుముకుంది.

"రేపు మాట్లాడదాం... నేను వెళుతున్నాను...." చెప్పి వెళ్ళిపోయాడు విశ్వనాథ్.

చీకట్లో అచేతనంగా వుండిపోయింది మంజరి.

* * * * *

"నన్నెవరు గాయపెట్టినా, బాధపెట్టినా నేనేం బాధపడను... కానీ అనంత్ ఏ విషయంలోనూ బాధపడకూడదు. నిన్న రాత్రి ఫోన్‌లో అనంత్ నిజంగా ఏడ్చాడు... అంతగా నియమను ప్రేమించాడు...." మర్నాడు టీ తాగుతున్నప్పుడు అన్నాడు విశ్వనాథ్.

"ఒకసారి మీరు న్యూయార్క్ వెళ్ళి అనంత్‌ని ఓదార్చితే బావుంటుంది...." సలహా ఇచ్చింది మంజరి.

"లేవగానే... బాబుకి ఫోన్ చేశాను... ఇక్కడికి రమ్మన్నాను... ఒక నెల రోజులుండి వెళ్ళమన్నాను... వస్తానన్నాడు... కానీ ఎప్పుడో చెప్పలేదు" నెమ్మదిగా అన్నాడతను.

అనంత్ తన దుఃఖం నుంచి బయటపడాలంటే ఏం చేయాలి?

ఆలోచిస్తున్నాడాయన...

ఇంకో పక్క బృంద... గతంలో మంజరి కోల్పోయిన జీవితాన్ని తను ఇవ్వగలడా!

మంజరి గురించి అనంత్‌కు పూర్తిగా చెప్తే... సహృదయంతో ఆమెను స్వీకరిస్తాడా?

అందుకు మంజరి సమ్మతిస్తుందా?

ఎన్నో ఆలోచనలు...

*   *   *   *   *

ప్రొడక్షన్ ఆఫీస్‌లో 'నేడేవిడుదల సినిమాపై ప్రత్యేక ప్రోగ్రాం షూటింగ్ జరుగుతోంది. కెమెరా ఎదురుగా ప్రొడ్యూసర్ సుమంతరావు, డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ, హీరోయిన్ బృంద కూర్చున్నారు.

మైక్ అందుకున్నాడు హనుమంతరావు.

"అఖిలాంధ్ర ప్రేక్షకులకు, అభిమానులకు నమస్కారం... రియల్ స్టోరీ ఆధారంగా మేం నిర్మిస్తున్న 'నేడేవిడుదల' ఇండస్ట్రీలో ఇప్పటికే సంచలనం సృష్టించింది. బిజినెస్ పరంగా చూస్తే... ఒక చిన్న సినిమా నాలుగు కోట్ల బిజినెస్ చెయ్యడం ఆ రోజుల్లో చాలా గొప్ప విషయంగా నేను భావిస్తున్నాను.

ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిపోయింది. డబ్బింగ్, రీ రికార్డింగ్ మిక్సింగ్... సెన్సార్ కార్యక్రమాల తర్వాత వచ్చేనెల సినిమాను రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాం.

ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు... టీ.వీ. ఛానల్స్‌లో మా అడ్వర్టయిజ్ మెంట్స్ చూసి, కొన్ని వేల ఉత్తరాలు వ్రాస్తున్నారు.

సినిమా రిలీజ్ కాకుండానే ఇంత 'ఎప్లాజ్' వస్తుందని నేనూహించలేదు. అందుకే ఈ సినిమాను మాతృమూర్తులకు అంకితం ఇస్తున్నాం...." అని చెప్పి కూర్చున్నాడు.

తర్వాత డైరెక్టర్ ప్రదీప్ మైకును అందుకున్నాడు.

"ఒక డైరెక్టర్‌గా నాకిది ఫస్ట్ సినిమా... ఒక సెన్సేషనల్ రియల్ స్టోరిని, సామాజిక స్పృహతో తెరపై మలచడం జరిగింది. ఈ సినిమా గొప్పదనం అంతా హీరోయిన్ బృందగారిదే. ఆమె నటన మార్వలెస్. ఈ సినిమాలో ఆమె పూర్తిగా ఇన్వాల్వ్ అయినటించారు. దానిక్కారణం నేను చెప్పను. ఆమె మాటల్లో మీరే వింటారు. నిజానికి సినిమా కాదు. పురుషాహంకారమ్మీద, పురుషులు సాగించే దౌర్జన్యం మీద మేం ఎక్కుపెట్టిన వజ్రాయుధం... అని మాత్రం చెప్ప గలను."

రచయిత సూర్యవంశీ మైకును అందుకున్నాడు.

"ఒక గొప్ప శిల్పాని తయారు చెయ్యడానికి, ఒక శిల్పి ఎంత కృషి చేస్తాడో... కథ కోసం నేనంత తపన పడితే.... దానిని వెల్యూలాయిడ్ మీద మలచడానికి డైరెక్టర్ దగ్గర్నుంచి, ప్రతి ఒక్కరూ అంత డెడికేటెడ్‌గా పనిచేశారు. పవర్‌ఫుల్ రియల్ స్టోరీ అంటున్నారు. ఈ కథ ఎక్కడ జరిగింది... ఎవరి జీవితంలో ఎలా జరిగిందో, దుర్మార్గం ఏమిటో, నా మాటల్లో కాకుండా హీరోయిన్ బృంద మాటల్లో వింటే బాగుంటుంది.

ఎందుకంటే-

ఆమె జీవితం ఒక మిస్టరీ... ఆ మిస్టరీలోంచి ఆవిడ బయటపడటానికి, ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేశాం" అంటూ మైకును బృందకు అందించాడు సూర్యవంశీ.

*     *     *     *     *

గతమంతా ఒక్కొక్క సంఘటనా గుర్తుకు వస్తుంటే మంజరి మనసు దావానంలా రగిలిపోతోంది. జెమినీ ప్రోగ్రాం ద్వారా తను నిర్ణయించుకొంది. ప్రస్తుతం ఆమె అణువణువు ప్రతికార జ్వాలతో రగిలిపోతోంది.

మైక్ అందుకున్న బృంద-

"అవును... నేడే విడుదల సినిమాలో అనూహ్యమైన పరిస్థితిల్లో నటించాల్సి వచ్చింది. ఈ సినిమాలో ప్రతి సంఘటన దగాపడిన ఒక అభాగ్య

స్త్రీ జీవితానికి నిసుపుటద్దంలా వుంటుంది. అయా సీన్లలో నటిస్తున్నపుడు... నాలో ప్రతి అణువూ కన్నీటి ప్రవాహమైపోయింది.

ఎందుకంటే–

ఆ సంఘటనలన్నీ నిజంగా... నా జీవితంలో జరిగినవే...." ఒక్క క్షణం ఆగిందామె. ఎంతో ఉద్వేగంగా వుందామె.

"నామీద కక్షగట్టిన శత్రువులు, ఈ సినిమా స్క్రిప్టును ఎత్తుకుపోయారు. షూటింగ్ జరక్కుండా వుండేందుకూ, రౌడీమూకలతో దాడిచెయ్యడానికి ప్రయత్నించారు. దర్శక, రచయితల్ని, నటుల్నీ బెదిరించారు. బెదిరిస్తున్నారు.

ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఈ సినిమా ఆగదు.

విడుదలయ్యాక ఈ సినిమా మహా ప్రభంజనం సృష్టిస్తుంది. ఆ ప్రభంజనంలో... జనం ఎదుట, నిర్ధాక్షిణ్యంగా, దయనీయంగా శత్రు సంహారం జరుగుతుంది.

నేను సినిమా హీరోయిన్ బృందను కాను...

ఒక దుర్మార్గున్ని ఎదుర్కోవడానికి పునర్జీనించిన మహాదుర్గను.

ఇప్పుడే ఈ క్షణంలోనే నేనో నిర్ణయం తీస్కున్నాను.

నేను తీసుకున్న నిర్ణయం, అతి త్వరలో బహిరంగ పరుస్తాను. నా నిర్ణయానికి, అఖిలాంధ్ర ప్రేక్షకులు ముఖ్యంగా స్త్రీలు మద్ధతుగా నిలుస్తారని నమ్మకం వుంది.

కొన్ని వేలమంది మహిళల మనోబలం ఊపిరిగా నేను శత్రువుల మీద యుద్ధాన్ని ప్రకటిస్తున్నానని చెపుతూ శలవు తీసుకుంటున్నాను" ఆవేశంగా చెప్పి కూర్చుంది మంజరి.

షూటింగ్‌లో ప్రతి ఒక్కరూ బొమ్మల్లా నిలబడిపోయారు.

మర్నాడు జెమిని టీ.వీ.లో వచ్చిన ఆ స్పెషల్ ప్రోగ్రాం ఇండస్ట్రీలోనూ, రాజకీయ వర్గాల్లోనూ... ముఖ్యంగా ఆమెను గురుతపట్టిన మహబూబ్ నగర్ పట్టణవాసుల్లో తీవ్ర సంచలనం రేపింది.

దానికి తోడుగా, హీరోయిన్ బృంద గత జీవితంపై సినిమా పేజీల్లో ప్రత్యేక కథనాలు ప్రచురించాయి... అందరిలో మొలకెత్తిన ప్రశ్న ఒక్కటే–

మంజరి ప్రకటించిన యుద్ధం ఎవరిమీద?

ఎవరా వ్యక్తులు?

రకరకాల ఊహాగానాలు చెలరేగాయి.

*    *    *    *    *

జమెని టీ.వీ. ప్రోగ్రామ్‌లో బృంద విసిరిన సవాల్‌ను తెరమీద చూసిన జయభూషణ్, అరివింద్‌లు ఆలోచనల్లో పడ్డారు.

"చూశావా... అప్పుడే చెప్పాను... అది బృంద కాదు... మంజరి అని... సవాల్ చేసింది చూశావా...." ఉగ్రంగా అన్నాడు జయభూషణ్.

"ఆమెకు అన్యాయం చేసిన వ్యక్తులు ఎవరై వుంటారని... ప్రెస్ రిపోర్టర్లు రకరకాల కథలు రాశారన్నా... మహబూబ్‌నగర్ కెల్లి... మళ్ళీ ఏ పరశురామ్ లాంటి వాడైనా - గతమంతా తవ్వి మీరే... మంజరి శత్రువులని రాస్తే...." కిషోర్‌దాస్ అన్నాడు.

"రేపు ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తుంది. ఆ సినిమా రిలీజైతే... డైరెక్ట్ ప్రభాం మనజిల్లా ప్రజల మీదే కాదు... రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మన గురించి తెలుస్తుంది. ఎమ్మెల్యేగా గెలిచినా సి.యం. పోస్ట్ పోతుంది" బెంగగా అన్నాడు జయభూషణ్.

"ముందు సినిమా విడుదల కాకుండా చూడండి... బాక్సుల్ని ఎత్తుకొచ్చేయ్యండి... ప్రస్తుతం ఆ సినిమా పరిస్థితి ఏమిటి?"

"ఎడిటింగ్ జరుగుతుందనుకుంటా నన్నా."

"ఎక్కడ?"

"ప్రసాద్ లాబ్‌లో."

"ఈ రాత్రికి ప్రసాద్ లాబ్‌మీద దాడి చెయ్యండి... అక్కడే నేడే విడుదల సినిమాకు సంబంధించి ఒక ముక్కకూడా మిగలకూడదు... అడ్డొచ్చిన వాడ్ని నరికెయ్యండి" ఆజ్ఞాపించాడు జయభూషణ్.

"మరి మంజరి?" అన్నాడు అరవింద్.

రామ్‌కాశ్యప్ ఇంటిమీద ఇరవై నాలుగ్గంటలూ నిఘా పెట్టు... ఎప్పుడు ఒంటరిగా దొరికితే అప్పుడు సఫా చేసేయ్" చెప్పాడతను.

*     *     *     *     *

"మంజరి... తన శత్రువులపై అంత డైరెక్ట్‌గా యుద్ధం ప్రకటిస్తుందని నేను అనుకోలేదు" అన్నాడు రామ్‌కాశ్యప్.

"సిటీలోని ఎడిటింగ్, డబ్బింగ్ థియేటర్స్‌కి, ప్రోసెసింగ్ యూనిట్లకి, ఇప్పటికే బెదిరింపు ఫోనులు వచ్చాయట సార్."

"ఏమని?"

"నేడే విడుదల సినిమా డబ్బింగ్ వేసినా, ప్రొసెసింగ్ చేసిన ఆ థియేటర్లని పేల్చేస్తామని" చెప్పాడు సూర్యవంశీ.

"వాళ్ళ తరంకాదు... ప్రసాద్ లాబ్ మేనేజర్ చాలా మంచి వ్యక్తి... దుర్మార్గాన్ని ఆయనెప్పుడూ సపోర్ట్ చెయ్యడు. అక్కడే మన సినిమా ప్రొసెసింగ్ జరుగుతుంది. దిగ్విజయంగా ఫస్ట్ కాపీ వస్తుంది. నేనంతా మాట్లాడాను" అన్నాడు డైరెక్టర్ ప్రదీప్.

"ఎలా... వాళ్ళు గుర్తు పట్టలేరా?"

"లేరు... నేడే విడుదల సినిమా బాక్సుల మీద 'శ్రీకృష్ణావతారం' అని ఇంకో పేరు అతికిస్తాం. అంతే... కంప్యూటర్ ఇంజనీర్లు, ఎడిటర్స్, అసిస్టెంట్స్ అందరూ మనకు కోపరేట్ చేస్తారు...." చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

*     *     *     *     *

మంజరికి 'జడ్' క్యాటగిరిలో వున్న పొలిటీషియన్స్‌కి వుండే సెక్యూరిటీని ఏర్పాటుచేశాడు రామ్‌కాశ్యప్.

మరీ అవసరమైతే తప్ప.... మంజరి బయటకు వెళ్ళడంలేదు. ప్రెస్ రిపోర్టర్స్‌కు అసలు పర్మిషన్ ఇవ్వడంలేదు.

ఇండస్ట్రీలో బయట ఎక్కడ చూసినా 'నేడే విడుదల' గురించే చర్చ... రాష్ట్రమంతటా పోస్టర్లు అతికించబడ్డాయి. అన్ని థియేటర్లలోనూ ఫిలిమ్ యాడ్ ప్రదర్శిస్తున్నారు. దూరదర్శన్‌లో పిక్చర్ పబ్లిసిటీతోపాటు, మార్కెట్లల్లో నెంబర్‌వన్‌గా నిలిచే పరిస్థితి ఏర్పడింది. మొత్తంమీద నాలుగు కోట్ల రూపాయలు బిజినెస్ చేసింది ఆ సినిమా... ఆ రోజు డైరెక్టర్ ప్రదీప్‌కి, సూర్యవంశీకి పట్టపగ్గాలు

లేకుండాపోయాయి... ప్రొడ్యూసర్ సుమంత్‌రావు వీళ్ళకిచ్చిన ప్రామిస్ మేరకు రెండు బ్రాండ్ న్యూ మారుతీ కార్లకు ఆర్డరిచ్చాడు.

జయభూషణ్ బృందం బియ్యర్స్‌ని, డిస్ట్రిబ్యూటర్స్‌ని బెదిరించారు.

"ఇది బిజినెస్... మీకూ మీకూ గొడవలుంటే... డైరెక్ట్‌గా తేల్చుకోండి... మా మీదపడితే పోలీస్ కేసు పెడతాం."

ఆ హెచ్చరికను విన్న జయభూషణ్ విలవిల్లాడిపోయాడు.

అరవింద్ పరిస్థితి అనూహ్యంగా వుంది.

ఇటుపక్క ఎలక్షన్ల ప్రచారం ఊపందుకొంది. పార్టీ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర మంతటా విరామం లేకుండా పర్యటిస్తున్నాడు జయభూషణ్. 'తమ పార్టీకి దాదాపు రెండు వందల సీట్లు ఖాయం' అని అతని అంచనా.

"రెండు వందల సీట్లు వస్తాయి... నువ్వు సి.యం. అవ్వడం ఖాయం" ఒక రోజు అన్నాడు అరవింద్.

అదే రోజు–

కడపలో 'నేడే విడుదల' అడ్వర్టయిజ్‌మెంట్‌ను చూసిన అరవింద్ ఖిన్నుడయ్యాడు.

మార్చి 18 ఉదయం ఆటతో...

విడుదల కాకముందే సంచలనం సృష్టిస్తున్న.

'నేడే విడుదల' సినిమా విడుదల.

బృంద (మంజరి) సోలో ఫోటోతో అట్రాక్టివ్‌గా వచ్చిన ఆ యాడ్ చూసి పిచ్చెక్కిపోయాడు జయభూషణ్.

అప్పటికప్పుడు పదిమంది రౌడీలకు ఫోన్ చేశాడు స్వయంగా...

"ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫిలిమ్ రీల్స్, స్టూడియోలోంచి థియేటర్లకు వెళ్ళకూడదు."

సినిమా రీల్స్ ఎత్తుకురావడానికి ముహూర్తం నిర్ణయించారు.

*   *   *   *   *

"అంకుల్! ఈవేళ ఈవెనింగ్ మీ ప్రోగ్రాం ఏంటి?"

"చెప్పు" అన్నాడు రామ్‌కాశ్యప్.

"నాతో మీరొస్తున్నారు."

"ఎక్కడికి?"

"చెప్పను."చూచాయగా అర్థమైంది రామ్‌కాశ్యప్‌కి.

సాయంత్రం ఆరుగంటలకు హైద్రాబాద్ నుంచి కారు బయలుదేరింది. అందులో రామ్‌కాశ్యప్, మంజరి వున్నారు.

హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ రెండు గంటల ప్రయాణం.

జెండా వీధిలోని ఆ ఇంటికి కొంచెం దూరంలో కారాపింది బృంద... ఆ ఇంటిని చూపించింది.

"ఇదే ఇంట్లో... నేనూ, మా అక్క, అక్క కొడుకు వున్నాం... ఈ ఇంటికే మాటలొస్తే, మా అక్క యశోద నా కోసం పడిన కష్టాల్ని చెప్తుంది...." అలా అంటున్నప్పుడు బృంద గొంతు జీరపోయింది.

కాలేజీ ప్లే గ్రౌండ్‌లో పరుగెత్తింది.

తర్వాత నారాయణపురం తీసుకెళ్ళింది.

ఒకప్పుడు తాముండే పూరిపాక ఇప్పుడులేదు... మట్టిదిబ్బ.

గుప్పిట్లోకి కొంత మట్టిని తీసుకుని ముద్దాడింది.

తర్వాత–

తన పెళ్ళయిన కళ్యాణ మండపంలోకి తీసుకెళ్ళింది రామ్‌కాశ్యప్‌ని.

"అంకుల్... కళ్యాణమండపం... చాలామంది ఆడపిల్లలకు పచ్చటి బంగారు కలల పందిరి... కానీ నాకు... ఒక స్మశాన భూమి" మండపంలో నుంచొని ఆ మాటలంటున్న ఆమె కళ్ళలో కన్నీటి చుక్కల్ని చూసిన రామ్‌కాశ్యప్ చలించిపోయాడు.

తర్వాత–

హైద్రాబాద్, కర్నూలు నేషనల్ హైవే పక్కన, కొండపల్లి గ్రామంలోని గెస్ట్‌హౌస్‌కి వెళ్ళారు.

"ఇదే అంకుల్... నా జైలు...." అంటూ నవ్విందామె... అది నవ్వుకాదు, కొండంత దుఃఖాన్ని దిగమింగుకోడానికి చేసే ప్రయత్నం అని అర్థమైంది రామ్‌కాశ్యప్‌కి.

అగ్ని ప్రమాదంలో మా అక్క చనిపోయాక, ఆమె కోరికమేరకు మా అక్క కొడుకుని వాళ్ళ తాతయ్య ఇంటికి నేను పంపేశాను. ఆ తరువాత నన్ను వెతికి పట్టుకున్నారు జయభూషణ్, అరవింద్. ఈ గెస్ట్‌హౌస్‌లోనే బంధించారు. వారం రోజులపాటు తిండీ, తిప్పలపు లేకుండా పడివున్నాను. ఆ వారం రోజుల్లో ప్రతిరోజూ పెరటివేపున తలుపు బద్దలు కొట్టడం ప్రారంభించాను... ఒక రోజున తలుపు వూడిపోయింది. అప్పుడు తెల్లవారుఝామున నాలుగ్గంటలు దాటింది...

ఎటువైపు వెళుతున్నానో... ఎక్కడి కెళ్తున్నానో తెలీదు...

హైవేమీద కొచ్చాను.

ఒక్క లారీ ఆపలా... ఒక కారు వస్తోంది... ఆ కారుని ఆపాలని ముందుకు పరిగెత్తుతున్న సమయంలో–

ఆ కారుకి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది... ఆ కారులో వున్న వ్యక్తి... కారులోంచి అంత ఎత్తు ఎగరడం చూశాను. లారీ డ్రైవర్ దిగి, పరుగెత్తి పోవడం చూశాను.

రెండూ, మూడు గంటలు... ఆ రోడ్డుమీద వచ్చిపోయే వాహనాలను ఆపడానికి ప్రయత్నించాను.

ఏ ఒక్కటీ ఆగలేదు.

అప్పుడు వినిపించింది నాకు...

అరుపు... ప్రాణభయంతో అరుస్తున్న ఒక మనిషి అరుపు– చీకట్లో తుప్పల్లోకి నడిచాను.

ఆ వ్యక్తి దాహం... దాహం. అని అడుగుతున్నాడు.

అక్కడకు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న ఓ చెరువు దగ్గిరికి వెళ్ళి నీళ్ళు తెచ్చాను... తాగించాను...

ఆ వ్యక్తి మాట్లాడలేకపోతున్నాడు.

వంటినిండా గాయాలు... అతన్ని ఎలాగయినా రక్షించాలని కర్నూలు వైపు పరిగెత్తాను.

తర్వాత కథ మీకు తెలుసు" చెప్పింది బృంద.

"ఆ రోజు నేను చచ్చిపోయాననే అనుకున్నాను... నువ్వు నన్ను రక్షించక పోతే చనిపోయేవాడ్ని" ఆనాటి తన పరిస్థితిని గుర్తుతెచ్చుకుంటూ అన్నాడు రామ్‌కాశ్యప్.

అక్కడ్నుంచి తిరిగొస్తున్నంతసేపూ ఆలోచించాడు రామ్‌కాశ్యప్.

ఆ ప్రదేశాల నన్నింటినీ బృంద తనకెందుకు చూపించింది?

* * * * *

ఆ విషయం మర్నాడు ఉదయం టీ తాగుతున్న సమయంలో అడిగాడు అతను.

"గతంలో నాకు జరిగిన ప్రతి విషయం గుర్తుకువచ్చిందని, గుర్తుందని మీకు చెప్పటానికి" చిర్నవ్వుతో జవాబిచ్చింది బృంద.

బృంద, మంజరిగా మారిపోవటం చాలా ఆనందంగా వుంది రామ్ కాశ్యప్‌కి – తర్వాత జరిగే పరిణామాలే అనూహ్యంగా వున్నాయతనికి.

సరిగ్గా అదే సమయంలో...

ఫోన్ మోగితే అందుకుని "కాశ్యప్ హియర్" అన్నాడు.

"మిస్టర్ రామ్‌కాశ్యప్... జాగ్రత్తగా విను... అనవసరంగా కొన్ని విషయాల్లో జోక్యం చేసుకునే వాళ్ళంటే నా కసహ్యం... నీకూ, నాకూ మధ్య శత్రుత్వం లేకపోయినా, అసహ్యం వుంది. నువ్వొక పేరుమోసిన ఇండస్ట్రియలిస్టు వన్న గౌరవంతో చెపుతున్నాను... విను... మంజర్ని ఇరవైనాలుగు గంటల్లో మాకప్పచెప్పు... లేని పక్షంలో ఏం జరుగుతుందో నువ్వూహించలేవు. ఎంత సెక్యూరిటీ పెట్టినా మంజరిని నువ్వు రక్షించలేవు."

"బాస్టర్డ్... హౌ ఆర్యూ?" ఉద్రేకంగా, కోపంగా అరిచాడు రామ్‌కాశ్యప్.

అతని ముఖంలోకి చూసిన మంజరి మొదటిసారి భయపడింది.

"కూల్‌డౌన్.. ఓల్డ్‌మాన్... కూల్‌డౌన్... అంత ఉద్రేకం ఆరోగ్యానికి మంచిదికాదు. నీ మంచికే చెపుతున్నాను. ఆలోచించుకో. లేకపోతే శిక్ష నీకు పడుతుంది" ఫోన్ కట్ అయింది.

"హౌ డేర్ హి ఈజ్... నన్ను... నన్ను హెచ్చరిస్తాడా... చూస్తాను... చూస్తాను" అతని ఆవేశం తగ్గటానికి పావుగంట పట్టింది.

"ఎవరంకుల్?" అడిగింది మంజరి.

"ఎనిమీ... పేరు చెప్పడానికి కూడా భయపడే ఎనిమీ... నీ వెనక నేనున్నాను... నువ్వేం చేస్తావో, ఎలాచేస్తావో నాకనవసరం. నీకన్యాయం చేసిన వ్యక్తులు నిర్ధాక్షిణ్యంగా చావాలి– భయంకరంగా ఛస్తూ వాళ్ళు అరిచే అరుపులు నేను వినాలి" అన్నాడు రామ్‌కాశ్యవ్.

రామ్‌కాశ్యవ్‌ని స్వయంగా బెదిరించిన వ్యక్తి ఎవరు?

జయభూషణా... అరవిందా...

ఆలోచిస్తోంది బృంద ఉరఫ్ మంజరి.

* * * * *

రాత్రి పదకొండున్నర సమయం.

లాబ్ గేట్‌ముందు నాలుగు జీపులు ఆగడం, అందులోంచి కొంత మంది రౌడీలు దిగటంతో సెక్యూరిటీ గార్డు గేట్‌వేపు వెళ్ళాడు.

అప్పటికే గేట్ తెరుచుకుని లోపలికొచ్చాడు అరవింద్.

"క్యా భాయ్! ఎక్కడకు?"

అలా అడిగిన సెక్యూరిటీ గార్డు దవడమీద ఒక్కటిచ్చి పక్కకు తోసేశాడు అరవింద్. లోనకు నడిచాడు.

వరుసగా డబ్బింగ్, రీరికార్డింగ్, మిక్సింగ్, ఎడిటింగ్ రూమ్స్ వున్నాయి.

ఒక్కొక్క రూమ్ చూసుకుంటూ, ఎడిటింగ్ రూం అని రాసున్న గదిలోకి వెళ్లాడు. అక్కడ కొన్ని సినిమారీళ్ళ బాక్సులున్నాయి. ఆ బాక్సుల్ని చేత్తో చూస్తున్నాడు.

అక్కడున్న స్టాఫ్ వాళ్ళను గుర్తుపట్టారు "నేడే విడుదల" సిన్మా రీళ్ళకోసం కొంతమందికి రావటానికి అవకాశం వుందనే విషయం మేనేజర్ ఎప్పుడో చెప్పి, అందుకు తగిన ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు.

"ఎవరు కావాలి? ఎవరు మీరు?"

"ఇవిగో ఇవి తీసుకుని 'నేడే విడుదల' సినిమా బాక్సులు కావాలి" అంటూ జేబులోంచి తీసిన డబ్బులి ఆ వ్యక్తి చేతిలో పెట్టాడు.

" 'నేడే విడుదల' సినిమా బాక్కులు ఇక్కడెందుకుంటాయి?"

"ఇక్కడ ఎడిటింగ్ జరుగుతోంది కాబట్టి"

ఆ మాటకు అక్కడున్న ఎడిటర్ పెద్ద ఎత్తున నవ్వాడు.

ఆ నవ్వు చాల అసహజంగా వుంది అరవింద్‌కి.

"ఎందుకలా నవ్వుతున్నావ్?"

"ఆలస్యంగా వచ్చారు కాబట్టి."

"ఆలస్యంగా రావడమేంటి? మేమేం సినిమా చూడటానికి రాలేదు" కిషోర్‌దాస్ అన్నాడు.

"చూడు భాయ్! రౌడీలకు మీసాలు, గడ్డాలు, కుడిచేతికి రాగికడియం వుంటే సరిపోదు. మెదడులో గుజ్జు వుండాలి. అంటే తెలివి కావాలి."

"అంటే?"

"అరగంట క్రితమే ఆ బాక్సుల్ని పట్టుకెళ్ళిపోయారు వాళ్ళు."

"ఎడిటింగ్ అయిపోయిందా."

"అయిపోయింది."

"అన్ని రీళ్ళు పట్టుకెళ్ళిపోయారా?" అనుమానంగా అక్కడున్న బాక్సులవేపు చూశారు.

రకరకాల సినిమాల పేర్లు.

"మా పెళ్ళికి రండి," "మీరొస్తేనే పెళ్ళి," "ఎదురింటి ప్రేమ- పక్కింటి పెళ్ళి," "పందిర్లో పెళ్ళి... సందట్లో విడాకులు" శ్రీకృష్ణావతారం."

"ఇవన్నీ ఏంటి?"

"అతి త్వరలో రిలీజ్ కాబోయే సినిమాల ఫస్టు కాపీలు, ప్రింట్స్ తియ్యాలి" చెప్పాడు ఎడిటర్.

"ప్రింట్స్ కూడా తీశారా?"

"అన్నీ పట్టుకెళ్ళిపోయారు."

"ఎక్కడికి పట్టుకెళ్ళుంటారు? ఆఫీస్‌కి పట్టుకెళ్ళుంటారు. పదండి" పరుగు పరుగున ఆ రూం బయటకొచ్చి జీపు ఎక్కారు ఆ రౌడీ జనం...

ఇరవై నిముషాల తర్వాత...

ఆ లాబ్‌లోకి ఒక టాటాసుమో ప్రవేశించింది. డ్రయివింగ్ సీట్లో డైరెక్టర్ ప్రదీప్ వున్నాడు. మిగతా సీట్లల్లో సూర్యవంశీ, ప్రొడక్షన్ మేనేజర్, ఇద్దరు బాయ్స్ వున్నారు. అందరూ దిగారు.

ప్రదీప్ లోనకెళ్ళి లాబ్ మేనేజర్ని కలిశాడు. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాక–

'శ్రీకృష్ణావతారం' లేబిల్‌ని అతికించిన ప్రింట్స్ తీసుకోవటానికి అనుమతి ఇచ్చాడు మేనేజర్.

ప్రింట్స్‌ని దగ్గరుండి టాటా సుమోలోకి ఎక్కించారు.

టాటాసుమో వెనక – ముందు రెండు జీపుల్లో సెక్యూరిటీ...

ఆ జీపులు రామ్‌కాశ్యప్ ఇంటి ముందు ఆగాయి.

ప్రింట్స్‌ని ఆ ఇంట్లో భద్రపరిచి వెళ్ళిపోయారు వాళ్ళు.

"నేడే విడుదల" సినిమా ప్రొడక్షన్ ఆఫీస్‌కి వెళ్ళిన అరవింద్ బృందం, అక్కడ సెక్యూరిటీ గార్డుని చితగొట్టి లోపలకు ప్రవేశించి, ఫర్నిచర్‌ని చిన్నా భిన్నం చేసి గదులన్నిట్నీ వెతికి ఎక్కడా ఏదీ కనబడకపోయే సరికి నిరాశగా, కోపంగా వెనక్కెళ్ళిపోయాడు.

*    *    *    *    *

మరి రెండు రోజుల్లో "నేడేవిడుదల" సినిమా రిలీజ్.

మరో నాలుగురోజుల్లో ఎలక్షన్ పోలింగ్ డే...

సినిమా ఇండస్ట్రీలో "నేడే విడుదల" సినిమా విడుదలకు సన్నాహాలు, బృంద జెమినీ ప్రోగ్రాం స్టేట్‌మెంట్ ప్రతిరోజూ సినిమా మీద అన్ని పేపర్స్‌లో వస్తున్న వివిధ వార్తలు సంచలనం సృష్టిస్తే...

రాజకీయ రంగంలో ఎలక్షన్ వేడి ఉదృతంగా వుంది.

రెండు రాజకీయ పక్షాలమధ్య హోరాహోరీ ఎన్నికలు పోరు జరిగింది. కేంద్రం నుంచి, ఇండస్ట్రీయల్ వర్గాలనుంచి కోటానుకోట్లు వసూలు చేసిన సొమ్ము వీళ్ళ ప్రవాహంలా ఖర్చయింది.

తొంభైశాతం సి.ఎమ్.గా జయభూషణ్ అయ్యే అవకాశాల గురించి ఛానల్స్ రివ్యూలు వెలువరించగా, పత్రికలు ఊహాగానాలు రాస్తున్నాయి.

ఆ రోజు రాత్రి మూడు గంటల సమయంలో–

"నేడే విడుదల బాక్సులు లాబ్‌నుంచి వెళ్ళిపోయాయి. ప్రొడక్షన్ ఆఫీస్‌లో కూడా లేవని, డిస్ట్రిబ్యూటర్స్ దగ్గరకి, అక్కడ్నుంచి సినిమా హాళ్ళకూడా వెళ్ళిపోయి వుంటాయని వార్త విన్న జయభూషణ్ పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు.

"నేడే విడుదల సినిమా రిలీజ్ కాకుండా ఆపలేదా?" ప్రశ్నించాడతను కోపంతో వూగిపోతూ.

"కష్టం చెప్పాడు అరవింద్.

"రేపు బృందను లేపెయ్యండి. లేనిపక్షంలో ఇంటిమీద బాంబులు వెయ్యండి...." ఆరో పెగ్గులో శాసించాడు జయభూషణ్.

*   *   *   *   *

రామ్‌కాశ్యప్ ఇంటి పరిశర ప్రాంతాల్లో పకడ్బందీగా జయభూషణ్ సమనుషుల నిఘా ఏర్పడింది. బృంద ఏ సమయలోనయినా బయటికికొచ్చిన మరుక్షణం ఆమె మీద దాడి చేయడానికి కడపనుంచి వచ్చిన బృందం రెడీగా వుంది.

ఏ విధమయిన ఎటాక్‌నయినా ఎదుర్కోడానికి వాళ్ళ దగ్గర మారణాయుధాలున్నాయి.

మంజరి తమ మీద ఏ రకంగా పగతీర్చుకోబోతోంది?

"ఏ రకంగా...?"

కేవలం సినిమా ద్వారా అయితే ఫర్వాలేదు. లేకపోతే?

జయభూషణ్ ఎన్నికల గొడవల్లో ఎంత తలమునకలుగా వున్నా, మంజరి హెచ్చరిక మెదడులో డ్రిల్ చేస్తూనే వుంది.

మానసికంగా అరవింద్ డీలాపడిపోయాడు.

దానిక్కారణం–

మీడియా మొత్తం మంజరి (బృంద) సవాల్ని ఆకాశానికెత్తేశాయి.

*   *   *   *   *

బృంద రకరకాల ఆలోచనలతో పచార్లు చేస్తోంది.

సరిగ్గా ఆ సమయంలో లోనికొచ్చాడు సూర్యవంశీ డైరెక్టర్ ప్రదీప్.

రామ్‌కాశ్యప్ రెండ్రోజులనుంచి ఆఫీస్ కెళ్ళడంలేదు.

అతను కూడా బృంద శతృసంహారం ఎలా చేస్తుందనే ఆలోచనలోనే వున్నాడు.

"మేడమ్! గుడ్‌న్యూస్... రాష్ట్రవ్యాప్తంగా అన్ని సినిమా థియేటర్లకు మన బాక్సలు వెళ్ళిపోయాయి. రేపుదయం ప్రత్యేకంగా పెట్టిన 3.40 నిముషాల ముహూర్తానికి మన సినిమా ఉదయం ఆటతో ప్రారంభమవుతుంది...." చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

"మీ ద్వారా వచ్చిన పబ్లిసిటీ కారణంగా పదిహేను రోజులవరకూ అడ్వాన్స్ బుకింగ్ టిక్కెట్లు సేల్ అయిపోయాయట. జిల్లాల్లో డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఫోన్లొస్తున్నాయి" ఉత్సాహంగా చెప్పాడు సూర్యవంశీ.

"వెరీగుడ్" అప్పుడే వచ్చిన రామ్‌కాశ్యప్ అడిగాడు.

"నోడౌట్... సినిమా సూపర్‌హిట్" అన్నాడు సూర్యవంశీ.

"మేడమ్... సార్...." అని రామ్‌కాశ్యప్‌వేపు, మంజరివేపు చూశాడు డెరెక్టర్ ప్రదీప్.

ఏమిటన్నట్టుగా వాళ్ళిద్దరూ చూశారు.

"ప్రేక్షకులతోపాటు మనం సినిమా చూడబోతున్నాం. హీరో, హీరోయిన్ సినిమా థియేటర్‌కి వస్తున్నారని, మెయిన్ థియేటర్‌లో స్లైడ్ వెయ్యమని చెప్పాం...." చెప్పాడు డైరెక్టర్ ప్రదీప్.

"అతను క్రేడ్‌లో సినిమా ఏం చూస్తాం...?" అన్నాడు రామ్‌కాశ్యప్.

"ముందుగా ప్రివ్యూవేసి, మీలాంటివాళ్ళకు చూపించాలని అనుకున్నాం. కానీ టైం లేదుకదా! ఆ క్షణం వరకు టెన్షన్... టెన్షన్...."

"సిటీలో మెయిన్ థియేటర్ ఏది?"

"ఓడియన్... 70 యం.యం."

"ఏ షోకి?"

"ఫస్ట్‌షోకి...."

ఆ మాట వినగానే మంజరివేపు చూశాడు రామ్‌కాశ్యప్.

"చూడండి ఫ్రెండ్స్! నాకందిన రిపోర్ట్స్ ప్రకారం బృంద బయటికి రావడం చాలా ప్రమాదం. ప్రాణాపాయం... ఆమె శత్రువుల్ని అంతం చేస్తానని ఇచ్చిన స్టేట్‌మెంట్ రేపిన సంచలనం మీకు తెలుసుకదా."

"మన ఇంటిచుట్టూ కూడా చాలామంది అపరిచిత వ్యక్తులు జీపుల్లో తిరుగుతూ కన్పిస్తున్నారు" కొంచెం దూరంలో వున్న సెక్యూరిటీ ఆఫీసర్ చెప్పాడు.

"ఎవడయినా పిచ్చి-పిచ్చి వేషాలేస్తే కాల్చేయండి." అని అంటుండగానే ఫోన్ మోగింది.

రామ్‌కాశ్యప్ అందుకొన్నాడు.

ఆ ఫోన్ మదన్ నుంచి.

"సార్! బృందను ఎలాగయినా చంపాలని, మనింటిమీద బాంబులతో దాడి చెయ్యాలని జయభూషణ్, అరవింద్ వాళ్ళు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది" చెప్పాడతను.

"ఒక్క పురుగు మనింటివేపు చూస్తే, వెయ్యిమంది మానవ హత్యా కాండ జరిపిస్తాను" అన్నాడు ఉద్రేకంతో రామ్‌కాశ్యప్.

"ఏమిటి సార్?" ఆత్రుతగా అడిగాడు డైరెక్టర్.

ఏం మాట్లాడలేదు రామ్‌కాశ్యప్.

కాసేపయ్యాక-

"మొన్న షూటింగ్‌లో బృంద వేషం వేసిన జూనియర్ ఆర్టిస్ట్ ఎక్కడుంది?" అడిగాడతను.

"ఎందుకు సార్?"

"ఆమెను అర్జంట్‌గా తీసుకురండి. వివరాలు తర్వాత చెబుతాను" అని చెప్పగానే ప్రదీప్, సూర్యవంశీ స్వయంగా బయలుదేరి వెళ్ళారు కారులో.

"ఏమిటంకుల్? అవిడెందుకు ఇప్పుడు?" అంది మంజరి.

చెప్పాడు రామ్‌కాశ్యప్.

"నన్ను రేపు ప్రివ్యూకి వెళ్ళమంటారా?" అడిగింది.

"ఏం?"

"శత్రువులు...." అన్నదామె.

"ఆ థియేటర్‌లోనే నిన్ను హతమార్చడానికి స్వయంగా జయభూషణ్, అరవింద్ వస్తే ఏం చేస్తావ్?"

"మీరూహిస్తున్నారా?"

"అవును."

"నేనేం చేస్తానో మీరు చూడండి" అందామె ఏదో ఆలోచిస్తూ.

మరో పదినిమిషాల తర్వాత–

జూనియర్ ఆర్టిస్ట్ రాజేశ్వరి లోనికి ప్రవేశించింది.

"చూడు బృందా! ఆమెకి నీ మేకప్ వెయ్యి. హెయిర్ స్టయిల్ నీలాగ్ వుండాలి. నీ చీర, జాకెట్టు ఆమెకు వేయించు. అలాగే నీ కళ్ళ జోళ్ళు...."

మరో అరగంట తర్వాత–

జూనియర్ ఆర్టిస్ట్ రాజేశ్వరి, బృంద డ్రస్‌లో, పూర్తి మేకప్‌లో బృంద బెడ్‌రూంలోంచి బయటికొచ్చింది.

అప్పటికే అక్కడికొచ్చాడు మదన్.

"మదన్! ఈ రాజేశ్వరిని కారెక్కించుకొని విజయవాడ వెళ్ళు... అక్కడ హోటల్ ఐలాపురంలో ఆమెనుంచు."

మిగతా వాళ్ళెవరికీ ఆయన ప్లాన్ అర్థంకాలేదు.

అందరికీ సందేహంగానూ, సంభ్రమంగానూ వుంది.

రామ్‌కాశ్యప్ ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం–

రాజేశ్వరి పోర్టికోలోకొచ్చింది. ఠీవిగా, బృందలానే నడుస్తూ దూరం నుంచి ఎవరుచూసినా బృందలాగానే భావిస్తారు.

అప్పటికే సిద్ధంగా వున్న మారుతీకారు ఎక్కిందామె.

కారు మరికొద్ది సేపటల్లో రామ్‌కాశ్యప్ నివాసంలోంచి రోడ్‌మీద కొచ్చింది.

*   *   *   *   *

ఆ ఇంటికి అటూ – ఇటూ కొన్ని గంటలనుంచీ నిఘా వేసిన జయ భూషణ్, ఏర్పాటు చేసిన రౌడీ బృందానికి చెందిన ఒక లీడర్.

వెంటనే సెల్‌ఫోన్ నెంబర్ ప్రెస్ చేశాడు.

అవతల్నుంచి జయభూషణ్ లైన్లోకొచ్చాడు.

"నేనే... కిరణ్‌ని."

"చెప్పు."

"మన ఎత్తుకి పై ఎత్తు వేసినట్టున్నాడు రామ్‌కాశ్యప్! మనం బాంబు దాడి చేస్తామని తెల్సిందేమో... బృందను ఇప్పుడే కారులో బయటకు పంపేశారు."

"ఎక్కడికి?"

"తెలీదు."

"ఆ కారుని ఫాలోకండి. బాంబులు వేసేయ్యండి. ఓ.కే."

"యస్.సార్" ఫోన్ కట్ అయింది.

గంట తర్వాత సెల్‌ఫోన్లో మదన్ చెప్పాడు.

"మేం ఇప్పుడు సూర్యపేట సమీపంలో వున్నాంసర్... ఆ వెనక మమ్మల్ని ఫాలో అవుతూ, కొన్ని జీపులొస్తున్నాయి. బహుశా శత్రువర్గం అనుకొంటాను."

"గుడ్... గో... ఎ హెడ్... ఆ వేషం వేసినందుకు విజయవాడ చేరగానే ఆమెకు లక్షరూపాలు ఇచ్చెయ్" అన్నాడు రామ్‌కాశ్యప్.

బృందవేపు చూసి, నవ్వి ఇలా అన్నాడు రామ్‌కాశ్యప్.

"నో... యూ ఆర్ సేఫ్. నువ్వు ఇంట్లోలేవని శత్రువర్గానికి ఈ పాటికే తెల్సి వుంటుంది. రేపు నువ్వు నిరభ్యంతరంగా థియేటర్కి వెళ్ళొచ్చు" అన్నాడతను.

"ఆ జూనియర్ ఆర్టిస్ట్‌కి ఏదైనా ప్రమాదం వాటిల్లితే...." సందేహం వ్యక్తం చేసింది బృంద.

"లేదు... మదన్ తెలివితేటల్ని తక్కువగా అంచనా వెయ్యకు. ఆమెకేం ప్రమాదంలేదు–" ధైర్యంగా, నిబ్బరంగా చెప్పాడు రామ్‌కాశ్యప్.

కానీ రామ్‌కాశ్యప్ ఊహ తప్పు!

కొన్ని సమయాల్లో జీనియస్‌లు కూడా తప్పుగా ఆలోచిస్తారు.

* * * * *

ఆ రాత్రి పదిగంటల సమయంలో-

డైరెక్టర్ ప్రదీప్, సూర్యవంశీ ఇద్దరు వచ్చారు.

"రేపు ఫస్ట్‌షో స్టార్టయ్యాక... పదినిమిషాలకు మనం థియేటర్‌కు వెళదాం. థియేటర్ లోపల, బయటా థియేటర్ యాజమాన్యం ఫుల్ సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. మీ నిలువెత్తు కటౌట్ పెట్టారు.

కొంతమంది మహిళా సంఘాల ప్రతినిధులు, న్యూ వేవ్ ఫిలిం ఆర్గనైజేషన్ వాళ్ళు బ్యానర్లు కట్టారు. రేపు అన్ని పేపర్స్‌లో యాడ్స్ వస్తున్నాయి. థియేటర్ ప్రొప్రయిటర్ ఇంకో రిక్వెస్ట్ చేశాడు."

ఆగి బృంద ముఖంలోకి, రామ్‌కాశ్యప్ ముఖంలోకి చూశాడు డైరెక్టర్ ప్రదీప్.

"చెప్పండి...."

"థియేటర్లో ఒక్క అయిదు నిమిషాలు... ప్రేక్షకులకు ఎదుట డయాస్ మీదకు మీరు రావాలని... మాట్లాడాలని...."

"అంత క్రెడ్‌లో కుదురుతుంగా అని-" సందేహం వెలిబుచ్చాడు రామ్‌కాశ్యప్.

"అటు సినిమా పబ్లిసిటీకి, ఇటు బృంద ఇమేజ్‌కి పనికొస్తుంది. కమర్షియల్ జిమ్మిక్ అంతే" అన్నాడు సూర్యవంశీ.

"జిమ్మికు సంగతి సరే- థియేటర్లోకి శత్రువర్గం వస్తే?"

"అందుకే ఫుల్ సెక్యూరిటీ - పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు జరుగుతోంది కదా సార్" అన్నాడు ప్రదీప్.

కాసేపు ఆలోచించింది బృంద.

"ఐడియా బానేవుంది. సినిమా ఎక్కడ అపుతారు? ఇంట్రవెల్‌లోనా?"

"అక్కడయితే బాగోదు."

"మరి!"

"సినిమా ఇంకా ఐదు నిమిషాల్లో అయిపోతుందనగా - అయితే బావుంటుది? ఎందుకంటే... ప్రేక్షకుల రియాక్షన్ కూడా మనకు తెలుస్తుంది" మామూలుగా అంది బృంద.

"మీరు కూడా కమర్షియల్‌గా ఆలోచిస్తున్నారు. పది నిమిషాల ముందు అంటే విలన్స్‌ని హీరోయిన్ చంపే సీన్" అన్నాడు డైరెక్టర్.

"ఇప్పుడే సెకండ్ షోలో ఇంకో స్లయిడ్ వెయ్యమని ఓడియన్ థియేటర్ ప్రొప్రైటరుకి ఫోన్ చేస్తా."

"ఏమని?!"

"రేపు ఫస్ట్‌షోకి హీరోయిన్ బృంద, సినిమాకు రావడమే కాకుండా, అయిదు నిమిషాల సేపు... ప్రేక్షకుల నుద్దేశించి థియేటర్లో మాట్లాడతారని. "

చెప్పి ఫోన్ అందుకొని బృంద మాట్లాడటానికి అంగీకరించిన విషయాన్ని థియేటర్ ప్రొప్రయిటర్‌కి చెప్పి, వెంటనే స్లయిడ్ తయారు చేయించి సెకండ్ షోలో వెయ్యమని కూడా చెప్పాడతను.

అలాగే పి.ఆర్. ఓ.కి చెప్పి, ఆ విషయాన్ని అన్ని పేపర్స్‌లో యాడ్‌గా వెయ్యమని చెప్పాడు.

ప్రదీప్, సూర్యవంశీ వెళ్ళిపోయాక–

రామ్‌కాశ్యప్‌కు, అమెరికా నుంచి అనంత్‌కాశ్యప్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. పది నిమిషాలు మాట్లాడి పెట్టేశాడు.

అతని ముఖం ఆనందంతో మెరిసిపోతోంది.

"ఏంటంకుల్... అంత హేపీ... ఎనిథింగ్ స్పెషల్ న్యూస్."

"రేపు చెప్పనా... ఇప్పుడే చెప్పనా?"

"ఇప్పుడే చెప్పండి...." చనువుగా డిమాండ్ చేసింది బృంద.

"రేపు అనంత్ వస్తున్నాడు...." అంటూ ఆమె ముఖంలోకి చూశాడు.

అనంత్ కాశ్యప్ రూపం ఒక్కసారి ఆమె కళ్ళముందు మెదిలింది.

డిన్నర్ ముగించి, నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ–

"బృంద, అనంత్‌ని మళ్ళీ నువ్వే మనిషిని చెయ్యాలీ...." అంటూ మరేం మాట్లాడకుండా రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

ఆలోచనలో పడింది బృంద.

రాత్రి చాలా సేపు వరకు నిద్రపట్టలేదామెకు.

సినిమా రిలీజ్ ఏంగ్జయిటీ ఒకపక్క, జయభూషణ్, అరవింద్‌ల ఆలోచనలు ఒక పక్క.

సరిగ్గా అదే సమయంలో ఫోన్ మోగింది.

వెంటనే లిఫ్ట్ చెయ్యలేదామె.

అదేపనిగా ఫోన్ మోగుతుంటే... లిఫ్ట్ చేసింది.

అటుపక్కనుంచి ఒక పోలీస్ ఆఫీసర్.

"ఈజిట్... రామ్‌కాశ్యప్... రెసిడెన్స్...."

"ఎస్!"

"ఆయనకొకసారి... ఫోన్ ఇస్తారా...."

"చెప్పండి... మెసేజ్ చెప్తాను."

"నేను కోడాలి పోలీస్‌స్టేషన్ నుంచి... ఎస్.ఐ.ని... రామ్‌కాశ్యప్ ఇండస్ట్రీతో మదన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారా?"

"అవును–"

"ఆయను ఇంకో లేడీతో కారులో ప్రయాణిస్తున్నారా?"

"యస్!"

"సారీ... మేడమ్... ఆ కారుమీద ఎవరో బాంబులు వేశారు. కారు ధ్వంసమైపోయింది. ఆ ఇద్దరూ స్పాట్ డెడ్. వాళ్ల శవాలు కూడా పోల్చుకోలేని పరిస్థితిలో వున్నాయి. శవాల దగ్గర దొరికిన విజిటింగ్‌కార్డ్ ఆధారంగా ఫోన్ చేశాను... ఎవర్నయినా కోదాడకు పంపండి."

"షాక్... వూహించని షాక్... బృంద ఒళ్ళు జలదరించింది. ఫోన్ పెట్టేసి రామ్‌కాశ్యప్ బెడ్‌రూం వైపు పరుగెత్తింది.

* * * * *

"విక్టరీ... తొలి విజయం...." టీ.వి. చూస్తున్న జయభూషణ్ అరిచాడు.

"రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ముగిసిన విషయం మీకు తెలుసు. రేపు ఉదయం నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని అదికార వర్గాలు తెలిపాయి... కాగా ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం ప్రజాపార్టీ ప్రెసిడెంట్

జయభూషణ్ ఆధ్వర్యంలోని పార్టీకి అనూహ్యమైన విజయం లభించనుందని... పోలింగ్ విశ్లేషణలు తెలుపుతున్నాయి. ఆ విశ్లేషణలను మీరిప్పుడు చూస్తారు."

జయభూషణ్ సోఫామీద కూర్చున్నాడు.

ఆ గెస్టెహౌస్ ప్రజాపార్టీ ప్రతినిధులతోనూ, కొంతమంది పోలీసు అధికారులతోనూ నిండిపోయింది.

ఎడతెగకుండా ఫోన్లు మోగుతున్నాయి.

విశ్లేషణల్ని వింటూ చేస్తున్న పార్టీ నాయకుల కోలాహలంతో ఉబ్బి తబ్బిబ్బుగా వున్నాడు జయభూషణ్.

సి.ఎం. జయభూషణ్ జిందాబాద్... అరుస్తున్నారు జనం.

సరిగ్గా అదే సమయంలో-

సెల్ ఫోన్ మోగింది. మాట్లాడిన అరవింద్, జయభూషణ్ దగ్గర కొచ్చి చెవిలో చెప్పాడు.

"మంజరి పని అయిపోయింది."

నమ్మలేనట్లుగా చూశాడు జయభూషణ్.

"బాంబుల దాడినుంచి తప్పించాలని, ఆ ముసలాడు రామ్‌కాశ్యప్ ప్లాన్ వేశాడు. విజయవాడకి కారులో రహస్యంగా ఆమెను పంపిస్తుండగా, మనోళ్ళు కోదాడ దాటగానే నాలుగు బాంబులు వేసేశారు. సఫా... ఆ మంజరికి ఎస్కార్టుగా వున్న మదన్ అనే వ్యక్తి కూడా సఫా... డ్రైవర్ మాత్రం గాయాల్తో బయటపడ్డాడు.

"ఇది విక్టరీ అంటే... ఇక మనకు తిరుగులేదు. ఇప్పుడు జరుపుకోండి పార్టీని... ఫుల్ బాటిల్స్ ప్రవహించాలి ఇక్కడ. మీ ఇష్టం. నేను అర్జంట్‌గా హైకమాండ్‌తో మాట్లాడాలి. నన్ను డిస్ట్రబ్ చెయ్యకు" అని తన పర్సనల్ రూంలోకి వెళ్ళిపోయాడు జయభూషణ్.

ఆ ఆనందంతో రెండు బీరు బాటిల్స్‌ను గడగడా తాగేశాడు అరవింద్. అతనికిప్పుడు చాలా ఆనందంగా వుంది.

మంజరి అలా చచ్చిపోతుందని అతనూహించలేదు.

*        *        *        *        *

మర్నాడు–

అన్ని పేపర్స్‌లోనూ 'నేడే విడుదల' సినిమా యాడ్స్ వచ్చాయి. హీరోయిన్ మంజరి థియేటర్లో ప్రేక్షకులతో ముఖాముఖి యాడ్‌తో సహా... ఆ యాడ్ చూడగానే తల దిమ్మెక్కిపోయింది అరవింద్‌కి రాత్రి తాగిందంతా దిగిపోయి నట్టయింది.

"చచ్చిన మంజరి రావడం ఏంటి?"

"ఆ విషయం తెల్సుకోకముందే పేపర్స్‌కి యాడ్స్ ఇస్తారుగా."

"హీరోయిన్ యాక్సిడెంట్లో ఛస్తే ఆ న్యూస్ పేపర్స్‌లో రావాలి కదా" గబగబా పేపర్స్ అన్నిటినీ తిరగేశాడు.

ఎక్కడా న్యూస్ కనిపించకపోవడంతో కాలుగాలిన పిల్లిలా అయోమ యంగా తిరుగుతున్నాడు.

అదే సమయంలో–

తన రూంలోంచి విసురుగా వచ్చిన జయభూషణ్–

"చచ్చిందన్నావ్... ఆ మంజరి బతికేవుంది. ఆ చచ్చింది మంజరి కాదు. జూనియర్ ఆర్టిస్టు. ఇప్పుడే మన కిషోర్‌దాస్ ఫోన్‌చేశాడు.

ఆ వార్తతో అరవింద్‌కి నిలువెల్లా చెమటలు పట్టాయి.

"సాయంత్రం ఓడియన్ థియేటర్‌కి వస్తుందా" అడిగాడు జయభూషణ్.

"అవును."

"రేపు ఉదయం సగం ఫలితాలు తెలుస్తాయి. విజయం మనదే, డోన్ట్ వర్రీ" అప్పుడే వచ్చిన ఫోన్‌లో మాట్లాడి అరవింద్ వేపు తిరిగి.

"థియేటర్లోకొచ్చే మంజరి శవంగా బైటికెళ్ళాలి. అటు దాని శవ యాత్ర... ఇటు మన విజయ యాత్ర జరగాలి. మనిద్దరి శత్రువు మిగలకూడదు" అని అరవింద్ భుజంమీద చెయ్యేసి, పక్కగా తీసికెళ్ళి, పదినిమిషాల సేపు రహస్యంగా మాట్లాడాడు జయభూషణ్.

*  *  *  *  *

HOUSE FULL... ALL SHOWS... UPTO 15 DAYS...

ఓడియన్ థియేటర్ ముందు ఆ బోర్డు వేలాడుతోంది.

రంగు రంగుల కాగితాలు, తోరణాలు, గేటుకి అటూ ఇటూ కొబ్బరి మట్టలు, అరటి బోదెలు-

హీరోయిన్ మంజరికి స్వాగతం....

డైరెక్టర్ ప్రదీప్‌కి స్వాగతం...

హీరో విమల్‌కి.... యూనిట్ సభ్యులకి స్వాగతం...

షూటింగ్ ప్రారంభం నుంచి, ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టించిన 'నేడే విడుదల' యూనిట్ సభ్యులకు స్వాగతం...

రియల్ స్టోరీలో నటించిన సూపర్ హీరోయిన్ మంజరికి అభినందనలు...

రకరకాల బ్యానర్లు...

టిక్కెట్లు దొరకక సగం జనం... బ్లాక్ టిక్కెట్ల కోసం ప్రయత్నిస్తున్నారు.

ఇంకో పక్క రామ్‌కాశ్యప్ ఏర్పాటు చేసిన కమెండోలు మఫ్టీలో అణువణువునా నిఘా చూపుల్తో చూస్తున్నారు.

మరొక పక్క జయభూషణ్, అరవింద్ ఏర్పాటు చేసిన రౌడీల ముఖాలు.

వరుసగా కార్లు థియేటర్ ప్రాంగణంలోకి దొచ్చుకుని వచ్చాయి.

మొదటి కారులోంచి డైరెక్టర్ ప్రదీప్, రచయిత సూర్యవంశీ. కెమోరామెన్ తదితరులు దిగారు.

థియేటర్ మేనేజర్, డైరెక్టర్ ప్రదీప్‌కి, సూర్యవంశీకి దండలువేసి ఆహ్వానించారు.

రెండో కారులోంచి నిర్మాత సుమంతరావు దిగాడు.

అతనికి థియేటర్ సీనియర్ ఆపరేటర్ దండలువేసి ఆహ్వానించాడు. మూడో కార్లోంచి హీరోయిన్ మంజరి రామ్‌కాశ్యప్‌తోపాటు దిగింది.

హీరోయిన్ మంజరిని చూడగానే జనం హోరెత్తిపోయారు.

మంజరి జిందాబాద్...

మంజరి జిందాబాద్... హర్షధ్వానాలు మిన్ను ముట్టాయి...

థియేటర్ ప్రొప్రయిటర్ రామ్‌కాశ్యప్‌కి దండవేయగా-

అతని భార్య, మంజరి మెడలో దండ వేసింది.

అటూ ఇటూ ఫుల్ సెక్యూరిటీ మధ్య మంజరి థియేటర్ లోపలికి అడుగు పెట్టింది.

స్పెషల్ క్యాబిన్‌లో కూర్చున్నారందరూ.

అప్పుడే టైటిల్స్ నడుస్తున్నాయి.

డైరెక్టర్ ప్రదీప్ చేతిలో, నిర్మాత సుమంతరావు చేతుల్లో వున్న సెల్‌ఫోన్లు నిరంతరం మోగుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా థియేటర్లముందు ప్రేక్షకుల సందడి... రెస్పాన్స్, వింటున్న వాళ్ళిద్దరూ... రన్నింగ్ కామెంట్‌లా పక్కవాళ్ళకి చెప్తున్నారు.

థియేటర్లో ప్రేక్షకులు ప్రతి సన్నివేశానికి ప్రతిస్పందిస్తున్నారు.

"ష్యూర్... నో డౌట్... జైంట్ కిల్లర్... ఈ సినిమా సంవత్సరం పాటు ఆడుతుంది గురూ గారూ...." కమెడియన్ రామబ్రహ్మం, సుమంతరావుతో అన్నాడు.

తెరమీద కన్పడ్తోన్న తన జీవితాన్ని తదేకంగా చూస్తోంది మంజరి.

ప్రతి సీన్‌ని అద్భుతంగా చిత్రీకరించాడు డైరెక్టర్ ప్రదీప్.

హీరోయిన్ ఇంట్రడక్షన్... అక్కా చెల్లెళ్ళ ఆత్మీయత, కాలేజీలో ఆమె చిలిపితనం, స్వంత ఊర్లో జమీందారీ వ్యవస్థ, అక్క భర్త చనిపోవడం, జయ భూషణ్ పరిచయం, అతనితో అక్క సంబంధం, కొన్ని సన్నివేశాల్లో మహిళా ప్రేక్షకులు కంటతడిపెట్టుకోవడం గమనించాడు రామ్‌కాశ్యప్.

రామ్‌కేశ్యప్ జీవితంలో చూస్తున్న మొట్టమొదటి తెలుగు సినిమా అది.

ఇంటర్వెల్ అయింది.

"వండ్రఫుల్ బృందా... నీలో మహానటి దాగుంది" తన్మయుడైపోతూ అన్నాడు రామ్‌కాశ్యప్.

మంజరికి ఏదో మాట్లాడలేని స్థితి.

గడ్డకట్టుకుపోయిన కన్నీళ్ళు మాట్లాడవు.

శిలగా మారిన హృదయం మాట్లాడదు.

అణువు అణువునా తనని వంచించిన విలన్ క్యారక్టర్ తెర మీద చూసినప్పుడల్లా ఆమె ఉద్రేకంతో ఊగిపోతోంది.

కొన్ని సందర్భాల్లో తన నటనని చూసి, తనే ఏడ్చేసింది మంజరి.

ఇంట్రవెల్ అయ్యాక సినిమా మళ్ళీ స్టార్టయింది.

అప్పుడు సమయం 8.05 నిమిషాలైంది.

* * * * *

సరిగ్గా ఆ సమయంలో సినిమా థియేటర్‌కి మూడు జీపులొచ్చాయి. ఆ వెనుక నాలుగు కార్లొచ్చాయి.

ఒక జీపులోంచి దిగిన వ్యక్తివేపు చూసిన మేనేజర్ ఆశ్చర్యపోయాడు.

అటూ ఇటూ గన్‌మేన్స్, వెనుక సీనియర్ పొలిటికల్ లీడర్స్... పోలీసు అధికారులు, గూండాలు.

"రేపు కాబోయే సి.ఎం. థియేటర్‌లోకి వచ్చాడంటే...."

మేనేజర్ ప్రొప్రైటర్‌కి ఆ విషయం చెప్పగానే స్పెషల్ క్యాబిన్‌లోంచి ప్రొప్రైటర్ గబగబా పరిగెత్తుకొని వచ్చి స్వాగతం పలికాడు.

"మీరు సినిమాకి రావడం...."

"చాలా గొప్ప సినిమా అట కదా...." అంటూ లోపలికి నడిచాడు జయభూషణ్.

ఎక్కడా సీట్లు ఖాళీలేవు.

బాక్సులు సినిమాయూనిట్ జనంతో నిండిపోవడంతో... బాల్కనీలో కొంత మందిని లేపి, వారికి ఛెయిర్స్ వేయించి... జయభూషణ్, అరవింద్, కొంతమంది పోలీసు అధికారుల్ని కుర్చీల్లో కూర్చోబెట్టాడు మేనేజర్...

హీరోయిన్ పెళ్ళి... గెస్ట్‌హౌస్‌లో శోభనం...

భర్తతో మరో వ్యక్తి రావడం...

ఆ తర్వాత పరిణామాలు దుస్సహంగా వున్నాయి.

సినిమాలో పొలిటికల్ లీడర్ పేరు వినయ్‌భూషణ్...

“ఆ రచయితని లేపేయ్యాల్సింది... ఎందుకు బతికించావ్?” అరవింద్ చెవిలో గొణిగాడు జయభూషణ్.

ఇంత డైరెక్ట్‌గా మనమీద సినిమా తీస్తారనుకోలేదు....” అన్నాడు అరవింద్.

అదే సమయంలో సెల్ మోగింది.

“చెప్పు....” అన్నాడు జయభూషణ్.

“సార్! నేను... కిషోర్‌దాస్‌ని... హీరోయిన్ బృంద... అదే మంజరి స్పెషల్ బాక్స్‌లో... రెండో వరుసలో రామ్‌కాశ్యప్ పక్కన వుంది. మన వాళ్ళందరూ అన్ని క్లాసుల గేట్స్ దగ్గర... ప్రేక్షకుల మధ్యలో బాంబులతో సిద్ధంగా వున్నారు. వాళ్ళందరి దగ్గరా సెల్‌ఫోన్స్ వున్నాయి. ఎప్పటికప్పుడు ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తున్నాను” చెప్పాడు కిషోర్‌దాస్.

“తొందరపడొద్దు, నేనిప్పుడు మామూలు మనిషినికాను... రేపు కాబోయే సి.యమ్.ని... ఏం చెయ్యాలో నేను చెప్పాక చెయ్యండి. డోన్ట్ డిస్ట్రబ్” చెప్పాడతను.

నిముషాలు గడుస్తున్నాయి...

సినిమా దాదాపు పూర్తి కావొస్తోంది.

సరిగ్గా అప్పుడు–

సినిమా తెరమీద సినిమా సడెన్‌గా ఆగిపోయింది. స్లైడ్ ఫోకస్ అయింది ఆ స్లైడ్‌లో–

ప్రేక్షకులకు గమనిక–

ఇప్పుడు మీ ముందుకు ‘నేడే విడుదల’ సినిమా హీరోయిన్ మంజరి వస్తారు... మీతో ముఖాముఖీగా మాట్లాడతారు. పక్కన ఆమె ఫోటో...’

ప్రేక్షకులందరూ ఒక్కసారిగా వెనక్కి చూడసాగారు.

అదే సమయంలో–

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్ స్పెషల్ బాక్స్‌ల్లో ఉన్న మంజరిమీద పడింది.

మంజరి, రామ్‌కాశ్యప్‌వేపు ఒకసారి చూసి లేచి నిలబడింది.

స్పెషల్ బాక్స్‌ల్లోంచి, బాల్కనీ క్లాస్ పక్కగా నడుస్తోందామె...

ఆమెకు అటూ ఇటూ సెక్యూరిటీగార్డ్స్... ఆమెకు కొంచెందూరంలో ప్రొప్రయిటర్... ఆ పక్కన మేనేజర్.

ప్రేక్షకులు ఆమెను చూడగానే కేరింతులు కొట్టారు.

ఈలలు వేశారు... చప్పట్లు... చప్పట్లు...

అదే సమయంలో తెరమీద ఇంకో స్లైడ్...

"మంజరికి స్వాగతం...."

"మహిళాజాతి ఆత్మాభిమానాన్ని నటన ద్వారా, నిలిపిన సూపర్ హీరోయిన్ మంజరికి స్వాగతం...."

చిన్నగా నవ్వుకుందామె...

గర్వంగా నవ్వుకుందామె...

బాల్కనీలోంచి మెట్లమీద అడుగువేసిన ఆమె, తనవేపే అదేపనిగా చూస్తున్న వ్యక్తులవేపే చూసి–

దిగ్భ్రాంతి చెందింది.

జయభూషణ్, అరవింద్...

ఒక్కసారిగా ఆమె హృదయం... లావాలా ఉప్పొంగింది.

తనని తాను కంట్రోల్ చేసుకుంటూ ముందుకు నడుస్తోందామె.

సరిగ్గా అదే సమయంలో–

కుర్చీలోంచి లేచాడు జయభూషణ్... అరవింద్‌వేపు చూశాడు. ఇద్దరూ బాల్కనీలోంచి బయటికొచ్చారు.

జయభూషణ్ ఎందుకు లేచాడో తెలీదు అరవింద్‌కి.

"ఏమిటి?" అన్నాడు.

"పద...." అంటూ సెకండ్ క్లాస్‌వేపు నడిచి, డోర్ తెరుచుకుని అక్కడ్నుంచి ముందుకెళ్ళాడు. అంతా చీకటి– అందరి దృష్టి మంజరిమీదే వుంది.

ఏ వ్యక్తి వాళ్ళని గుర్తుపట్టలేదు... ఆ చీకట్లో...

కానీ ఒకే ఒక వ్యక్తి వాళ్ళిద్దర్నీ గుర్తుపట్టాడు.

ఆ వ్యక్తి పరశురామ్... రిపోర్టర్ పరశురామ్.

తను ఒకప్పుడు ప్రాణాలకు తెగించి చేసిన పరిశోధన ఫలితం–

"నేడే విడుదల...."

షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి, ఇప్పటివరకు జరుగుతున్న ప్రతి పరిణామాన్ని అతను తెలుసుకొంటూనే వున్నాడు...!

ఏ చేతితో ఆ సెన్సేషనల్ న్యూస్ రాశాడో, ఆ కుడిచెయ్యి అతనికిప్పుడు లేదు. నరనరాన కసి, పగతో రహస్యంగా బతుకుతున్న అతను చాలా నెలల తర్వాత బయటి ప్రపంచంలోకి ఇవాళే అడుగుపెట్టాడు.

'నేడే విడుదల.'

బృందను ఫ్లడ్‌లైట్ల వెలుగుల మధ్య చూడగానే అతనికి చెప్పలేని ఆనందం కలిగింది.

జయభూషణ్, అరవింద్–

సినిమాకి రావడం అతనికి ఆశ్చర్యంగా వుంది.

ఏదో జరగబోతోంది.

ఏదో జరగబోతోంది. బృందకు మళ్ళీ ఏదో ఆపద సంభవించబోతోంది. అతని సిక్త్‌సెన్స్ బలంగా చెబుతోంది.

నెమ్మదిగా తన సీట్లోంచి లేచి గోడ పక్కనుంచి ముందుకెళ్ళాడు రిపోర్టర్ పరశురామ్. ఎడం చేతిలో వున్న వాకింగ్ స్టిక్ సహాయంతో...

ఆ వాకింగ్ స్టిక్‌ను అతను ప్రత్యేకంగా చేయించాడు. ఆ వాకింగ్ స్టిక్ హేండిల్‌ని పైకిలాగితే... పదునైన కరవాలం వస్తుంది. తను దుర్మార్గుల చేతిలో వికలాంగత్వానికి గురైన తర్వాత ముందు జాగ్రత్త చర్యగా ఆ ఏర్పాటు చేసుకున్నాడు.

ఫ్లడ్‌లైట్ కాంతి మంజరిమీదే పడుతోంది.

ఆమె కార్డ్‌లెస్ మైక్‌ని అందుకొంది.

ఈ ప్రోగ్రాం గురించి ముందుగా తెల్సిన వివిధ ఛానల్స్ వీడియో గ్రాఫర్లు, ప్రెస్ రిపోర్టర్లు, ప్రెస్ ఫోటోగ్రాఫర్లు అందరూ ఎత్తయిన డయాస్ కింద షూట్ చేస్తున్నారు... ఫోటోలు తీస్తున్నారు.

"అఖిలాంధ్ర ప్రేక్షకులకు నమస్కారం.

నేనొక హీరోయిన్‌గా మీ ముందుకు రాలేదు. ఒక అడపడుచుగా మీ ముందుకొచ్చాను.

ఇప్పటివరకు తెరమీద చూసింది నా కథే–

అణువణువు నా కథే–

ఈ సినిమాలో కూతుళ్ళిద్దరికి జరిగిన అన్యాయాన్ని తలచుకొని, దుర్మార్గాన్ని ఎదిరించలేక రైలుకిందపడి చనిపోయిన తండ్రి – నా తండ్రే...

ఆ రాజేశ్వరి మా అక్కే...

ప్రేమించాడనుకొని, పూర్తిగా నమ్మి, తనని తాను సర్వస్వాన్ని అర్పించు కోడానికి ముగ్ధంగా, మోహనంగా, శోభనంనాడు అపారమైన ఆనందంతో ఎదురు చూసిన పాత్రను నేనే–

వచ్చిన భర్త తనను కౌగిలించుకుంటే, ఆ కౌగిలి నిజమేననుకొని నమ్మిన ఆదర్శ భారతనారిని నేనే–

ఆ భర్త వెనక, నా అక్కను ఉంచుకొన్న వ్యక్తి గదిలో చొరపడగా, మొదట భర్త చేతిలో, తర్వాత ఆ దుర్మార్గుడి కబంధ హస్తాల్లో కలిగిపోయి, ఇద్దరి కామదహానికి బలైపోయిన– ఆమెను నేనే!" ఉద్వేగంగా చెప్పి ఆగింది మంజరి.

ఆ మాటల్ని వింటున్న జయభూషణ్ కళ్ళు క్రోధంతో ఎరుపెక్కాయి. అతని చెయ్యి జేబులో కెళ్ళింది. పిస్టల్‌మీద అతని చేయి పడింది.

ముందుకు నడుస్తున్నాడు.

అప్పుడక్క ఏం జరగబోతోందో ఊహించిన అరవింద్ సెల్‌ఫోన్ అందుకొని కిషోర్‌దాస్‌తో మెల్లిగా చెప్పాడు.

"అన్న పిస్టల్ పేల్చగానే... హాల్లో ధ్వంసం సృష్టించండి... మొత్తం మొత్తం ధ్వంసమైపోవాలి."

మళ్ళీ కొనసాగించింది మంజరి.

అలా మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్ళు, కార్నర్‌లో తనవేపే చూస్తున్న పరుశురామ్‌వేపు చూశాయి... ఆ కళ్ళు ఆనందంతో మిలమిల లాడాయి–

"పుణ్యభారత దేశంలో స్త్రీకి విలువలేదా... మగవాడి వాడి కోరలకు రాక్షసత్వానికి బలైపోవల్సిందేనా... ఎన్నాళ్ళీ దుర్మార్గం... మగవాడు ఆడ దానిలో చూసేది కామమేనా–

పాలివ్వడానికి పనికొచ్చే పాలిండ్లు మగవాడికి సెక్స్ సింబల్స్ మాత్రమేఆ? ఆ జననేంద్రియం పుణ్య గోదావరి లాంటి స్థలం కాదా?

ఆలోచించండి–

కూతురుగా, తల్లిగా, చెల్లిగా, భార్యగా ఆలోచించండి" ఆ మాటలు చెపుతూ భోరున ఏడ్చింది మంజరి.

హాలంతా నిశ్శబ్దంలో, కన్నీళ్ళతో మునిగిపోయింది.

మళ్ళీ కొనసాగించింది.

కన్నీళ్ళు, ఎడతెగని కన్నీళ్ళు... ఆ కన్నీళ్ళను ఆమె తుడుచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

సరిగ్గా ఆ సమయంలో–

ఆమె చూపులు–

కర్టెన్‌వారగా కదులుతున్న జయభూషణ్ మీద, అరవింద్ మీద పడ్డాయి. ఒక్క క్షణం – ఒక్క క్షణం... ఆమె మనసు ఫ్లాష్‌లాంటి ఐడియా.

కొంచెం దూరంలో నుంచొన్న మేనేజర్‌ని పిలిచి అతని చెవిలో ఏదో చెప్పింది. అతను పరుగు పరుగున బైటకెళ్ళాడు. అతనెందుకు బయటికి వెళ్ళాడో ఎవరికీ అర్థంకాలేదు.

"తల్లులారా! తండ్రులారా...! ఈ సినిమాలో హీరోయిన్ ఓడిపోతుంది. ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. మీరా సీన్‌ని చూడకండి."

ఆమె చెప్పిన మాటలు ఎవ్వరికీ అర్థంకాలేదు.

తెరమీద సినిమా ప్రదర్శన ప్రారంభమైంది. మంజరి చెప్పిన సీన్ జరుగుతుంది.

"ప్రపంచంలో ఎవడూ మమ్మల్ని ఏం చెయ్యలేడు... రాజకీయం, డబ్బు, పలుకుబడి, అంగబలం, అర్థబలం వున్నన్నాళ్ళు నీలాంటి స్త్రీ జాతి మా మీద

దాడి చేస్తుందా....” అంటూ ప్రధాన విలన్ హీరోయిన్‌ని తాడుకు కట్టి, ఆ తాడుని కిందకి లాగుతాడు.

వికటాట్టహాసం చేస్తాడు... అందుకు హీరోయిన్‌ని ప్రేమించిన వ్యక్తి శ్రుతి కలుపుతుండగా-

మంజరి ప్రశ్నించింది.

“ఇది సినిమాలో దర్శకుడు చూసిన ఎండింగ్. కాని సహృదయులైన మహిళల్లారా... ఆ ముగింపు ని జీవితంలో అయితే ఎలా వుండాలని మీరను కుంటున్నారు? చెప్పండి- గట్టిగా చెప్పండి.” అరిచింది మంజరి.

“ఆ దుర్మార్గుల్ని చంపాలి. హీరోయిన్ చనిపోకూడదు....” కొన్ని వందల గొంతులు హాల్లో ప్రతిధ్వనించాయి.

ఒక్క క్షణం... ఒక్కక్షణం...

జయభూషణ్‌కేమీ అర్థంకాలేదు. అరవింద్ క్కూడా అర్థంకాలేదు.

వాళ్ళ రౌడీమూకలకు అసలేం అర్థంకాలేదు.

“ఎస్... ప్రేక్షకులారా... యూ ఆర్ రైట్... మీరు కోరినట్లుగానే ఆ ముగింపు జరుగుతుంది. ఇప్పుడే- ఇక్కడే, ఈ క్షణమే జరుగుతుంది. మీరు చెయ్యాల్సింది ఒక్కటే-

నా శత్రువులు ఈ హాల్లో చాలామంది వున్నారని, నన్ను చంపాలని చూస్తున్నారని నాకు తెలుసు.

నా వేపు ఏ ఒక్కరూ దూసుకురాకుండా చూసే బాధ్యత మీది... సరేనా?” అందామె.

ఆ సన్నివేశం చాలా విచిత్రంగా వుంది.

అద్భుతంగా వుంది. అనన్యసామాన్యంగా వుంది.

అప్పుడు ఆ సమయంలో-

జయభూషణ్ వేపు, అరవింద్ వేపు చూసిన మంజరి ఒక్కక్షనంలో కిందకి దూకి, రెండు చేతులతో ఇద్దర్నీ పట్టుకుని, కనురెప్ప పాటులో ఇద్దర్నీ వేదిక మీదకు తెచ్చింది.

కదలబోయిన పక్కనున్న వ్యక్తులు తమవేపు చూడడంతో ఆగిపోయారు.

నిశ్శబ్దం... నిశ్శబద్దం...

తెరమీద సన్నివేశం జరుగుతూనే వుంది.

"వీడే జయభూషణ్, గొప్ప పొలిటీషియన్... రేపు కాబోయే సి.యం. వీడే 'నేడే విడుదల'లో విలన్. నా నిజమైన జీవితంలో విలన్ తాళి కట్టిన భర్త. తాళి విలువ మర్చిపోయి, తాళిని సెక్స్‌కు లైసెన్స్ బిళ్ళను చేసిన భర్త– చూసారుగా."

ఫోటో స్నాప్స్ ఫ్లాష్, ఫ్లాష్ మంటున్నాయి...

వీడియో కెమెరాలు ఊపిరి పీల్చడం మానేసి, పరుగులు తీస్తున్నాయి. ప్రేక్షకులు మంత్రముగ్ధంగా, బొమ్మల్లా నిలబడిపోయారు.

"అవును– వీళ్ళే నా జీవితాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తులు. వీళ్ళనేం చెయ్యాలి?"

"చంపాలి...." వేల గొంతుల్లోంచి వచ్చిందామాట.

"ఎక్కడ?"

"ఇక్కడ."

సరిగ్గా అదే సమయంలో ఆమె చేతుల్లోంచి తప్పించుకుని జయభూషణ్ పిస్టల్ పేల్చాడు. అది గురి తప్పింది, మరోసారి పేల్చబోతుండగా "అమ్మా... బృందా...." అరిచి పరుశురామ్ తన చేతిలోని హేండ్ స్టిక్‌ని ఓపెన్ చేసి విసిరాడు.

దాన్ని అందుకుంది మంజరి.

మరే మాత్రం ఆలస్యం చెయ్యలేదు.

తళతళమని మెరుస్తున్న కత్తి అంచు.

జయభూషణ్, వేపు, అరవింద్ వేపు దూసుకెళ్ళింది.

జయభూషణ్... అరవింద్.. .గుండెల్లో... ఆ కత్తి కసుక్కున, కసుక్కున దిగబడింది.

పెనుకేకలతో హాలు ప్రతిధ్వనించింది.

అదే సమయంలో–

బాంబులు హోరెత్తిన మోత.

చెల్లా చెదురైపోయిన జనం.

ప్రాణభయంతో పరుగులు తీస్తున్న జనం.

స్టేజీమీద కుప్పకూలిపోయిన ఆ ఇద్దరి వేపు ఒకసారి చూసి, ఆ కత్తి వాళ్ళమీద పడేసి, స్టేజీమీంచి కిందకు పరిగెడుతోంది మంజరి.

బాంబుల దాడిక సినిమా హాలు ధ్వంసమైపోయింది. ఎవరెక్కడ వున్నారో, ఏమైందో ఎవరికీ తెలీదు.

పరుగెడుతోంది... పరుగెడుతోంది...

ఎంత దూరం పరిగెట్టిందో తెలీదు. ఆగింది.

సరిగ్గా అదే సమయంలో ఆమె పక్కన ఓ కారొచ్చి ఆగింది. ఆ కార్లోంచి దిగాడు అనంత్‌కాశ్యప్.

"మిస్ బృంద! కారెక్కండి... అర్జంట్."

కారు ముందుకు పరుగెడుతోంది.

"గంటక్రితం హైద్రాబాద్ కొచ్చాను. మీరంతా సినిమా థియేటర్లో వున్నారని తెల్చి, సినిమా హాలుకొచ్చాను. అప్పుడే సినిమా హాల్లో బాంబులు మోత విన్పించింది. చాలామంది చనిపోయారు. మీరు బయటకు పరిగెట్టడం కన్పించింది...." చెప్తున్నాడతను.

ఆ మాటల్ని వినిపించుకోలేని దశలో నిస్త్రాణంగా. సీటు వెనక్కి వాలి పోయిందామె.

* * * * *

సినిమా హాల్లో జరిగిన దాడిలో రామ్‌కాశ్యప్ గాయపడ్డాడు. ఆ విషయం తెలియడంతో రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అనంత్‌తోపాటు, హాస్పిటల్‌కి వెళ్ళింది బృంద.

అప్పుడే స్పృహ వచ్చింది రామ్‌కాశ్యప్‌కి. అతని చుట్టూ డైరెక్టర్ ప్రదీప్, సుమంతరావు, సూర్యవంశీ... మిగతా చాలా జనం వున్నారు.

మంజరిని చూసిన రామ్‌కాశ్యప్ చిన్నగా నవ్వాడు.

"అయామ్ ఆల్‌రైట్... అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ... మైగర్ల్. అనుకున్న శత్రు సంహారం చేశావు."

ఆ మాటలు ఎంతో సంతృప్తినిచ్చాయి మంజరికి.

* * * * *

వారంరోజుల తర్వాత...

ఊటీలోని స్కూల్లో చదువుతున్న అక్క రాజేశ్వరి కొడుకుని తీసుకొస్తు న్నప్పుడు.

"నీ శపథం నెరవేర్చుకున్నావ్... ఇప్పుడేం చేస్తావు?" అడిగాడు రామ్‌కాశ్యప్ మంజరిని.

"అవును తనేం చేస్తుంది?"

"నా కోరిక ఒకటి తీర్చాలి. తీరుస్తావా?"

"చెప్పండి అంకుల్."

"అనంత్... అమెరికా టిక్కెట్లు బుక్ చేశాడు."

"ఎవరికి...."

"నీకు... తనకి...." అతని మనసులోని మాట అర్థం అయింది మంజరికి.

"కానీ...."

"గతం గురించి మర్చిపో, ఇన్నాళ్ళూ నీ గతం జ్ఞాపకం రావాలని నేను కోరుకున్నాను. ఇప్పుడు దయచేసి నీ గతం మర్చిపొమ్మని కోరుతున్నాను" అన్నాడతను.

జీవితం చాలా చిత్రమైనది.

* * * * *

మరి రెండురోజుల తర్వాత

హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అనంత్, మంజరి, రామ్‌కాశ్యప్, సుమంతరావు, అక్కకొడుకు, సూర్యవంశీ, రామావతారం అందరూ వున్నారు.

"మీ పెళ్ళి అమెరికాలోనే... వచ్చేవారం నేను రాగానే డేట్ ఫిక్స్ చేస్తాను" అన్నాడు రామ్‌కాశ్యప్.

చిన్నగా సిగ్గుపడింది మంజరి.

"మీరెంత త్వరగా వస్తే అంత మంచిది" అన్నాడు అనంత్.

మరో పావుగంటలో ఫ్లైట్‌లోకి వెళ్ళబోతున్న దశలో అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పి సూర్యవంశీ దగ్గరకొచ్చింది.

"నన్ను మర్చిపోరు కదూ?" అంది అభిమానంగా.

"మిమ్మల్నా... నేనా... మీరే నన్ను మర్చిపోతారేమోనని...." అంటుండగా అతని చేతుల్లోని నలుగుతున్న కాగితం మడతలు వేపు చూసి–

"ఏంటది!" అంది.

"ఎప్పటికయినా మీకు చూపిద్దామని నా జేబులో దాచుకున్న పిచ్చి కాగితాలు."

"నన్ను చూడనివ్వండి" అంటూ లాక్కుంది మంజరి.

అలా ఆ కాగితాలని లాక్కుంటుందని సూర్యవంశీ ఊహించలేదు.

గబగబా ఆ కాగితపు మడతల్ని విప్పి చదవడం ప్రారంభించింది మంజరి.

"తిండీ తిప్పలు లేకుండా... కలం మనోరథంలో కూర్చుని కాంక్షా భరిత స్వప్నాల్ని కంటూ, మిమ్మల్ని నేను ముద్దుపెట్టుకుంటూ... మీరు నన్ను కౌగిలించు కుంటూ...

జీవితాన్ని వెన్నెల జలపాతంలా చేసుకుంటే... ఎంత బావుటుంది.

ప్రేమించిన స్త్రీ పక్కన పూలబాటలో నడుస్తుంటే ఎంత బావుంటుంది.

పైనుంచి వర్షిస్తున్న చినుకులతో కిందకు రాలుతున్న గుల్‌మోహర్ పూల రెక్కల గుబాళింపులమధ్య చిక్కుకున్న వెన్నెల్లో మంచులో పచ్చని పచ్చిక మీద...."

చదవడం పూర్తిచేసింది మంజరి.

సూర్యవంశీ కళ్ళలోకి చూసింది.

మంజరి కళ్ళల్లో మెరుస్తున్న కన్నీటిని చూసి చలించిపోయాడు అతను.

"బృందా... బాధపడకండి. జీవితంలో నేనెప్పుడూ లేటే" అన్నాడతను విషాదంగా.

ఆమె కనురెప్పల్లోంచి రెండు కన్నీటి చుక్కలు అతని చేతిమీదపడి మెరిశాయి.

వాటివేపు చూసుకుని ఆ కన్నీటి బిందువుల్ని ముద్దుపెట్టుకున్నాడు అతను.

"సూర్యవంశీగారూ... మనిషిగా నేను పాత జీవితంలోంచి విడుదల అయ్యాను. కానీ నా మనసుకు విడుదల లేకుండా చేశారు" అంటూ నవ్విందామె చిన్నగా.

అతనూ నవ్వాడు, ఆనందంతో కాదు-

మరో ఇరవై నిమిషాల తర్వాత...

ఆకాశంలోకి ఎగిరింది విమానం.

మేఘాల్లోకి దూసుకుపోతోంది పక్షిలా.

కనుమరుగై పోయేంతవరకూ అక్కడే నిలబడి వెనుతిరిగాడు... సూర్యవంశీ.

-: అయిపోయింది :-



For My Web Magazine Serials : www.gotelugu.com
For My eBooks : www.kinige.com
**For My eBooks on Mobiles : www.dailyhunt.com**

Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com